
నమస్తే తెలంగాణ

WELCOME 2018

మన రాష్ట్రం • మన పత్రిక

నూతన సంవత్సర శుభాకాంక్షలు | సోమవారం 1•1•2018 | హైదరాబాద్ | WWW. NTNEWS.COM /NTDAILYONLINE

S & D



కొత్త రాష్ట్రం తెలంగాణ మూడున్నరేళ్లలో ఆవిష్కరించిన అద్భుతం

నేటి నుండి వ్యవసాయానికి 24 గంటలు నిరంతరంగా నాణ్యమైన ఉచిత విద్యుత్

Reliable Power Supply to all sectors in Telangana — 24x7 Hrs POWER

దేశంలో ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ

ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారి కృషితో మూడున్నర దశాబ్దాల కరెంటు కష్టాలకు చరమగీతం



తెలంగాణ రాష్ట్రంలోని మొత్తం 23 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు నేటి నుండి 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా అవుతున్నది.

ఈ ఘనత సాధించిన ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కొత్త చరిత్రను సగర్వంగా లిఖిస్తున్నది.

సమైక్య రాష్ట్రంలో తీవ్రమైన విద్యుత్ కొరత వల్ల గంటల కొద్దీ విద్యుత్ కోతలతో జనజీవనం దుర్భరంగా మారింది. కనీసం మూడు నాలుగు గంటలు కూడా కరెంటు అందక పంటలు ఎండిపోయినయి. అర్ధరాత్రి, అపరాత్రి నీళ్లు పెట్టుకోవడానికి పోయిన రైతుల ప్రాణాలు కరెంటు షాకులకు బలైపోయినయి. లో ఓల్టేజి సమస్యతో ట్రాన్స్ ఫార్మర్లు పటాకుల వలె పేలిపోయేవి. నిరంతరం మోటార్లు కాలిపోయేవి.

పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. వారంలో కొన్నిరోజులు పవర్ హాలిడేలు ప్రకటించే దుస్థితి ఆవరించి, పరిశ్రమలు మూతపడే స్థాయికి సంక్షోభం చేరింది.

సంక్షోభాన్ని సవాల్‌గా తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో, కార్యదీక్షతో కృషి చేసి, మూడున్నరేళ్ల అనతికాలంలోనే అద్భుతాన్ని ఆవిష్కరించింది. తెలంగాణలో కరెంటు కోతలు ఇప్పుడు ప్రజలు మరిచిపోయిన గతం. 24 గంటల విద్యుత్ సరఫరా ఇప్పుడు ప్రజల నిత్యానుభవం. పవర్ హాలిడేలు పోయి ఎవ్రీ డే ఈజ్ పవర్ డే అనే రోజులొచ్చినయి. నిరంతర విద్యుత్ సరఫరాతో పరిశ్రమలలో ఉత్పత్తి పెరిగింది. కార్మికులకు కావాల్సినంత పని దొరుకుతున్నది. పెరిగిన వ్యవసాయోత్పత్తులతో రైతాంగంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతోంది. కొద్ది కాలంలోనే మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ అవతరించబోతున్నది.

వ్యవసాయానికి 24 గంటలు నిరంతరాయంగా ఉచిత విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచింది.

తెలంగాణలో ఇప్పుడిక అన్ని రంగాలకు 24x7 నాణ్యమైన విద్యుత్

ఎత్తిపోతల పథకాలకు 12వేల మెగావాట్ల విద్యుత్

కోటి ఎకరాలకు సాగునీరు అందించే సంకల్పంతో ప్రభుత్వం నిర్మిస్తున్న భారీ ఎత్తిపోతల పథకాలకు అవసరమైన 12వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయడానికి సర్వసన్నద్ధం.

లోటు నుంచి మిగులు వరకు

2వ జూన్ 2014 తెలంగాణ అవతరించే నాటికి రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 6,573 మెగావాట్లు.

1 జనవరి 2018 నాటికి అందుబాటులోకి వచ్చిన విద్యుత్ 14,913 మెగావాట్లు.

కొద్ది కాలంలోనే అందుబాటులోకి వచ్చే విద్యుత్ 28,000 మెగావాట్లు.

రూ.12,316 కోట్లతో పంపిణీ, సరఫరా వ్యవస్థల పటిష్టం

వ్యవసాయానికి 24 గంటల సరఫరా చేయడంతో పాటు రాష్ట్రంలోని అన్ని రంగాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి గడిచిన మూడున్నరేళ్ల కాలంలో విద్యుత్ సంస్థలు రూ.12,316 కోట్ల వ్యయంతో పంపిణీ, సరఫరా వ్యవస్థలను పటిష్టం చేశాయి. 514 కొత్త సబ్ స్టేషన్లు, 1,724 కొత్త పవర్ ట్రాన్స్ ఫార్మర్లు, 19,154 కిలోమీటర్ల కొత్తలైన్లు నిర్మించింది.

సోలార్ పవర్‌లో దేశంలో నెంబర్ వన్

3,142 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తితో ఇప్పుడు తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.

జాతీయ సగటును దాటిన తలసరి విద్యుత్ వినియోగం

ఆర్థిక ప్రగతికి సూచికగా చెప్పబడే తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ రాష్ట్రం దేశ సగటును మించింది. తెలంగాణ ఏర్పడే నాటికి తలసరి విద్యుత్ వినియోగం 1,200 యూనిట్లు, నేడు 1,505కు పెరిగింది. ఇది తెలంగాణలో జీవన ప్రమాణాల పెరుగుదలకు అద్దం పడుతున్నది.

శరవేగంగా అల్ట్రా మెగా & సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ల నిర్మాణం

- 4000 మెగావాట్ల రికార్డు స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో టి.ఎస్.జెన్‌కో సారథ్యంలో యాదాద్రి అల్ట్రా మెగా పవర్ ప్లాంటు నిర్మాణం జరుగుతున్నది.
- 1080 మెగావాట్ల సామర్థ్యంతో భద్రాద్రి పవర్ ప్లాంటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డిశంబరు 2018 లో పూర్తి కానున్నవి
- 800 మెగావాట్లు కెటిపిఎస్ పవర్ ప్లాంటు ఈ మార్చిలో ఉత్పత్తి ప్రారంభం కానున్నది.

తెలంగాణ చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్ ల అనుసంధానం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఉత్తర, దక్షిణ గ్రిడ్ ల మధ్య వార్ధా నుండి హైదరాబాద్- 765 కెవి డిసి లైన్ ప్రారంభం పి.జి.సి.ఐ.ఎల్ ద్వారా నిర్మించబడింది. దేశంలో ఎక్కడి నుంచైనా విద్యుత్‌ను ఇచ్చిపుచ్చుకునే సౌలభ్యం ఈ లైన్ వల్ల కలిగింది.

రికార్డు స్థాయిలో ఉద్యోగాల కల్పన - దళారీ వ్యవస్థ నిర్మూలన

- జెన్ కో, ట్రాన్స్ కో, డిస్కమ్ లలో కొత్తగా 16వేల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నది. వేల మందికి ఏకకాలంలో పదోన్నతి కల్పించింది.
- విద్యుత్ సంస్థల్లో 24,000 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత. దళారీ వ్యవస్థను నిర్మూలించింది.



తెలంగాణ రాష్ట్ర పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ | ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ | తెలంగాణ స్టేట్ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్

R.O.No.62/17



ఎన్నో జ్ఞాపకాలు.. ఎన్నెన్నో అనుభవాలు.. మదిమూలల్లో చెరుగని సంతకాలు చేసి.. 2017 సెలవుతీసుకుంది! కొత్త ఊసులతో.. కొంగొత్త బాసలతో నేనున్నానంటూ 2018 తలుపులు తెరిచింది!! 2017 ఏడాది చివరి సూర్యాస్తమయ దృశ్యమిది. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని బిర్లా మందిరంపై ఆవిష్కృతమైంది.

గణతంత్ర వేడుకల ముఖ్య అతిథులుగా

10 దేశాల అధినేతలు

దేశ ప్రజలకు ప్రధాని మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: ఈ ఏడాది గణతంత్ర వేడుకలకు పది దేశాల అధినేతలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. దేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ.. ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో పలు అంశాలపై మాట్లాడారు. ప్రతిఏటా జనవరి 26న జరిగే గణతంత్ర వేడుకలకు ఒక దేశ అధినేత ముఖ్య అతిథిగా హాజరు కావడం ఆనవాయితీ. కానీ వచ్చే 26న జరిగే గణతంత్ర దిన వేడుకలకు పది దేశాల అధినేతలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఆగ్నేయాసియా దేశాల అసోసియేషన్‌లో సభ్యత్వం గల పది దేశాల అధినేతలు పాల్గొంటారన్నారు. ఇది భారత చరిత్రలో అసాధారణ రికార్డు అని పేర్కొన్నారు. ఆసియాన్ ఏర్పాటై 50 ఏండ్లు పూర్తి కావడంతోపాటు అందులో భారత్ భాగస్వామిగా చేరి 25 ఏండ్లవుతున్నది. ఆసియాన్ రజతోత్సవం సందర్భంగా 10 దేశాల అధినేతలు మన గణతంత్ర దిన వేడుకలకు హాజరు కావడం భారతీయులందరికీ గర్వ కారణమన్నారు. ఆసియాన్ కూటమిలో బ్రూనై, కంబోడియా, ఇండోనేషియా, లావోస్, మలేషియా, మయన్మార్, ఫిలిప్పీన్స్, థాయిలాండ్, సింగపూర్, వియత్నాం సభ్యదేశాలుగా ఉన్నాయి.


సుఖసంతోషాలతో వర్ధిల్లాలి

గవర్నర్ నరసింహన్ శుభాకాంక్షలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేవారందరి కోసం సోమవారం ఉదయం గం.11.00 నుంచి మధ్యాహ్నం 12.00 వరకు రాజ్‌భవన్‌లోని దర్బార్‌హాల్‌లో గవర్నర్ నరసింహన్ అందుబాటులో ఉంటారు.

లక్ష్యాలు సాధించాలి



కే స్వామిగౌడ్, శాసనమండలి చైర్మన్

రాష్ట్ర ప్రజలందరికీ శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రతి ఒక్కరు అనుకున్న లక్ష్యాలు సాధించాలని, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఉద్యోగులు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేర్చాలని కోరారు.

రైతుల కండ్లల్లో 24 గంటల వెలుగులు

మంత్రి హరీశ్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొత్త సంవత్సరం నుంచి రైతుల కండ్లల్లో వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్తు ఇస్తున్నట్టు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు, దేశ విదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్తూ ఆయన ఆదివారం ప్రకటన విడుదలచేశారు. కొత్త ఏడాదిలో ఎన్నో కొత్త ఆశయాలు, లక్ష్యాలను సాధించి.. సరికొత్త ఆలోచనలతో ముందుకు పోవాలని ఆకాంక్షించారు. ఈ నూతన సంవత్సర వేడుకలను ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సంబురంగా చేసుకోవాలని హరీశ్‌రావు కోరారు. గత ఏడాది విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్‌రంగాల్లో పెనుమార్పులు తెచ్చామని పేర్కొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్ కీలకం

సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల సమీక్షలో డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి



కామారెడ్డిలో ఎస్పీ కార్యాలయ నిర్మాణ పనుల వివరాలను డీజీపీ ఎం మహేందర్‌రెడ్డికి తెలియజేస్తున్న ఎస్పీ శ్వేతారెడ్డి

హైదరాబాద్/ సిద్దిపేట అర్బన్/ కామారెడ్డి, నమస్తే తెలంగాణ: కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజల్లోకి వెళ్లి శాంతిభద్రతలతోపాటు స్థానిక సమస్యలపై దృష్టిసారించాలని డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి పోలీసులకు పిలుపునిచ్చారు. ప్రజాసమస్యలపై స్పందించినప్పుడే పోలీస్ ఫ్రెండ్లీ వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఆదివారం సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో పర్యటించి.. జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. శాంతిభద్రతలకు సంబంధించి 2018లో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించిన డీజీపీ మహేందర్‌రెడ్డి.. దాని అమలు కోసం జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరుగుతున్న నేరాలపై ఆరాతీశారు. కొత్త ఏడాది ప్రణాళిక అమలుపై చర్చించి, పలు సూచనలు చేశారు. ప్రజాసమస్యల్లో అక్కడికక్కడే పరిష్కారమయ్యే వాటిని గుర్తించి.. అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా పోలీసులపై ప్రజల్లో నమ్మకం, భరోసా పెరుగుతుందన్నారు. సిద్దిపేట పోలీసు కమిషనర్ శివకుమార్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నేరాలు, నివారణ చర్యలను డీజీపీకి వివరించారు. సిద్దిపేట జిల్లా నుంచి కామారెడ్డి జిల్లాకు వెళ్లిన డీజీపీ మహేందర్‌రెడ్డి.. అక్కడ నిర్మిస్తున్న జిల్లా పోలీసు అధికారి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత పాటించడంతోపాటు ఏడాదిలో పనులు పూర్తిచేయాలన్నారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో సిటిజన్ ఫీడ్ బ్యాక్ సెంటర్‌ను ప్రారంభించారు. పోలీసుల పనితీరులో నాణ్యతను పరిశీలించడానికే థర్డ్ పార్టీ సిటిజన్ ఫీడ్ బ్యాక్ సెంటర్‌ను రాష్ట్రంలోనే మొదటిసారిగా కామారెడ్డి జిల్లాలో ప్రారంభించామని డీజీపీ తెలిపారు. ఇక్కడి నుంచే రాష్ట్రంలోని 12 జిల్లాలకు ఫీడ్ బ్యాక్ సెంటర్ పనిచేస్తుందన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు బాగుండాలన్నారు. ప్రపంచ దేశాల పెట్టుబడులు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వచ్చేవిధంగా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మూడున్నరేండ్లుగా పోలీసుశాఖకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని చెప్పారు. 2017లో పోలీస్‌శాఖ పనితీరు భేష్‌గా ఉన్నదని, కొత్త సంవత్సరంలో మరిన్ని నూతన మార్పులకు నాంది పలుకుతామని వెల్లడించారు. హైదరాబాద్ తరహాలోనే ప్రతి జిల్లాలో సంస్కరణలు తేనున్నట్టు చెప్పారు. డీజీపీ వెంట ఐజీ స్టీఫెన్ రవీంద్ర, కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ శ్వేతారెడ్డి తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కేంద్రంతో పోరు

తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ స్పష్టీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ తెలిపింది. 2018 నూతన సంవత్సరం ఉద్యోగుల హక్కుల సాధన సంవత్సరంగా జరుపుతామని జేఏసీ పేర్కొన్నది. ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పథకాలను, అర్హులకు అందజేసేందుకు పాటుపడుతామని స్పష్టంచేసింది. జూలై -2018లోగా పీఆర్సీని ఏర్పాటు చేయాలనే విజ్ఞాపనను మరోసారి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జేఏసీ నాయకులు చెప్తున్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణను విజయవంతంగా నిర్వహించామని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌తో కార్యాచరణను ఖరారుచేశామని సెక్రటరీ జనరల్ వీ మమత తెలిపారు. సీపీఎస్ రద్దు చేసేవరకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని పలు సందర్భాలలో ప్రకటించారని, ఆ దిశలోనే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ నాయకులు మునగాల మణిపాలరెడ్డి, ఇంటర్మీడియట్ జేఏసీ నాయకుడు పీ మధుసూదన్‌రెడ్డి విజ్ఞప్తిచేశారు. కొత్త ఏడాదిలో సాధారణ బదిలీల ప్రక్రియ చేపట్టాలని, మారుమూల గ్రామాల్లో మూడున్నర ఏండ్లుగా ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులను పరిగణనలోకి తీసుకోవాలని జేఏసీ నాయకులు కోరారు.



'చిన్న' లెక్కలపై

పెద్ద కసరత్తు

చిన్న నీటి వనరుల వినియోగంపై తేలని లెక్కలు

చివరకు ఎన్నారెస్సీని ఆశ్రయించిన కృష్ణాబోర్డు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలుగు రాష్ట్రాల పరిధిలోని కృష్ణా బేసిన్‌లో చిన్న నీటి వనరుల కింద వినియోగంపై సుదీర్ఘకాల అయోమయం కొనసాగుతూనే ఉన్నది. ప్రతి ఏటా రెండు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదురకపోవటం.. శాస్త్రీయ పరిష్కారాన్ని కృష్ణాబోర్డు సూచించకపోవటంతో ఇప్పటివరకు 'చిన్న' లెక్కలపై స్పష్టత రాలేదు. తాజాగా కృష్ణానది యాజమాన్య బోర్డు.. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్నారెస్సీ) సహకారం తీసుకోవాలని నిర్ణయించింది. రెండు రాష్ట్రాల్లో చిన్న నీటి వనరుల వినియోగం ఎంత ఉన్నదో తేల్చే బాధ్యతను ఈ సెంటర్‌కు అప్పగిస్తూ త్వరలో ఒప్పందం చేసుకోనున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇందుకు సంబంధించి బోర్డు సభ్య కార్యదర్శి పరమేశం ఎన్నారెస్సీ ప్రతినిధులతో సంప్రదింపులు జరిపినట్టు సమాచారం. ఇటీవల విజయవాడలో జరిగిన కృష్ణాబోర్డు సమావేశంలో ఎన్నారెస్సీ ద్వారా వినియోగాన్ని శాస్త్రీయంగా లెక్కించవచ్చని తెలంగాణ నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్‌రావు సూచించారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీని పర్యవేక్షిస్తున్న కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు చిన్న నీటి వనరుల కింద వినియోగం లెక్కలు తేల్చడం పెను సవాల్‌గా మారింది. మొదటి రెండేండ్లు రెండు రాష్ట్రాల్లోనూ పెద్దగా వర్షాలు లేకపోవటంతో ఈ వినియోగంపై ఎవరూ పట్టుబట్టలేదు. 2016-17లో వివాదం కొనసాగింది. తెలంగాణ రాష్ట్ర ఖాతాలో బచావత్ ట్రిబ్యునల్‌లో పొందుపరిచిన పరిమాణాన్ని వినియోగం కింద వేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టుబడుతున్నది. తెలంగాణ నీటిపారుదలశాఖ వ్యతిరేకిస్తున్నది. ఇందుకు సంబంధించి కృష్ణా బేసిన్‌లోని చెరువులు, వినియోగాన్ని బోర్డు ముందు ఉంచింది. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా చెరువులను నింపి.. సాగునీటికి వినియోగించటాన్ని ఏపీ ఎత్తి చూపుతుండగా.. తెలంగాణ విభేదిస్తున్నది. ఒకవైపు సాగునీటి ప్రాజెక్టుల కింద వినియోగాన్ని లెక్కించి.. ఆపై చెరువుల కింద వినియోగాన్ని లెక్కించడమంటే రెండు పర్యాయాలు వినియోగించినట్టు అవుతుందని తెలంగాణ స్పష్టంచేసింది. బచావత్‌లో పేర్కొన్నట్టు 90 టీఎంసీల వినియోగాన్ని లెక్కించడమనేది అశాస్త్రీయమని వాదించింది. ఇది వాస్తవమని గుర్తించిన కృష్ణాబోర్డు 90 టీఎంసీలను తెలంగాణ ఖాతాలో వేయటానికి సాహసించలేకపోయింది.

ముహూర్తం



సూర్యోదయం: 6.50 గంటలకు



సూర్యాస్తమయం: 5.49 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం, చతుర్దశి ఉదయం 11.46 వరకు, తదుపరి పూర్ణిమ. నక్షత్రం: మృగశిర మధ్యాహ్నం 2.54 వరకు, తదుపరి ఆరుద్ర. అమృత ఘడియలు: ఉదయం 7.12 నుంచి 8.48 వరకు, రాహుకాలం: ఉదయం 8.12 నుంచి 9.35 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.58 నుంచి 12.42 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.54 నుంచి మధ్యాహ్నం 3.37 వరకు, వర్జ్యం: రాత్రి 10.13 నుంచి 11.49 వరకు.

లోకం పోకడ



ఉత్పత్తిలో మేటి.. జైపూర్ ఎస్టీపీపీ

విద్యుత్ ఉత్పత్తిలో దేశానికి ఆదర్శం

- జాతీయస్థాయిలో 4వ స్థానం
- 100% పీఎల్‌ఎఫ్ సాధించిన యూనిట్-1.. యూనిట్-2లో 99%
- తెలంగాణకు 10,658 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా
- అతి తక్కువ ధరకే విద్యుత్ అందిస్తున్న సింగరేణి
- 24గంటల విద్యుత్‌లో మేముసైతం: సింగరేణి సీఎండీ శ్రీధర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంటు (ఎస్టీపీపీ) రికార్డుల పరంపర కొనసాగిస్తున్నది. ప్రారంభమై 18నెలలే అయినా 90శాతం సగటు పీఎల్‌ఎఫ్‌తో దేశంలోని 25 అత్యుత్తమ థర్మల్ విద్యుత్ కేంద్రాల జాబితాలో 4వ స్థానాన్ని సాధించింది. డిసెంబర్‌లో అత్యధికంగా 99.5శాతం స్టేషన్ పీఎల్‌ఎఫ్ సాధించి సరికొత్త రికార్డు నెలకొల్పింది. యూనిట్-1లో 100శాతం, యూనిట్-2లో 99శాతం పీఎల్‌ఎఫ్ సాధించింది. 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాలో భాగస్వామ్యమవుతూ 100శాతం విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా దూసుకుపోతున్నది.

బొగ్గు ఉత్పత్తిలో సింగరేణి సంస్థ దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తుండగా.. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం కూడా అద్భుతమైన పనితీరుతో ఆదర్శంగా నిలుస్తున్నది. గతంలోనూ అత్యుత్తమ పీఎల్‌ఎఫ్‌తో జాతీయస్థాయిలో మంచిస్థానాలు సాధించింది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ వారు ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంపికచేసిన 25 ఉత్తమ విద్యుత్ కేంద్రాల్లో ఎస్టీపీపీ సెప్టెంబర్ వరకు 87.54 శాతం పీఎల్‌ఎఫ్‌తో 8వ స్థానం, నవంబర్ వరకు 89 శాతం పీఎల్‌ఎఫ్‌తో 7వ స్థానం, అక్టోబర్ వరకు 88.83 శాతం పీఎల్‌ఎఫ్‌తో 6వ స్థానం సాధించింది. ఎస్టీపీపీలోని రెండు యూనిట్లు అద్భుత సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. 2017 ఫిబ్రవరితోపాటు మే, నవంబర్ నెలల్లో యూనిట్-2 100 శాతం పీఎల్‌ఎఫ్ సాధించింది. యూనిట్-1 ఏప్రిల్, డిసెంబర్‌లో వందశాతం పీఎల్‌ఎఫ్ సాధించింది. డిసెంబర్ చివరినాటికి 1వ యూనిట్ 5,977 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తిచేయగా, 5,590 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేసింది. యూనిట్-2 ఇప్పటివరకు 5415 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా.. ఇందులో 5,068 మిలియన్ యూనిట్లను గ్రిడ్‌కు సరఫరా చేసింది.

తక్కువ ధరకే ఎస్టీపీపీ విద్యుత్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్న నేపథ్యంలో సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం 10,658 మిలియన్ యూనిట్లను ఇతరుల కన్నా తక్కువ ధరకే సరఫరా చేసి తెలంగాణ ప్రగతికి చేయూతనిచ్చింది. ఇతర ధరలతో పోలిస్తే తక్కువకే తెలంగాణ డిస్కంలు విద్యుత్‌ను కొనుగోలు చేయడంతో ప్రభుత్వానికి దాదాపు రూ.వెయ్యి కోట్లు ఆదా అయింది.

సంతోషంగా ఉంది




ఎస్టీపీపీ జాతీయస్థాయిలో అత్యుత్తమ పీఎల్‌ఎఫ్, సగటు వార్షిక పీఎల్‌ఎఫ్ 90శాతంతో 4వ స్థానానికి ఎదగటం సంతోషంగా ఉంది. బంగారు తెలంగాణ నిర్మాణం ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరాను అమలు చేస్తున్నది. ఎస్టీపీపీ కూడా తనవంతుగా వందశాతం విద్యుత్ ఉత్పత్తి చేసి అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నది. ప్లాంటు ప్రగతిలో భాగస్వాములైన అన్నివర్గాల ఉద్యోగులకు నా అభినందనలు. సింగరేణి ప్రగతిపథంలో కీలకపాత్ర పోషిస్తున్న వారందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు.

– ఎన్ శ్రీధర్, సింగరేణి సీఎండీ

సింగరేణి కార్మికులకు న్యూ ఇయర్ కానుక

సీఎం కేసీఆర్ ఆదేశాలతో 3,157 మందికి పదోన్నతి.. ఉత్తర్వులు జారీ



కొత్తగూడెం ప్రతినిధి, నమస్తే తెలంగాణ: సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా సింగరేణి యాజమాన్యం.. సంస్థలో పనిచేస్తున్న 3,157 మంది కార్మికులకు సర్వీస్ అనుబంధ పదోన్నతులు కల్పిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. నూతన సంవత్సర కానుకగా పదోన్నతులు కల్పించినట్టు యాజమాన్యం ప్రకటించింది. సింగరేణి సంస్థ అండర్‌గ్రౌండ్‌లో ఒకే క్యాటగిరీలో ఏడేండ్లు పూర్తిచేసిన కార్మికులకు, ఉపరితలం (సర్ఫేస్)లో ఒకే క్యాటగిరీ / గ్రేడ్‌లో ఎనిమిదేండ్లు పూర్తిచేసిన కార్మికులకు సర్వీస్ లింకుడ్ ప్రమోషన్స్ (ఎస్‌ఎల్పీ) స్కీమ్ కింద 2018 జనవరి ఒకటో తేదీ నుంచి ఏరియాలవారీగా పదోన్నతులు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీచేసింది. కొత్తగూడెం కార్పొరేట్‌లో 63 మంది కార్మికులు, కొత్తగూడెం ఏరియా -188, మణుగూరు-136, ఇల్లెందు-83, రామగుండం1 ఏరియా -400, రామగుండం2 ఏరియా-170, రామగుండం3 ఏరియా-235, భూపాలపల్లి-490, శ్రీరాంపూర్-1040, మందమర్రి-272, బెల్లంపల్లిలో 80 మంది కార్మికులకు పదోన్నతులు కల్పించనున్నారు.



ఈ-పాస్ అమలుకు ఏర్పాట్లు పూర్తి

- రాష్ట్రంలో ఈ-పాస్ వినియోగంపై కేంద్రం ప్రశంసలు
- దేశంలోనే రెండోస్థానంలో తెలంగాణ
- నేటినుంచి దేశవ్యాప్తంగా అమలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నకిలీ ఎరువులకు కళ్లెం, విక్రయాల్లో పారదర్శకత సాధించేందుకు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న ఈ-పాస్ (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్) పై కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. ఎరువుల రాయితీలను రైతులకు నేరుగా అందించే లక్ష్యంతో కేంద్రం ఈ-పాస్ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ఈ-పాస్ అమలులో తమిళనాడు (96.65 శాతం) ప్రథమస్థానంలో ఉండగా, తెలంగాణ (96.06శాతంతో) రెండోస్థానంలో నిలిచింది. ఈ విషయాన్ని ఆదివారం కేంద్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖల అదనపు కార్యదర్శి ధర్మపాల్ ప్రకటించారు. దీంతోపాటు ఈ-పాస్ యంత్రాలతో ఎరువుల కొనుగోలు జనవరి 1 నుంచి అమలులోకి వస్తుందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ-పాస్ అమలుకు అవసరమైన ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయశాఖ పూర్తిచేసింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 6,641 ఎరువుల దుకాణాల్లో ఈ-పాస్ మిషన్ల యాక్టివేషన్ పూర్తయినట్టు వ్యవసాయ శాఖ కార్యదర్శి సీ పార్థసారథి తెలిపారు. 2017 డిసెంబర్ 24 అర్ధరాత్రి నుంచి కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఉన్న ఎరువుల దుకాణాల్లోని నిల్వ వివరాలను ఈ-పాస్ యంత్రాల్లో జీరోస్టాక్ చేసింది. దీంతో డిసెంబర్ 25 నుంచి ఈ-పాస్ మిషన్లను సాంకేతికంగా అప్‌డేట్ (రీఇన్సియేషన్) చేశారు. ఇప్పటివరకు 6,377 (96.06 శాతం) యంత్రాల అప్‌డేట్ పూర్తయిందని, మరో 264 యంత్రాలు సాంకేతిక కారణాలతో అప్‌డేట్ కాలేదని పార్థసారథి తెలిపారు. వీటిని కూడా త్వరలోనే అప్‌డేట్ చేస్తామని వెల్లడించారు.

నిబంధనలు పాటించకుంటే లైసెన్స్‌లు రద్దు..

జనవరి 1 నుంచి ఎరువుల అమ్మకాలు పూర్తిగా ఈ-పాస్ మిషన్ల ద్వారానే చేపట్టాలని, దీనికి విరుద్ధంగా ఏ డీలరైనా అమ్మకాలు జరిపితే వారి లైసెన్సులు రద్దు చేస్తామని వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి హెచ్చరించారు. ఇందుకు సంబంధించి ఎరువుల డీలర్లకు రాతపూర్వకంగా తాఖీదులు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారులకు సూచించారు. స్థానిక కేబుల్ టీవీలు, విలేకరుల సమావేశాల ద్వారా ప్రచారం చేయాలన్నారు. అవసరమున్న చోట ప్రగతిశీల రైతుల సహకారం తీసుకోవాలన్నారు. ఈ-పాస్ మిషన్ల ద్వారా ఎరువులు విక్రయించని డీలర్ల లైసెన్సులు రద్దుచేయాలని, లేనిపక్షంలో జిల్లా వ్యవసాయాధికారి, సహాయ వ్యవసాయాధికారి, మండల వ్యవసాయాధికారులపై చర్యలు తప్పవని పార్థసారథి హెచ్చరించారు.

మన రాష్ట్రం • మన పత్రిక

నమస్తే తెలంగాణ

సోమవారం 1•1•2018 హైదరాబాద్ • వెల.5 రూ. • సంపుటి 7 • సంచిక 205 • పేజీలు : 20 + (24/20/16)

WWW. NTNEWS.COM /NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

S & D

తెలంగాణ అంతటా

విద్యుత్తేజం

12:01

నిరంతర ఉచిత కరంటు ప్రారంభం

- అన్నమాట నిలబెట్టుకొన్న ముఖ్యమంత్రి కేసీఆర్
- విద్యుత్ అధికారులు, సిబ్బంది శ్రమకు లభించిన ఫలితం
- కొత్త సంవత్సర వేళ తెలంగాణ రైతు లోగిళ్లలో వెలుగు జిలుగులు
- ఎప్పటికప్పుడు సమీక్షించిన ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు
- సీఎంవో కార్యాలయం నిరంతర పర్యవేక్షణ




సుఖ సంతోషాలతో గడుపాలి

ప్రజలకు సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రజలంతా సుఖ సంతోషాలతో గడుపాలని భగవంతుడిని ప్రార్థించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం చేపట్టే కార్యక్రమాలన్నీ 2018లో విజయవంతంగా ముందుకుసాగాలని సీఎం ఆకాంక్షించారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు



పుట్టింది ఎందుకో తెలిసేది కొందరికి అన్నట్టు.. తెలంగాణ తాను పుట్టడానికి ముందే.. ఎందుకు పుడుతున్నదో తెలుసుకొని ఆవిర్భవించింది. మూడున్నరేండ్ల చిన్న జీవితంలో మూడు నూతన సంవత్సరాలు చూసి.. నాలుగో వసంతంలోకి అత్యంత ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టింది. ఎన్నో సంక్షేమ పథకాలు.. మరెన్నో అభివృద్ధి ప్రణాళికలు.. అన్ని వర్గాలు.. అన్ని కులాలు.. అన్ని మతాలు.. అన్ని రంగాలు.. ప్రతి ఒక్కరి ఆకాంక్షను నెరవేర్చే దిశలో ఎన్నో చర్యలు.. తెలంగాణలో ఏ పథకం చేపట్టినా రికార్డే. యావత్ దేశానికి ఆదర్శమే. ప్రపంచ దేశాలు సైతం అబ్బురపడిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ తెలంగాణకు మాత్రమే సాధ్యమైనవి. నూతన సంవత్సర శుభ సందర్భాన్ని పురస్కరించుకొని దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా వ్యవసాయానికి 24గంటల విద్యుత్ పథకాన్ని ప్రారంభించి రైతుల లోగిళ్లలో తెలంగాణ ప్రభుత్వం వెలుగులు నింపింది. ఈ ఆనందం తెలంగాణ వ్యవసాయాన్ని సుసంపన్నం చేయాలి. ప్రతిష్ఠాత్మక కాళేశ్వరం వంటి ప్రాజెక్టులు నూతన సంవత్సరంలో పూర్తై తెలంగాణ సమృద్ధం కావాలి. బంగారు తెలంగాణ దిశగా 2018లో నిర్ణయాత్మక అడుగులు పడాలి. నూతన సంవత్సర శుభాకాంక్షలతో..!

సీఎం కేసీఆర్ వ్యూహంవల్లే సాధ్యమైంది
ఇది చారిత్రాత్మక సందర్భం!



- 24గంటల విద్యుత్‌తో వ్యవసాయ పురోభివృద్ధి
- కరంటు లోటులేకుండా చర్యలు
- 'నమస్తే తెలంగాణ'తో విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలోనూ అమలుకాని విధంగా తెలంగాణలో వ్యవసాయరంగానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయడం ఆనందంగా ఉన్నదని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు విద్యుత్‌కోతలపై రోడ్డెక్కి ఆందోళనలు చేశామని, విద్యుత్ సమస్యతోనే తెలంగాణ ఉద్యమం తీవ్రమైందని గుర్తుచేశారు. వీటన్నింటిపై అవగాహన ఉన్న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక వ్యూహంతో విద్యుత్ వ్యవస్థపై ప్రజల్లో భరోసా కల్పించారని పేర్కొన్నారు. అధికారం చేపట్టిన ఆరునెలల్లోనే కోతల్లేకుండా విద్యుత్‌ను అందించిన ప్రభుత్వం నేడు వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను అందించడం చారిత్రాత్మక సందర్భమని తెలిపారు. ఈ నేపథ్యంలో మంత్రి జగదీశ్‌రెడ్డితో నమస్తే తెలంగాణ ప్రతినిధి జరిపిన ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు.

ఉద్యమస్ఫూర్తితో సాధించాం: మా నీళ్లు.. మా నిధులు.. మా ఉద్యోగాలు నినాదంతోనే తెలంగాణ ఉద్యమం

మిగతా 4వ పేజీలో

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఆదివారం అర్ధరాత్రి.. 2018 నూతన సంవత్సరం ప్రవేశించిన శుభ సందర్భం.. యావత్ ప్రపంచం కొత్త సంవత్సరానికి స్వాగతం పలికి సంబురాలు చేసుకొంటున్న మంచి తరుణం.. సరిగ్గా కొత్త ఏడాది ప్రవేశించిన ఒక్క నిమిషానికి తెలంగాణ రాష్ట్రంలో అర్ధరాత్రి సూర్యుడు ఉదయించాడు. ఉమ్మడి పాలనలో దశాబ్దాల తరబడి అలుముకొన్న చీకట్లను చీల్చివేసి విద్యుత్ కాంతులను ప్రసరింపజేశాడు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు స్వప్నం సాకారమైన క్షణమది. లక్షల రైతు కుటుంబాల్లో ఆనందం నిండిన సమయమది. వ్యవసాయానికి ఇరవైనాలుగు గంటలపాటు నిరాఘాటంగా విద్యుత్ సరఫరా ప్రారంభమైన శుభవేళ అది.

నూతన సంవత్సరపు ఉషోదయ కిరణాలు భూమిపై మెరువకముందే తెలంగాణ పంటపొలాల్లో విద్యుత్ వెలుగులు విరజిమ్మాయి. రాష్ట్రంలోని 23లక్షల వ్యవసాయ కనెక్షన్లకు 24 గంటల కరంట్ సరఫరాను విద్యుత్ సంస్థలు సగర్వంగా ప్రారంభించాయి. దేశ చరిత్రలో ఏ రాష్ట్రమూ చేయలేని పనిని తెలంగాణ ప్రభుత్వం చేసి చూపించింది. విడిపోతే తెలంగాణ అంధకారంలో మగ్గిపోతుందన్న వారికి చెంపపెట్టుగా రాష్ట్రం ఏర్పడిన మూడున్నరేండ్లలోనే అన్ని రంగాలతోపాటు వ్యవసాయానికి సైతం నిరంతరంగా నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చి రికార్డు సృష్టించింది. ఇప్పటికే అభివృద్ధిపరంగా, సంక్షేమపరంగా అనేక రంగాలలో దేశంలోనే నంబర్ 1గా నిలిచిన

మిగతా 4వ పేజీలో

కరంటు లేనప్పుడు పుట్టాను..
నిరంతర కరంటులో భాగస్వామినయ్యా



- భయంతో మొదలుపెట్టి.. దిగ్విజయం సాధించాం
- కర్త, కర్మ, క్రియ.. అంతా సీఎం కేసీఆరే
- 'నమస్తే తెలంగాణ'తో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు

ఎక్కల్‌దేవి శ్రీనివాస్, నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి

వేరు పడితే.. మీరు చీకట్లో మగ్గిపోతారని సమైక్య పాలకులు భయపెట్టినా.. ఉద్యమ ప్రభావంతో ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తరువాత తెలంగాణలో చీకట్లను పారదోలి వెలుగులు విరజిమ్మేలా చేసే అతి పెద్ద, అతి ముఖ్యమైన కార్యక్రమానికి సారథ్యం వహించారాయన. కరంటు లేనికాలంలో.. కరంటు అంటేనే తెలియని కాలంలో ఆయన పుట్టారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయానికి 24గంటలపాటు ఉచిత విద్యుత్‌ను ఇచ్చే బృహత్ పథకాన్ని సఫలం చేయడంలో దిగ్విజయం సాధించారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు లాంటి దార్శనికుడి మార్గదర్శనంలో, ఎప్పటికప్పుడు రానున్న సమస్యలను ముందుగానే ఊహించి వాటిని పరిష్కరించడంలో తనకున్న అపారమైన అనుభవానికి తోడుగా మన రాష్ట్రాన్ని మనం బాగుచేసుకోవాలనే గట్టి సంకల్పంతో 'టీం పవర్'గా సమిష్టిగా కలిసి పనిచేసిన విద్యుత్‌శాఖ సిబ్బంది, ఇంజినీర్ల సహకారంతో దేశంలోనే ఎవరూ

మిగతా 4వ పేజీలో

ఉగ్రవాదుల బరితెగింపు



దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సీఆర్పీఎఫ్ శిక్షణాకేంద్రంపై ఉగ్రవాదులు దాడికి తెగబడడంతో అప్రమత్తమైన జవాను

- కశ్మీర్‌లోని సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై ఉగ్రదాడి
- ఐదుగురు భారత జవాన్లు మృతి
- ఇద్దరు జైషే మహ్మద్ మిలిటెంట్ల కాల్చివేత

7

గురుకుల పీజీటీ ఫలితాలు విడుదల

టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో ఎంపిక జాబితా



హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణ గురుకులాల్లోని పీజీటీ పోస్టుల నియామక ఫలితాలను టీఎస్‌పీఎస్సీ ఆదివారం విడుదల చేసింది. ఫలితాల తుదిజాబితాను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లో ఉంచినట్టు కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. గణితం, జీవ, భౌతిక, సాంఘికశాస్త్రాలకు సంబంధించి మొత్తం 513 పోస్టులకు జూలై 18,19 తేదీల్లో రాతపరీక్షలు జరిగాయి. తాజా పోస్టుల భర్తీతో ఇప్పటివరకు గురుకులాల్లో 921 పీజీటీ ఖాళీలను భర్తీ చేసినట్టు వాణీప్రసాద్ వివరించారు. పీజీటీ గణితంలో 126 ఖాళీలకుగాను 114 మందిని, సాంఘికశాస్త్రం విభాగంలో 177 ఖాళీలకు 166 మంది, భౌతికశాస్త్రం విభాగంలో 188 ఖాళీలకు 174 మంది అభ్యర్థులను ఎంపిక చేసినట్టు వాణీప్రసాద్ తెలిపారు. మిగిలిన ఖాళీల భర్తీ వివరాలను పీహెచ్‌సీ క్యాటగిరీ కింద వైద్యధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం విడుదల చేస్తామని చెప్పారు. కాగా, జీవశాస్త్రం విభాగంలో 22 పోస్టులకుగాను 21 మందిని ఎంపిక చేసినట్టు, ఏజెన్సీ క్యాటగిరీలో అర్హులైన అభ్యర్థి దొరుకకపోవడంతో మరోపోస్టును భర్తీచేయలేదని తెలిపారు.

ములుగు అటవీ కళాశాలలో కొలువుల భర్తీ

ములుగులోని అటవీ కళాశాలలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల నియామక జాబితాను టీఎస్‌పీఎస్సీ ఆదివారం విడుదల చేసింది. మొత్తం 19 ఖాళీల్లో 2 ప్రొఫెసర్ ఖాళీలు కాగా మిగిలినవి అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలు. వీటిలో 8 ఖాళీలు భర్తీ చేసినట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది. అర్హులు లేకపోవడం వల్ల మిగతా పోస్టులను భర్తీ చేయలేదని తెలిపింది. కాగా, ఖాళీగా ఉన్న ఒక లైబ్రేరియన్ పోస్టుకు జనవరి 5, 6 తేదీల్లో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది.

దేవుడు శాసించాడు.. వస్తున్నా!

త్వరలోనే పార్టీ పెడుతా..


వచ్చే ఎన్నికల్లో 234 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తా.. హామీలు నెరవేర్చకపోతే మూడేండ్లలో రాజీనామా : రజనీకాంత్

తమిళనాట అభిమానుల సంబురాలు

రాజకీయ ఎంట్రీపై శుభాకాంక్షల వెల్లువ

> తమిళనాట రాజకీయాలు భ్రష్టుపట్టిపోయాయి. ఇటీవలి పరిణామాలతో తమిళ ప్రజలు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా నేను నిర్ణయం తీసుకోకపోతే, నాకు జీవితాన్నిచ్చిన తమిళప్రజలకు ద్రోహం చేసినవాడిగా మిగిలిపోతాను. ఆ బాధ నన్ను జీవితాంతం వెంటాడుతుంది.

7



ఆదివారం చెన్నైలో రాజకీయ పార్టీని స్థాపిస్తానంటూ ప్రకటించి అభిమాన సంఘాలకు అభివాదం చేస్తున్న తమిళ సినీ సూపర్‌స్టార్ రజనీకాంత్

సరిహద్దు వెంట.. అర్ధరాత్రి పాక్ దుర్మార్గం

విచక్షణారహిత కాల్పుల్లో ఓ జవాను మృతి

7

పోలీసులకు పతకాల పంట

- ఉత్తమ సేవలందించిన సిబ్బందికి అవార్డులు ప్రకటించిన ప్రభుత్వం
- నలుగురికి ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీస్ పతకాలు
- ముగ్గురికి మహోన్నత సేవా పతకాలు
- 17 మందికి శౌర్యపతకాలు.. 44 మందికి ఉత్తమ సేవాపతకాలు..
- 21 మందికి కఠినసేవా పతకాలు.. 208 మందికి సేవా పతకాలు

14

S & D



ఆదివారం అర్ధరాత్రి '24 గంటల విద్యుత్ సరఫరా' పథకాన్ని మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం పోతాయపల్లి గ్రామంలో రైతు చింతల వెంకట్‌రెడ్డి పొలం వద్ద స్టార్టర్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు. చిత్రంలో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఉన్నతాధికారులు జాలా శ్రీనివాస్‌రెడ్డి, స్వామిరెడ్డి, శ్రీ రత్నాకర్‌రావు, రైతులు కూడా ఉన్నారు.



హిమాచల్‌ప్రదేశ్‌లోని సిమ్లాలో 2018 సంవత్సరానికి స్వాగతం పలుకుతున్న బౌద్ధ సన్యాసులు



నయాసాల్.. నయా జోష్

ఆదివారం అర్ధరాత్రి హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులో నూతన సంవత్సర సంబురాల్లో యువత



సిరిసిల్లలో ఆదివారం మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ వినోద్‌కుమార్. చిత్రంలో టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

ఉద్యమ సమయంలోనే పథకాలకు రూపకల్పన

నేటి పథకాలు నాటి శ్రీకృష్ణ కమిటీ నివేదిక అంశాలే

కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో నేడు అమలవుతున్న సంక్షేమ పథకాలన్నింటికీ తెలంగాణ ఉద్యమ సమయంలోనే రూపకల్పన చేశామని కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. సిరిసిల్లలోని మంత్రి కేటీఆర్ నివాసంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డితో కలిసి ఎంపీ వినోద్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణలో అమలవుతున్న చాలా కార్యక్రమాలు నాడు రాష్ట్ర ఏర్పాటు కోసం వేసిన శ్రీకృష్ణ కమిటీ నివేదికలో పొందుపరిచామన్నారు. రాష్ట్రంలో అధిక శాతమున్న బలహీనవర్గాలు అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో సీఎం కేసీఆర్ స్వయం ఉపాధి పథకాలు ప్రకటిస్తుంటే, ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. నాడు ఉద్యమ పార్టీ టీఆర్ఎస్ తరఫున ప్రొఫెసర్ జయశంకర్, తాము వెళ్లి శ్రీకృష్ణ కమిటీకి నివేదిక ఇచ్చామని, అందులోనే రాష్ట్రం ఏర్పడితే అభివృద్ధి ఎలా జరుగుతుందో వివరించామన్నారు. దూరదృష్టితో సీఎం కేసీఆర్ చేసే ఆలోచనలు భవిష్యత్తుతరాలకు మేలు చేస్తున్నాయన్నారు. 2017ను బడుగు బలహీన వర్గాల నామ సంవత్సరంగా చెప్పుకోవచ్చన్నారు. గడిచిన ఏడాదిలో సీఎం కేసీఆర్ బీసీ, ఎస్సీ, ఎస్టీల కోసం అనేక పథకాలు ప్రకటించారని, అవన్నీ 2018లో అమల్లోకి రానున్నాయని స్పష్టం చేశారు. సమైక్య పాలనలో చచ్చుబడిన కులవృత్తులకు జీవం పోసేందుకు రజకులకు వాషింగ్‌మెషిన్లు, నాయీ బ్రాహ్మణులకు అధునాతన సెలూన్లు, యాదవులకు గొర్రెలు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. సిరిసిల్లలో మెగా పవర్‌లూమ్ క్లస్టర్, టెక్స్‌టైల్ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్, తాను కేంద్ర మంత్రులను కలిశామని, వారు సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

సీఎం కేసీఆర్ వ్యూహంవల్లే సాధ్యమైంది

ఇది చారిత్రాత్మక సందర్భం!

మూడోపేజీ తరువాయి...

చేపట్టాం. రాష్ట్ర సాధన ఉద్యమం నడుస్తున్న రోజుల్లోనే ఉద్యమనేతగా.. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు తెలంగాణలోని అన్ని రంగాల్లో జరుగాల్సిన అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించారు. విద్యుత్ రంగంలో ఇవాళ సాధించిన పురోగతి నాటి ప్రణాళిక ఫలితమే. 2014 జూన్ 2న అధికారం చేపట్టిన నాటి నుంచి ఆర్నెలల్లోనే కోతల్లేకుండా 24 గంటల విద్యుత్‌ను అందించగలిగాం. సీఎం కేసీఆర్ ప్రత్యేక వ్యూహం వల్లే విద్యుత్ పంపిణీ, ఉత్పత్తి, సబ్‌స్టేషన్ల నిర్వహణలో వినూత్న విధానాలు అవలంబిస్తున్నాం. ప్రజలకు కోతల్లేని విద్యుత్ అందిస్తూనే.. సాంకేతికతకు ప్రాధాన్యమిచ్చి విద్యుత్ వృథాకాకుండా చర్యలు చేపట్టాం.

సంప్రదాయేతర విద్యుత్‌పై దృష్టి

రాష్ట్ర అవసరాలకు సరిపడా విద్యుత్‌ను అందుబాటులోకి తెస్తూనే.. సంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తిపై దృష్టి సారించాం. అందులో భాగంగానే సౌర విద్యుత్ ఉత్పత్తిలో మన రాష్ట్రం దేశంలోనే ముందంజలో నిలిచింది. పవన విద్యుత్‌ను కూడా అందుబాటులోకి తేనున్నాం. నిరంతర విద్యుత్ సరఫరా ప్రారంభమవుతున్నందున 4వేలకు పైగా ఖాళీల భర్తీకి త్వరలో చర్యలు చేపడుతాం. రికార్డు స్థాయిలో రెండేండ్ల వ్యవధిలోనే కొత్తగూడెం విద్యుత్ కేంద్రం నిర్మాణాన్ని పూర్తిచేస్తున్నాం. భద్రాద్రి, యాదాద్రి విద్యుత్‌కేంద్రాల పనులూ వేగంగాచేస్తున్నాం. 2024నాటికి రాష్ట్ర స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం



28వేల మెగావాట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నాం. వార్ధా డిచ్‌పల్లి లైనును కేంద్రం నిర్మిస్తున్నందున దానిలో సరఫరా కోసమే ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్నాం. అక్కడి నుంచి 1000 మెగావాట్లు వస్తుండటంతో .. ఇక్కడి సంస్థలు తక్కువ ధరకు విద్యుత్‌ను అమ్మడానికి ముందుకొచ్చాయి. విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)ల ఆర్థిక లోటు తీర్చడానికి కరంటు చార్జీలు పెంచడం ఒక్కటే కాకుండా, ఇతర మార్గాల్లో సైతం ఆదాయం పెంచుకోవాలని సీఎం కేసీఆర్ సూచించారు. ఇందుకు అనుగుణంగా కృషి చేస్తున్నాం.

భారమని భావించడం లేదు

వ్యవసాయానికి 24గంటల విద్యుత్‌ను అందిస్తామంటే కొందరు ఎద్దేవా చేశారు.. ఇప్పుడు ఆచరణలో చూపిస్తున్నాం. వ్యవసాయానికి నిరంతరం విద్యుత్ సరఫరాకోసం అదనంగా ఖర్చు చేయడాన్ని ప్రభుత్వం భారంగా భావించడంలేదు. అందరికీ అన్నంపెట్టే రైతన్నలు పంటలు సాగు చేసేందుకు విద్యుత్ సరఫరాద్వారా తోడ్పడుతున్నాం. ఇందుకోసం 11వేల మెగావాట్ల విద్యుత్ అవసరం కాగా, 14500 మెగావాట్ల విద్యుత్‌ను సిద్ధంగా ఉంచాం.

భవిష్యత్ అవసరాలకు ఇబ్బంది లేదు

రాష్ట్రంలో భవిష్యత్ అవసరాలకు సరిపడా విద్యుత్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాం. నిరుడు ఎండాకాలంలో అత్యధికంగా ఒకేరోజు 9,500 మెగావాట్ల విద్యుత్ వినియోగమైంది. ఇప్పుడు 24 గంటలు సరఫరా ప్రారంభిస్తే రాష్ట్ర విద్యుత్ వినియోగం 11వేల మెగావాట్లకు చేరొచ్చని అంచనా.. ఇందుకోసం 1500 మెగావాట్లు అదనంగా కొంటున్నాం. ఒకవేళ డిమాండ్ 15వేల మెగావాట్లకు చేరుకొన్నా, తట్టుకుని సరఫరా చేసేలా పంపిణీవ్యవస్థను ఆధునీకరించాం. ఇందుకోసం రూ.12 వేల కోట్లు ఖర్చు చేశాం. కొత్తగా 400 కేవీ స్థాయి సబ్‌స్టేషన్లు 18 నిర్మించాం. కేసీఆర్ పాలనలోకి వచ్చిన ఆరునెలల్లోనే సేద్యానికి 24 గంటల విద్యుత్ సరఫరా ఇవ్వాలనుకున్నారు. కానీ సరఫరా, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేసిన తర్వాత ఇప్పుడిస్తున్నాం.

ఇదంతా పవర్ టీం సమిష్టి కృషి

మూడోపేజీ తరువాయి...

సాధించలేని విజయాన్ని సాధించిన టీం లీడర్.. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు. కొత్త సంవత్సరం ప్రారంభం నుంచి రాష్ట్రంలోని 23 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు 24 గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించిన ప్రభాకర్‌రావుతో 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూ.

నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో అన్నిరంగాలకు నిరంతర విద్యుత్, వ్యవసాయానికి 24గంటలపాటు ఉచితంగా విద్యుత్‌ను అందించాలనే సీఎం కేసీఆర్ కలను నెరవేర్చడంలో ముఖ్యభూమిక పోషించిన మీకు, మీ 'టీం పవర్'కు నమస్తే తెలంగాణ తరపున అభినందనలు.

ప్రభాకర్‌రావు: కృతజ్ఞతలు. తెలంగాణ గడ్డకు, ప్రజలకు సేవచేసే అవకాశం దక్కడం.. సమైక్య పాలకుల శాపనార్థాలు వమ్ము చేయడంలో కీలకపాత్ర పోషించడం నిజంగా నా అదృష్టం. అసలు కరంటు అంటేనే తెలియని కాలంలో పుట్టిన నేను.. నిరంతర విద్యుత్‌ను అందించే కార్యక్రమానికి సారథిగా మారడం కంటే గొప్ప అనుభవం.. అనుభూతి ఎవరికుంటుంది చెప్పండి.

దేశంలో ఎవరూ ఇవ్వనివిధంగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను ఇస్తున్న ఈ శుభ సందర్భంలో మీకెలా అనిపిస్తున్నది.

నిజంగా చెప్పాలంటే.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇలాంటి నిర్ణయం (సేద్యానికి 24 గంటల ఉచిత విద్యుత్) తీసుకుని చెప్పినప్పుడు కొంత భయం వేసింది. కానీ దానిని విజయవంతం చేసిన ఈరోజు ఎంతో సంతోషంగా ఉన్నది. ఇప్పటిదాకా ఎవ్వరూ చేయలేని పని ఇది. భయంతో మొదలై.. నమ్మకంతో ముందుకు సాగుతూ.. తెలంగాణ యావత్తూ గర్వపడేలా విజయం సాధించాం.

వ్యవసాయ కనెక్షన్లతోపాటు అన్ని ఇతర రంగాలకు నిరంతరం విద్యుత్ ఇవ్వడం కోసం ఎలాంటి చర్యలు తీసుకొన్నారు? వ్యవసాయానికి ఎంతమేర అదనంగా విద్యుత్ కావాల్సి ఉంటుంది?

రాష్ట్రవ్యాప్తంగా 23 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. వీటికి గరిష్ఠంగా 7500 మెగావాట్ల విద్యుత్ అవసరం ఉంటుంది. అది కూడా ఈ యాసంగిలో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఉండే అవకాశం ఉంటుంది. కచ్చితంగా చెప్పాలంటే.. ఏడాదికి దాదాపు 17వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ వ్యవసాయానికి అవసరం. ఇదే సమయంలో గృహ, వాణిజ్య, పరిశ్రమల రంగాలకు కూడా నిరంతరాయంగా విద్యుత్‌ను అందించేందుకు ఏర్పాట్లుచేశాం. రాష్ట్రం ఏర్పడినప్పుడు 6,574 మెగావాట్ల స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉండేది. గడిచిన మూడున్నరేండ్లలో మన స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 14,585 మెగావాట్లకు పెరిగింది. భవిష్యత్తులో మరో 13వేల మెగావాట్లకు పైగా విద్యుత్‌ను సమకూర్చుకునేందుకు కొత్త విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు నిర్మిస్తున్నాం. 2022 నాటికి తెలంగాణలో 28వేల మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. 24 గంటల విద్యుత్ కోసం రూ. 12,610 కోట్లతో ట్రాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం. గ్రిడ్ సమస్యలుకూడా తలెత్తకుండా అన్ని రకాల చర్యలు తీసుకొన్నాం. కావాల్సిన సబ్‌స్టేషన్లు, విద్యుత్‌లైన్లు ఏర్పాటు చేశాం. పైగా ప్రయోగాత్మకంగా రాష్ట్రం మొత్తం 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేసి.. సాంకేతికంగా ఎలాంటి సమస్యలు వస్తాయో తెలుసుకొని వాటిని సరిచేశాం. అనుకున్నట్టుగానే కొత్త సంవత్సరం నుంచే 24 గంటల విద్యుత్‌ను విజయవంతంగా ప్రారంభించాం.

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఎలా బలోపేతం అవుతుంది?

సీఎం కేసీఆర్ చెప్పేది కూడా అదే. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల పంటలు సమృద్ధిగా పండుతాయి. వినూత్నమైన పంటలకు రైతులు శ్రీకారం చుడుతారు. నిరంతరంగా విద్యుత్ అందుబాటులో ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లోనూ కుటీర, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు పెరుగుతాయి. దీనితో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. జీడీపీ పెరుగుతుంది. ఇప్పటికే ఆ దిశగా మనం పయనిస్తున్నాం.

సీఎం కేసీఆర్ ఈ నిర్ణయం చెప్పినప్పుడు భయపడ్డామని అన్నారు.. ఎలా సాధించారు? ఎవరెవరు సహకరించారు?

సీఎం నిర్ణయం చెప్పినప్పుడు ఇది సాధించగలమా అనే భయం పట్టుకుంది. నిజానికి మన రాష్ట్రం వచ్చినప్పుడున్న పరిస్థితికి.. ఇప్పటికి ఏమైనా పోలిక.. పొంతన ఉన్నదా? చిమ్మచీకట్లలో మగ్గుతున్న సమయంలో రాష్ట్రం ఏర్పడింది. అలాంటి పరిస్థితుల్లో కేవలం ఆరు నెలల్లోనే కోతలన్నింటినీ ఎత్తివేసి.. గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు 24 గంటలపాటు, వ్యవసాయానికి 9 గంటలపాటు విద్యుత్ ఇవ్వడమనేది చిన్న విషయం కాదు. దానిని సాధించిన తర్వాత మాలో ఆత్మస్థైర్యం ఏర్పడింది. వీటన్నింటికంటే ముఖ్యమైనది.. మన ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం. ఆయన మార్గదర్శకత్వంలో ముందుచూపుతో ఆయన వేసిన ప్రణాళికతోనే విద్యుత్ రంగంలో ఇంతటి ఘన విజయం సాధించాం. దీనికి కర్త, కర్మ క్రియ సీఎం కేసీఆరే..ఆయన మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టాం. దీనికి తోడు మా 'టీం పవర్'.. విద్యుత్ శాఖలోని సిబ్బంది, ఇంజినీర్లు, అధికారులు అందరూ సమిష్టిగా శ్రమించి సాధించారు. ఈ విజయం



అటు సీఎం కేసీఆర్‌కు, ఇటు క్షేత్రస్థాయిలో పనిచేసిన సిబ్బంది, ఇంజినీర్లకు చెందుతుంది. అదే సమయంలో పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్లు మనకు చేసిన ఆర్థికసాయం ఎనలేనిది. వాటి సాయంతో అనుకున్న సమయంలోగా మన ప్రాజెక్టులను పూర్తిచేయగలుగుతున్నాం. ప్రభుత్వం అందించినసాయం, మా శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి ప్రోత్సాహం మరువలేనిది.

ఉత్పత్తి కేంద్రాలను బ్యాక్‌డౌన్ చేస్తున్నారనే అపవాదు, ప్రచారం నాకు బాధ కలిగించింది. ఇక్కడ ఒక వాస్తవాన్ని చెప్పుకోవాలి. మిగతా వస్తువులు, ఉత్పత్తుల మాదిరిగా కరంట్‌ను మనం నిల్వచేసుకోలేం. ఉత్పత్తి అయినప్పుడే వాడుకోవాలి. విద్యుత్ డిమాండ్ వేరు.. వినియోగం వేరు. దీనిని సరిగా అర్థం చేసుకోలేక.. ఇలాంటి ప్రచారంచేశారు. 24 గంటల విద్యుత్‌ను ఇవ్వాలంటే.. సాంకేతికంగా కొన్నిసార్లు థర్మల్‌కేంద్రాలను బ్యాక్‌డౌన్ చేయాల్సిందే. ఇది మన రాష్ట్రమే కాదు.. అన్ని రాష్ట్రాలు చేసే ప్రక్రియే. మన రాష్ట్రంలో ప్రతిరోజూ విద్యుత్ డిమాండ్.. రాత్రికి, పగటికి సుమారు 3 వేల మెగావాట్ల తేడా ఉంటుంది. ఉదాహరణకు.. డిసెంబర్ 27 ఉదయం 2 గంటలకు (తెల్లవారుజామున) 5000 మెగావాట్ల డిమాండ్ ఉన్నది. ఉదయం 7.44 గంటలకు 8257 మెగావాట్లకు చేరింది. మళ్లీ సాయంత్రం వరకు డిమాండ్ తగ్గుతూనే ఉన్నది. ఈవిధంగా ఎప్పటికప్పుడు వచ్చే డిమాండ్ హెచ్చుతగ్గులకు అనుగుణంగా విద్యుత్‌ను అందివ్వాలంటే.. అటు విద్యుత్‌ను అంచనాల మేరకు కొనుగోలు చేయాల్సిందే. అదే సమయంలో మన థర్మల్ విద్యుత్ కేంద్రాలను పూర్తిగా షట్‌డౌన్ చేయకుండా.. బ్యాక్‌డౌన్ (పూర్తి సామర్థ్యంలో 45శాతం మేరకే తగ్గించగలం) చేయాల్సిందే. లేకపోతే.. డిమాండ్ హెచ్చుతగ్గులకు అనుగుణంగా విద్యుత్ సరఫరా ఉండక.. నిరంతరాయంగా విద్యుత్‌ను ఇవ్వలేం. గ్రిడ్ వైఫల్యానికి కూడా దారితీసే అవకాశం ఉంటుంది.

మీరు చాలా సంతోషపడిన సందర్భాలు ఉన్నాయా?

కేవలం ఆరు నెలల కాలంలోనే గృహ, వాణిజ్య, పరిశ్రమల రంగాలకు 24 గంటల విద్యుత్‌ను అందివ్వడం.. అలాగే ఇప్పుడు వ్యవసాయానికి 24 గంటలపాటు ఉచిత విద్యుత్‌ను అందివ్వడం, దేశ చరిత్రలోనే తెలంగాణ పేరును సువర్ణాక్షరాలతో లిఖించడం.. చాలా సంతోషం కలిగించిన అంశాలు. క్షేత్ర స్థాయిలో చెప్పుకోవాలంటే గోదావరి పుష్కరాల సమయంలో భూపాలపల్లి నుంచి పరకాలకు వాహనంలో వస్తుండగా మధ్యలో భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. నాలుగైదు గంటలపాటు అక్కడే వాహనాన్ని నిలిపివేయాల్సి వచ్చింది. ఆ సమయంలో పక్కనే ఉన్న చిన్న గ్రామానికి నడుచుకుంటూ వెళ్ళాను. అక్కడ కొందరు కూర్చుని ఉన్నారు. నేనెవ్వరో వారికి తెలియదు. వారితో మాటల సందర్భంలో కరంట్ ఎలా ఉంటున్నది అని అడిగాను. దానికి అందరూ ముక్తకంఠంతో.. 'కేసీఆర్ సార్ వచ్చిన తర్వాత అసలు కరంటు పోతలేదు. ఎప్పుడైనా పోతే.. గప్పున పోయి.. జప్పున వస్తున్నది' అంటూ చెప్పడం చాలా చాలా సంతోషాన్నిచ్చింది. సీఎం కృషికి, మేము పడ్డ కష్టానికి అది నిజమైన కితాబు.

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందిస్తే.. భూగర్భ జలాలు ఎండిపోతాయనీ, ఆటోమేటిక్ స్టార్టర్ల వల్ల అనర్థాలు జరుగుతాయన్న వాదనపై మీరేమంటారు..

రైతులు తెలివైనవారు. వివేకంతో వ్యవహరిస్తారు. వారికి అన్ని విషయాలు తెలుసు. కరంటు ఇవ్వడం బాధ్యత. భూగర్భజలాలు వృథా కాకుండా, మోటర్లు కాలిపోకుండా చూసుకొంటారనే నమ్మకం రైతులపై మాకు ఉన్నది. పంటలు బాగా పండాలంటే.. నీళ్లు ఎంత కావాలో అంతే పెట్టాలి. అది రైతులకు బాగా తెలుసు. అలాగే.. అనవసరంగా మోటర్లు నడిస్తే కాలిపోతాయని కూడా వారికి తెలుసు. గతంలో కరంటు సరిగా లేనప్పుడు.. ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియనప్పుడు.. ఆ కష్టాల నుంచి బయటపడేందుకు.. ఆటోమేటిక్ స్టార్టర్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు వాటి అవసరం లేదు. ఎప్పుడు కావాలంటే అప్పుడు కరంటు అందుబాటులో ఉన్నప్పుడు ఆటోమేటిక్ స్టార్టర్లతో పనేమున్నది. ఆటోమేటిక్ స్టార్టర్లను స్వయంగా వారే తొలిగించుకొంటున్నారు.

మూడు తరాల తెలంగాణ జనజీవనానికి మీరు నిలువెత్తు సాక్ష్యమని చెప్పవచ్చేమో..

అవును. ఇది నిజంగా అద్భుతం. అదృష్టంకూడా. పాత వరంగల్ జిల్లా సంగెం మండలం పల్లారిగూడలో నేను పుట్టినప్పుడు ఎవరికీ కరంటు అంటే తెలియదు. నా చదువంతా.. కందిళ్ల కిందనే సాగింది. 1969లో నేను విద్యుత్ సంస్థలో ఉద్యోగిగా చేరాను. ఆ తర్వాతే 1972లో మా ఊరుకు కరంటు వచ్చింది. అప్పటినుంచి విద్యుత్‌పై అనుభవం సంపాదిస్తూ వచ్చాను. నిరంతర విద్యుత్ అనేది ఇన్నాళ్లూ కలగానే మిగిలింది. ఇప్పుడు నా కీలకపాత్రలో అది నెరవేరడంతో జన్మసార్థకమైంది. నా మనుమలు, మనుమరాండ్లకు నేను గర్వంగా చెప్పుకొనే అంశమిది.

చరిత్రలో నిలిచిపోయేలా విద్యుత్‌రంగాన్ని తీర్చిదిద్దుతున్న తరుణంలో.. మీరు బాధపడిన సంఘటన ఏదైనా ఉందా?

నిజమే.. చాలా బాధపడిన సంఘటన ఉన్నది. థర్మల్ విద్యుత్

విద్యుత్తేజం

మూడోపేజీ తరువాయి...

తెలంగాణ, రైతాంగానికి సమృద్ధిగా విద్యుత్‌ను అందించి.. అన్ని రాష్ట్రాలకూ మార్గదర్శకంగా నిలిచింది. ఇది 'టీం పవర్' సిబ్బంది, ఇంజినీర్లు, అధికారులు సమిష్టిగా సాధించిన విజయం. తెలంగాణ రైతులను ఉత్తేజపరిచిన ఆనంద క్షణాలివి.

ఆదివారం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులు.. రైతుల సమక్షంలో 24గంటల విద్యుత్ సరఫరాను ప్రారంభించి.. వారు సంబురాల్లో పాలుపంచుకొన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని వారు పరిశీలించి, సంబంధిత సమాచారాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి అందించారు. అన్ని జిల్లాల్లో స్థానిక విద్యుత్ ఇంజినీర్లు, అధికారులుకూడా నిరంతర విద్యుత్‌ను పరిశీలిస్తూ.. సిబ్బందికి అవసరమైన సూచనలు అందిస్తూ.. అందరినీ ఉత్సాహపరుస్తూ.. తెల్లవారుజామువరకు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులతో ముచ్చటించారు. సోమవారం ఉదయం రైతులు ఎక్కువగా మోటర్లను ఉపయోగించే అవకాశం ఉండటంతో.. రానున్న డిమాండ్‌ను అంచనా వేస్తూ.. తగిన చర్యలను ఉన్నతాధికారులు చేపట్టారు. వ్యవసాయానికి నిరంతర సరఫరా కోసం ప్రత్యేకంగా 7500 మెగావాట్ల విద్యుత్‌ను అందుబాటులో ఉంచారు.

మద్యం మత్తులో వీరంగం

భర్తపై దాడి.. అడ్డొచ్చిన భార్యపై లైంగికదాడికి యత్నం

నలుగురిపై కేసు నమోదు.. పెద్దపల్లి జిల్లా జూలపల్లిలో ఘటన

జూలపల్లి: మద్యం మత్తులో నలుగురు యువకులు వీరంగం సృష్టించారు. ఇంటి ఎదుట నిలబడి ఉన్న వ్యక్తిపై దాడి చేశారు. తన భర్తను అకారణంగా ఎందుకు కొడుతున్నారని అడ్డొచ్చిన భార్యపై దాడి చేయడంతోపాటు ఆమెపై లైంగికదాడికి యత్నం చేయబోయిన ఘటన పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలంలోని కాచాపూర్‌లో శుక్రవారం రాత్రి జరుగగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కాచాపూర్‌కు చెందిన మాధవ్ తన భార్య (26)తో కలిసి ఇంటి ఎదుట నిలబడి ఉండగా అదే గ్రామానికి చెందిన సంతోష్, సంపత్, సత్యం, తిరుపతి అనే నలుగురు యువకులు తాగిన మైకంలో అకారణంగా మాధవ్‌ను చితకబాదారు. తన భర్తను ఎందుకు కొడుతున్నారని అడ్డొచ్చిన మహిళపై దాడి చేయడమేగాక ఆమెను వివస్త్రను చేసి లైంగిక దాడి యత్నం చేశారు. గ్రామస్తులు ఒక్కసారిగా రావడంతో సదరు యువకులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనపై వివాహిత శనివారం జూలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు జూలపల్లి పోలీసులు తెలిపారు.



కెన్యాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు

కెన్యాలో ఘోర రోడ్డు ప్రమాదం

36 మంది దుర్మరణం.. 11 మందికి గాయాలు

నైరోబి: కెన్యాలోని నకురు–ఎల్డోరేట్ రహదారిపై శనివారం అర్ధరాత్రి దాటాక ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, బస్సు ఎదురెదురుగా ఢీకొనడంతో 36 మంది దుర్మరణం చెందారు. మరో 11 మంది గాయపడ్డారు. సహాయ సిబ్బంది క్షతగాత్రులను సమీప దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. 30 మంది ఘటనాస్థలిలోనే మృతిచెందగా, మరో ఆరుగురు దవాఖానలో చనిపోయారు. లారీ, బస్సు బలంగా ఢీకొనడంతో రెండువాహనాల డ్రైవర్లు సీట్లలోనే ఇరుక్కొని చనిపోయారు. ఈ నెలలో ఈ ఒక్క రహదారిపై జరిగిన ప్రమాదాల్లో సుమారు వంద మంది చనిపోయారని పోలీసులు చెప్పారు. కెన్యాలో రోడ్డు ప్రమాదాల్లో ప్రతియేటా మూడువేల మంది మృత్యువాత పడుతున్నారు.

బీజేపీవి ఉత్తుత్తి హామీలు: రాహుల్



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర నమోదీ, బీజేపీ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శలకు దిగారు. బీజేపీ ఉత్తుత్తి హామీలకే పరిమితం కావడంతో.. చైనా భారత్‌ను అధిగమించిందని పేర్కొన్నారు. రైతులు, స్మార్ట్ సిటీ ప్రాజెక్టు అంశాలను ప్రస్తావిస్తూ.. మోదీ, ఆయన మద్దతుదారులను విమర్శించారు. 'ప్రియమైన మోదీ భక్తులారా.. దేశంలో స్మార్ట్‌సిటీల కోసం 9,860 కోట్లకుగానూ కేవలం ఏడుశాతమే ఖర్చుచేశారు. మీ నాయకుడు ఉత్తుత్తి నినాదాలకే పరిమితమయ్యారు. దీంతో చైనా మనల్ని దాటిపోయింది. ఈ వీడియో చూడండి. ఎలాంటి అంశాల (భారత్‌కు ఉద్యోగాల సృష్టి)పై దృష్టిపెట్టాలో సలహా ఇవ్వండి' అంటూ వీడియోతో సహా రాహుల్‌గాంధీ ఆదివారం ట్వీట్ చేశారు. మూడేండ్లలో కర్ణాటకలోని స్మార్ట్‌సిటీలు కొంతవరకే పురోగతి సాధించగా, చైనాలోని చేపలుపట్టే ఓ చిన్న గ్రామం షెన్‌జెన్.. మెగాసిటీగా మారిందని వీడియోలో ఉన్నది.

3డీలో కణజాల రూపాలు



లాస్ ఏంజిల్స్, డిసెంబర్ 31: జీవ కణ జాలం సాయంతో శాస్త్రవేత్తలు సంక్లిష్టమైన 3డీ రూపాలను సృష్టించడానికి మార్గం కనుగొన్నారు. ఇది సంప్రదాయ జీవ శాస్త్రాన్ని మెరుగ్గా అర్థం చేసుకోవచ్చునని భావిస్తున్నారు. ఎలుక నుంచి గానీ, మానవుల్లోని కణ జాలాలతో గానీ వీటిని రూపొందించొచ్చని భావిస్తున్నారు. ఈ కణజాలంతో తీగ చుట్టలు, కప్పులు,సృష్టించొచ్చని భావిస్తున్నారు. ఈ పరిణామం ఇంజినీరింగ్‌కు కన్వాస్‌కు మార్గం అవుతుందని అంచనా వేస్తున్నారు. అభివృద్ధిలోని సంక్లిష్టతను బద్దలు కొట్టి ఇంజినీరింగ్ సూత్రాలను సరళతరం చేసేందుకు వెసులుబాటు కలుగుతుందని కాలిఫోర్నియా యూనివర్సిటీ పరిశోధకుడు జెవ్ గార్టనర్ తెలిపారు.




S & D



మనం మోకరిల్లి ఉండటం వల్లనే,
గొప్పవారు గొప్పగా కనిపిస్తున్నారు.
లేచి నిలబడుదాం.

సల్లీ ప్రుధోమ్

నిన్నటికి రేపటికి మధ్యలో



నిన్నటిని వదిలేసి
కొత్తగా ఈరోజును తొడుక్కున్న,
పునాదులు మాత్రం నిన్నవే
జ్ఞాపకాలు మాత్రం నిన్నవే!
కొత్త అనుభవాల కోసం
కొత్తగా మొలకెత్తి చిగురిస్తాను!
కొన్ని అభిమానాలు, బంధాలు
కొన్ని ఆప్యాయతలు, స్నేహాలు
ఎదగడానికి మట్టిలా, నీటిలా,
వెలుగులా వెన్నంటే ఉంటాయి!
అప్పుడప్పుడు...
కొన్ని చీడలు తుంచేస్తున్నా
కొన్ని పీడలు పీడిస్తున్నా
పయనం ఎక్కడా ఆగదు,
ఒక విశ్రాంతి, ఒక అలసట!
చెట్టులా వ్యాపిస్తున్నా
వేర్లలో ఎందరో ఉంటారు,
కూలిపోతున్న ప్రతిసారీ
నిలబెట్టేందుకు ఒకరుంటారు!
మధ్యలో వస్తాం, పోతాం
శాశ్వతం కాని ఈ జీవం కోసం
ఎన్నో దూరం చేసుకుంటాం
కొన్ని కష్టంగా వదులుకుంటాం
ఫలితం మనసుకు శూన్యం!
ఈ గాలి, ఈ నీడ
అంతా ఎవరో అందించినవే,
కొత్తగా పరిమళించటమే
మనకున్న శ్వాస, ధ్యాస!

- పుట్టి గిరిధర్, 94914 93170

కొత్త బాట

గోడ మీద
క్యాలెండర్ మారినట్లు
ఆకాశంలో సూర్యుడు మారడు.

ఐదేళ్లకోసారి
నాయకులు మారినట్లు
నేలమీద ప్రజలు మారరు!

ప్రతి సంవత్సరం
పండుగలు వచ్చిపోయినట్లు
సుఖదుఃఖాలు పలకరిస్తాయి
ప్రతిరోజూ
వెలుగుచీకట్లు అలుముకున్నట్లే
ఆశ నిరాశలు ముసిరిపోతుంటాయి

ఈలోకం
నాలుగు రోడ్ల కూడలి
వాహనాలు వచ్చిపోయినట్లే
మనుషులు వచ్చి ఎటో వెళ్లి
పోతుంటారు

మనసు కిటికీలు
మూసుకున్నా
అనుభూతుల ద్వారాల్ని తెరిచేది
స్నేహితులే!
గోడల మధ్య కూర్చున్నా
అడ్డుగోడలు లేనివి మానవ
అనుబంధాలే.
ఆత్మీయ స్నేహ సంబంధాలే
బతుకు ఖాళీల్లో వసంతాల్ని
పూయిస్తాయి!

కాలచక్రం చుట్టూ మర మనుషుల్లా
తిరుగాడే
మనమధ్య విరబూసిన మాటల
జ్ఞాపకాలే
జీవన గ్రంథానికి పరిమళాల్ని
అద్దుతాయి

కొత్త సంవత్సరానికి స్వాగతం
పాతమాట!
నిత్యచైతన్యానికి పునరంకితం కొత్త
బాట!!



- ఎస్. రఘు, 98482 08533




అవిచ్ఛిన్నం!

గోడది
ఫేస్‌బుక్ ఫ్రెండ్‌షిప్
కాలసూచిని
ఏడాది పొడుగున మోసినా
డిసెంబర్ ముప్పయి ఒకటిన
నిర్దయగా డిస్పోజ్ చేస్తది!
ఆ బ్రేకప్పు ఈవెంట్ను చేసి
జనవరి ఒకటిన
కొత్త క్యాలెండర్తో సెలబ్రేట్ చేస్తది!

మట్టికి
మనిషి మీద అంతులేని ప్రేమ
నేల మీద నడిచే ప్రతి మనిషి
కొనసాగుతున్న వాక్యం వంటి వాడే
వచ్చిన 'క్రియ' ముగియనిదే
నేల ఎద తలుపులు తెరవదు!
మట్టీ-మనిషి మధ్య
అల్లుకున్న అనాది బంధాన్ని
ఏ అంతర్జాలమూ విచ్ఛిన్నం చేయలేదు!!
(నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ)

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి, 94402 33261



రాత్రి సూర్యున్ని..

నువ్వు నన్ను
ఒకానొక రాత్రి దీపాన్ని చేసి
నిట్టనిలువునా గాలిలో వ్రేలాడదీసి వెళ్తావు
చలికి ఒణుకుతున్న దేహాన్ని ముడుచుకుంటూ
గాలిలో నేను అటూ ఇటూ ఊగిసలాడుతూ
కొట్టుకుంటుంటాను

మొండెం తెగిన
ఏవో రెండు చేతులు నా ముఖమ్మీద
తెల్లటి దుప్పటిని కప్పి
నన్ను ఆరిపోకుండా చేసి మాయమవుతాయి

ఊపిరి పోసుకున్న నేను
నీతోపాటుగా ఆ రెండు చేతుల్ని అంతటా
వెతుకుతుంటాను

చివరికి..,
చీకట్లో కల్సిపోయిన మీ అడుగుల్ని
నిలబెట్టేందుకు
నేను ప్రతీ రాత్రి అడవిలో
సింధూరమై మొలకెత్తుతూనే ఉంటాను..!!

- బిల్ల మహేందర్, 91776 04430

రచనలకు ఆహ్వానం

దేశ ప్రగతిలో యువత పాత్ర, దృష్టిలో ఉంచుకొని యువతలో స్ఫూర్తిని నింపే దిశగా యువ కవుల నుంచి రచనలను ఆహ్వానిస్తున్నాం. 'సామాజంలో యువత పాత్ర' అనే అంశంపై 15-35 సంవత్సరాలలోపు యువతీ,యువకులు 18-25 లైన్లు వచ్చేలా, 200 పదాలకు మించకుండా కవితలు రాసి 2018 జనవరి 16 లోపు అందేలా పంపాలి. చిరునామా: మెరుగు ప్రవీణ్, పిన్‌రెడ్డి తిరుపతిరెడ్డి, ఇ.నెం: 2-10-895, మాధవ నిలయం, కెన్ క్రైస్ట్ స్కూల్ వెనుక, జ్యోతినగర్, కరీంనగర్-505001.

- మెరుగు ప్రవీణ్,9989715531
- ఎ.కిరణ్ కుమార్,9866138207

చిటికెన వేలు కాదిది.. చూపుడు వేలు!

స్త్రీలు బుద్ధిజీవులు కాదు కాబట్టి కవిత్వం రాయలేరనే అభిప్రాయం ఒకప్పుడు ఉండేది. అవును కాబోలు అని ఆడవాళ్లంతా నమ్మిన రోజులున్నాయి.

'ఇంతచక్కటి భాష ఎలా రాస్తారు' అనే ప్రశ్నకు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి ఒకసారి ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన జవాబు చెప్పారు..

'భాష నేను ఆడవాళ్ల దగ్గర నేర్చుకున్నాను. నా వాక్యాల్లో ఉన్న ఆర్ద్రతకు రహస్యం అదే. ఇంతకీ ఇదంతా ఇప్పుదెందుకంటారా అది చెప్పడానికే నా ప్రయత్నమంతా..'అన్నారు శ్రీపాద.

అక్షర సైన్యం ఆధ్వర్యంలో కవయిత్రులు 2017 డిసెంబర్ 24న మధ్యాహ్నం 3 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కవయిత్రుల సమ్మేళనం జరుపుకున్నారు. 'కవి సమ్మేళనం' అనగానే పాత పుస్తకం తెరిచి ఏదో ఓ పేజీ చదివి వినిపించడానికి భిన్నంగా ప్రతి సారి కొత్త వస్తువుల మీదే రాయాలనే నిబంధన ఒక టి పెట్టుకున్నాం. అందులో భాగంగా ఈసారి **'చిటికెనవేలు'** వస్తువు గా ఎంచుకున్నాం. ఈ వస్తువు ప్రకటించగానే కొందరు నిరుత్సాహపడ్డారు. మరీ డ్రై సబ్జెక్టు కదా అన్నారు. స్వచ్ఛ భారత్ నినాదంలా ఉందని కొందరు అభిప్రాయపడ్డారు. మొదట చాలా తక్కువమంది నుంచి మాత్రమే స్పందన వచ్చింది. ఆ వస్తువు వెనుక ఉన్న సామాజికత గుర్తుచేసుకునేలా ప్రోవోక్ చేసేసరికి ఎక్కువ మంది కదిలా రు. కుక్క పిల్ల, సబ్బు బిల్ల, అగ్గి పుల్ల కవితా వస్తువులవగా లేనిది స్త్రీ శరీర సమస్యలు కవిత్వం ఎందుకు కావు. వాటికెందుకని కావ్య గౌరవంలేదు? పొయ్యి దగ్గర ముట్టించి విసిరేసిన అగ్గిపుల్లకన్నా తీసిపోయామా అనే ధిక్కారంతో కాబోలు కొందరు దీన్ని సవాల్ గా తీసుకున్నారు. వ్యక్తిగతమంతా రాజకీయమే అనే నినాదంతో సవాళ్లను స్వీకరించడం స్త్రీలకు కొత్త కాదుకదా.. కవయిత్రుల సమ్మేళనం విజయవంతమైంది.

కవిత్వం చదవుకోవడంతో పాటు, కవితా నిర్మాణం గురించి చర్చించుకోవాలనే ఆలోచన మాకున్నది. ఏ నిషిద్ధ వస్తువును అయినా కవిత్వంగా మలుచడానికి సాహసం ఒక్కటే చాలదు. ఇంకేదో కావాలి. మూస ధోరణిలో కాకుండా కొత్తగా చెప్పాలి? మరి అదెలా? ముఖ్యంగా కొత్త కవులు, ఆ మాటకొస్తే సీనియర్ కవులు కూడా కొన్ని వస్తువులను కవిత్వం చేయడంలో ఎదుర్కొంటున్న సమస్య **'నిర్మాణం'** గురించే. నిర్మాణమంటే భాష మాత్రమే కాదు. భాషకు కులం, మతం, ప్రాంతమే కాదు దృక్పథం కూడా ఉంటుంది. ఈసారి అన్నిటిమీదా చర్చ జరిగింది. అందుకు అతిథులుగా మనదగ్గర పుట్టిపెరిగి అమెరికా వెళ్లి వచ్చిన ప్రసిద్ధ కవులైన అఫ్సర్, నారాయణస్వామి, రచయిత్రి కల్పనా రెంటాల వచ్చారు. అస్వస్థత కారణంగా నారాయణస్వామి కొంత ఆలస్యంగా చేరుకున్నా.. **అంతర్జాతీయంగా కవిత్వం గురించి ఎలా ఆలోచించాలి, వస్తువును ఎలా తీసుకోవాల**నే అంశం మీద ప్రసంగం చేశారు.

గీతాంజలి, భండారు విజయ, శాంతి ప్రబోధ, కొండేపూడి నిర్మల, రేణుకా అయోల తమ కవితలు చదివారు. ఒక్కొక్క కవితను విశ్లేషిస్తూ అఫ్సర్ **'కవితా వస్తువు, రూప నిర్మాణం'** అనే అంశం మీద మాట్లాడారు. అఫ్సర్ ప్రసంగంలోని విషయాలు ఇలా ఉన్నాయి.**'కవిత్వం ఎలా రాయాలి'..** అనే సమస్యలో **భాష** మొదటి అవరోధంగా కనిపిస్తుంది. భాషను స్వంతం చేసుకుంటే కవిత్వం వస్తుంది. **నీలిమేఘాలు** -స్త్రీవాద సంకలనం ఆ పని చేసింది. వున్నదాన్ని బ్రేక్ చేస్తున్న క్రమంలోనే కొత్త భాష వెతకడం మొదలవుతుంది. ఎక్కడో విన్నట్టు, చదివినట్టు అనిపించే భాష సొంతభాష కాదు. వచనానికి కవిత్వానికి మధ్య చిన్న గీత వుంటుంది. కవిత్వం అంటే బరువైన పదాలు కాదు.

అమ్మ మాట్లాడే భాషను కవిత్వంలోకి తీసుకురావాలి. ఏది కవిత్వం ఏది కాదు అంటే చెప్పడం కష్టం. కానీ కవిత్వం కాని దాన్ని గుర్తించగలం. కవిత్వాన్ని గురించగలం. భాష ఎంత నగ్నంగా వుంటే అంత నిజాయితీగా వుంటుంది. నిజాయితీ అంటే కవిత్వమే. మనం ఇప్పుడు పదాలు, పద చిత్రాలు అనే కొలబద్దలు పరిహరించాం. అలంకారిక లక్షణాలు పరిహరించాం.. ఈ పరిహరించడాల వల్ల కవిత్వం చనిపోకుండా చూడటమే కవి చెయ్యాల్సిన పని. ఏ వస్తువూ దానంతట అదే కవిత్వాన్ని చంపదు. వ్యక్తీకరణలో వున్న

> **'కవిత్వం ఎలా రాయాలి'.. అనే సమస్యలో భాష మొదటి అవరోధంగా కనిపిస్తుంది. భాషను స్వంతం చేసుకుంటే కవిత్వం వస్తుంది. నీలిమేఘాలు -స్త్రీవాద సంకలనం ఆ పని చేసింది. వున్నదాన్ని బ్రేక్ చేస్తున్న క్రమంలోనే కొత్త భాష వెతకడం మొదలవుతుంది. ఎక్కడో విన్నట్టు, చదివినట్టు అనిపించే భాష సొంతభాష కాదు. వచనానికి, కవిత్వానికి మధ్య చిన్న గీత వుంటుంది. కవిత్వం అంటే బరువైన పదాలు కాదు**

లోపమే కవిత్వం కాదల్చుకున్నదాన్ని శుద్ధ వచనం చేస్తుంది.

రష్యా విప్లవం గురించి రాయచ్చు. చిటికెనవేలు గురించి రాయడం కష్టం. చాలారోజులు స్త్రీలు పురుషుల భాష వాడారు. పురుషుల కళ్ళతో ప్రపంచాన్ని చూశారు. తమ కళ్ళతో చూడ్డం మొదలెట్టినప్పుడు మంచి కవిత్వ రాశారు. కవిత్వం ఎమోషనల్‌గా వుంటూనే ధిక్కారంతో వుండాలి. లేదా తాత్వికంగా వుండాలి. ఆ రెంటి మధ్య వంతెన నిర్మించినప్పుడు మంచి కవిత అవుతుంది.

అఫ్సర్ మాట్లాడుతుంటే అనేక విషయాలు చర్చకు వచ్చాయి. చిటికెనవేలు లాంటి సమస్యలు పురుషులకు వుండదా అని సభికుల్లో ఒకరు వేసిన ప్రశ్నకు అఫ్సర్ వుంటాయని చెప్పారు.

మతమూ, సంస్కృతి లాంటివి తెచ్చిపెట్టిన శుద్ధత వల్ల ఒక ప్రత్యేక జీవన విధానం వస్తుంది. శుద్ధతకు సంబంధించి కొన్ని అతి సున్నితమైన వ్యక్తిగత అంశాలు వుంటాయి. ఉదాహరణకు పురుషుల్లో కొందరు చిన్న ఇటుకరాయి ముక్కలు జేబులో వేసుకుని తిరుగుతారు. మూత్ర విసర్జన అనంతరం ఆ ప్రాంతంలో చెమ్మ లేకుండా వుండటానికి అది పనికొస్తుంది. ఇటుకరాయి చెమ్మ పీల్చుకుంటుందని మనకు తెలుసుకదా.. అన్నారు.

ఔను కొన్ని బహిరంగ మరుగుదొడ్లలో గమనిస్తే గోడవార చిన్న చిన్న ఇటుకరాయి ముక్కల్ని కనబడతాయి.. అంది కవయిత్రి అనసూయ. మరి అటువంటి గోప్య సమస్య గురించి కవిత్వం రాయడం పురుషులకైనా కష్టమే కావచ్చు అనిపించింది.

అయితే వారికి చోటు కంటే నీటి సదుపాయం లేకపోవడం అసలు సమస్య అవుతుంది. స్త్రీలకి అలా కాదు నీటి సదుపాయం, చోటు, గోప్యత అన్నీ కరువే. వాటన్నిటికంటే అభద్రత ఇంకా సమస్య. ఇవన్నీ ప్రాథమిక హక్కులు కాబట్టి ఇవి పొందలేకపోవడం ఆత్మగౌరవ సమస్య అవుతుంది.

పబ్లిక్ ప్రదేశాల్లో బిడ్డకు పాలిస్తున్న తల్లులకు కూడా ఏకాంతం లేకపోవడం సమస్య అవుతుంది. ఇవి చాలా సున్నితమైన అంతరంగికమైన విషయాలుగా మనం భావిస్తున్నంత కాలం వెలుగుకి నోచుకోవడం కష్టమే.

రెండవ వక్త- కల్పనా రెంటాల **'మానవ సంబంధాలు-సవాళ్ళు'** అనే విషయాన్ని విశ్లేషిస్తూ.. తను కొన్ని కథల్లో ఎంచుకున్న 'లెస్బియన్', 'గే' సంబంధాలు అమెరికాలోని వాస్తవ గాథలే అని చెప్పారు. సమస్యల చిత్రీకరణ మాత్రమే తను చేశానని, వివాహ బంధం అనే దాన్ని ధిక్కరిస్తూ సహజీవనం వచ్చినట్టే, సహజీవనంలో సెక్సువల్ ఛాయిస్ తీసుకునే స్వేచ్ఛను కోరుతున్నవారు వుంటారని దానికి మనమెలా తీర్పు చెబుతామని అన్నారు. ఈ విషయం మీద ఆసక్తికరమైన చర్చ నడిచింది. ఒక కవయిత్రి ఆ సమస్యను అర్థం చేసుకోవాలన్నారు. జన్యు సమస్యగా తీసుకోవడం సరికాదని అది వారు అడుగుతున్న హక్కుల్ని తక్కువ చెయ్యడమే అని అన్నారు.

డాక్టర్ గీతాంజలి తనదగరకొస్తున్న కేసుల్ని గురించి చెబుతూ.. ఈ బంధాల్లో రిస్క్ ఎక్కువ వుందని, లైంగిక వ్యాధులకు గురవుతున్నారని, కౌన్సిలింగ్ ఇవ్వాలని చెప్పారు. వెంటనే అమెరికా సమాజం గురించి చెబుతూ నారాయణ స్వామి చెబుతూ.. అమెరికా సమాజంలో గే, లెస్బియన్ పదాలకు గౌరవం వుందని, దరఖాస్తుల్లో ఫిమేల్, మెల్, అదర్, 'నాట్ విల్లింగ్ టు టెల్' అని నాలుగు కాలమ్స్ వుంటాయని ఎవరూ ఎదుటి వారి జెండర్ అడగరన్నారు. పబ్లిక్ ప్లేసెస్‌ల్లో ఎవరికి తగిన రెస్ట్ రూమ్స్ వాళ్ళకి వుంటాయని చెప్పారు.

కల్పన అమెరికాలో గృహహింస చట్టాలు బలంగా లేవని, తను వెళ్ళిన కొత్తలోనే ఒక ఇల్లాల్ని ముక్కలు చేసి 'డస్ట్ బిన్'లో వేశారని చెప్పింది. ఒకరకంగా ఇండియాలోనే గృహహింసకు ఎప్పటినుంచో వ్యతిరేక నినాదముంది అన్నారు.

మేమంతా ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న నారాయణ స్వామి వంతు వచ్చింది. **'కవిత్వంలో వస్తువు-పూరించాల్సిన ఖాళీలు'** అనే విషయం గురించి స్వామి మాట్లాడుతూ.. మనుషుల్లో వున్న ద్వేషాలను ఎన్నికల్లో వాడుకున్నాడు ట్రంప్. ముస్లింలపై ద్వేషం, స్త్రీలపై హింస ఇవన్నీ ఎన్నికల్లో అజెండాలవడం ఆశ్చర్యకరం. తెలుగువాళ్లు కూడా ఓటు అతనికే వేశారు. అంతకుముందున్న బిల్ క్లింటన్ మీద కూడా లైంగిక నేరారోపణలున్నాయి. చిత్రంగా అవి ఏవీ గెలుపుకు ఆటంకం కాలేదు.

ఎపుడయితే ఒక నాయకుడి స్థాయిలో వున్న మనిషి ఇలాంటి నేరాలు చేస్తాడో అప్పుడు దానికి సాధారణీకరణ వస్తుంది. అంటే అప్రకటిత మద్దతు లభిస్తుందన్నమాట. ట్రంప్ అసలు తను 'బిజినెస్ మ్యాన్' అని నిర్లజ్జగా ప్రకటించుకున్నాడు. కిందటి జనవరిలో స్త్రీలు అతనికి వ్యతిరేకంగా పెద్ద మార్చ్ చేశారు. ఏ శక్తి లేదనుకున్న మహిళలు ఉద్యమించడం మొదలుపెడితే అది తీవ్రంగానే వుంటుందని చరిత్ర అనేకసార్లు నిరూపించింది. మిగతావాళ్ళకు లేని పొలిటికల్ గట్స్ వారికున్నాయి. ఇవన్నీ కవిత్వానికి వస్తువులే. ఇజ్రాయెల్ పౌరులు వాళ్ళ దేశంలో వాళ్ళు అనాథలయ్యారు. దాని మీద ఐడెంటిటీ కార్డ్ అనే కవితా వచ్చింది. కుటుంబ హింస నుంచి ట్రంప్ లైంగిక హింసదాకా అన్నీ సమస్యలే.. వాటిమీద రాయాలి.

ఏదీ రాజకీయం కాకుండా పోదు. తెలంగాణ, ఆంధ్రా భార్యాభర్తలు వున్నారనుకోండి.. అప్పుడున్న పితృస్వామ్య ఆధిపత్యాలకు తోడుగా వారిమీద రాజ్యం సృష్టించి వదిలిన ఆధిపత్యం కూడా చేరుతుంది కొత్తగా. సమాజంలో వచ్చిన మార్పులు రాజకీయమైనవైనా కూడా ఇంట్లోకి చేరకుండా ఆగవు. దాని తాలూకు హింస కూడా వ్యక్తిగత జీవితాల్లోకి చేరుతుందని స్వామి చెప్పాడు.

ఈ సభకు విచ్చేసిన అరణ్య కృష్ణ ఇదే సమస్యపై తను రాసిన కవితను చదివారు. ప్రముఖ విమర్శకుడు నారాయణ శర్మ , కార్టూనిస్ట్ అక్బర్, ప్రముఖ కవయిత్రి, సబ్‌ఎడిటర్ పసుపులేటి గీత లాంటి వారు రావడం ఆసక్తిగా వినడం సంతోషం వేసింది. చాలా రోజుల తర్వాత మంచి సభకు హాజరయ్యామని కవయిత్రులు చెప్పారు. **'చిటికెన వేలు కాదిది.. చూపుడు వేలు..'** అంది ఒక కవయిత్రి. నిజమే.. కవి చెయ్యాల్సిన పని సమస్యకున్న అన్ని కోణాలను చూపడమే కదా. ఆ పని ఈ సమ్మేళనం చేసింది.

- కొండేపూడి నిర్మల,9949303626

'ఇంక్విలాబ్'కు అవార్డు..?

తమిళ కవి, నాటక రచయిత 'ఇంక్విలాబ్'కు ఈ ఏడాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును ప్రకటించారు. ఆయన 2016 డిసెంబర్ 1న తన 72వ ఏట చనిపోయారు. ఆయన మరణాంతరం ఆయన కవిత్వ పుస్తకం **'కాందల్ నాటకల్'** (Day of Flame lily)కు అవార్డును ప్రకటించింది.

ఇంక్విలాబ్ అసలు పేరు సాహుల్ హమీద్. తమిళనాడులోని రామంతపురం జిల్లాలోని భీజ్‌కరారిలో ఆయన జన్మించారు. 'వానంపూడి' కవిత్వ ఉద్యమంతో సంబంధం ఉన్న కవి ఇంక్విలాబ్. వామపక్ష భావాజాలంతో ప్రభావితమైన ఇంక్విలాబ్ కాలక్రమంలో మార్కిస్టు, లెనిస్టు భావజాలానికి దగ్గరయ్యాడు. కానీ అతనికి ఏ పార్టీతో సంబంధం లేదు.

ఈ సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ 21 మందికి అవార్డును ప్రకటించినప్పటికీ ఈ కవి గురించే మాట్లాడుకోవడానికి కారణమేమిటి? అన్న ప్రశ్న సహజంగానే వస్తుంది. దానికి కారణం ఆయన కుటుంబ సభ్యులు ఆ అవార్డు తిరస్కరించారు.

'అణగారిన, వెనుకబడిన వర్గాలకు గొంతుగా నిలిచిన కవి ఇంక్విలాబ్. అవార్డుల కోసం అతను సాహితీ సృజనను చేయలేదు. ఆయన బతికున్న కాలంలో ప్రభుత్వం ఇంటరాగేషన్లను, అరెస్టులను బహుమతిగా ఇచ్చింది.' ఆయన కూతురు అమీనాబర్వీన్ చెబుతూ అవార్డును తిరస్కరించింది.

'అధికారాన్ని ప్రశ్నించే గొంతును ఆరోజు అణగదొక్కారు. అలాంటి ప్రభుత్వం నుంచి అవార్డు స్వీకరించడం అంటే ఆయన జీవన విధానానికి, అతని రాతలకు ద్రోహం చేసినట్టే'నని కూడా ఆమె పేర్కొన్నది.

అన్యాయాలను, దోపిడీని ఎదుర్కొన్న కవి ఇంక్విలాబ్. తన మనస్సులోని విషయాలను నిర్భయంగా వ్యక్తంచేసిన వ్యక్తి ఇంక్విలాబ్. రాజ రాజచోళ వెయ్యవ జయంతిని జరుపడాన్ని విమర్శించిన కవి ఇంక్విలాబ్. రాజరాజ చోళుడు సామ్రాజ్యవాది అని, మనుషుల శ్రమను దోపిడి చేసి తంజావూర్‌లో దేవాలయం నిర్మించాడని అతని భావన.

పెరంబుర్ జిల్లాలోని కొలప్పాడి గ్రామంలో దళిత పిల్లలను 1980లో కాల్చి చంపారు. వాళ్లుచేసిన తప్పిదం ఊరి మధ్యలో ఉన్న బావిలోనుంచి నీరు తోడుకోవడం. ఆ సంఘటనలో ముద్దాయిలను విడుదలచేసి, ఆ పిల్లల శవాలను మళ్లీ దహనం చేసినందుకు వాళ్ల బందువులను అరెస్టు చేశారు. ఆ దిగ్భ్రాంతి కలిగించే సంఘటన ప్రతిస్పందిస్తూ 'మనసుంగ దా' (మేమూ మనుషులమే) అన్న కవితను ఇంక్విలాబ్ రాశాడు. మనుషులం. మేమూ మనుషులమే అన్న గీతం ఆ తర్వాత దళిత గీతంగా మారిపోయింది. ప్రతి సమావేశంలో దళితులు ఆ పాట పాడుకుంటున్నారు. ఆ తర్వాత ఆ పాటను అంతర్జాతీయ డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శనలో కూడా ప్రదర్శించారు.

కులవ్యవస్థలో కరడుగట్టుకుపోయిన సమాజం మారాలన్నది ఇంక్విలాబ్ ఆకాంక్ష. దళితులపై జరుగుతున్న అత్యాచారాలను ఎదుర్కోవడం అతని అభిమతం. భూస్వామ్య వ్యవస్థ అంతమై శాస్త్రీయ సామ్యవాదం ఏర్పడేంతవరకు దళితులపై దాడులు జరుగుతూనే ఉంటాయనేవాడు. దళితుల మరణాల గురించి...

'సజీవంగా దళితులని ఆహుతులని చేసి
ఆ బూడిదని తమ
నుదిటి మీద
అద్దుకుంటుందీ ఈ భూస్వామ్య వ్యవస్థ' ఈ దాడులు ఎలా ముగుస్తాయి? అన్న ప్రశ్నకు ఆయన పరిష్కారం..

'అంటరానితనమనే దోమను
అంతం చేయడానికి
మరుగునీటితో ఉన్న భూస్వామ్య డ్రైనేజీని
ధ్వంసం చేద్దాం'.

దళితుల పట్ల అమనుషంగా ఎవరైనా వ్యవహరించినప్పుడు, క్రూరంగా వ్యవహరించినప్పుడు ఇంక్విలాబ్ నర్సింహస్వామిలా కోపోద్రిక్తుడయ్యేవాడు. దళితులతో ఐడెంటిఫై అయ్యేవాడు. తానే దళితుడిగా మారిపోయేవాడు.

'బొటన వ్రేలి నుంచీ
పిరుదుల నుంచీ కారిన రక్త చుక్కలతో
ఇతిహాసాలు గడ్డకట్టుకు పోయినావి
మనం రోజూ
బోధి వృక్షం క్రింద
అహింసను ప్రవచిస్తూనే ఉంటాం
మంట మమ్మల్ని అనునిత్యం
కాలుస్తూనే ఉంది
అది ఎప్పుడూ ఆగిపోదు
వేల సంవత్సరాల నుంచి
మేం వేదనకు గురవుతూనే వున్నాం.
మా కాళ్ళకి ఇనుప సంకెళ్ళు
మా నోట్లో పశువుల పేడ
మా వీపు మీద ఎర్రటి ఎండ
ప్రపంచ దిగంబరత్వాన్ని
మేం ప్రదర్శిస్తూనే వున్నాం.
అయినా మాకు దక్కేది
ఇంత అన్నం
ఇంత గుడ్డపేగు
××××
మా తల్లి గర్భంలో 'మాయ' గా
వున్నప్పుడే
మా మెడలో కులం దారాన్ని వేలాడదీశారు.
మేం భారతీయ నీగ్రోలం
తెల్లవాళ్ళ సంపద
నల్లవాళ్ళ రక్తంతో తయారైనట్టు
మీ గుళ్ళూ, తాజ్ మహళ్ళూ
మా రక్తంతో నిర్మితమైనాయి..'

ఆగ్రహ, ఆవేశ కవిత్వం రాసిన ఇంక్విలాబ్ అవార్డుల గురించి ఓసారి ఇలా అన్నాడు 'తాను అవార్డు స్వీకరిస్తే తాను బతుకుతూ చనిపోయినట్టే!'

ఆయన బతికి ఉన్నప్పుడు అవార్డు ప్రకటిస్తే అతను స్వీకరిస్తే ఎందుకు స్వీకరించేవాడో చెప్పేవాడు. తిరస్కరిస్తే ఎందుకు తిరస్కరిస్తున్నాడో చెప్పేవాడు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని ఆయన కూతురు ప్రకటించింది. ఇది తమిళనాడులోని కవుల సంగతి.

మన తెలుగు కవులు అదోరకం. విప్లవ కవిత్వం రాస్తారు. విప్లవ కవులమని ప్రకటించుకుంటారు విరసంలో లేని విప్లవ కవులు అవార్డుల కోసం అర్రులు చాస్తారు, స్వీకరిస్తారు. అవార్డుల్లో జ్యూరీలో సభ్యులుగా ఉంటారు. తమ సన్నిహితులు ఏదైనా కేసులో కన్పిస్తే న్యాయమూర్తులు ఆ కేసును వేరే కోర్టులు బదిలీ చేయమని పై కోర్టును అభ్యర్థిస్తారు. ఈ మధ్య ఓ ఇంటర్వ్యూ బోర్డులో మాతో పాటు ఓ ఐఏఎస్ అధికారి ఉన్నాడు సచివాలయంలో పనిచేస్తున్న ఓ వ్యక్తి అభ్యర్థిగా ఇంటర్వ్యూకి వచ్చినప్పుడు ఆ ఇంటర్వ్యూ బోర్డు నుంచి అతను వైదొలిగాడు.

ఈ రకంగా మన కవులు ఎప్పుడు ప్రవర్తిస్తారో...?

మరీ ముఖ్యంగా విప్లవ కవిత్వం రాస్తున్నామని చెబుతున్న కవులు.

- రాజేందర్ జింబో, 94404 83001

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుల్లో తెలంగాణకు అన్యాయం

మూడు దశాబ్దాలుగా తెలంగాణ భాషకు, సాహిత్యానికి, చరిత్రకు జరిగిన వివక్ష పట్ల ఆందోళన తీవ్రస్థాయిలో కొనసాగింది. అన్నిరంగాల్లో ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరిగిందన్న అంశం చర్చనీయాంశం అయింది. అంతిమంగా తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించుకోగలిగారు. ఇప్పుడు తెలంగాణ తన మూలాలను అన్వేషిస్తూ అస్తిత్వ చైతన్యంతో ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నది. జరిగిన అన్యాయాల పట్ల సూటిగానే ప్రశ్నిస్తున్నది. కారకులను నిలదీస్తున్నది. తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో ప్రపంచ తెలుగు మహాసభలు ఘనంగా జరిగాయి. భాష, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో ప్రపంచం ముందు తెలంగాణ విశ్వరూప సాక్షాత్కారం జరిగింది. సరిగ్గా ప్రపంచ తెలుగు మహాసభలకు రెండు రోజుల ముందు ఇదే హైదరాబాద్ నగరంలో కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి సంచాలకుల ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగిన న్యాయ నిర్ణేతల కమిటీ ఇద్దరు తెలంగాణ అగ్రశ్రేణి సాహితీ వేత్తలను పక్కకు నెట్టి తిరిగి గుంటూరు కవికి పట్టం కట్టింది. గత ఐదు సంవత్సరాల పురస్కారాలలో వరుసగా నాలుగు గుంటూరు వాసులను వరించడం గమనార్హం. భవిష్యత్తు చరిత్ర క్షమించదన్న కనీస భయం లేని జ్యూరీ సభ్యుల వైఖరి పట్ల తెలంగాణ సాహితీవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సంగిశెట్టి శ్రీనివాస్ లేవనెత్తిన ప్రశ్నలు ఆరంభం మాత్రమే. గత నాలుగేండ్లుగా సుంకిరెడ్డి నారాయణరెడ్డి, జూకంటి జగన్నాథం, నందిని సిధారెడ్డి, ఎస్వీ సత్యనారాయణల గ్రంథాలు తుది పరిశీలన దాకా చేరుకుని అక్కడ వెన్నుపోటుకు గురికావడం ఆందోళనకరం. తెలంగాణ కలాలు, గళాలు దేశవ్యాప్తంగా వెలుగొందకూడదన్న కుట్రను, దుర్బుద్ధిని బద్దలు కొట్టవలసిన సమయం ఆసన్నమైంది. భవిష్యత్తులో మరో ఏడేండ్ల పాటు తెలంగాణ సాహితీవేత్తలకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను అందజేస్తే తప్ప ఈ వివక్షను సరిచేయడం సాధ్యం కాద న్న విషయాన్ని కొత్తగా ఏర్పడబోయే అకాడమీ తెలుగు సలహామండలి గమనించవలసిందిగా విజ్ఞప్తి.

- డాక్టర్ రాపోలు సుదర్శన్

పానుగంటి కవితల పోటీ

మార్చి 21 అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని 'కవిసంధ్య' కవిత్వ పత్రిక 'పానుగంటి కవితల పోటీ' నిర్వహిస్తున్నది. పోటీలో పాల్గొనదల్చిన వారు 200 రూపాయలు ఎంట్రీ ఫీజుగా మనియార్డరు/ డ్రాఫ్టు లేదా, నేరుగా బ్యాంకు ద్వారా పంపించాల్సి ఉంటుంది. ఎంట్రీ ఫీజు వివరాలను పంపుతున్న కవితతో పాటు పంపాలి. కవితలను 2018 ఫిబ్రవరి 20వ తేదీలోగా చేరేట్లు పంపాలి. చిరునామా: దాట్ల దేవదానం రాజు, జక్రియానగర్, యానాం-533464. వివరాలకు:9440105987.

ఎంట్రీ ఫీజు చెల్లించాల్సిన బ్యాంకు వివరాలు: కవిసంధ్య, అకౌంట్ నెం:155711100002360.ఆంధ్రాబ్యాంకు, యానాం. IFSC Code: ANDB0001557

-కవిసంధ్య, యానాం.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



ఆస్ట్రేలియాలోని సిడ్నీ నగరంలో ఒపెరా హౌస్ వద్ద నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూపేల్చిన పటాకులు

కాల గమనంలో మరో ఏడాది గడిచిపోయింది. అనేక అనుభవాలు.. అనుభూతులను గతానికి వదిలి కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టాం. ఈ సంవత్సరం విశ్వమానవాళికి సుఖసంతోషాలనివ్వాలి. ఉగ్రవాద హుంకారాలు తగ్గాలి. శాంతి నినాదాలు మిన్నంటాలి. అసహనం.. అశాంతి, పీడనలు లేని సమాజం వృద్ధి చెందాలి. రాష్ట్రాలు, దేశాల మధ్య సామరస్యం వెల్లివిరియాలి. కర్బన ఉద్గారాలు లేని స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు సమిష్టిగా పూనుకోవాలి. యుద్ధమేఘాలు తొలిగి.. ఆయుధ ప్రయోగాలు తరిగి.. ఆరోగ్యకరమైన శాంతియుత వాతావరణంలో దేశాల మధ్య స్నేహ పావురాలు ఎగురాలి. ఎలాంటి ఆంక్షలు లేని, శరణార్థులు కానరాని.. మారణకాండలకు తావులేని విశ్వ మానవ సమాజాన్ని ఆకాంక్షిద్దాం. ఈ నూతన సంవత్సరంలో ప్రతి మాటా ప్రియమైనది కావాలి.. ప్రతి ప్రియమైనదీ పండుగ కావాలి. నూతన సంవత్సర శుభాకాంక్షలతో..

క్యాబ్ డ్రైవర్‌గా కన్నడ నటుడు

8 నెలలుగా తగ్గిన సినిమా అవకాశాలు
బెంగళూరులో కారు నడుపుతున్న శంకర్



మైసూర్, డిసెంబర్ 31: ఆయన దివంగత నటుడి కుమారుడు, కన్నడలో 61 సినిమాల్లో కూడా నటించారు. గత 8 నెలలుగా సినిమా అవకాశాలు తగ్గాయి. తనకు అవకాశం కల్పించమని దర్శక, నిర్మాతలను అడుగలేదు.. జీవనోపాధి కోసం క్యాబ్ డ్రైవర్‌గా మారిపోయాడు.. శంకర్ అశ్వత్‌కు (60) విశ్వాసమే కాదు ఆత్మాభిమానం ఎక్కువే. అందుకే ఆయన ఎవరినీ తనకు అవకాశాలు ఇవ్వమని అడుగకుండా.. తన పేరు, హోదా గురించి పట్టించుకోకుండా సొంతంగా బెంగళూరులో క్యాబ్ నడుపుతున్నారు. శంకర్ స్వస్థలం మైసూరులోని సరస్వతిపురం. శంకర్ తండ్రి దివంగత కేఎస్ అశ్వత్‌కు కన్నడ సినీ పరిశ్రమలో మంచి పేరుంది. ఆయన వారసత్వంగా సినిమాల్లో అడుగుబెట్టి.. 25 ఏండ్లు వివిధ చిత్రాల్లో నటించారు. 'రంగితరంగ' అనే సినిమా కన్నడలో సూపర్ హిట్టయ్యింది. ఈ మధ్య సినిమా అవకాశాలు అంతగా లేకపోవడంతో 'ఉబెర్' క్యాబ్ నడిపిస్తూ సమాజంలో గౌరవప్రదంగా జీవిస్తున్నానని శంకర్ చెప్తున్నారు. సోమవారం నుంచి గురువారం వరకు క్యాబ్‌లో మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. క్యాబ్ డ్రైవర్‌గా కొత్త జీవితం బాగుందని, దీంతో సంతోషంగా ఉంటున్నానని వెల్లడించారు.

తలాక్ బిల్లును రాజ్యసభ ఆమోదిస్తే
సుప్రీంకోర్టుకు వెళతాం

S & D

ఐయూఎంఎల్ నేత కున్హాల్ కుట్టి స్పష్టీకరణ

కొచ్చి, డిసెంబర్ 31: ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభ కూడా ఆమోదిస్తే తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ముస్లిం సంస్థలు తెలిపాయని ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) ప్రధాన కార్యదర్శి పీకే కున్హాలీ కుట్టి తెలిపారు. ట్రిపుల్ తలాక్ బిల్లులో పలు చట్ట విరుద్ధ నిబంధనలు చేర్చారన్నారు. లోక్‌సభ ఆమోదించిన ట్రిపుల్ తలాక్ బిల్లులో పలు పరస్పర వైరుధ్యాలు, అసంపూర్ణ అంశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇదే బిల్లును రాజ్యసభ కూడా ఆమోదిస్తే ముస్లిం సంస్థలు సుప్రీంకోర్టులో సవాల్ చేస్తాయని, అందులో ఐయూఎంఎల్ కూడా కక్షిదారుగా చేరుతుందన్నారు. కుటుంబ సమస్యను నేరపూరితం చేయడానికి అధికార బీజేపీ ప్రయత్నిస్తున్నదన్నారు. పర్సనల్ లాలో కేంద్రం జోక్యం చేసుకోవడం పూర్తిగా రాజకీయ ప్రేరేపితం అని ఆరోపించారు.

సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై ఉగ్రదాడి

ఐదుగురు భారత జవాన్లు మృతి
ఇద్దరు జైషే మహ్మద్ మిలిటెంట్ల కాల్చివేత

శ్రీనగర్, డిసెంబర్ 31: దక్షిణ కశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో సీఆర్‌పీఎఫ్ శిక్షణాకేంద్రంపై ఉగ్రవాదులు దాడికి దిగారు. భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రి ధరించిన జైషే మహ్మద్ ఉగ్రవాదులు భద్రతాబలగాలపై గ్రెనేడ్లతో దాడిచేసి విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డారు. శనివారం అర్ధరాత్రి జరిగిన మెరుపుదాడిలో ఐదుగురు భారత జవాన్లు అమరులయ్యారు. మరో ముగ్గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. దాడిని సీఆర్‌పీఎఫ్ బలగాలు దీటుగా ఎదుర్కొన్నాయి. ముగ్గురు ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. గాయపడిన జవాన్లను దగ్గర్లోని దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

అవంతిపొరా ప్రాంతంలోని లెత్‌పొరా సమీపంలో ఉన్న 185వ సీఆర్‌పీఎఫ్ బెటాలియన్‌పై శనివారం అర్ధరాత్రి దాటాక 2:30 గంటల ప్రాంతంలో మిలిటెంట్లు దాడికి దిగారు. దాదాపు 11గంటలపాటు ఇరువైపులా భీకరంగా ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఏడాది ఆగస్టులో పుల్వామాలో ఇలాంటి దాడే జరిగింది. ఉగ్రవాదులు జిల్లా పోలీస్ కాంప్లెక్స్‌ను లక్ష్యంగా చేసుకుని దాడికి దిగారు. ఈ దాడిలో ఎనిమిది మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. తాజా దాడి ఘటనకూడా సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ లక్ష్యంగా పక్కా ప్రణాళికతో జరిగినట్లు తెలుస్తున్నది. మిలిటెంట్ల కాల్పుల్లో కానిస్టేబుళ్లు సైఫుద్దీన్ సాజ్, షరీఫుద్దీన్ సహా మరో నలుగురు జవాన్లు మృతిచెందారని సీఆర్‌పీఎఫ్ అధికార ప్రతినిధి రాజేశ్ యాదవ్ తెలిపారు. ఈ కాల్పుల్ని జవాన్లు దీటుగా ఎదుర్కొన్నారని ఆయన చెప్పారు. ఎదురుకాల్పుల్లో ఇద్దరు జైషే మహ్మద్ ఉగ్రవాదులు హతమామయ్యారని, వారి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని రాజేశ్ యాదవ్ చెప్పారు. బిల్డింగ్‌లోకి దూరిన మరొక మిలిటెంట్ సమాచారం తెలియరాలేదని, బహుశా అతడు కూడా చనిపోయి ఉంటాడని భావిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 'తెల్లవారుజామున రెండున్నర గంటల ప్రాంతంలో అండర్ బ్యారెల్ గ్రెనేడ్ లాంచర్లు, అత్యాధునిక ఆయుధాలతో ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. తొలుత సెంట్రీ పోస్టుపైకి గ్రెనేడ్ విసిరారు. జవాన్లు తేరుకునేలోపే కాల్పులు జరుపుకుంటూ వారు బెటాలియన్ బ్లాక్‌లోకి ప్రవేశించారు. అక్కడినుంచే సుదీర్ఘంగా కాల్పులు కొనసాగాయి. బ్లాక్‌ని చుట్టుముట్టిన జవాన్లు ముగ్గురు మిలిటెంట్లను మట్టుబెట్టారు' అని రాజేశ్ యాదవ్ తెలిపారు. జైషే మహమ్మద్ కమాండర్ నూర్‌మహ్మద్ తాపేని భారత బలగాలు మట్టుబెట్టిన తర్వాత ఆ సంస్థ ప్రతీకారం కోసం ప్రయత్నించిందని జమ్ముకశ్మీర్ డీజీపీ ఎస్పీ వేద్ అన్నారు. 'మూడు రోజులుగా జైషే మహమ్మద్ ఉగ్రవాదులు దాడికి ప్రయత్నిస్తున్నారని మాకు సమాచారముంది .అయితే దాడికి పలుమార్లు విఫలయత్నం చేసిన తర్వాతే వారు ఇలా అర్ధరాత్రి దాడికి దిగారు' అని ఆయన తెలిపారు. పుల్వామా ఘటన దురదృష్టకరమని వేద్ చెప్పారు.


సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ షరీఫుద్దీన్ అంతిమయాత్ర

పుల్వామా దాడి.. విదేశాంగ విధాన వైఫల్యానికి నిదర్శనం: కాంగ్రెస్

పుల్వామాలో ఉగ్రవాదుల దాడి ఘటన ప్రధానమంత్రి నరేంద్రమోదీ విదేశాంగ విధాన వైఫల్యానికి నిదర్శనమని కాంగ్రెస్ విమర్శించింది. ఇలాంటి వరుస వైఫల్యాలే జాతి వ్యతిరేక శక్తులకు మనదేశం అంటే భయం లేకుండా చేస్తాయని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుష్మితాదేవ్ అన్నారు. గుజరాత్ ఎన్నికల ప్రచారం సందర్భంగా భారత్ శక్తిమంతమైన దేశంగా ప్రధాని మోదీ పదే పదే చెప్పారని, కానీ కాల్పుల ఉల్లంఘన ఘటనలు, ఉగ్రవాద దాడులు మాత్రం క్రమంగా పెరిగిపోతున్నాయని ఆమె అన్నారు. 'దేశ ప్రయోజనాల రీత్యా ప్రధాని మోదీ ఎలాంటి కఠిన చర్యలు తీసుకున్నా మద్దతు తెలుపుతాం. అయితే ఆయన తన నిర్ణయాలను వెల్లడించకుండా నాన్చివేత ధోరణి మాత్రం మంచిదికాదు' అని ఆమె చెప్పారు.

అర్ధరాత్రి పాక్ దుర్మార్గం


విచక్షణా రహిత కాల్పుల్లో ఓ జవాను మృతి

జమ్ము: దాయాది పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు పొడిచింది. అర్ధరాత్రివేళ పాక్ సైన్యం విచక్షణా రహితంగా కాల్పులకు దిగడంతో ఆదివారం ఉదయం ఓ జవాను మృత్యువాతపడ్డారు. ఈ ఘటన జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లా నౌషెరా సెక్టార్‌లో చోటుచేసుకున్నది. సరిహద్దుల వెంట అర్ధరాత్రి ఒంటిగంట నుంచి ఉదయం 5:30 వరకు పాక్ కాల్పులకు దిగడంతో బుల్లెట్ తగిలి జవాను మృతిచెందాడని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. పూంచ్ జిల్లాలోని దిగ్వార్ సెక్టార్‌లో కూడా పాకిస్థాన్ సైన్యం కాల్పులకు పాల్పడినట్టు చెప్పారు. పాక్ వైపు నుంచి ఉల్లంఘనలు ఎక్కువకావడంతో భారత బలగాల సన్నద్ధత, భద్రతా పరిస్థితులపై ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ శనివారం సమీక్ష నిర్వహించారు. రాజౌరీ సెక్టార్‌లో డిసెంబర్ 23వ తేదీన పాక్ కాల్పులకు ముగ్గురు జవాన్లు బలైన సైనిక పోస్టులను ఆయన సందర్శించారు. 2017 సంవత్సరంలో పాకిస్థాన్ దాదాపు 881 సార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. పాక్ కాల్పుల్లో మొత్తం 34 మంది చనిపోయారు.

దేవుడు శాసించాడు.. వస్తున్నా..!

- తలైవా రాజకీయరంగ ప్రవేశంపై వీడిన ఉత్కంఠ
- త్వరలోనే పార్టీ పెడుతా..
- వచ్చే ఎన్నికల్లో 234 అసెంబ్లీ స్థానాలకు పోటీ చేస్తా..
- హామీలు నెరవేర్చకపోతే మూడేండ్లలో రాజీనామా: రజినీకాంత్
- తమిళనాట అభిమానుల సంబురాలు
- పొలిటికల్ ఎంట్రీపై శుభాకాంక్షల వెల్లువ

చెన్నై, డిసెంబర్ 31:



దేవుడు శాసిస్తే రాజకీయాల్లోకి వస్తా.. అంటూ కొన్నేండ్లుగా అభిమానులతోపాటు అందరినీ ఉత్కంఠకు గురిచేసిన రజినీకాంత్ సందిగ్ధానికి తెరదించారు. తాను రాజకీయాల్లోకి వస్తున్నానని, త్వరలోనే నూతన రాజకీయ పార్టీని ప్రారంభిస్తానని ప్రకటించి నూతన సంవత్సర సంబురాలను రెట్టింపు చేశారు. పార్టీ పేరును ప్రకటించనప్పటికీ 2019 ఎన్నికలకు ముందే దాన్ని స్థాపిస్తానని, తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తామని ఆయన వెల్లడించారు. అభిమానులు 'తలైవా'గా పిలుచుకునే రజినీకాంత్.. మార్పు కోసమే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి జయలలిత మరణం తర్వాత తమిళనాడు రాజకీయాల్లో ఏర్పడిన శూన్యతను భర్తీ చేసేందుకు పలు రాజకీయ సమీకరణాలు జరుగుతున్నాయి. సాంప్రదాయ పార్టీల ప్రయత్నాలకుతోడు కమల్‌హాసన్ వంటి వ్యక్తుల రాజకీయ ప్రవేశ ప్రకటనలు వెలువడుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో దక్షిణాది సూపర్‌స్టార్ రజినీకాంత్ తానూ పార్టీ పెట్టబోతున్నట్లు ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. ఆరు రోజులుగా అభిమానులతో భేటీ అవుతూవస్తున్న రజినీకాంత్ సమావేశాల ముగింపు సందర్భంగా ఆదివారం కీలక ప్రకటన చేశారు. 'కులమతాలకు అతీతంగా పారదర్శకతతో కూడిన రాజకీయాలు కావాలి. అదే నా లక్ష్యం' అని శుక్రవారం రజినీ అభిమానుల కోలాహలం మధ్య ప్రకటించారు. తెల్లటి కుర్తా, గుబురు గడ్డంతో ఆయన రెండు చేతులు జోడించి తన రాజకీయ ప్రవేశంపై ప్రకటన చేశారు. తనది 'అధ్యాత్మిక రాజకీయం'గా రజినీ పేర్కొన్నారు.

రాజకీయాల్లో కొత్త.. రాజకీయాలకు కాదు..!

తన రాజకీయ ప్రకటనకు ముందు 'కర్మణ్యేవాధికారస్తే..' అంటూ భగవద్గీత శ్లోకాన్ని చదివిన రజినీకాంత్.. పనిచేయడమే తమపనని, ఫలితం భగవంతుడే ఇస్తాడని చెప్పారు. తాను రాజకీయాల్లో కొత్తేమోకానీ, రాజకీయాలకు కొత్తకాదన్నారు. డబ్బు, అధికారం కోసమే రాజకీయ పార్టీ పెట్టడం లేదని, తనకు కావాల్సినంత డబ్బు, పేరు ప్రఖ్యాతులు ఇప్పటికే ఉన్నాయని చెప్పారు. 'రాజులు దండయాత్రలు చేసి దోచుకున్నట్లు, ఇప్పుడున్న పార్టీలు అధికారం పేరుతో ప్రజలను లూటీ చేస్తున్నాయి. ఇలాంటి వ్యవస్థ మారాలి. దాన్ని ప్రజాస్వామ్య విధానంలోనే మార్చాలి' అని చెప్పారు.'నాకు క్యాడర్ అవసరం లేదు. వాలంటీర్లు మాత్రమే కావాలి. బంధుప్రీతి, లంచగొండితనానికి పాల్పడేవారు నాకు అవసరం లేదు. ఎవరైనా తప్పు చేస్తే ప్రశ్నించే సైన్యం కావాలి. అలాంటి సైనికులకు నాయకుడిగా, ప్రజలకు ప్రతినిధిగా నేనుంటాను' అని రజినీకాంత్ వివరించారు. ప్రస్తుతానికి తమిళనాడులోని తన అభిమాన సంఘాల్ని సమర్థవంతమైన వేదికలుగా తీర్చిదిద్దాల్సి ఉందని చెప్పారు. అభిమానులు కూడా ప్రజల్ని అభిమాన సంఘాల్లోకి తీసుకురావాలని, తర్వాత ఆ సంఘాలనే క్రమంగా పార్టీగా మారుద్దామని సూచించారు. అప్పటివరకు తనతోసహా ఎవరూ రాజకీయాల గురించి మాట్లాడాల్సిన అవసరం లేదన్నారు.

తమిళనాడులో రాజకీయాలు భ్రష్టుపట్టాయి

తమిళనాట రాజకీయాలు భ్రష్టుపట్టిపోయాయని రజినీ ఆరోపించారు. తమిళనాడును చూసి ఇతర రాష్ట్రాలు హేళనగా నవ్వుతున్నాయని, ప్రతీ తమిళుడు సిగ్గుతో తలదించుకుంటున్నాడని పరోక్షంగా అధికార అన్నాడీఎంకే కుమ్ములాటలపై వ్యాఖ్యానించారు. 'ఇప్పటికైనా నేను నిర్ణయం తీసుకోకపోతే, నాకు జీవితాన్నిచ్చిన తమిళప్రజలకు ద్రోహం చేసిన వాడిగా మిగిలిపోతాను. ఆ బాధ నన్ను జీవితాంతం వెంటాడుతుంది' అని రజినీ పేర్కొన్నారు. అధికారంలోకి రావడమంటే ఆశామాషీ కాదని, అది సముద్ర గర్భం నుంచి ముత్యాలు తీసుకురావడంలాంటిదని తెలిపారు. దేవుడి దయ, ప్రజల మద్దతు ఉంటేనే అది సాధ్యమవుతుందని చెప్పారు. చో రామస్వామి బతికి ఉంటే ఈ సమయంలో తనకు గొప్ప అండ లభించేదని తెలిపారు.

హామీలు నెరవేర్చకపోతే మూడేండ్లలో రాజీనామా

మార్పు కోసమే తాను రాజకీయాల్లోకి వస్తున్నానని రజినీకాంత్ ప్రకటించారు. తమిళ ప్రజలంతా తనకు అండగా నిలువాలని కోరారు. పరోక్షంగా బీజేపీ, కాంగ్రెస్‌లపైనా ఆయన విమర్శలు చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆధ్యాత్మిక పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. 'నేను ఏర్పాటు చేయబోయే పార్టీ నిజం, పని, అభివృద్ధి అనే మూడు సూత్రాలతో నడుస్తుంది. అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే మూడేండ్లలోనే రాజీనామా చేస్తాను' అని సూపర్‌స్టార్ ప్రకటించారు. రజినీకాంత్ రాజకీయ ప్రవేశ ప్రకటనతో అభిమానులే కాదు, సాధారణ ప్రజానీకం కూడా సంబురాల్లో మునిగింది. అభిమానులు వీధివీధినా పటాకులు పేల్చుతూ, నృత్యాలు చేస్తూ సంబురాల్లో మునిగిపోయారు. 'ఇది తలైవా మాకిచ్చిన కొత్త ఏడాది కానుక' అని వారంటున్నారు.


చెన్నైలో జరిగిన సంబురాల్లో రజినీ అభిమానులు

కండక్టర్ నుంచి క్రమంగా ఎదిగి..



ఆన్‌స్క్రీన్‌పై సూపర్ స్టార్ అయిన రజినీకాంత్ మేకప్ తీస్తేసే అతి సామాన్యుడు. దేశదేశాల్లో అభిమాన గణం ఉన్నా, నిరాడంబర వ్యక్తిత్వం ఆయనది. 1950 డిసెంబర్ 12న జన్మించిన రజినీకాంత్ పూర్తిపేరు శివాజీరావ్ గైక్వాడ్. బెంగళూరులో నివసించే మహారాష్ట్ర కుటుంబం వారిది. తండ్రి కానిస్టేబుల్. ఐదేండ్ల వయసులో తల్లిని పోగొట్టుకున్నారు శివాజీ. కుటుంబ ఆర్థికస్థితి సాధారణంగా ఉండడంతో ఆయన పలు ఉద్యోగాలు చేయాల్సి వచ్చింది. చివరకు కర్ణాటక ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్‌లో కండక్టర్ ఉద్యోగం చేశారు. నాటకాలూ వేసేవారు. ఆ అభినివేశంతో మద్రాస్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో చేరి నటనకు మెరుగులు దిద్దుకున్నారు. 1975లో 'అపూర్వరాగంగళ్' చిత్రంలో తొలి అవకాశం ఇచ్చిన కే బాలచందర్ శివాజీ పేరును రజినీకాంత్‌గా మార్చారు. తొలుత ప్రతినాయకుడిగా పాత్రలు వేసిన రజినీ క్రమంగా కథానాయకుడయ్యారు. విజయవంతమైన చిత్రాలతో అంతర్జాతీయ నటుడుగా మారారు. 'జయలలిత సీఎం అయితే తమిళనాడును దేవుడుకూడా రక్షించలేడు' అంటూ 1996లో తొలిసారిగా రాజకీయాలపై రజినీ చేసిన ప్రకటన సంచలనం సృష్టించింది. 1998లో రజినీ బీజేపీ-డీఎంకే కూటమికి మద్దతు ప్రకటించారు. అదీ ఫలితాన్నివ్వలేదు. అప్పటినుంచి ఏ పార్టీకీ ఆయన మద్దతు ప్రకటించకుండా మౌనంగా ఉండిపోయారు.

ప్రముఖుల స్పందనలు..

నా ప్రియమైన స్నేహితుడు, సహ నటుడు, అద్భుతమైన వ్యక్తి రజినీకాంత్.. ఈరోజు రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. ఆయన ఈ రంగంలో విజయం సాధించాలని కోరుకుంటున్నాను **-అమితాబ్ బచ్చన్, నటుడు**

2017 ఏడాదికి ఇదే అతిపెద్ద వార్త. సూపర్‌స్టార్ రజినీ రాజకీయాల్లోకి వస్తున్నారు. జయహో **-అనుపమ్ ఖేర్, నటుడు**

నా సోదరుడు రజినీ సామాజిక బాధ్యతను అభినందిస్తూ ఆయన రాజకీయ ప్రవేశాన్ని స్వాగతిస్తున్నా **- కమల్‌హాసన్, నటుడు**

నిరక్షరాస్యుడు, అవినీతిపరుడు అయిన రజినీ మనకేం చెబుతాడు? వయసుమళ్లిన మరో తమిళనటుడు రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నాడంతే. **- సుబ్రమణ్యస్వామి, బీజేపీ ఎంపీ**

రజినీకాంత్ తన అభిమానుల ఊహాగానాలకు ముగింపునిచ్చారు. ఆయనను అభినందిస్తున్నాను **- స్టాలిన్, డీఎంకే నేత**

ఇక ఒంటరిగానే హజ్‌కు ముస్లిం మహిళలు

- సమాన అవకాశాలతోనే దేశ ప్రగతి..
- నవ్య భారత్‌పై ఆగస్టు 15న యువ ప్రతినిధులతో మాక్ పార్లమెంట్
- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ


ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మోదీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: సంరక్షకుడి తోడు లేకుండానే ముస్లిం మహిళలు హజ్‌యాత్రకు వెళ్లొచ్చని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. ఒంటరిగా హజ్‌యాత్రకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్న వందల మంది మహిళల కోసం ఈ ఆంక్షను తమ ప్రభుత్వం తొలిగించిందని చెప్పారు. ఆదివారం ఆయన దేశ ప్రజలతో 'మన్‌కీ బాత్ (మనసులో మాట)' కార్యక్రమంలో మాట్లాడుతూ 45 ఏండ్లు దాటిన మహిళలను నలుగురు సభ్యులతో కూడిన గ్రూపులుగా 'మహ్రం' లేకుండా హజ్ యాత్రకు వెళ్లేందుకు అనుమతిస్తున్నామని చెప్పారు. సుమారు 1300 మంది మహిళలు ఒంటరిగా వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నందుకు సంతోషంగా ఉన్నదన్నారు. సంరక్షకుడు లేకుండా మహిళలను అనుమతించడం చాలా చిన్న విషయమని, కానీ ఇటువంటి అంశాలు సమాజంపై ప్రభావం చూపుతాయన్నారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన 70ఏండ్ల తర్వాత కూడా ముస్లిం మహిళలపై విధించిన ఆంక్షల పూర్వాపరాల లోతుల్లోకి వెళ్లి పరిశీలించానన్నారు. పలు ఇస్లామిక్ దేశాల్లోనూ ఆ ఆంక్షలు అమలులో లేవన్నారు. సమాన అవకాశాలతోనే దేశ ప్రగతి సాధ్యమని చెప్పారు. కాగా, 2000, అంతకుముందు జన్మించిన వారు.. నూతన సంవత్సరంలో 18 ఏండ్లు దాటిన వారు యువ ఓటర్లుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వారే భారత్‌కు పునాది అని అన్నారు. ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం 2014 ఎన్నికల్లో 18 – 19 ఏండ్ల మధ్య వయస్కులు 1,34,30,193 ఓటేశారని అన్నారు. ఢిల్లీలో ఆగస్టు 15న యువ ప్రతినిధులతో 'మాక్ పార్లమెంట్' నిర్వహించడం ద్వారా వచ్చే ఐదేండ్లలో నవ్య భారత నిర్మాణంపై చర్చించాలని ప్రతిపాదించారు. అంతకుముందు ప్రతి జిల్లాలో మాక్ పార్లమెంట్ జరుపాలన్నారు. నూతన సంవత్సరంలో ప్రగతిశీల భారత్ కోసం ప్రజలంతా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్న ప్రధాని మోదీ.. అందుకు కశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన అంజుమన్ బషీర్‌ఖాన్ కటక్ స్ఫూర్తి అని పేర్కొన్నారు. నవ్య భారతానికి కులతత్వం, మతతత్వం, ఉగ్రవాదం, దారిద్ర్యం నుంచి విముక్తి కల్పించాలన్నారు. జనవరి నాలుగో తేదీ నుంచి మార్చి 10 వరకు స్వచ్ఛభారత్ విజయాలపై సర్వే నిర్వహిస్తామని తెలిపారు. నూతన సంవత్సరంలో కుల, మతాలకతీతంగా అందరి అభివృద్ధి దిశగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 25న క్రిస్మస్‌ను గుర్తు చేసిన ప్రధాని మోదీ.. ఏసుక్రీస్తు సేవా స్ఫూర్తిని బోధించారని చెప్పారు. జనవరి 5న గురుగోవింద్‌సింగ్ 350వ జయంతిని గుర్తు చేసిన ప్రధాని మోదీ ధైర్య సాహసాలకు, త్యాగనిరతికి ఆయన పెట్టింది పేరు అని చెప్పారు.

ట్రిపుల్ తలాక్‌పై నిషేధంతో ముస్లిం మహిళలకు స్వేచ్ఛ
శివగిరి మఠం 85వ వార్షికోత్సవ వేడుకల ప్రారంభంలో ప్రధాని మోదీ

ఏండ్ల తరబడి వేదన అనుభవించిన ముస్లిం మహిళలకు స్వేచ్ఛ లభించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. కేరళలోని శివగిరి మఠం 85వ వార్షికోత్సవాలను ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ట్రిపుల్ తలాక్ నిషేధ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలుపడంపై స్పందించారు. ముస్లిం మహిళలకు స్వేచ్ఛా మార్గం ఏర్పడిందన్నారు. మహిళల హక్కులు, వారి అభ్యున్నతి కోసం జ్యోతిబా పూలే, సావిత్రిబాయి, రాజా రామ్మోహన్ రాయ్, ఈశ్వర్ చంద్ విద్యాసాగర్, దయానంద్ సరస్వతి వంటి సంఘ సంస్కర్తలు ఎంతో కృషిచేశారని చెప్పారు. 'సంస్కరణ, ప్రగతి, పరివర్తన' అనే అంశాలు నూతన సంవత్సరంలో అందరి ప్రగతి మంత్రాలు కావాలని చెప్పారు.

పంతం నెగ్గించుకున్న నితిన్

అమిత్‌షా జోక్యంతో లభించిన ఆర్థిక శాఖ
గుజరాత్‌లో సద్దుమణిగిన అసంతృప్తి


మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న నితిన్‌పటేల్

అహ్మదాబాద్, డిసెంబర్ 31: గుజరాత్ ఉప ముఖ్యమంత్రి నితిన్ పటేల్ తన పంతం నెగ్గించుకున్నారు. గత ప్రభుత్వంలో తాను నిర్వహించిన ఆర్థిక శాఖను తిరిగి పొందారు. తనకు కేటాయించిన శాఖలపై అసంతృప్తితో ధిక్కార స్వరం వినిపించిన నితిన్ పటేల్ పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా ఫోన్‌చేసి స్వయంగా మాట్లాడటంతో ఆదివారం మెత్తబడ్డారు. తన స్థాయికి తగ్గట్టుగా క్యాబినెట్‌లో నంబర్ 2 హోదా ఉండే విధంగా శాఖలు కేటాయిస్తామని అమిత్‌షా తనకు హామీ ఇచ్చారని ఆయన మీడియాతో చెప్పుకొన్నారు. గత క్యాబినెట్‌లో ఆర్థిక, పట్టణాభివృద్ధిశాఖల మంత్రిగా పనిచేసిన నితిన్‌పటేల్‌కు ఈసారి ఆ శాఖలు ఇవ్వకుండా, రోడ్లు భవనాలు, వైద్య విద్య, ఆరోగ్యశాఖలు కేటాయించటంతో అసంతృప్తితో రగిలిపోయారు. తనకు గౌరవప్రదమైన శాఖలు ఇవ్వండి లేదా క్యాబినెట్ నుంచి తొలిగించండి అని హైకమాండ్‌ను కోరినట్టు ఆయన వెల్లడించారు. తన శాఖ మార్పును ఆత్మగౌరవానికి సంబంధించిన వ్యవహారంగా పరిగణిస్తున్నట్టు చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నితిన్‌పటేల్ తన నియోజకవర్గమైన మెహసానాకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం సమయంలో ముఖ్యమంత్రి విజయ్‌రూపానీ ఒక ప్రకటన చేస్తూ నితిన్ పటేల్‌కు తిరిగి ఆర్థిక శాఖను కేటాయిస్తున్నట్టు వెల్లడించారు. దీంతో శాఖల కేటాయింపు సమస్య సద్దుమణిగిందని పేర్కొన్నారు. నితిన్‌పటేల్ బయటకు వస్తే ఆయనతోపాటు మరో పదిమంది ఎమ్మెల్యేలు వస్తారని, వారికి కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం దక్కేలా మధ్యవర్తిత్వం చేస్తానంటూ పాటిదార్ ఉద్యమనేత హార్దిక్ పటేల్ పేర్కొనటం, ఆయన బీజేపీని వీడితే తాము మద్దతిచ్చి, ముఖ్యమంత్రిని చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే విర్జీ తుమ్మర్ వ్యాఖ్యానించటంతో గుజరాత్ రాజకీయాలు శనివారం ఒక్కసారిగా వేడెక్కాయి. అయితే, ఎమ్మెల్యే వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని, శాఖల కేటాయింపు బీజేపీ అంతర్గత వ్యవహారమని కాంగ్రెస్ పార్టీ స్పష్టంచేసింది. అమిత్‌షా రంగంలోకి దిగి, నితిన్‌పటేల్‌ను బుజ్జగించటంతో గుజరాత్ బీజేపీలో ముసలం సద్దుమణిగినట్టే కనిపిస్తున్నది. గుజరాత్ అసెంబ్లీలో బీజేపీకి 99 మంది ఎమ్మెల్యేలు ఉండగా, కాంగ్రెస్ పార్టీకి 77 మంది ఉన్నారు.

సిడ్నీలో కూలిన సముద్ర విమానం

ఆరుగురు దుర్మరణం

సిడ్నీ, డిసెంబర్ 31: ఆస్ట్రేలియాలోని ఓ నదిలో నీటిపై ఎగిరే, దిగే (సముద్ర)తేలికపాటి విమానం ఆదివారం కూలిపోయింది. ఈ ఘటనలో ఆరుగురు దుర్మరణం చెందినట్టు పోలీసులు తెలిపారు. ప్రమాద కారణాలపై దర్యాప్తు జరుపుతున్నట్టు పేర్కొన్నారు. సిడ్నీకి ఉత్తరాన 50 కిలోమీటర్లదూరంలో కోవాన్ శివారు సమీపంలో హాకెస్‌బెరీ నదిలో సింగిల్ ఇంజిన్ సముద్ర విమానం కూలిపోయింది. విమానంలో నుంచి ఆరు మృతదేహాలను వెలికితీసినప్పటికీ వారెవరనేది అధికారులు ధ్రువీకరించడం లేదు. అయితే, ఆస్ట్రేలియా మీడియా మాత్రం మృతుల్లో ఇద్దరు డ్రైవర్లు, నలుగురు ప్రయాణికులు బ్రిటిష్ జాతీయులు అని చెప్తున్నది. బ్రిటిష్ విదేశాంగ కార్యాలయం దీనిని ధ్రువీకరించలేదు.

ఐటీబీపీ కుటుంబాలతో రాజ్‌నాథ్

ఉత్తరకాశి, డిసెంబర్ 31: భారత్-చైనా సరిహద్దులో కాపలాకాస్తున్న ఇండో టిబెటన్ బార్డర్ పోలీస్ కుటుంబాలతో కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారం నూతన సంవత్సర వేడుకలు జరుపుకోనున్నారు. ఇందుకోసం ఆయన ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశికి ఆదివారం బయల్దేరి వెళ్లారు. రక్తం గడ్డకట్టే చలిలో దేశ సరిహద్దుల వద్ద కాపలా కాస్తున్న ఐటీబీపీ సిబ్బంది రాజ్‌నాథ్‌కు గౌరవం వందనం సమర్పించారు. గంగోత్రి ఎమ్మెల్యే గోపాల్‌సింగ్ సహా స్థానిక బీజేపీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఐటీబీపీ సిబ్బంది పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హోం మంత్రి పాల్గొన్నారు. రాత్రంతా ఐటీబీపీ సిబ్బందితో గడిపిన అనంతరం ఉదయం ఆయన నెలాంగ్ లోయకు వెళతారని అధికార వర్గాలు తెలిపాయి. అక్కడ నెలకొల్పిన పది సరిహద్దు పోస్టుల్లో పరిస్థితిని సమీక్షిస్తారని పేర్కొన్నాయి.



ఉత్తర కాశీలో ఐటీబీపీ కుటుంబాలతో రాజ్‌నాథ్

నాలుగు రోజుల్లో రూ.338 కోట్ల మద్యం అమ్మకాలు

- గతేడాది కంటే రాష్ట్ర ఎక్సైజ్‌శాఖకు అదనంగా రూ.19 కోట్ల ఆదాయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం ప్రియులు అధిక మొత్తంలో తాగి మత్తులో తూగారు. 2017 సంవత్సరానికి వీడ్కోలు పలికి, 2018కి స్వాగతం పలికేందుకు ఏర్పాటు చేసుకున్న నూతన వేడులకల ద్వారా రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ ఆదాయం గత నాలుగు రోజులుగా రూ. 338 కోట్లకు చేరింది. గత ఏడాది డిసెంబర్ చివరి నాలుగు రోజుల్లో రూ.319 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయింది. గతంలో కంటే ఈసారి రూ.19 కోట్ల అదనపు ఆదాయం వచ్చింది. గతేడాది డిసెంబర్ మొత్తానికి రూ. 1,310 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోగా, 2017 డిసెంబర్‌లో రూ.1,630 కోట్ల విలువైన మద్యం అమ్ముడయింది.

చివరి నాలుగు రోజుల ఆదాయం ఇలా..	
2016 డిసెంబర్ 28న	రూ.67 కోట్లు
2017 డిసెంబర్ 28న	రూ. 105 కోట్లు
2016 డిసెంబర్ 29న	రూ.76 కోట్లు
2017 డిసెంబర్ 29న	రూ.80 కోట్లు
2016 డిసెంబర్ 30న	రూ.102 కోట్లు
2017 డిసెంబర్ 30న	రూ.105 కోట్లు
2016 డిసెంబర్ 31న	రూ.74 కోట్లు
2017 డిసెంబర్ 31న	రూ.48 కోట్లు



నేటి నుంచి నుమాయిష్

అబిడ్స్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగర ప్రజలను అలరించేందుకు నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో నిర్వహించే అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) సోమవారం ప్రారంభం కానున్నది. ఏటా జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు 46 రోజులపాటు ఎగ్జిబిషన్ మైదానంలో నుమాయిష్ నిర్వహిస్తారు. అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకుగాను స్టాళ్ల కేటాయింపు పూర్తి కాగా, నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. నుమాయిష్‌ను గత ఏడాది దాదాపు 20 లక్షల పైచిలుకు సందర్శించగా, ఈ ఏడాది ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా సొసైటీ ప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారు. సీసీ కెమెరాలతోపాటు అంతర్గత భద్రత కోసం సెక్యూరిటీ గార్డులు, వలంటీర్లు, వాచ్ అండ్ వార్డ్ సిబ్బంది, మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్ డిటెక్టర్లతో తనిఖీలు చేపట్టనున్నారు. నుమాయిష్‌ను డిప్యూటీ సీఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ ప్రారంభించనున్నారని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు నరోత్తంరెడ్డి తెలిపారు. వీరితోపాటు ఆర్థిక మంత్రి, సొసైటీ అధ్యక్షుడు ఈటల రాజేందర్ పలువురు మంత్రులు పాల్గొంటారన్నారు.





నయాసాల్‌లో నగరానికి కొత్త బస్సులు

- 185 కొత్తవి, మరో 200 పాత బస్సుల పునరుద్ధరణ
- 500 మంది ఉద్యోగులకు పదోన్నతులు
- గ్రేటర్ ఈడీ పురుషోత్తంనాయక్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: హైదరాబాద్ నగర ఆర్టీసీ 2018లో కొత్త పుంతలు తొక్కనున్నది. నగర ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడానికి 185 కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నది. ఇవి వచ్చే జూన్‌నాటికి అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం నడుస్తున్న 200 బస్సులను రూ.16 కోట్లతో మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దనున్నారు. 500 మంది ఆర్టీసీ సిబ్బంది, ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వనున్నారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే యాజామన్యానికి అందజేసినట్టు గ్రేటర్ హైదరాబాద్ ఆర్టీసీ ఈడీ పురుషోత్తంనాయక్ తెలిపారు. ప్రస్తుతం నిత్యం నగరంలోని 29 డిపోల నుంచి 3,566 బస్సులు 43,354 ట్రిప్పులు తిరుగుతూ 33 లక్షల మందిని గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2017లో నగర ఆర్టీసీ సర్వీసుల రద్దు వంటి నిర్ణయాలు 2.93శాతం నుంచి 1.92శాతానికి తగ్గాయి. 21.12 లక్షల కిలోమీటర్లు ఎక్కువగా తిరిగాయి. ఏప్రిల్ 18న ఫరూఖ్‌నగర్ బస్‌డిపోను ప్రారంభించారు. సికింద్రాబాద్, జేఎన్టీయూ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి 33 పుష్పక్ బస్సుల స్థానంలో మెట్రోలగ్జరీ ఏసీ వోల్వో బస్సులను ప్రవేశపెట్టారు. నవంబర్‌లో 76 పాత హైర్‌బస్సుల స్థానంలో కొత్త బస్సులను తీసుకొచ్చారు. 170 సూపర్‌లగ్జరీ బస్సులను 13.60 కోట్లతో విజయవంతంగా నడిపించేలా మరమ్మతులు చేశారు. శంషాబాద్ బస్‌స్టేషన్ నుంచి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయం వరకు నాలుగు మినీ బస్సులను ఏర్పాటు చేశారు. నవంబర్ 1 నుంచి మెట్రోరైలుకు అనుసంధానంగా 50 ఫీడర్ బస్సులను తిప్పుతున్నారు. 2017లో 583 మందికి పదోన్నతులు కల్పించారు. బస్సుల కేఎంపీఎల్‌ను 4.42 నుంచి 4.43కు పెంచారు. దీనివల్ల 12.08 లక్షల లీటర్ల ఇంధనం పొదుపుతో రూ.7.29 కోట్లు ఆదా అయ్యాయి. ప్రమాదాల విషయానికి వస్తే 2016లో 119 నమోదుకాగా, 2017లో 112కు తగ్గాయి.

డ్రగ్స్ సరఫరాకు నైజీరియన్ల ప్లాన్

- నైజీరియా నుంచి భారీగా దిగుమతి
- భగ్నం చేసిన రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు.. ఇద్దరి అరెస్ట్
- పరారీలో కీలక సూత్రధారి బెంజిమిన్



పట్టుబడిన డ్రగ్స్, పాసుపోర్టులను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ మహేశ్ భగవత్

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: న్యూ ఇయర్ వేడుకల్లో మత్తు బాబులకు డ్రగ్స్ సరఫరా చేసేందుకు పథకం పన్నిన నైజీరియన్ విద్యార్థుల గుట్టును రాచకొండ ఎస్‌వోటీ పోలీసులు రట్టుచేశారు. వీరి నుంచి భారీగా మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఎల్బీనగర్ రాచకొండ పోలీస్ కమిషనర్ క్యాంపు కార్యాయంలో సీపీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ నైజీరియాకు చెందిన చుక్వూమా(19), సండే ప్రిసిల్లా ఉజున్వా(21) 2015లో స్టూడెంట్ వీసాపై మన దేశానికి వచ్చారు. ఆ తర్వాత జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యాప్రాల్ మారుతీ గార్డెన్స్ వేదా స్ట్రీట్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ఉంటున్నారు. చుక్వమా పీజీ కాలేజీలో బీఎస్సీ(ఎంపీసీఎస్), సండే ప్రిసిల్లా ఉజున్నావ ఆర్‌బీవీఆర్‌ఆర్ కాలేజీలో బీఫార్మసీ చదువుతున్నారు. ఇద్దరికీ అప్పటికే హైదరాబాద్‌లో అక్రమంగా ఉంటున బెంజిమిన్ పరిచయమయ్యాడు. అతను వీరికి సులభంగా నగదును సంపాదించే మార్గాన్ని చూపిస్తానంటూ మాదక ద్రవ్యాల విక్రయాలను జరిపించాడు. దీంతో వీరు బెంజిమిన్‌కు నమ్మకస్తులుగా మారడంతో న్యూ ఇయర్ కోసం డ్రగ్స్‌ను అధికంగా విక్రయించేందుకు వీరి వద్ద భారీగా మత్తు పదార్థాలను నిల్వ ఉంచాడు. ఈ సమాచారం అందుకున్న రాచకొండ స్పెషల్ అపరేషన్ టీం ఆదివారం వీరి ఇంటిపై దాడి చేసి కొకైన్-16 గ్రాములు, హెరాయిన్-23 గ్రాములు, అల్ప్రాజోలం-40 గ్రాములు, యాంఫెటామైన్-15 గ్రాములు, జీహెచ్‌పీ స్టెరాయిడ్ బాటిళ్లు-1, కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బెంజిమిన్ వీటిని నైజీరియా నుంచి షిప్‌లో గోవాకు, అక్కడి నుంచి హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తాడని నిందితులు తెలిపారు. కొకైన్, హెరాయిన్‌ను నిందితులు బెంజిమన్ నుంచి గ్రాము రూ.20 వేలకు కొనుగోలు చేసి, రూ.50 వేలకు అమ్ముతామని వివరించారు. పట్టుబడ్డ మత్తు పదార్థాలను దాదాపు 50 మంది కస్టమర్లకు సరఫరా చేసేందుకు పథకాన్ని రూపొందించుకున్నట్టు నిందితులు చెప్పారు. ఈ మత్తు పదార్థాల విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.16.70 లక్షలు ఉంటుందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. డ్రగ్స్‌తోపాటు వీరి నుంచి స్విఫ్ట్ కారు, 5 మొబైల్ ఫోన్లు, 2 ల్యాప్‌టాప్‌లు, నిందితులతోపాటు మరో ఐదుగురికి చెందిన పాస్‌పోర్టులను పోలీసులు సీజ్ చేశారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న బెంజిమిన్ పరారీలో ఉన్నాడు. అతను గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి జైలు శిక్ష అనుభవించినట్టు సమాచారం. ఈ కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన సిబ్బందిని సీపీ నగదు రివార్డులతో అభినందించారు. సమావేశంలో జాయింట్ సీపీ తరుణ్ జోషి, మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వరశర్మ, స్పెషల్ అపరేషన్ టీం అదనపు డీసీపీ రఫీక్ పాల్గొన్నారు.

బెయిల్‌పై కెల్విన్ విడుదల

డ్రగ్స్ సరఫరా కేసులో ప్రధాన సూత్రధారి



తన న్యాయవాదితో కలిసి జైలు నుంచి బయటకు వస్తున్న కెల్విన్

చర్లపల్లి/హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మాదకద్రవ్యాల సరఫరా కేసులో ప్రధాన నిందితుడైన కెల్విన్ ఆదివారం చర్లపల్లి కేంద్ర కారాగారం నుంచి బెయిల్‌పై విడుదలయ్యాడు. మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కెల్విన్ జూలై 3వ తేదీ నుంచి చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. ఆరు నెలలుగా శిక్ష అనుభవిస్తున్న కెల్విన్‌కు నాంపల్లి కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో శనివారం రాత్రి కెల్విన్ న్యాయవాది జైలు అధికారులకు బెయిల్ పత్రాలను అందించారు. విడుదలకు సంబంధించి సమయం మించిపోవడంతో ఆదివారం ఉదయం విడుదల చేశారు. కెల్విన్ ముఠా ఎవరెవరికీ డ్రగ్స్ సరఫరాచేసింది? అతని వెనుక ఎవరెవరు ఉన్నారు? అనే విషయమై ఎక్సైజ్ సిట్ అధికారులు చేసిన దర్యాప్తులో భాగంగా సినీ పరిశ్రమను కుదిపేసిన విషయం తెలిసిందే. కెల్విన్ కాల్ డేటా ఈధారంగా సినీపరిశ్రమలకు చెందిన పూరి జగన్నాథ్, రవితేజ, తరుణ్, చార్మి, సుబ్బరాజు ఇలా రోజుకు ఒకరు చొప్పున 12 మందిని విచారించిన ఎక్సైజ్ అధికారులు కొంత మంది నుంచి రక్త నమూనాలను తీసుకున్నారు. కెల్విన్ సెల్‌ఫోన్, వాట్సప్ చాటింగ్ ఆధారంగా కీలక సమాచారం తెలుసుకున్న ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఫోరెన్సిక్ నివేదికలు అందిన వెంటనే చార్జిషీట్లు దాఖలు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈవెంట్ మేనేజర్‌గా పని చేసిన కెల్విన్ అంతర్జాతీయ, గోవా డ్రగ్స్ ముఠాలతో సంబంధాలున్నాయని, సినీ పరిశ్రమలో పలువురికి డ్రగ్స్ సరఫరా చేసినట్టు బలమైన ఆధారాలతో సిట్ అధికారులు అప్పట్లో అరెస్ట్ చేశారు.

మన నగరంనకు మంచి స్పందన

కుత్బుల్లాపూర్ సమస్యలకు జీహెచ్‌ఎంసీ తక్షణ పరిష్కారం

72 పనులకు రూ.43.12 కోట్లు మంజూరు



కొంపల్లిలో 'మన నగరం' సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కే తారకరామారావు (ఫైల్)

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: మన నగరం కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీతోపాటు జలమండలి, విద్యుత్‌శాఖాధికారులు అమలు చేస్తున్నారు. నగరవాసులతో వివిధ శాఖాధికారులు ప్రత్యక్షంగా సమావేశమై ప్రధానమైన సమస్యలను తెలుసుకొని తక్షణ పరిష్కారానికి శ్రీకారం చూడుతున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలను మరింత భాగస్వామ్యం చేసేందుకుగాను డిసెంబర్ 16న 'మన నగరం' పేరుతో మున్సిపల్‌శాఖ మంత్రి కే తారకరామారావు గ్రేటర్ హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్‌లో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక రెసిడెన్షియల్ వెల్ఫేర్ సంఘాలు, ఏరియా సభ, వార్డు కమిటీల సభ్యులు 'మన నగరం'లో మంత్రి కేటీఆర్‌కు పలు సమస్యలను వివరించారు. స్థానికులు వివరించిన సమస్యలన్నింటికీ రెండు వారాల్లో నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి ఆ పనులకు నిధులు కేటాయించారు. వివిధ శాఖలకు సంబంధించిన 71 పనులకు రూ.43.12 కోట్ల నిధులు మంజూరు చేస్తూ పరిపాలనపరమైన అనుమతులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి జారీ చేశారు. మన నగరం కార్యక్రమాల్లో ఏర్పాటు చేసిన జనహిత కౌంటర్ల ద్వారా వచ్చిన పలు దరఖాస్తులను మంత్రి కేటీఆర్ పేషి ద్వారా పరిశీలించి జీహెచ్‌ఎంసీకి అందిన ప్రతిపాదనలపై అత్యంత వేగవంతంగా క్షేత్రస్థాయి పరిశీలన జరిపి అంచనాలు రూపొందించి రికార్డుస్థాయిలో నిధులు మంజూరు చేస్తున్నారు. మంత్రి కేటీఆర్ తమ సమస్యల పరిష్కారంపై అత్యంత వేగంగా స్పందించి నిధులు మంజూరు చేయడం పట్ల కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాట్ల వేలానికి నోటిఫికేషన్ సిద్ధం!

- 160 చోట్ల అమ్ముడుపోని హెచ్‌ఎండీఏ స్థలాలకు ఆన్‌లైన్‌లో వేలం
- రూ.500 కోట్లు రావొచ్చని అంచనా.. జియో ట్యాగ్ చేస్తున్న అధికారులు
- వెబ్‌సైట్‌లో ప్లాట్ల వివరాలు.. ప్లాట్ల ఎంపికకు కమిటీ
- కేటాయించిన వెంటనే 25శాతం చెల్లించాలి



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పారదర్శకంగా ప్లాట్ల వేలం ప్రక్రియను చేపట్టాలని హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు నిర్ణయించారు. నగరానికి నలువైపులా ఉన్న స్ట్రే బిట్లు 30, ఓపెన్ ఏరియా/ప్లాట్లు 76, గిఫ్ట్ ల్యాండ్స్ 54 కలిపి మొత్తం 160 చోట్ల స్థలాలను గుర్తించారు. మియాపూర్, చందానగర్, ముక్తా మహల్, అత్తాపూర్ సర్వే నంబర్-366, మాదాపూర్, వనస్థలిపురం, నల్లగండ్ల, ఆసిఫ్‌నగర్, తెల్లాపూర్, నెక్నాంపూర్, సరూర్‌నగర్ రెసిడెన్సీ కాంప్లెక్స్, గోపన్‌పల్లి, చిత్రా లేఔట్, హకీంపేట హుడా హైట్స్, హుడా ఎన్‌క్లేవ్, నందనగిరి హిల్స్, రామచంద్రాపురం ప్రాంతాల్లో ఈ ప్లాట్ల వేలం ఉండనున్నది. అధికారులు వాటిని జియో ట్యాగ్ చేసేందుకు రంగంలోకి దిగారు. వేలం వేసే ప్లాట్ల సమగ్ర వివరాలను సేకరించి సంస్థ వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నారు. ఇందుకు రెండు రోజుల్లోగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి మూడు రోజుల్లో జియో ట్యాగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ప్రధానంగా ఆన్‌లైన్ వేలంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. టీఎస్‌ఐఐసీ తరహాలో ఈ ప్లాట్ల వేలం జరుపుతుండగా, ఆన్‌లైన్‌లో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన ఎంఎస్‌టీసీ సంస్థకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సంస్థకు వచ్చిన ఆదాయంలో రూ.75 లక్షలు సదరు ఏజెన్సీ (ఎంఎస్‌టీసీ)కు కేటాయించనున్నారు. ఈ ప్లాట్ల విక్రయం ద్వారా సంస్థ ఖజానాలోకి రూ. 500 కోట్ల మేర ఆదాయం రావొచ్చని అధికారులు అంచనా వేశారు. సంస్థ వద్ద అమ్ముడు కాకుండా మిగిలిపోయిన ప్లాట్లను వేలం వేయడానికి ఇటీవల పురపాలకశాఖ అనుమతిచ్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియ పారదర్శకంగా సాగడానికి కమిషనర్ నాయకత్వంలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీలో ముఖ్య ప్రణాళికాధికారి, ఔటర్‌రింగ్ రోడ్డు భూసేకరణ డిప్యూటీ కలెక్టర్, సూపరింటెండెంట్ ఇంజినీర్ తదితరులు సభ్యులుగా ఉంటారు. ఎస్టేట్ ఆఫీసర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీ ముందుగా ప్లాట్లను ఎంపిక చేస్తుంది. ఆ ప్లాట్లకు ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ మార్కెట్ విలువ ఎంత ఉన్నదో దాన్ని పరిగణనలోకి తీసుకొని దానిపై ఒకటిన్నర రెట్లు అధికంగా తుది ధర ఉండేటట్లుగా నిర్ణయించి, ఆన్‌లైన్‌లో వేలానికి ఉంచుతారు. వేలంలో పాల్గొనాలనుకొనేవారు ప్రభుత్వం నిర్దేశించిన ధరలో పదిశాతం ముందుగా చెల్లించాలి. వేలంలో ప్లాటును సొంతం చేసుకొంటే, వారం రోజుల్లో పాతిక శాతం సొమ్మును చెల్లించాలి. మిగతా సొమ్మును రెండు నెలల్లో కట్టాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో తొలిసారి కొనుగోలుదారులెవరూ రాకపోతే.. ఆ వేలాన్ని రద్దుచేసి రెండోసారి వేలం వేస్తారు. అప్పుడు కూడా రాకపోతే ఆరు నెలలపాటు వేలంపాటను రద్దు చేస్తారు. ఒక ప్లాటుకు ఒక్కరు మాత్రమే దరఖాస్తు చేసుకొంటే.. ప్రామాణిక ధరకంటే ఎక్కువకు కోట్ చేయాల్సి ఉంటుంది.

8 కోట్ల నకిలీ చెక్కు మార్పిడికి యత్నం

- ముగ్గురు నిందితుల అరెస్ట్

ఉప్పల్, నమస్తే తెలంగాణ: రూ.8 కోట్ల నకిలీ చెక్కు మార్పిడికి ప్రయత్నించిన కేసులో నిందితులను హైదరాబాద్ నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఉప్పల్‌లో ఆదివారం మల్కాజిగిరి డీసీపీ ఉమామహేశ్వరశర్మ, ఏసీపీ సందీప్‌రావు గోనె, సీఐ విఠల్‌రెడ్డి, ఎస్సై రమేశ్ వివరాలు వెల్లడించారు. హబ్సిగూడలోని ఐసీఐసీఐ బ్యాంకుకు డిసెంబర్ 28న ముగ్గురు వ్యక్తులు హెర్బల్‌లైఫ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన రూ.8 కోట్ల చెక్కును తీసుకొని వచ్చారు. నగదును శ్యామ్‌సుందర్ అనే వ్యక్తి ఖాతాలోకి బదిలీ చేయాలని డిపాజిట్ స్లిప్ అందజేశారు. చెక్కును చూసిన బ్యాంకు అధికారులు అనుమానంతో సదరు కంపెనీ ప్రతినిధులకు ఫోన్ ద్వారా విచారించగా తాము చెక్కును ఇవ్వలేదని చెప్పారు. దీంతో చెక్కు నకిలీదని నిర్ధారించుకొని వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా ఇద్దరు పరారయ్యారు. వరంగల్ కాజీపేటకు చెందిన రవికృష్ణను పట్టుకున్నారు. సమాచారం అందుకునున్న పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. సురేశ్, శ్యాంసుందర్, వీరేశ్, సంపత్‌కుమార్, శ్రీనివాస్, రవిభవానియాదవ్, శ్రావణ్‌కుమార్, గోపీనాథ్ కలిసి పథకం ప్రకారం చెక్కును మార్చుకొని డబ్బులు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. సురేశ్ అనే వ్యక్తి చెక్కు తీసుకొచ్చి శ్యాంసుందర్ ఖాతాలోకి మార్చి, అనంతరం డ్రా చేసుకోవాలని ప్రయత్నించారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులు కోలా తారక్ దుర్గా గోపినాథ్(26), సంపత్‌కుమార్(45), పెద్దిరాజు శ్రీనివాసరాజు(40)ను అదుపులోకి తీసుకొన్నారు. చెక్కు ఎక్కడినుంచి వచ్చింది? మిగతావారి పాత్రపై దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ తెలిపారు. గతంలో కూడా ఇదే నంబర్‌తో కూడిన చెక్కుల ద్వారా రూ.20 కోట్ల వరకు నగదు బదిలీ చేసినట్టు తెలుస్తున్నదని, ఇదే నంబర్ చెక్కులు ఐదు ఉన్నట్టు సమాచారం ఉన్నదన్నారు. త్వరలోనే కేసును ఛేదిస్తామన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ ఉమామహేశ్వరశర్మ, ఏసీపీ సందీప్‌రావు గోనె

డీజిల్ వాహనాలతో చేటు

అత్యధిక కాలుష్యంతో దెబ్బతింటున్న పర్యావరణం

ఆందోళన వ్యక్తం చేసిన సీపీసీబీ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:



హైదరాబాద్ మహా నగరంలో వెలువడుతున్న వాయు కాలుష్యంలో 49శాతం వాహనాలదే. ఇందులో ప్రత్యేకించి బస్సులు, భారీ వాహనాలు కాలుష్యాన్ని మోసుకొస్తున్నాయి. మొత్తంగా డిజిల్ వాహనాలు పర్యావరణానికి చేటుచేస్తున్నాయి. ఇదే విషయాన్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) ఇటీవల ఆందోళన వ్యక్తం చేసింది. అర్బన్ ఏయిర్ పేరుతో పట్టణ ప్రాంతాల్లో వాయుకాలుష్యంపై సీపీసీబీ అధ్యయనం చేసింది. వాహనాలవారీగా వాటి నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని లెక్కించారు. బస్సులు, ట్రక్కులు, లారీలు సహా భారీ వాహనాల నుంచే అధిక కాలుష్యం వెలువడుతున్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. ఇంకొంత కాలం పరిస్థితి ఇలాగే కొనసాగితే హైదరాబాద్‌లోనూ స్వచ్ఛమైన గాలి కరువయ్యే పరిస్థితి ఏర్పడుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఏటా పెరుగుతున్న వాహనాలు హైదరాబాద్‌ను కాలుష్య కాసారంగా మార్చేస్తాయేమోనన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రస్తుతం గ్రేటర్‌లో 50 లక్షల పైచిలుకు వాహనాలు నిత్యం రోడ్డెక్కుతున్నాయి. వీటిలో 50 శాతం బైకులు ఉండగా, 1.20 లక్షల ఆటోలు, 3,850 ఆర్టీసీ బస్సులు, సరుకు రవాణాచేస్తున్న లారీలు, ట్రక్కులు ఉన్నాయి. మిగతా ప్రాంతాలతో పోల్చితే వాహనాలు ఎక్కువగా తిరిగే ప్రాంతాల్లోనే కాలుష్యం అత్యధికంగా నమోదువుతున్నట్టు కాలుష్య నమోదు కేంద్రాల ద్వారా వెల్లడవుతున్నది.

గ్రేటర్‌లో వెలువడుతున్న కాలుష్యం..	
ఉద్గారాలు	టన్నుల్లో
కార్బన్	212
హైడ్రోకార్బన్లు	59
నైట్రోజన్ ఆక్సైడ్	138
కార్బన్‌డయాక్సైడ్	15,282
పీఎం	11.9
సల్ఫర్‌డయాక్సైడ్	0.5
నైట్రస్ ఆక్సైడ్	0.4
మీథేన్	5.2
అమ్మోనియా	1.1
బెంజీన్ (గ్రాముల్లో)	1699.3
1-3 బూటడైన్ (గ్రాముల్లో)	1526.3
టాల్డిహైడ్ (గ్రాముల్లో)	1049.8
పాలిసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్ (గ్రాముల్లో)	5588.2

- బైకులు, ఆటోల నుంచి 37-35 శాతం కార్బన ఉద్గారాలు, 51-33 శాతం వరకు హైడ్రోకార్బన్లు, బస్సుల నుంచి 45శాతం నైట్రోజన్ ఆక్సైడ్, బస్సులు, ఆటోల నుంచి 29-28 శాతం కార్బన్‌డయాక్సైడ్, 41-32 శాతం వరకు దుమ్ముధూళి కణాలు 33-29 శాతం సల్ఫర్‌డయాక్సైడ్ వెలువడుతున్నాయి.
- ఆరేండ్ల నుంచి గ్రేటర్ హైదరాబాద్‌లో వాహనాల సంఖ్య భారీగా పెరుగుతున్నది. దేశంలోని మిగతా నగరాలతో పోల్చితే ఏటా హైదరాబాద్‌లో 16 శాతం అధనంగా వాహనాలు పెరుగుతుండగా, అహ్మదాబాద్‌లో 9 శాతం, కోల్‌కత్తాలో 8, లక్నోలో 11, పట్నాలో 9, షోలాపూర్ 7 శాతం మాత్రమే వాహనాలు పెరుగుతున్నాయి.

ఏ వాహనాల ద్వారా ఎంత కాలుష్యం మిల్లీ గ్రాముల్లో (కిలోమీటర్ వ్యవధిలో నమోదవుతున్నవి)	పీఎం 2.5	పీఎం 10	కార్బన్ డయాక్సైడ్	హైడ్రో కార్బన్లు	నైట్రోజన్ డయాక్సైడ్
ఆటోలు	0.045	0.045	1.0	25.2	0.2
కార్లు	0.015	0.01	6.46	1.77	0.43
బస్సులు	0.30	0.30	3.72	3.75	6.21
ట్రక్కులు	0.41	0.41	4.13	0.28	8.63
ఎల్‌సీవీ(ఫోర్‌వీలర్)	0.90	0.90	0.40	0.14	0.50
మోటర్ సైకిళ్లు	0.35	0.35	1.64	0.61	0.27
స్కూటర్లు	0.15	0.15	0.40	0.15	0.25

- 2000 సంవత్సరానికి ముందు గ్రేటర్‌లో కేవలం 48,741 డిజిల్ వాహనాలు వినియోగంలో ఉండగా, తాజా లెక్కల ప్రకారం వాటి సంఖ్య 2,41,817 చేరింది. కేవలం 15 ఏండ్ల వ్యవధిలోనే డీజిల్ వాహనాల సంఖ్య రెండు లక్షలు పెరుగడం గమనార్హం. భారీ వాహనాలైన ఆర్టీసీ బస్సులు, లారీలు, కార్ల వినియోగం గణనీయంగా పెరిగింది.
- నగరంలో వాహనాల నుంచి 49 శాతం కాలుష్యం వెలువడుతున్నది. ఇది కాక రోడ్లపై ఉన్న దుమ్ముతో 33 శాతం, సెకండరీ పొల్యూటెంట్ల ద్వారా 8 శాతం, చెత్తను తగులబెట్టడం ద్వారా 4 శాతం, బొగ్గును మండించడం ద్వారా 16 శాతం, సిమెంట్ వినియోగం ద్వారా 2 శాతం వాయుకాలుష్యం వెలువడుతున్నది.

టన్నుల కొద్దీ కాలుష్యం

వాహనాల ద్వారా వెలువడే వాయు కాలుష్యం టన్నులకు చేరుకుంటున్నది. ఒకప్పుడు పరిమితంగా ఉన్న ఉద్ఘారాలు, కాలుష్యకారకాలు వాహనాల విస్ఫోటనంతో భారీగా నమోదవుతున్నది. 1992లో వాహనాల నుంచి 500 టన్నుల పొగ వెలువడగా, 2016లో 1,500 టన్నులకు చేరింది. సీఎన్జీ వాహనాలను ప్రోత్సహించడం, ప్రజారవాణాకు పెద్దపీట వేయడం ద్వారా ఈ కాలుష్యానికి అడ్డుకట్టవేయగలమని పర్యావరణవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆ దిశగా మరింత ముందడుగు పడాలని వారు కోరుతున్నారు.

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
S & D
హైదరాబాద్
సోమవారం 1 జనవరి 2018
WWW.NTNEWS.COM

జిందాల్ స్టీల్ అండ్ పవర్ కంపెనీని విజయవంతంగా నిర్వహిస్తూ దేశంలోనే అత్యంత విజయవంతమైన మహిళ గా దూసుకెళ్తున్నారామె. భర్త ఓం ప్రకాశ్ జిందాల్ ప్రారంభించిన జిందాల్ కంపెనీ 2005లో ఆయన మరణించిన తర్వాత బాధ్యతలు భుజానికెత్తుకున్నారు. నాటి నుంచి భర్త స్థాపించిన ఓపీ జిందాల్ గ్రూప్ పగ్గాలు చేపట్టి ఎంతో సమర్థవంతంగా మరింత ముందుకు నడిపించారు. మనదేశంలో మహిళా సంపన్నుల్లో ఈమెదే అగ్రస్థానం. అతి తక్కువ కాలంలోనే విజయవంతమైన సంస్థగా కంపెనీని లాభాల బాటలో నడిపించడంలో విజేతగా నిలిచిన సావిత్రి జిందాల్ సక్సెస్‌మంత్ర.

వ్యాపారం, సేవలోనూ సంపన్నురాలు

సావిత్రి జిందాల్



సావిత్రి జిందాల్ భారతదేశంలో సంపన్న మహిళల్లో ప్రథమ స్థానంలో ఉన్నారు. 2012 సంవత్సరం ఫోర్బ్స్ అందించిన నివేదికల ప్రకారం ఈమె ప్రపంచ సంపన్నుల జాబితాలో 80వ స్థానంలో ఉన్నారు. అనివార్య కారణాల వల్ల భర్త బాధ్యతలను సావిత్రి స్వీకరించాల్సి వచ్చింది. భర్త మరణం తర్వాత సంస్థను నాలుగు భాగాలుగా విభజించినప్పటికీ చిన్న కొడుకు నవీన్ జిందాల్ మాత్రం అదే పేరును కొనసాగిస్తూ సావిత్రి జిందాల్ సలహాలతో మిగతా కంపెనీల కంటే ఎక్కువ ఆదాయాన్ని గడించి ఫోర్బ్స్ జాబితాలో 16వ స్థానంలో నిలిచారు.

జిందాల్ గ్రూప్ ప్రస్థానం

ఓపీ జిందాల్ గ్రూప్‌ను ఓపీ జిందాల్ 1952లో స్థాపించాడు. అత్యధికంగా ఇనుమును ఉత్పత్తిచేసే సంస్థల్లో ప్రపంచంలోనే ఇది మూడోది. దీంట్లో స్టీల్, పవర్, మైనింగ్, ఆయిల్ అండ్ గ్యాస్‌కు సంబంధించిన నాలుగు విభాగాలున్నాయి. ఉక్కు ఉత్పత్తి కర్మాగారాన్ని స్థాపించిన జిందాల్ దానిని సమర్థవంతంగా నిర్వహించారు. కానీ జిందాల్ 2005లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయాడు.

జీవన ప్రయాణం

1950 మార్చి 20న సావిత్రి అసోంలోని తిన్‌సుకియా అనే ప్రాంతంలో జన్మించారు. హర్యానాలో హిసర్ నగరంలోనే ఎక్కువ కాలం ఉన్నారు. అక్కడే డిప్లొమా చేశారు. సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగిన సావిత్రి 1970లో ఓపీ జిందాల్‌ని వివాహం చేసుకున్నారు. 9 మంది సంతానంతో గృహిణిగా తన బాధ్యతల్ని ఎంతో హుందా గా నిర్వర్తిస్తూ వచ్చారావిడ.

ఇల్లే లోకంగా..

భార్యగా, తల్లిగా ఎంతో సంతోషంగా సావిత్రి జిందాల్ బాధ్యతలు నిర్వర్తించారు. ఆమెకు నలుగురు అబ్బాయిలు, అయిదుగురు అమ్మాయిలు. వారిని పెంచి పెద్దచేయడంలో ఎప్పుడూ ఇబ్బంది పడలేదు. బయటి విషయాలూ, వ్యాపార లావాదేవీలన్నీ భర్తే చూసుకునేవారు. పిల్లలూ, ఇంటికి వచ్చిపోయే బంధువులూ.. ఇదే ఆమె లోకం. 2005లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో భర్త మరణించేంతవరకూ వారికున్న ఆస్తిపాస్తులు ఏమిటో కూడా సావిత్రికే తెలియదు. ఆ తర్వాత తన ప్రపంచం ఒక్కసారిగా మారిపోయింది. భర్త తదనంతరం చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించాల్సిన పరిస్థితి వచ్చింది. అప్పట్లో వ్యాపార లావాదేవీలకు ఆమె పూర్తిగా కొత్త కావడంతో ఆమె నలుగురు అబ్బాయిలు పృథ్వీరాజ్, సజ్జన్, రతన్, నవీన్‌లే అన్ని విషయాలూ చూసుకునేవారు. ఆమె బోర్డు మీటింగులకూ, వాటిలో తీసుకునే నిర్ణయాలకూ దూరంగా ఉండేవారు. ఊపిరి సలపని వ్యవహారాలకు దూరంగా ఉండటానికి రాజకీయాల నెపంతో మూడు రోజులు హిసార్ నియోజకవర్గంలో గడిపేవారు. ఇప్పుడు ఆమె బోర్డు మీటింగుల్లో ఉత్సాహంగా పాల్గొనడమే కాకుండా సొంతంగా నిర్ణయాలు కూడా తీసుకుంటున్నారు.

తండ్రికి తగ్గ తనయులు

ఓపి జిందాల్ మరణం తర్వాత కంపెనీని నలుగురు కుమారులు స్టీల్, పవర్, మైనింగ్, ఆయిల్ అండ్ గ్యాసుకు సంబంధించిన నాలుగు విభాగాలలో ఒక్కొక్కరూ ఒక్కో విభాగ బాధ్యతలు చేపట్టారు. అయితే, ఎవరికి ఏ సమస్య వచ్చినా నలుగురూ ఒకచోట కూర్చుని జాగ్రత్తగా చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు. ఎంత ఎత్తుకు ఎదిగినా తామంతా అన్నదమ్ములమే నన్న విషయాన్ని ఎప్పుడూ మర్చిపోరు. ఇదంతా తండ్రి నుంచి వచ్చిన క్రమశిక్షణే. నా పిల్లలకు కుటుంబ వార సత్వంగా ఆస్తిపాస్తులే కాదు, నీతి నిజాయతీలూ, కష్టపడేతత్వం, చక్కటి వ్యక్తిత్వం కూడా వచ్చాయి అని మురిసిపోతున్నారు సావిత్రి.

నిరాడంబర జీవితం

సావిత్రి వ్యాపార పగ్గాలు చేపట్టాక సుమారు యాభైమూడు వేల కోట్ల రూపాయల సంపదతో దేశంలోని సంపన్నుల్లో ఏడో స్థానం పొందారు. ప్రపంచ సంపన్నుల్లో యాభై ఆరో స్థానం సాధించడం, ఇంకా దేశంలోనే అత్యంత సంపన్న మహిళగా ఎంపిక కావడమూ విశేషం. అయితే, ఇవేమీ ఆమె వ్యక్తిగత జీవితంలో ఎలాంటి మార్పులూ తీసుకురాలేదు. ఎప్పుడూ నిరాడంబరంగా జీవించడానికే ఇష్టపడుతారు. ఆమె పగ్గాలు చేపట్టిన తర్వాత సంస్థ ఆదాయం మూడు రెట్లు పెరిగింది. బాధ్యతలను సంతృప్తికరంగా నిర్వర్తించడంలోనే నిజమైన ఆనందం దొరుకుతుందంటారు సావిత్రి. ఆ సంస్థ ఉద్యోగులను ఆమె కేవలం ఉద్యోగుల్లా చూడరు, కుటుంబ సభ్యుల్లా చూస్తారు. వారి సమస్యలను శ్రద్ధగా వింటారు. 'కుటుంబం అంటే నువ్వూ, నేనూ, పిల్లలు మాత్రమేకాదు, మన ఉద్యోగులు కూడా' అని ఆయన ఎప్పుడూ చెబుతుండేవారు. ఆ మాటలను నేను ఎప్పటికీ మర్చిపోను' అని చెబుతారు సావిత్రి.

సామాజిక సేవలో..



ఓపీ జిందాల్ మరణానంతరం ఆయన పేరిట ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి సామాజిక సేవకు శ్రీకారం చుట్టారు సావిత్రి. విద్య, ఉద్యోగ, ఆరోగ్య రంగాల్లో ఆ సంస్థ ఎంతోకాలంగా సేవలందిస్తున్నది. 2007లో జిందాల్ పేరిట ఒక కమ్యూనిటీ కాలేజీని స్థాపించారు. దీంట్లో వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ అందిస్తారు. ఒక వ్యక్తి సొంతంగా వ్యాపార సంస్థను ప్రారంభించడానికి కావాల్సిన శిక్షణ అంతా ఇక్కడ లభిస్తుంది. ప్రతిభ కనబరిచినవారికి స్కాలర్‌షిప్‌తో ప్రోత్సహిస్తున్నారు.

ఉన్నత పదవులు.. గౌరవాలు

సావిత్రి జిందాల్ ఆసియాలోనే అత్యంత సంపన్న మహిళలలో ఒకరు. అంతే కాదు, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్‌కు చైర్‌పర్సన్ కూడా. హర్యానా విధాన్ సభ సభ్యురాలిగా, మంత్రిగా కూడా హర్యానా ప్రభుత్వానికి ఎన్నో సేవలు అందించారు. ఆమె చేసిన సేవలకు గాను ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది.

అభిరుచులు

సావిత్రి సామాజిక సేవా కార్యక్రమాల్లో ఇష్టంగా పాల్గొంటారు. కాస్త సమయం దొరికినా చదువుతారు, పిల్లలకు కమ్మగా వండిపెడుతారు. వ్యాపారం చేయాలనుకునే ఉత్సాహవంతులకు ప్రోత్సాహకర పరిస్థితులు కల్పించడంతో పాటు స్వయం ఉపాధికి అవకాశాలూ పెరిగేలా కృషిచేస్తున్నారు. నేటి మహిళా వ్యాపారవేత్తలకు ఆమె చెప్పేది ఒక్కటే- 'కష్టపడి పనిచేయండి. శ్రమజీవికి భగవంతుడి ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయి. మార్కెట్లో గట్టి పోటీ ఎదురైనా, అవరోధాలు కలిగినా బెదిరిపోకండి. వ్యాపార ప్రపంచంలో అవన్నీ సహజం. ధైర్యంగా ముందడుగు వేస్తే ఫలితం ఎప్పుడూ మీకు అనుకూలంగానే ఉంటుంది' అంటున్నారు.

సోలార్ చికెన్



ఇంతవరకు మనం సోలార్ లైట్లు, సోలార్ పంపుసెట్లు, సోలార్ వాహనాల గురించే విన్నాం. ఇపుడు కొత్తగా సోలార్ చికెన్ వస్తున్నది. ఎవరైనా చికెన్‌ను అగ్గి మీద కాలుస్తారు. కానీ థాయ్‌లాండ్‌లోని సిలా సుతారట్ అనే దుకాణాదారుడు మాత్రం 1000 మొబైల్ మిర్రర్లను ఉపయోగించి సూర్యుని నుంచి వచ్చే కాంతిని ఆ అద్దాలపై పడేలా చేసి తద్వారా వచ్చే వేడితో చికెన్‌ను వండుతున్నాడు. ఒకటిన్నర కేజీ చికెనును 10-15 నిమిషాల్లో వండేస్తున్నాడు. ఆ వేడిని తట్టుకునేందుకు ముఖానికి వెల్డింగ్ మాస్కును ధరిస్తాడు. మెల్లగా మెల్లగా ఈ బిజినెస్ పుంజుకుంటున్నది. థాయిలో ఇప్పుడు సోలార్ చికెన్ పాపులర్ ఫుడ్ ఐటెంగా మారుతున్నది.

సిరిముగ్గు

13 చుక్కలు 13 వరుసలు





ఎన్. లలితా కృష్ణా
ఓల్డ్ అల్వాల్
సికింద్రాబాద్

మా చిరునామా:
సిరి ముగ్గు,
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం - 10,
హైదరాబాద్ - 500034.
zindagi@ntdaily.news
zindagi.nt@gmail.com

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 1 జనవరి 2018

S & D

హైదరాబాద్ ఐఐటీకి పదోర్యాంక్

కేంద్ర మానవవనరుల మంత్రిత్వశాఖ విడుదల చేసిన ర్యాంకుల్లో ఐఐటీ హైదరాబాద్ పదోర్యాంక్ దక్కించుకుంది. దేశవ్యాప్తంగా 23 ఐఐటీలు ఉండగా ఐఐటీ హైదరాబాద్‌కు 10వ ర్యాంక్ రావడం విశేషం. ప్రత్యేకించి ఏడాది కాలంగా ఇక్కడ చేపడుతున్న పలు ఆవిష్కరణలు, పరిశోధనలు, ప్రాజెక్టులతో దేశ, విదేశాల్లో ఐఐటీహెచ్‌కు గుర్తింపు వచ్చింది.

- 5జీ, నానోసైన్స్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో ప్రపంచ స్థాయి పరిశోధనలు ఇక్కడ జరుగుతున్నాయి.
- నేరేడు విత్తనాల పొడితో ఫ్లోరైడ్‌ను నిర్దేశిత ప్రమాణాల మేరకు తొలగించే విధానాన్ని ఇక్కడి కెమికల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ చంద్రశేఖరశర్మ కనుగొన్నారు. నల్లగొండ జిల్లా నుంచి సేకరించిన ఫ్లోరైడ్ నీటిపై ప్రయోగాలు చేసి దీన్ని రుజువు చేశారు. అదేవిధంగా నారింజ తొక్కల నుంచి తీసిన నారతో చేసిన చేతిరుమాళ్లు (న్యాప్కిన్) వంటి పలు ఆవిష్కరణలకు వేదికగా ఐఐటీహెచ్ నిలిచింది.
- తెలంగాణ సంస్కృతిపై యానిమేషన్ రూపంలో తక్కువ నిడివితో సినిమాలను రూపొందించి, వీక్షకులకు 360 డిగ్రీల అనుభూతి కలిగేలా చిత్రాలు రూపొందిస్తున్నారు.
- పదేండ్లలో అనేక కొత్త కోర్సులను ప్రారంభించడమే కాకుండా, వినూత్న ఆవిష్కరణలకు, ప్రాజెక్టులకు వేదికగా నిలవడంతో దేశంలో అగ్రగామి దిశగా దూసుకుపోతుంది.



విశ్లేషణ

తెలంగాణ జనాభా అక్షరాస్యత

తెలంగాణ రాష్ట్ర విస్తీర్ణం 1,12,077 చ.కి.మీ
జనాభా 3,50,03,674/ 350.04 లక్షలు
పురుషులు 1,76,11,633/ 176.12 లక్షలు
స్త్రీలు 1,73,92,401/ 173.92 లక్షలు
గ్రామీణ ప్రాంత జనాభా 213.95 లక్షలు
పట్టణ ప్రాంత జనాభా 136.09 లక్షలు



అత్యధిక జనాభాగల జిల్లాలు
- హైదరాబాద్ – 39,43,323 (పురుషులు 20,18,575, స్త్రీలు 19,24,748)
- రంగారెడ్డి – 24,26,243 (పురుషులు 12,43,967, స్త్రీలు 11,82,276)
- మేడ్చల్ మల్కాజిగిరి – 24,60,095 (పురుషులు–12,56,883, స్త్రీలు–12,03, 212)
- నల్లగొండ – 16,18,196 (పురుషులు 8,18,306, స్త్రీలు–8,00,110)
- సంగారెడ్డి – 15,27,628 (పురుషులు–7,77,235, స్త్రీలు–7,50,393)

అతి తక్కువ జనాభాగల జిల్లాలు
- కుమ్రం భీం ఆసిఫాబాద్ – 5,15,812 (పురుషులు 2,58,197, స్త్రీలు 2,57,615)
- రాజన్న సిరిసిల్ల – 5,52,037 (పురుషులు 2,74,109, స్త్రీలు 2,77,928)
- జనగాం – 5,66,376 (పురుషులు 2,83,648, స్త్రీలు 2,82,728)
- వనపర్తి – 5,77,758 (పురుషులు 2,94,833, స్త్రీలు 2,82,925)
- జోగులాంబ గద్వాల్ – 6,09,990 (పురుషులు 3,09,274, స్త్రీలు 3,00,716)

లింగ నిష్పత్తి
- **2011** జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో **1000** మంది పురుషులకుగాను **988** మంది స్త్రీలు ఉన్నారు.

1901 - 947	1941 - 960	1981 - 971
1911 - 957	1951 - 980	1991 - 967
1921 - 963	1961 - 975	2001 - 971
1931 - 958	1971 - 969	2011 - 988

- మొత్తం **31** జిల్లాలకుగాను **21** జిల్లాల్లో లింగ నిష్పత్తి రాష్ట్ర సగటు **(988)** కంటే ఎక్కువగా ఉన్నది. **11** జిల్లాల్లో పురుషుల కంటే స్త్రీలు ఎక్కువగా ఉన్నారు.
- అత్యధిక లింగ నిష్పత్తి ఉన్న జిల్లా నిర్మల్. **1000** మంది పురుషులకుగాను **1046** మంది స్త్రీలు ఉన్నారు.
- **1901** నుంచి **2011** వరకు లింగ నిష్పత్తి పెరుగుతూ తగ్గుతూ వస్తున్నది.

అత్యధిక లింగ నిష్పత్తి
- నిర్మల్ 1046
- నిజామాబాద్ 1044
- జగిత్యాల 1036
- కామారెడ్డి 1033
- మెదక్ 1027
- రాజన్న సిరిసిల్ల 1014
- జయశంకర్ భూపాలపల్లి 1009
- సిద్దిపేట 1008
- భద్రాద్రి కొత్తగూడెం 1008
- ఖమ్మం 1005
- వికారాబాద్ 1001

అతితక్కువ లింగ నిష్పత్తి
- రంగారెడ్డి 950
- హైదరాబాద్ 954
- మేడ్చల్ మల్కాజిగిరి 957
- వనపర్తి 960
- సంగారెడ్డి 963
- రాష్ట్ర జనసాంద్రత 312 చ.కి.మీ.
- పట్టణ ప్రాంతంలో నివసిస్తున్న జనాభా 38.88 శాతం

పట్టణ, గ్రామీణ జనాభా (లక్షల్లో)

దశాబ్దం	గ్రామీణ	పట్టణ
1961- 71	124.97	33.21
1971- 81	150.82	50.99
1981- 91	182.15	78.74
1991-2001	211.34	98.53
2001- 2011	213.95	136.09

2001 నుంచి 2011 మధ్య జనాభా పెరుగుదల 38.12 శాతం (పట్టణ ప్రాంతం)
2001 నుంచి 2011 మధ్య జనాభా పెరుగుదల 2.13 శాతం (గ్రామీణ ప్రాంతం)
మొత్తం కుటుంబాలు: 83,03,612
కుటుంబ పరిమాణం: 4

- గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్న జనాభా 61.12 శాతం

జనాభా పెరుగుదల
- 2001 నుంచి 2011 మధ్య జనాభా పెరుగుదల 13.58 శాతం
- 1991 నుంచి 2001 మధ్య జనాభా పెరుగుదల 18.77 శాతం
- జనాభా వృద్ధిలో రుణ వృద్ధిరేటు నమోదైన దశాబ్దం 1911–21 (–3.79 శాతం)
- అతి ఎక్కువ జనాభా వృద్ధిరేటు నమోదైన దశాబ్దం 1981–1991 (29.37 శాతం)

అక్షరాస్యత రేటు
- ఏడేండ్ల వయస్సు పైబడి చదవ, రాయగలిగి, అర్థం చేసుకునేవారిని అక్షరాస్యులు అంటారు.
- మొత్తం జనాభాలో (0–6 ఏండ్ల మినహా) ఎంత మంది అక్షరాస్యులు ఉన్నారో తెలిపేది అక్షరాస్యత రేటు
- 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర అక్షరాస్యత 66.54 శాతం
- పురుషులు– 75.04 శాతం
- స్త్రీలు – 57.99 శాతం
- గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య అక్షరాస్యత వ్యత్యాసం అత్యధికం.
- పట్టణ ప్రాంతాలు – 81.09 శాతం
- గ్రామీణ ప్రాంతాలు – 57.03 శాతం

అత్యధిక అక్షరాస్యత (శాతం)
- హైదరాబాద్ – 83.25
- మేడ్చల్–మల్కాజిగిరి – 82.48
- వరంగల్ అర్బన్ – 76.17
- రంగారెడ్డి – 71.88
- కరీంనగర్ – 69.16

అతితక్కువ అక్షరాస్యత
- జోగుళాంబ గద్వాల 49.37
- నాగర్‌కర్నూల్ 54.38
- వనపర్తి 55.66
- మెదక్ 56.12
- రాష్ట్ర సగటు అక్షరాస్యత 66.54 కంటే 26 జిల్లాల అక్షరాస్యత తక్కువగా ఉన్నది.

జనాభాలో సామాజిక భాగస్వామ్యం
మొత్తం జనాభాలో ఎస్సీ, ఎస్టీల భాగస్వామ్యం
- ఎస్సీ జనాభా 54,08,800 (పురుషులు 26,93,127, మహిళలు 27,15,673)
- ఎస్సీ జనాభా శాతం 15.45 శాతం
- ఎస్సీ జనాభాలో లింగ నిష్పత్తి 1,008
- ఎస్టీ జనాభా 31,77,940 (పురుషులు 16,07,656, మహిళలు 15,70,284)
- ఎస్టీ జనాభా శాతం 9.08 శాతం
- ఎస్టీ జనాభాలో లింగ నిష్పత్తి 977
- 1961లో 2.81 శాతం ఉన్న ఎస్టీ జనాభా 1981లో 8.19 శాతానికి చేరింది. 2011లో 9.08 శాతానికి చేరుకున్నది. ఎస్టీ జనాభాలో గణనీయమైన పెరుగుదల కనిపిస్తున్నది.

అత్యధికంగా ఎస్సీ జనాభా
- మేడ్చల్ – మల్కాజిగిరి 24.72
- నాగర్ కర్నూల్ 21.32
- జనగామ 21.15

అతితక్కువ ఎస్సీ జనాభా
- హైదరాబాద్ 6.29
- మేడ్చల్– మల్కాజిగిరి 9.43
- భద్రాద్రి కొత్తగూడెం 13.42

అత్యధిక ఎస్టీ జనాభా
- మహబూబాబాద్ 37.80
- భద్రాద్రి కొత్తగూడెం 36.66
- ఆదిలాబాద్ 31.68

అత్యల్ప ఎస్టీ జనాభా
- హైదరాబాద్ 1.24
- కరీంనగర్ 1.27
- జోగుళాంబ గద్వాల 1.54
- మేడ్చల్ మల్కాజిగిరి 2.26

అత్యధిక కుటుంబాలు
- హైదరాబాద్ 8,49,051
- మేడ్చల్–మల్కాజిగిరి 5,98,112
- రంగారెడ్డి 5,59,150
- నల్లగొండ 4,01,728
- ఖమ్మం 3,82,929

అతితక్కువ కుటుంబాలుగల జిల్లాలు
- కుమ్రం భీం ఆసిఫాబాద్ 1,20,420
- వనపర్తి 1,23,544
- జోగుళాంబ గద్వాల 1,32,261
- రాజన్న సిరిసిల్ల 1,38,261
- జనగామ 1,39,238
- రాష్ట్ర పట్టణ జనాభా 1,36,08,665 (పురుషులు 69,06,640, మహిళలు 67,02,025)
- పట్టణ జనాభాలో లింగనిష్పత్తి 970
- 100 శాతం పట్టణీకరణ జరిగిన జిల్లా – హైదరాబాద్

పట్టణ జనాభా అత్యధికం
- మేడ్చల్– మాల్కాజిగిరి 91.47
- వరంగల్ అర్బన్ 68.51
- రంగారెడ్డి 57.60
- రాష్ట్ర గ్రామీణ జనాభా 2,13,95,009 (పురుషులు 1,07,04,993, మహిళలు 1,06,90,016)
- గ్రామీణ జనాభాలో లింగ నిష్పత్తి 999

గ్రామీణ జనాభా ఎక్కువ
- వరంగల్ రూరల్ 93.01
- జయశంకర్ భూపాలపల్లి 92.43
- మెదక్ 92.33
- 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో మొత్తం కార్మికులు లేదా వర్క్‌ఫోర్స్ 163.42 లక్షలు
- ప్రధాన కార్మికులు – 137.20 లక్షలు (ఎస్సీలు 22.42 లక్షలు, ఎస్సీలు 14.58 లక్షలు)
- ఉపాంత కార్మికులు – 26.22 లక్షలు (ఎస్సీలు 4.96 , ఎస్టీలు 2.93 లక్షలు)
- వ్యవసాయదారులు – 31.51 లక్షలు
- వ్యవసాయ కార్మికులు – 59.15 లక్షలు
- కుటీర పరిశ్రమ – 7.77 లక్షలు
- ఇతర కార్మికులు – 64.99 లక్షలు
- పనిచేయని వారు – 186.62 లక్షలు

అత్యధిక వర్క్‌ఫోర్స్
- **హైదరాబాద్** (కార్మికులు 10.96, ఉపాంత కార్మికులు 3.17)
- **రంగారెడ్డి** (కార్మికులు 8.65, ఉ. కా.1.57)
- **మేడ్చల్ మల్కాజిగిరి** (కార్మికులు 8.06, ఉపాంత కార్మికులు 1.58)
- **నల్లగొండ** (కార్మికులు 6.92, ఉపాంత కార్మికులు 1.14)
- **నిజామాబాద్** (కార్మికులు 6.56, ఉపాంత కార్మికులు 1.06)

అతితక్కువ వర్క్‌ఫోర్స్
- **కుమ్రం భీం** (కార్మికులు 1.81, ఉపాంత కార్మికులు 0.72)
- **జనగాం** (కార్మికులు 2.30, ఉ. కా. 0.57)
- **రాజన్న సిరిసిల్ల** (కార్మికులు 2.54, ఉపాంత కార్మికులు 0.45)
- **మంచిర్యాల** (కార్మికులు 2.58, ఉపాంత కార్మికులు 0.87)
- **వనపర్తి** (కార్మికులు 2.63, ఉపాంత కార్మికులు 0.33)

పనిచేయని వారు అత్యధికం
- హైదరాబాద్ 25,30,026
- మేడ్చల్ మల్కాజిగిరి 14,95,363

పనిచేయని వారు తక్కువ
- రాజన్న సిరిసిల్ల 2,53,374
- కుమ్రం భీం ఆసిఫాబాద్ 2,62,811
- జనగామ 2,78,883
- వనపర్తి 2,81,609
- జోగుళాంబ గద్వాల్ 2,81,904
- పిల్లల జనాభా (0–6 ఏండ్లు) 38,99,166
- బాలలు 20,17,935
- బాలికలు 18,81,231
- రాష్ట్ర మొత్తం జనాభాలో పిల్లల జనాభా శాతం 11.14 శాతం

అత్యధిక పిల్లల జనాభా
- హైదరాబాద్ 4,69,126
- రంగారెడ్డి 2,97,841

అతితక్కువ పిల్లల జనాభా
- రాజన్న సిరిసిల్ల 48,571
- జనగామ 55,056

పిల్లల్లో లింగ నిష్పత్తి 932

పిల్లల్లో లింగ నిష్పత్తి (అత్యధికం)
- భద్రాద్రి కొత్తగూడెం 964
- సంగారెడ్డి 955

పిల్లల్లో లింగ నిష్పత్తి (అతితక్కువ)
- వనపర్తి 903
- వరంగల్ రూరల్ 903
- మహబూబాబాద్ 903

... సాయికిరణ్ వేముల

STUDY GUIDE

'హెల్తీ' కెరీర్

హెల్త్‌కేర్ రంగంలో రోజురోజుకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఉస్మానియా యూనివర్సిటీ అడ్వాన్స్‌డ్ హెల్త్‌కేర్‌లో పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా యశోద, కేర్, సన్‌షైన్, ఓమ్ని, మల్లారెడ్డి, మ్యాక్స్‌క్యూర్, ఇండో–యూఎస్ హాస్పిటల్ వంటి ప్రముఖ కార్పొరేట్ దవాఖానాల్లో ప్రవేశాలు, శిక్షణ కాలంలో వృత్తి శిక్షణ, అనంతరం ఉద్యోగాలు లభించేలా వీటిని రూపొందించింది. ఈ సంస్థలు ఓయూ అనుబంధ హోదాతో కోర్సులను నిర్వహిస్తూ, యూనివర్సిటీ సర్టిఫికెట్‌ను అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏ కోర్సు చేస్తే ఎలాంటి అవకాశాలు ఉన్నాయి, ఆయా టెక్నీషియన్లకు మార్కెట్‌లో ఎలాంటి డిమాండ్ ఉంది వంటి విషయాలు నిపుణ పాఠకుల కోసం..

కోర్సులు
- అనస్థీషియా టెక్నాలజీ, కార్డియాక్ టెక్నాలజీ, క్యాథ్‌ల్యాబ్ టెక్నాలజీ, డయాలసిస్ టెక్నాలజీ, ఎమర్జెన్సీ కేర్, ఎమర్జెన్సీ మెడికల్ కేర్, ఇకో కార్డియోగ్రఫి అండ్ సోనోగ్రఫి, హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, మెడికల్ ఇన్ఫర్మాటిక్స్, ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ, ఫిజీషియన్ అసిస్టెంట్, పర్‌ఫ్యూషన్ టెక్నాలజీ, రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ, హెల్త్ ఇన్సూరెన్స్ అండ్ బిల్లింగ్, హెల్త్‌కేర్ టెక్నాలజీ.
- ఈ అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా కోర్సులు చేయాలంటే లైఫ్‌సైన్స్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.
- మొదటి రెండు సెమిస్టర్లలో థియరీ పార్ట్ ఉంటుంది. మూడు, నాలుగు సెమిస్టర్లలో ప్రాక్టికల్స్ ఉంటాయి. ఇవి ఆయా దవాఖానల్లో ఆన్ ఫీల్డ్‌లో చేయాలి.
- కోర్సు సమయంలో వివిధ దవాఖానలు రూ. 2 వేల నుంచి రూ. 4 వేల వరకు స్టయిఫండ్ చెల్లిస్తున్నాయి. ఇది విద్యార్థుల వ్యక్తిగత ప్రదర్శనపై ఆధారపడి ఉంటుంది.

ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ
- ఒక హాస్పిటల్‌కు ఆపరేషన్ థియేటర్ వెన్నెముక లాంటిది. అలాంటి ప్రధానమైన విభాగంలో ఆపరేషన్ థియేటర్ టెక్నాలజిస్టులు సేవలందిస్తారు. ఇన్ఫెక్షన్ లేని ఆపరేషన్ థియేటర్‌లో వివిధ రకాల ఆపరేషన్లు జరుగుతాయి. ఏ ఆపరేషన్‌కు ఎలాంటి పరికరాలు ఉంటాయి, వేటిని ఉపయోగించాలి, అవి శుభ్రంగా ఉండేలా చూడటం, ఆపరేషన్‌కు ముందు, తర్వాత వాటిని స్టెరిలైజ్ చేయడం, వాటిలో ఏవైనా లోపాలుంటే సంబంధిత డిపార్ట్‌మెంట్లకు రిపోర్ట్ చేయడం, ఆపరేషన్ సమయంలో డాక్టర్లకు సహకరించడం వంటి విషయాలను శిక్షణా కాలంలో నేర్చుకోవచ్చు.

ఇకోకార్డియోగ్రఫి అండ్ అల్ట్రా సోనోగ్రఫి
- అల్ట్రాసౌండ్ టెక్నీషియన్లు ఎంపికచేసుకునే కోర్సుల్లో ఇది ఒకటి. మానవ కణజాలాల్లోకి తరంగాలను పంపించి కంప్యూటర్ డాటా ద్వారా ఆ కణజాలం చిత్రాన్ని రూపొందిస్తారు. దాని ఆధారంగా ఆ వ్యక్తులకు సంబంధించిన ఆరోగ్య వివరాలను రిపోర్టుల్లో నిక్షిప్తం చేస్తారు. డాక్టర్లు వారికి వైద్య చికిత్స అందిస్తారు.
- ఈ కోర్సులో 2డీ ఇకో, అల్ట్రాసౌండ్, ఈసీజీ గురించి నేర్చుకోవచ్చు.

ఫిజీషియన్ అసిస్టెంట్
- డాక్టర్‌కు, పేషెంట్లకు మధ్య సంధానకర్తగా ఫిజీషియన్ అసిస్టెంట్ వ్యవహరిస్తాడు. కార్పొరేట్ దవాఖానాల్లో మెడికల్, నాన్ మెడికల్ అనే అంశాలు ఉంటాయి. వీటిమధ్య ఉండే గ్యాప్‌ను పూడ్చటానికి ప్రత్యేకంగా రూపొందించిందే ఫిజీషియన్ అసిస్టెంట్ కోర్సు.
- హాస్పిటళ్లకు వచ్చేవారికి ఏ ట్రీట్‌మెంట్‌కు ఎంత ఖర్చవుతుందనే విషయాలను డ్యూటీ డాక్టర్లు, అక్కడ ఉండే మెడికల్ ఆఫీసర్లు సవివరంగా చెప్పలేరు. అలాగే ఏ వ్యాధికి ఎలాంటి వైద్యం అందించాలి వంటి విషయాలను నాన్‌మెడికల్ పీపుల్ వివరించలేరు. ఈ విషయాలను ఫిజీషియన్ అసిస్టెంట్లు చూసుకుంటారు.

ఎమర్జెన్సీ మెడికల్ కేర్
- ఇది చాలా ముఖ్యమైన కోర్సు. వీరు ఎమర్జెన్సీ డాక్టర్లకు అసిస్టెంట్లుగా పనిచేస్తారు. ఎమర్జెన్సీ డిపార్ట్‌మెంట్‌కు కేసులు వచ్చినప్పుడు ఎలా స్పందించాలి, వైద్యులు ఏ మందులు రాస్తున్నారు, ఎంత డోస్‌లో మందులు ఇస్తున్నారు, వాటితో పేషెంట్ ఎలా రియాక్టవుతున్నాడు వంటి వాటిని నిత్యం పర్యవేక్షిస్తారు.



డిగ్రీ పూర్తికాగానే హెల్త్‌కేర్ కోర్సులు చేయడం వల్ల ఉద్యోగావకాలు అధికంగా ఉంటాయి. హెల్త్‌కేర్ ఇండస్ట్రీ ఎప్పటికీ ఆగిపోయేది కాదు. జనాభా నిత్యం పెరుగుతూనే ఉంటుంది. వారికి వైద్యసేవలు అందించడానికి దవాఖానాలు కూడా వస్తూనే ఉంటాయి. దీంతో మెడికల్ టెక్నీషియన్లు పెద్దసంఖ్యలో అవసరమవుతూ ఉంటారు. అందుకే హెల్త్‌కేర్ కోర్సులకు డిమాండ్ ఎప్పుడూ ఉంటుంది. ఇలాంటి వారికోసం ఉస్మానియా విశ్వవిద్యాలయం చాలా తక్కువ ఫీజుతో, కార్పొరేట్ కాలేజీల సహకారంతో అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా హెల్త్‌కేర్ కోర్సులను అందిస్తున్నది.

– డా. ఆర్. చంద్రశేఖర్
డీన్, యశోద స్కూల్ ఆఫ్ నర్సింగ్ అండ్ పారామెడికల్స్, సికింద్రాబాద్

అనస్థీషియా టెక్నాలజీ
- అనస్థీషియాకు సంబంధించిన పరిజ్ఞానం వీరికి ఉంటుంది. ఒక పేషెంట్‌కు ఎలాంటి అనస్థీషియా ఉంది, జనరల్ అనస్థీషియాకు కావాల్సిన ఎక్విప్‌మెంట్ ఏది, అనస్థీషియనిస్ట్‌కు ఎలా సహాయం చేయాలి, పేషెంట్‌కు గతంలో ఏవైనా సర్జరీలు అయ్యాయా, ఎలాంటి అనస్థీషియా ఇచ్చారు వంటి వివరాలను సేకరించాలి. అనస్థీషియా స్పెషలిస్ట్ డాక్టర్ వచ్చేలోపు పేషెంట్ ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరిస్తారు. దీనిద్వారా ఆ వ్యక్తికి ఎంత డోస్ ఇవ్వాలి అని డాక్టర్లు నిర్ణయిస్తారు.

రెస్పిరేటరీ థెరపీ టెక్నాలజీ
- ఊపిరితిత్తులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధుల నిర్ధారణ, వాటికి సంబంధించిన టెస్టులు చేయడంలో సంబంధిత వైద్యులకు సహాయం చేస్తారు.
- ఆక్సిజన్‌ను పేషెంట్‌కు ఎలా ఇవ్వాలి, వెంటిలేటర్ ఎలా పెట్టాలి, పేషెంట్ సిక్ అయినప్పుడు, శ్వాస అందనప్పుడు ఏంచేయాలి, కార్డియోథోరసిక్ సర్జరీ పూర్తయిన తర్వాత ఫిజియోథెరపీ చేయడం, లంగ్ ఫంక్షన్ సరిగా ఉందా లేదా పరీక్షించడం, రెస్పిరేటరీ థెరపీ వంటివి చేయాల్సి ఉంటుంది.

డయాలసిస్ టెక్నాలజీ
- నెఫ్రాలజీ డిపార్ట్‌మెంట్‌లో డయాలసిస్ చాలా ముఖ్యమైనది. కిడ్నీలు సరిగా పనిచేయనప్పుడు లేదా పాడైనప్పుడు డయాలసిస్ తప్పనిసరి. రోగి పరిస్థితి దృష్ట్యా డయాలసిస్ ఎంతసేపు చేయాలి, ఎన్ని గంటలు చేయాలి, విడతలవారీగా అయితే ఎలా, ఎక్కువ సమయం అయితే ఎలా, డయాలసిస్ మిషన్లను ఎలా ఉపయోగించాలి అనే విషయాల గురించి నేర్చుకుంటారు. పేషెంట్‌కు డయాలసిస్ మిషన్‌ను అమర్చినప్పటి నుంచి పూర్తయ్యేవరకు దాన్ని పర్యవేక్షిస్తాడు.

మెడికల్ ఇమేజింగ్ టెక్నాలజీ
- ఇది ఎక్స్‌రే టెక్నాలజీకి సంబంధించింది.
- ఎక్స్‌రే తీయడం ఎలా, డాక్టర్లు ఏ భాగానికి ఎక్స్‌రే రాశారు, వాటిని ఎలా తీయాలి, ఏ పొజిషన్‌లో అయితే సరైన ఇమేజ్ వస్తుంది వంటి విషయాలను నేర్చుకుంటారు.
- ఇందులో ఎక్స్‌రే, ఎంఆర్‌ఐ, సీటీ స్కానింగ్, ఎండోస్కోపి, న్యూక్లియర్ మెడిసిన్ అనే విభాగాలు ఉంటాయి.
- ప్రతి దవాఖానకు వీరి అవసరం ఉంటుంది. కాబట్టి ఈ కోర్సు చేసిన వారికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

క్యాథ్‌ల్యాబ్ టెక్నాలజీ
- గుండెపోటు వచ్చినవారికి యాంజియోగ్రామ్ అవసరమవుతుంది, కొంతమంది చిన్నపిల్లలకు గుండెలో రంధ్రాలు సరిగా పూడుకొనిపోవు ఇలాంటి వాటికి సంబంధించిన డయాగ్నసిస్ అంతా క్యాథ్‌ల్యాబ్‌లో చేస్తారు.
- రక్త నాళాలు పూడిపోయిన (బ్లాక్ అవుతాయి)వారికి ఎక్కడ సమస్య ఉందో గుర్తించి, ఏ రకమైన స్టంట్ వేయాలి, యాంజియోగ్రామ్ ఎలా చేయాలి వంటివి తెలుసుకుంటారు.

హెల్త్‌కేర్ ఇన్సూరెన్స్ అండ్ బిల్లింగ్
- మారుతున్న ఆహారపు అలవాట్లు, వాతావరణంలో మార్పులతో ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో సంపాదనలో ఎక్కువగా వైద్యానికే వెచ్చిస్తున్నాం. వీటిని కొంతైనా తగ్గించుకోవడానికి వివిధ ఇన్సూరెన్స్ సంస్థలు, కంపెనీ యాజమాన్యాలు అందించే ఆరోగ్య బీమా సదుపాయాలను ఎక్కువమంది ఉపయోగించుకుంటున్నారు. దీంతో హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నది. ఈ ఇన్సూరెన్సులకు సంబంధించిన బిల్లులను తయారు చేయడం, వాటిని క్లెయిమ్ చేయడం వంటి పనులు నిత్యం తీరికలేకుండా గడిపే డాక్టర్లకు భారంగా మారాయి. అందువల్ల ఈ విధులకు సంబంధించిన పరిజ్ఞానాన్ని అందించే ఉద్దేశంతో పీజీ డిప్లొమా ఇన్ హెల్త్‌కేర్ ఇన్సూరెన్స్ అండ్ బిల్లింగ్ కోర్సును తీసుకువచ్చారు.

... గణేష్ సుంకరి

సుడోకు

డైలీ సుడోకు 81 సమాధానం

8	7	4	9	5	1	6	2	3
1	9	6	2	3	4	8	5	7
2	3	5	7	8	6	1	9	4
3	4	8	1	9	5	7	6	2
6	2	9	3	7	8	5	4	1
5	1	7	4	6	2	3	8	9
9	6	3	5	2	7	4	1	8
4	8	2	6	1	3	9	7	5
7	5	1	8	4	9	2	3	6

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

డైలీ సుడోకు -82

			3		9		7	
				2			6	1
7		1				3		
4			2					
	8	9	4		5	2	3	
					1			8
		6				4		5
8	9			7				
	1		6		2			

సమాధానం రేపటి సంచికలో

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
సోమవారం 1 జనవరి 2018

S & D

ఐఐటీ అడ్వాన్స్‌డ్ 'హెల్ప్ వీడియో'

ప్రతిష్ఠాత్మకమైన ఐఐటీ అడ్వాన్స్‌డ్ 2018 ఎగ్జామ్‌కు సంబంధించిన వీడియోను ఐఐటీ కాన్పూర్ విడుదల చేసింది. అడ్వాన్స్‌డ్ ఎగ్జామ్‌ను తొలిసారిగా ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఎటువంటి ఆందోళనలు, ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశంతో ఐఐటీ కాన్పూర్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ వీడియో లింక్‌ను, హెల్ప్ వీడియో ఫర్ మాక్‌టెస్ట్‌ను విడుదల చేసింది.

- యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచిన ఈ వీడియోలు ఇంగ్లిష్/హిందీ భాషల్లో ఉన్నాయి.
- ఆన్‌లైన్ టెస్ట్ విధానాన్ని పూర్తిగా తెలుసుకొనేలా ఈ వీడియోలను రూపొందించారు. యూజర్ ఫ్రెండ్లీ విధానంలో వీటిని రూపొందించారు.
- వీటితో పరీక్ష హాల్‌లో విద్యార్థికి సమయం ఆదా అవుతుంది. పరీక్షలో మానిటర్‌పై ఏ విధానంలో ఆదేశాలు ఉంటాయి. ఏ విధంగా లాగిన్ కావాలి? పాస్‌వర్డ్ తదితర అంశాలపై అవగాహన కల్పించడానికి ఈ వీడియో ఉపయోగపడుతుంది.
- ప్రశ్నలకు సంబంధించిన వివరాలు అంటే.. ప్రశ్నల పక్కన తెలుపు రంగులో డబ్బా (white square) ఉన్నవి కన్పించవు. రెడ్ బటన్ ఉంటే జవాబులు గుర్తించనివని, ఆకుపచ్చ డబ్బా ఉంటే జవాబులు గుర్తించిన ప్రశ్నలుగా, ఊదారంగు బాక్స్ ఉంటే అభ్యర్థులు కొంత సమయం తర్వాత జవాబు గుర్తించేవిగా విభజించారు.
- పరీక్ష ప్రారంభమైనప్పటి నుంచి కౌంట్‌డౌన్ టైమర్ (క్లాక్) కన్పించడం జరుగుతుంది.
- వీటితోపాటు మాక్‌టెస్ట్ లింక్‌లో గత అడ్వాన్స్‌డ్ పేపర్లు లభిస్తాయి.
- ఈ వీడియోలింక్‌ల ద్వారా జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ మధ్య ఉన్న స్వల్ప తేడాలను తెలుసుకోవచ్చు. జేఈఈ అడ్వాన్స్‌డ్ ఎగ్జామ్‌లో కొన్ని సబ్జెక్టివ్ ప్రశ్నలు ఇవ్వనున్నారు.
- https://www.jeeadv.ac.in



సీడీపీవో గ్రాండ్ మోడల్ పేపర్



1. సమాజ ఆవిర్భావానికి సంబంధించిన కింది అంశాలను జతపర్చండి?
ఎ. ఉమ్మడి ఒప్పందం వల్ల సమాజం ఏర్పడింది — 1. హెర్బర్ట్ స్పెన్సర్
బి. సమాజం పరిణామక్రమంలో ఏర్పడింది — 2. రూసో
సి. సామూహిక మానసిక జీవనమే సమాజం ఏర్పడటానికి కారణం — 3. మెక్‌డొగల్
డి. సమాజం బలప్రయోగం వల్ల ఏర్పడింది — 4. బెర్న్‌హర్ట్
1) ఎ-2, బి-1, సి-3, డి-4
2) ఎ-4, బి-3, సి-1, డి-2
3) ఎ-3, బి-2, సి-4, డి-1
4) ఎ-1, బి-4, సి-2, డి-3

2. కిందివాటిని జతపర్చండి.
ఎ. వెబ్ ఆఫ్ సోషల్ రిలేషన్స్ — 1. ఎమైలీ డర్ఖైమ్
బి. మేము, మనం — 2. గిడ్డింగ్స్
బి. చేతనత్వం — 3. కూలే
డి. యాంత్రిక సాధర్మత — 4. మెకైవర్
1) ఎ-2, బి-3, సి-4, డి-1
2) ఎ-3, బి-1, సి-2, డి-4
3) ఎ-4, బి-3, సి-2, డి-1
4) ఎ-1, బి-2, సి-3, డి-4

3. జెమిన్ షాఫ్ట్ అంటే?
1) సముదాయం 2) సమాజం
3) గిరిజన సమాజం 4) పారిశ్రామిక సమాజం

4. సముదాయం అనే భావనకు పితామహుడు అని ఎవరిని పేర్కొంటారు?
1) అరిస్టాటిల్ 2) టోనిస్
3) మెకైవర్ 4) ముర్డాక్

5. కిందివాటిలో సముదాయం అనే భావనకు సంబంధించి సరికాని దానిని గుర్తించండి?
ఎ. గ్రామీణ సముదాయం కంటే గిరిజన సముదాయంలో 'we Feeling' అధికంగా ఉంటుంది
బి. సామాజిక గతిశీలత గిరిజన సముదాయంలో అధికంగా ఉంటుంది
సి. గ్రామీణ, గిరిజన సముదాయ రూపాల్లో అనియత సామాజిక నియంత్రణ కీలకపాత్ర వహిస్తుంది
డి. నగర సముదాయంలో మనుషుల మధ్య ప్రాథమిక, ద్వితీయ సంబంధాలు కనిపిస్తాయి
1) ఎ, సి, డి 2) ఎ, డి 3) ఎ, సి 4) బి, డి

6. కిందివాటిలో విలీనీకరణకు ఆటంకంగా ఉండే దానిని గుర్తించండి?
ఎ. సహనం బి. పృథక్కరణ
సి. నిరూపించని అభిప్రాయాలు డి. సారూప్యత
1) ఎ, బి 2) బి, సి 3) ఎ, డి 4) ఎ, డి

7. సర్దుబాటు అనే భావనను ప్రాచుర్యంలోకి తీసుకు వచ్చింది?
1) బాల్‌విక్ 2) సిమ్మెల్
3) రాబర్ట్‌సన్ 4) స్పెన్సర్

8. సామాజిక నియంత్రణ అనే పదం మొదటిసారిగా ఉపయోగించినవారు?
1) ఆగ్‌బర్న్ 2) ఈరాస్ 3) సమ్నర్ 4) పావెల్

9. కుడిచేతితో భోజనం చేయాలి అనేది?
1) సంప్రదాయం 2) అలవాటు
3) ఆచారం 4) జానపద రీతి

10. కాబోయే పెండ్లికూతురు వంటలు నేర్చుకోవడం అనేది?
1) ముందస్తు లేదా పూర్వాధనా సామాజీకరణం
2) లింగభేద సామాజీకరణ
3) ప్రాథమిక సామాజీకరణ
4) వివాహ సామాజీకరణ

11. కిందివాటిని సరిగ్గా జతపర్చండి.
ఎ. Looking glass self theory — 1. Ch. Cooley
బి. Theory of self — 2. G.H. Mead
సి. Psyco-social development theory — 3. Erickson
డి. Collective Representation Theory — 4. E.Durkheim
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-2, బి-1, సి-3, డి-4
3) ఎ-3, బి-4, సి-2, డి-1
4) ఎ-4, బి-3, సి-1, డి-2

12. సామాజిక స్తరీకరణకు సంబంధించి Tumin తెలుపని లక్షణం ఏది?
1) సాంఘికమైంది 2) పురాతనమైంది
3) పర్యావసానమైంది 4) మార్పునకు లోనుకాదు

13. కిందివాటిలో సామాజిక స్తరీకరణ రూపం కానిదేది?
1) వర్ణం 2) కులం 3) అంతస్తు 4) విద్య

14. కులానికి సంబంధించి కిందివాటిలో సరికాని వ్యాఖ్యను గుర్తించండి.
ఎ. కులం ఆపాదించిన అంతస్తుకు కారణం
బి. కులం సాధించిన అంతస్తుకు కారణం
సి. కులం అనేది క్రమశ్రేణి విభజన
డి. కులం అనేది సమశ్రేణి విభజన
1) ఎ, సి 2) బి, డి 3) ఎ, బి, సి 4) ఎ, డి

15. గిరిజన సంక్షేమానికి సంబంధించి కింది వాటిని జతపర్చండి.
ఎ. గిరిజన తెగల నిర్వచనం — 1. 366 ఆర్టికల్
బి. రాష్ట్రపతి గిరిజనులను గుర్తించడం — 2. 342 ఆర్టికల్
సి. గిరిజన సలహా మండలి — 3. ఆర్టికల్ 244 (1)
డి. ప్రత్యేక స్వయంపాలన ప్రాంతం — 4. ఆర్టికల్ 244 (2)
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-2, బి-1, సి-4, డి-3
3) ఎ-3, బి-1, సి-4, డి-2
4) ఎ-4, బి-3, సి-2, డి-1

16. గ్రామపంచాయతీ వ్యవస్థలో ఎస్సీ, ఎస్టీ, మహిళలకు అధ్యక్ష పదవుల్లో రిజర్వేషన్లు కల్పిస్తున్న రాజ్యాంగ అధికరణ?
1) 243 డి(1) 2) 243 డి(2)
3) 243 డి(3) 4) 243 డి(4)

17. హిందూ మతంలోని అన్ని కులాల వారికి సాంస్కృతిక సమానత్వం కలిగించేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ నిబంధన?
1) 25 (బి) 2) 25 (ఎ)
3) 26 (ఎ) 4) 26 (బి)

18. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించి కిందివాటిని జతపర్చండి.
ఎ. రాజకీయ సాధికారత — 1. 330 అధికరణ
బి. సామాజిక వైకల్యాలను రూపుమాపడం — 2. 338 అధికరణ
సి. వివక్షల నిషేధం — 3. 17 అధికరణ
డి. హక్కులు సరిగా అమలయ్యేలా చూడటం — 4. 15 అధికరణ
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-1, బి-3, సి-4, డి-2
3) ఎ-3, బి-1, సి-4, డి-2
4) ఎ-2, బి-4, సి-1, డి-3

19. కిందివాటిని జతపర్చండి.
ఎ) స్తుతి నారాయణ కాకర్ — 1) ఎన్‌సీపీసీఆర్
బి) రామ్‌శంకర్ కతారియా — 2) ఎన్ఎస్‌సీ
సి) నందకుమార్‌సాయి — 3) ఎన్‌సీఎస్‌టీ
డి) ప్రేమ కరియప్ప — 4) సీఎస్‌డబ్ల్యూ
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-3, బి-2, సి-1, డి-4
4) ఎ-3, బి-1, సి-3, డి-2

20. 93వ రాజ్యాంగ సవరణ చట్టం దేనికి సంబంధించింది?
1) రిజర్వేషన్ ఇన్ సెంట్రల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్
2) రిజర్వేషన్ ఇన్ సెంట్రల్ ప్రొఫెషనల్ ఎడ్యుకేషన్
3) రిజర్వేషన్ ఇన్ టెక్నికల్ ఎడ్యుకేషన్ 4) పైవన్నీ

21. కిందివాటిలో రామ్‌ధన్ కమిటీ దేనికి సంబంధించింది?
1) రిజర్వేషన్స్ ఫర్ ఓబీసీ 2) క్రీమీలేయర్ వ్యవస్థ
3) ఓబీసీల ఆర్థిక వెనుకబాటు 4) 1, 2

22. ఏడు రకాల గ్రామాలను తెలిపినవారు?
1) చిదంబర్ 2) ఏఆర్ దేశాయ్
3) ఎంఎన్ శ్రీనివాస్ 4) యోగేంద్రశర్మ

23. కిందివాటిని సరిగా జతపర్చండి.
ఎ. కామిన్ — 1. హెన్రీమెయిన్
బి. ఐదు రకాల వ్యవసాయదారులు — 2. కుమరప్ప
సి. మూడు రకాల భూ సంస్కరణలు — 3. ధనాగారే
డి. గ్రామాలు లిటిల్ రిపబ్లిక్స్ — 4. జజ్‌మాన్
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-2, బి-4, సి-1, డి-3
3) ఎ-4, బి-3, సి-2, డి-1
4) ఎ-3, బి-2, సి-4, డి-1

24. సాంస్కృతిక ప్రక్రియలకు సంబంధించి కిందివాటిని సరిగా జతపర్చండి.
ఎ. డ్రగ్స్ సంస్కృతి హైదరాబాద్‌లో విస్తరించడం — 1. పర సంస్కృతీకరణ
బి. హైదరాబాద్‌లో రకరకాల మతాలవారు సోదరభావంతో కలిసి ఉండటం — 2. సాంస్కృతిక సర్దుబాటు
సి. హైదరాబాద్‌లో కొన్ని ప్రాంతాల్లో ఏదో ఒక మతం ఆధిపత్యం చెలాయించడం — 3. పాశ్చాత్య సంస్కృతీకరణ
డి. ఒక్క హైదరాబాద్‌లో భిన్న జీవన విధానాలు ఏకకాలంలో గోచరించడం — 4. సాంస్కృతిక బాహుల్యత
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-3, బి-4, సి-1, డి-2
4) ఎ-4, బి-1, సి-1, డి-2

25. మానవ జాతి చరిత్రలో మంచిని నిల్వచేసి పంచేవే సామాజిక సంస్థలు అని తెలిపింది?
1) డర్ఖైమ్ 2) మెకైవర్
3) స్పెన్సర్ 4) గిడ్డింగ్స్

26. కిందివాటిలో కుటుంబంలో ఏర్పడిన ప్రకార్యాత్మక మార్పును గుర్తించండి?
1) ఉమ్మడి కుటుంబం కేంద్రక కుటుంబంగా మారుతుండటం
2) కుటుంబం పట్ల కుటుంబ సభ్యులు నిర్వర్తించాల్సిన బాధ్యతల్లో మార్పులు 3) 1, 2
4) 1, 2తోపాటు కుటుంబం నివాస స్థలాలూ మారడం

27. వివాహానికి సంబంధించి కిందివాటిని జపతర్చండి.
ఎ. అంతర్వివాహం — 1. జీవిత భాగస్వామి ఎంపిక
బి. ఓలి — 2. వివాహ రూపం
సి. బహు వివాహం — 3. వివాహ చెల్లింపు
డి. ప్రయోగం — 4. వివాహ నియమం
1) ఎ-4, బి-1, సి-3, డి-2
2) ఎ-1, బి-4, సి-2, డి-3
3) ఎ-3, బి-2, సి-4, డి-1
4) ఎ-4, బి-3, సి-2, డి-1

28. ప్రస్తుత ఆధునికయుగంలో భారతసమాజంలో గోచరించే నవీన కుటుంబ రూపమేది?
1) నియో లోకల్ కుటుంబాలు
2) బై లోకల్ కుటుంబాలు
3) అవాంకు లోకల్ కుటుంబాలు
4) అన్ని కుటుంబాలు

29. ఖాళీగూడు లక్షణం కుటుంబ జీవనం ఏ దశలో కనిపిస్తుంది?
1) Aging family members stage
2) Middle aged parents state
3) Family launching stage
4) Family with teenages

30. పిల్లలను అనుక్షణం గమనిస్తూ ఉండే పెంపకాన్ని ఏమని పిలుస్తారు?
1) డెమోక్రటిక్ పేరెంటింగ్ 2) స్ట్రిక్ట్ పేరెంటింగ్
3) హెలికాప్టర్ పేరెంటింగ్ 4) పర్మిసివ్ పేరెంటింగ్

31. హిందూ వివాహం అత్యుత్తమ లక్ష్యం ఏది?
1) కామం 2) మోక్షం 3) ధర్మం 4) అర్థం

32. బహుభార్యత్వం నేరం అని తెలిపే భారతీయ శిక్షా స్మృతి సెక్షన్‌ను గుర్తించండి?
1) 494 2) 495 3) 498-ఎ 4) 1, 2

33. వివాహ సంబంధిత సమస్యలు ఉన్న దంపతులకు సరిపడే మంత్రణ విధానం?
1) అనిర్దేశక మంత్రణం 2) నిర్దేశక మంత్రణం
3) దార్శనిక మంత్రణం
4) సందర్భాన్ని బట్టి మారుతూ ఉంటుంది

34. అమ్మమ్మ అనేది?
1) వర్గీకృతపదం 2) ప్రాథమిక పదం
3) ద్వితీయ పదం 4) వివరణాత్మక పదం

35. కిందివాటిలో మతం వికార్యాన్ని గుర్తించండి?
1) సాంఘిక నియంత్రణ 2) మానసిక ప్రశాంతత
3) కమ్యూనిజం 4) సామ్యవాదం

36. కిందివాటిలో ఆర్థిక సంస్థకు సంబంధించి సరైన వ్యాఖ్యను గుర్తించండి?
ఎ. ఆస్తిహక్కులు అనేవి సంపూర్ణ హక్కులు
బి. ఆస్తిహక్కులు అనేవి సంపూర్ణ హక్కులు కావు
సి. ఆస్తి, యాజమాన్యం వేర్వేరు అంశాలు
డి. ఆస్తి, యాజమాన్యం అనేవి ఒకే అర్థాన్ని కలిగి ఉంటాయి
1) ఎ, డి 2) ఎ, సి 3) ఎ, డి 4) బి, సి

37. సమాజంలోని అన్ని రకాల సామాజిక సంస్థలపై ఆధిపత్యం చెలాయించే సంస్థ ఏది?
1) మతసంస్థ 2) ఆర్థికసంస్థ
3) కులసంస్థ 4) రాజకీయసంస్థ

38. భారతదేశంలో పట్టణ, గ్రామీణ లింగ నిష్పత్తి విషయంలో ఎంత తేడా ఉంటుంది?
1) 20 2) 18 3) 30 4) 28

39. కింది వాటిని జతపర్చండి.
ఎ. ఐవైడబ్ల్యూఈ — 1. 2001
బి. ఎస్‌వైజీసీ — 2. 1990
సి. ఐవైడబ్ల్యూ — 3. 1975
డి. ఎన్‌సీడబ్ల్యూ — 4. 1992
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-3, బి-1, సి-4, డి-2
3) ఎ-4, బి-3, సి-2, డి-1
4) ఎ-2, బి-1, సి-3, డి-4

40. కిందివాటిని జతపర్చండి.
ఎ. బాల్యం, యవ్వనం దోపిడీకి గురికాకూడదు — 1. 39(ఎఫ్)
బి. ప్రజారోగ్యం — 2. 47
సి. సమాన ఉపాధి అవకాశాలు — 3. 39(ఎ)
డి. సమాన వేతనాలు — 4. 39(డి)
1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-3, బి-1, సి-2, డి-4 4) ఎ-2, బి-4, సి-1, డి-3

41. శిశువు తొలుత ముద్దు పలుకులు, చిన్నచిన్న పదాలు, చిన్నచిన్న వాక్యాలు ఇలా క్రమక్రమంగా వృద్ధి చెందుతాడని తెలిపే వికాస నియమం?
1) సమీప దూరస్థ వికాసం
2) వికాసం సంచిత ప్రక్రియ
3) శిరోపాదాభిముఖ వికాసం
4) దూరస్థ సమీప వికాసం

42. ఏ దశలో ఉద్వేగ వికాసం తీవ్రస్థాయిలో ఉంటుంది?
1) ఉత్తర పాఠశాల దశ 2) వయోజన దశ
3) కౌమార దశ 4) యవ్వనారంభదశ

43. కింది వాటిని జతపర్చండి.
ఎ. లయ వికాస నియమం — 1. వివిధ దశల్లో వివిధ రకాలుగా పెరుగుదల ఉంటుంది
బి. వివిధ అంగాలు వివిధ వేగంతో వృద్ధి చెందుతాయి. — 2. వికాస వేగ నియమం
సి. ముందుగా శిరస్సు తర్వాత ఇతర భాగాలు వృద్ధి చెందుతాయి — 3. దిశా నియమం
డి. క్రమక్రమంగా పెరుగుదల జరుగుతుంది — 4. అవిచ్ఛిన్నతా నియమం
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-3, బి-1, సి-4, డి-2
3) ఎ-4, బి-3, సి-2, డి-1
4) ఎ-2, బి-4, సి-1, డి-3

44. సామాజీకరణ ఫలితంగా వృద్ధిచెందేది?
1) ఇడ్ 2) ఇగో 3) కన్‌ఫ్యూజన్స్ 4) అన్నీ

45. ఎడిపస్ కాంప్లెక్స్, ఎలక్ట్రా కాంప్లెక్స్ ఏ దశలో కనిపిస్తాయి?
1) మౌఖిక దశ 2) ఆసన దశ
3) శిష్ట దశ 4) గుప్త దశ

46. కిందివాటిని జతపర్చండి.
ఎ. మూడు దశలు — 1. కోల్‌బర్గ్ నైతిక వికాస దశలు
బి. రెండు దశలు — 2. పియాజే నైతిక వికాస దశలు
సి. ఐదు దశలు — 3. మనో లైంగిక వికాస దశలు
డి. ఎనిమిది దశలు — 4. మనో సాంఘిక వికాస దశలు
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-2, బి-3, సి-4, డి-1
3) ఎ-3, బి-1, సి-4, డి-2
4) ఎ-4, బి-3, సి-2, డి-1

47. ముద్దు పలుకుల దశ వయస్సును గుర్తించండి?
1) $1\frac{1}{2}$ సంవత్సరాలు 2) 6-12 నెలలు
3) 4-12 నెలలు 4) 8-12 నెలలు

48. అన్వేషించే వయస్సు అని ఏ దశను పిలుస్తారు?
1) పూర్వ బాల్యదశ 2) ఉత్తర బాల్యదశ
3) కౌమారదశ 4) యవ్వనారంభదశ

49. ముఠా వయస్సు అని ఏ దశను సంబోధిస్తారు?
1) పూర్వ బాల్యదశ 2) ఉత్తర బాల్యదశ
3) కౌమార దశ 4) యవ్వనారంభదశ

50. Puberty Precox అంటే?
1) యవ్వనారంభం ఆలస్యం కావడం
2) యవ్వనారంభం త్వరగా రావడం
3) ఉద్వేగాలు పెరగడం 4) కోపం బాగా రావడం

51. కింది వాటిలో శిశువును అధికంగా ఉద్దీపనకు గురిచేసేది?
1) రంగుల బొమ్మలు 2) కదిలే బొమ్మలు
3) పెద్దబొమ్మలు
4) కదులుతూ శబ్దాలు చేసే బొమ్మలు

52. వేర్వేరు వికాసదశల్లో ఉన్న శిశువులను ఒకేసారి అధ్యయనం చేసేందుకు ఉపయుక్తమయ్యే అధ్యయన పద్ధతిని గుర్తించండి?
1) లాంగిట్యూడ్ అప్రోచ్ 2) క్రాస్ సెక్షన్ అప్రోచ్
3) అబ్జర్వేషన్ 4) పర్సనాలిటీ టెస్ట్

53. ICD-10 వారి ప్రకారం IQ-20-35 మధ్య ఉన్న శిశువును ఏమని పిలుస్తారు?
1) Mild 2) Moderate
3) Severe 4) Profound

54. పూర్తిస్థాయిలో రాయలేకపోయే అశక్తతను ఏమని పిలుస్తారు?
1) ఆటిజం 2) డిస్‌గ్రాఫియా
3) అగ్రాఫియా 4) అలెక్సియా

55. చెడు పదాలను పలికే స్వభావాన్ని ఏమంటారు?
1) Caprolalia 2) Capropraxia
3) Tacs 4) Pica

56. శిశువుల్లో కనిపించే అలవాట్లకు సంబంధించి కింది అంశాలను జతపర్చండి.
ఎ. గోర్లు కొరకడం — 1. Onychophagy
బి. ముక్కు కెలకడం — 2. Mucophagy
సి. సుద్దముక్కలు తినడం — 3. Pica
డి. తరుచూ తినడం — 4. Bing Eating
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-4, బి-2, సి-1, డి-3
3) ఎ-3, బి-1, సి-2, డి-4
4) ఎ-2, బి-4, సి-3, డి-1

57. NIEPMO ఎక్కడ ఉంది?
1) హైదరాబాద్ 2) కటక్
3) చెన్నై 4) బెంగళూరు

58. సవరించిన బాల్యన్యాయచట్టం-2015 ఎప్పటి నుంచి అమల్లోకి వచ్చింది?
1) 2015, మార్చి 1 2) 2016, మార్చి 1
3) 2015, జనవరి 1 4) 2016, జనవరి 1

59. 'Best Interest of the Child' అనేది ఏ చట్టానికి సంబంధించిన ముఖ్య లక్ష్యం?
1) విద్యాహక్కు చట్టం
2) బాలకార్మిక నిషేధ చట్టం
3) పోస్కో చట్టం 4) బాలన్యాయ చట్టం

60. కింది వాటిలో దేన్ని రిఫరెన్స్ ప్రొటీన్ అని పిలుస్తారు?
1) చేపలు 2) గుడ్డు 3) సోయా 4) పైవన్నీ

61. శరీరంలోఅధికంగా ఉన్న కార్బోహైడ్రేట్లు ఏ రూపంలో నిల్వ అవుతాయి?
1) కొలెస్ట్రాల్ 2) గ్లిజరాల్
3) కొవ్వులు 4) గ్లైకోజెన్‌లు

62. కింది వాటిలో అత్యధిక శాతం కార్బోహైడ్రేట్లు కలిగి ఉండేది?
1) బెల్లం 2) అల్లం కలిపిన బెల్లం
3) మాల్టోజ్ 4) చెరుకు

63. చిన్నపిల్లల్లో మాత్రమే కనిపించే అమైనో ఆమ్లాన్ని గుర్తించండి?
1) లైసిన్ 2) ఐసోటాసిన్
3) కేసిన్ 4) హిస్టడిన్

64. అధిక మొత్తంలో ప్రొటీన్లు లభించే ఆహార పదార్థాన్ని గుర్తించండి?
1) సోయా 2) మాంసం
3) పప్పు 4) దుంపలు

65. మరాస్మస్ లేదా కట్టెవ్యాధి అనేది దేనివల్ల వస్తుంది?
1) ప్రొటీన్ల లోపం 2) విటమిన్ లోపం
3) ఖనిజ లవణాల లోపం
4) ప్రొటీన్లు, కేలరీల లోపం

66. క్వాషియార్కర్ లేదా ఉబ్బువ్యాధి లక్షణం?
1) వాపు ఉంటుంది కానీ బరువు ఉండదు
2) వెంట్రుకలు అధికంగా రాలుతాయి
3) మానసిక దౌర్బల్యం ఉంటుంది 4) పైవన్నీ

67. విటమిన్ A అధికంగా లభించే ఫలం?
1) బొప్పాయి 2) క్యారెట్
3) మగ్గిన మామిడి 4) పుచ్చకాయ

68. తక్కువ కాంతిలో కూడా చూసేందుకు ఉపకరించేది?
1) రెటినాల్ 2) కెరోటిన్
3) విటమిన్ A 4) విటమిన్ E

69. సూర్యకాంతిలోని ఏ కిరణాల వల్ల విటమిన్ D తయారవుతుంది?
1) UV-A 2) UV-B
3) UV-D 4) UV-C

70. కాల్షియం, ఫాస్ఫరస్ శోషణం కోసం అవసరమైన విటమిన్‌ని గుర్తించండి?
1) C 2) B 3) D 4) పైవన్నీ

74. అందాన్ని పెంపొందింపజేసే విటమిన్?
1) C 2) E 3) D 4) K

72. కింది వాటిలో యాంటీక్యాన్సర్ విటమిన్లను గుర్తించండి?
1) A 2) C 3) E 4) పైవన్నీ

73. బియ్యాన్ని ప్రధాన ఆహారంగా వినియోగించే ప్రజల్లో కనిపించే విటమిన్ లోపం ఏది?
1) థయమిన్ లోపం 2) రైబోఫ్లావిన్ లోపం
3) రెటినాల్ లోపం 4) ఆస్కార్బికామ్ల లోపం

74. ఖిలోసిస్ అనే వ్యాధి ఏ విటమిన్ లోపం వల్ల వస్తుంది?
1) B_1 2) B_2 3) B_{12} 4) B_6

75. కింది వాటిలో ప్రోబయోటిక్‌కు ఉదాహరణ?
1) పెరుగు 2) క్యారెట్ 3) ముల్లంగి 4) వెన్న

76. 'ఫుడ్ పిరమిడ్'ని 'మై ప్లేట్' అని ఎప్పటి నుంచి పిలుస్తున్నారు?
1) 2009 2) 2010 3) 2011 4) 2012

77. తల్లిపాల వారోత్సవాలను ఎప్పుడు జరుపుకొంటారు?
1) ఆగస్టు 1-7 2) ఆగస్టు 2-8
3) మార్చి 1-7 4) మార్చి 2-8

78. కాలేయ సమస్యలు ఉన్నప్పుడు తీసుకోకూడని ఆహారం?
1) నూనె పదార్థాలు 2) కార్బోహైడ్రేట్‌లు
3) మాంసకృత్తులు 4) విటమిన్లు

79. BMI విలువ ఎంత దాటినప్పుడు వారిని ఊబకాయులుగా పిలుస్తారు?
1) 23 2) 24 3) 25 4) 27

80. గర్భిణులకు ఎన్ని కేలరీల ఆహారం (రోజుకు) అవసరమవుతుంది?
1) 2850 2) 3850 3) 2950 4) 3200

81. గర్భిణులు, బాలింతలకు ప్రతిదినం ఎంత కాల్షియం అవసరమవుతుంది?
1) 600 ఎంజీ 2) 650 ఎంజీ
3) 675 ఎంజీ 4) 690 ఎంజీ

82. పురుషులకు రోజుకు ఎన్ని గ్రాముల ప్రొటీన్లు అవసరం?
1) 100 2) 125 3) 65 4) 60

83. పాలిచ్చే తల్లులకు ప్రతిరోజు ఎంత B_{12} అవసరమవుతుంది?
1) 1.5 మి.గ్రా 2) 2 మి.గ్రా
3) 3 మి.గ్రా 4) 1 మి.గ్రా

84. ఏ ఏడాదిలోగా కుపోషణ్ ముక్త్ భారత్‌గా ఏర్పడాలని విధానం రూపొందించారు?
1) 2020 2) 2021 3) 2019 4) 2022

85. దేశంలో ఎంత శాతం మంది మహిళలు ఎనీమియా సమస్యతో బాధపడుతున్నారు?
1) 53 2) 51 3) 50 4) 50.3

86. ఎంత శాతం మంది మహిళల్లో ఓవర్ వెయిట్ ఉంది?
1) 18.6 2) 20.7 3) 21.7 4) 22.7

87. గ్లోబల్ హంగర్ ఇండెక్స్-2017లో భారతదేశ స్థానం?
1) 117 2) 97 3) 100 4) 102

88. దేశంలో ఎంత శాతం మంది బాలలు Stunting నకు గురవుతున్నారు?
1) 38.4 2) 28.4 3) 48.4 4) 58.4

89. జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు?
1) 2011 2) 2012 3) 2013 4) 2014

90. ఎప్పటి వరకు అంధత్వ రహిత తెలంగాణ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు?
1) 2018 2) 2019 3) 2022 4) 2023

91. యునెస్కో, యునిసెఫ్‌ల ప్రకారం పూర్వ బాల్యదశ ఎప్పటి వరకు ఉంటుంది?
1) ఆరేండ్లు 2) ఏడేండ్లు
3) ఎనిమిదేండ్లు 4) ఐదేండ్లు

92. నేషనల్ పాలసీ ఆన్ ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్-2013 ప్రకారం ఎప్పటి వరకు నిర్మాణాత్మక దశ అని అంటారు?
1) ఆరేండ్లు 2) ఏడేండ్లు
3) ఎనిమిదేండ్లు 4) ఐదేండ్లు

93. ఎమిలీ గ్రంథ రచయిత ఎవరు?
1) ఫ్రోబెల్ 2) రూసో
3) ఠాగూర్ 4) పెస్టాలజీ

94. కిండర్ గార్డెన్ విధానం సృష్టికర్త ఎవరు?
1) ఫ్రోబెల్ 2) రూసో
3) నోమ్‌చామ్‌స్కీ 4) అరిస్టాటిల్

95. 'ది డిస్కవరీ ఆఫ్ చైల్డ్' అనే గ్రంథాన్ని రచించింది?
1) రూసో 2) పెస్టాలజీ
3) మాంటిస్సోరి 4) గాంధీ

96. పూర్వ బాల్యదశ ప్రణాళికలో కృత్యాలు గరిష్ఠంగా ఎంత సమయం ఉండాలి?
1) 15 నిమిషాలు 2) 12 నిమిషాలు
3) 17 నిమిషాలు 4) 20 నిమిషాలు

97. కిందివాటిలో సబల కార్యక్రమం లక్ష్యం కానిది?
1) రిప్రొడక్టివ్ అండ్ సెక్సువల్ హెల్త్‌పై అవగాహన పెంచడం
2) కౌమార బాలికల సాధికారత
3) పోషకాహార స్థాయి పెంచడం
4) అక్రమ రవాణాకు గురైనవారిని సంరక్షించడం

98. 'మైక్రో బర్త్ ప్లాన్'ని ఏ పథకంలో భాగంగా రూపొందిస్తారు?
1) JSY 2) RGSEAG
3) RGSEAB 4) NRHM

99. బాలికలు ఉన్న కుటుంబాలు ఉత్సవాలు జరుపుకొనేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న కార్యక్రమాన్ని గుర్తించండి?
1) RGSEAG 2) ధనలక్ష్మి
3) BBBP 4) సాక్ష్యం

100. కిందివాటిలో 'కండిషనల్ మెటర్నిటీ బెనిఫిట్ స్కీమ్'ని గుర్తించండి?
1) MBS 2) IGMSY
3) MSY 4) పైవన్నీ

ANSWERS

1-1	27-4	53-3	79-3
2-3	28-1	54-3	80-4
3-1	29-2	55-1	81-1
4-2	30-3	56-1	82-4
5-4	31-3	57-3	83-1
6-2	32-4	58-4	84-4
7-1	33-1	59-4	85-1
8-2	34-4	60-2	86-2
9-4	35-3	61-4	87-3
10-1	36-4	62-1	88-1
11-1	37-4	63-4	89-3
12-4	38-1	64-1	90-2
13-4	39-1	65-4	91-3
14-1	40-1	66-4	92-1
15-1	41-2	67-3	93-2
16-4	42-3	68-1	94-1
17-1	43-1	69-2	95-3
18-2	44-2	70-3	96-4
19-1	45-3	71-2	97-4
20-1	46-1	72-4	98-1
21-2	47-3	73-1	99-3
22-1	48-1	74-2	100-2
23-3	49-2	75-1	
24-1	50-2	76-3	
25-4	51-4	77-1	
26-2	52-2	78-1	

తరువాయి విజేతలో...



శ్రవణ్‌కుమార్ శ్రీరాం
శ్రీ కనిష్క ఐఏఎస్ స్టడీ సర్కిల్
హైదరాబాద్, 9666 411367

S & D


SVCC
SRI VENKATESWARA CINE CHITRA
Happy New Year 2018
తొలిప్రేమ
BVSN PRASAD VENKY ATLURI
THAMAN S GEORGE C WILLIAMS NAVIN NOOLI KIRAN
journey of love


MAHALAKSHMI ARTS
నూతన సంవత్సర శుభాకాంక్షలు
ఆనందంగా ఆదరిస్తున్న ప్రేక్షక మహాశయులకు శుభాభివందనాలు
SUPER HIT
2 కంట్రీస్
www.nshankar.com


UV creations PRESENTS
HAPPY NEW YEAR 2018
studio green
K.E.GNANAVELRAJA PRODUCTIONS
SURIYA'S
గ్యాంగ్
WRITTEN AND DIRECTED BY VIGNESH SHIVN MUSIC BY ANIRUDH
DOP DINESH KRISHNAN B EDITOR SREEKAR PRASAD ART drk KIRAN STUNTS DILIP SUBBARAYAN


SMT. ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
HAPPY NEW YEAR 2018
'DIL' RAJU PRODUCTION
MCA
మిడిల్ క్లాస్ అబ్బాయ్
MASS CLASS ALL CENTRES
BLOCKBUSTER
RAJU - SHIRISH - LAXMAN SRIRAM VENU DEVI SRI PRASAD
HARSHITH REDDY SAMEER REDDY
PRAWIN PUDI THIRU SRIKANTH VENKAT RAMANJANEYULU
TO PARTICIPATE IN MCA MOVIE CONTEST SCAN THIS QR CODE IN paytm APP & WIN UPTO RS 1 LAKH PAYTM CASH.
ADITYA U/A


ఆనంది ఆర్ట్ క్రియేషన్స్
HAPPY NEW YEAR 2018
Indira
మనసుకు నచ్చింది
రచన - దర్శకత్వం మంజుల ఘట్టమనేని
JAN 2018 RELEASE
AUDIO ON ADITYA
#Follow Your Heart


LAKSHMI NARASIMHA ENTERTAINMENTS
SANKAR CHIGURUPATI PRESENTS
HAPPY NEW YEAR 2018
ALLU SIRISH IN
ఒక్క క్షణం
LOVE VS DESTINY
STORY, SCREENPLAY, DIRECTION VI ANAND
PRODUCER CHAKRI CHIGURUPATI
THRILLING HIT



ఈ నెలలో పులుల గణన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెలలో రాష్ట్రంలో పులుల గణన చేపట్టనున్నట్టు రాష్ట్ర అటవీశాఖ సీనియర్ అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారి పులులు ఎన్ని ఉన్నాయో లెక్క తేల్చనున్నట్టు చెప్పారు. చివరిసారి 2013-14 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో అధ్యయనం జరిపామని, అప్పుడు తెలంగాణ ప్రాంతంలో 17 పులులు ఉన్నట్టు అంచనా వేశామని వివరించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం, జనవరి లేదా ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా పులుల గణన చేపట్టాల్సి ఉంటుందని, ప్రతి నాలుగేండ్లకోసారి గణన జరుపుతారని తెలిపారు. ఇతర జంతువులను కూడా లెక్కిస్తున్నప్పటికీ పులి జాతీయ జంతువు కావటం వల్ల పులుల గణనగా దీనిని పరిగణిస్తారని వివరించారు.



ఏపీ నూతన డీజీపీ మాలకొండయ్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాజీ డీజీపీ సాంబశివరావు

ఏపీ నూతన డీజీపీగా మాలకొండయ్య బాధ్యతల స్వీకరణ

సాంబశివరావుకు ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్/ అమరావతి, నమస్తే తెలంగాణ: ఏపీ రాష్ట్ర కొత్త డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి, ప్రస్తుత ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ఎన్ మాలకొండయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అమరావతిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో సాంబశివరావు నుంచి ఆయన బాధ్యతలు తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణకే తొలి ప్రాధాన్యమిస్తానని నూతన డీజీపీ ఈ సందర్భంగా స్పష్టంచేశారు. పదవీ విరమణ చేసిన డీజీపీ సాంబశివరావును పోలీస్‌రథంలో కూర్చోబెట్టి ఐపీఎస్ అధికారులు దానిని లాగి వీడ్కోలు పలికారు. మంగళగిరి 6వ బెటాలియన్‌లో పోలీసు గౌరవ వందనం సమర్పించారు. 33 ఏండ్ల తన సర్వీసులో ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని సాంబశివరావు చెప్పారు. సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవడంలో ఏపీ పోలీసులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. సాంబశివరావు నిబద్ధత కలిగిన వ్యక్తి అని నూతన డీజీపీ మాలకొండయ్య కొనియాడారు. వృత్తిపరంగా ఆయన సలహాలు, సూచనలు తీసుకుంటానని చెప్పారు.

భూ రికార్డుల ప్రక్షాళనలో..

తహసీల్దార్ల కృషి అభినందనీయం

తెలంగాణ తహసీల్దార్ల సంఘం డైరీ ఆవిష్కరణలో మహమూద్ అలీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:



ఆదివారం తహసీల్దార్ల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి మహమూద్‌అలీ. చిత్రంలో తహసీల్దార్ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి తదితరులు

భూ రికార్డుల ప్రక్షాళనలో తహసీల్దార్ల కృషి అభినందనీయమని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. కొత్త ఏడాదిలో అధికారులు, సిబ్బంది కృషితో తెలంగాణ రెవెన్యూశాఖ దేశంలోనే నంబర్‌వన్ స్థానానికి వెళుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంత్రుల నివాస సముదాయంలో ఆదివారం తెలంగాణ తహసీల్దార్ల సంఘం 2018 సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎం మహమూద్‌అలీ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రెవెన్యూ శాఖలో ఖాళీలను భర్తీచేస్తామని, తహసీల్దార్లకు పదోన్నతులు కల్పిస్తామని చెప్పారు. రెవెన్యూ అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదైన సంఘటనపై పోలీస్‌శాఖతో మాట్లాడుతానని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటానన్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గతంలో ఎన్నడూ లేనివిధంగా పదోన్నతులు వచ్చాయని, రెవెన్యూశాఖకు ప్రభుత్వం అప్పగించిన అన్ని పనులనూ వందశాతం పూర్తిచేస్తామని పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లపై పనిఒత్తిడి పెరుగుతున్నదని, వారిని క్రమబద్ధీకరించాలని నల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ కోరారు. రెవెన్యూచట్టాలను తెలంగాణకు అనుకూలంగా సవరణలు చేసుకోవాలని, ఈ శాఖను పటిష్ఠం చేయాలని ప్రభుత్వానికి సూచించారు. తహసీల్దార్లతోపాటు ప్రతి రెవెన్యూ ఉద్యోగి సంక్షేమానికి తమ సంఘం కృషి చేస్తున్నదని ఈ సంఘం అధ్యక్షుడు కే గౌతంకుమార్ తెలిపారు.

ప్రమాదరహిత తెలంగాణ దిశగా అడుగులు

- ఆధునికత సంతరించుకున్న రవాణాశాఖ
- రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో ఆధునికతకు రాష్ట్ర రవాణాశాఖ చిరునామాగా మారిందని, ఇదే స్ఫూర్తితో ప్రమాదరహిత తెలంగాణ దిశగా అడుగులు వేద్దామని రవాణాశాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చెప్పారు. గత ఏడాది ప్రమాదాలను తగ్గించిన రాష్ట్రంగా తెలంగాణ గుర్తింపు సాధించిందని ఆదివారం ఆయన మీడియాకు తెలిపారు. అదే స్ఫూర్తితో 2018లోనూ ప్రమాదాలు నివారించి ప్రాణ నష్టం తగ్గించాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. 2016-17లో 21,202 ప్రమాదాలు జరుగగా 7,219 మంది మృతిచెందారని, 23,719 గాయపడ్డారని తెలిపారు. 2017 జూన్ నాటికి 9,611 ప్రమాదాల్లో 3,028 మంది మృతిచెందగా 10,402 మంది గాయపడ్డారని, ప్రమాదాల రేటును గణనీయంగా తగ్గించగలిగామని మంత్రి వివరించారు. రవాణా శాఖ రెవెన్యూలోనూ 2016-17 కంటే ఈ సారి 22 శాతం ఆదాయం పెరిగిందని చెప్పారు. ఆన్‌లైన్ విధానం ఎం-వ్యాలెట్ తదితర స్మార్ట్ పద్ధతులతో రాష్ట్ర రవాణాశాఖ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదని అన్నారు. గతంలో ఎప్పుడూలేనివిధంగా వాహన సామర్థ్యం కేంద్రాలు, డ్రైవింగ్ శిక్షణ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. టీఎస్‌ఆర్టీసీని మరింత ఆధునీకరించేందుకు గత ఏడాది 1,400 కొత్త బస్సులను కొనుగోలు చేశామని తెలిపారు. మెట్రోతో పూర్తిస్థాయిలో ఆర్టీసీని అనుసంధానం చేస్తామని, అందుకు 1000 కొత్త బస్సులను కొనుగోలు చేసి రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తామని మంత్రి చెప్పారు.

4న అన్నిశాఖల కార్యదర్శులతో సీఎస్ సమీక్ష



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జిల్లాస్థాయిలో ఉద్యోగుల విభజన, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, యుటిలైజేషన్ సర్టిఫికెట్ల సమర్పణ తదితర అంశాలపై జనవరి 4న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీసింగ్ అన్నిశాఖల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించనున్నారు. కేంద్రనిధులతో చేపడుతున్న ప్రభుత్వ పథకాల అమలు పూర్తయిన వెంటనే కేంద్రానికి యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది. సర్టిఫికెట్ల సమర్పణలో జాప్యం కారణంగా తదుపరి నిధుల విడుదలలో జాప్యం జరిగే అవకాశం ఉన్నది. వివిధశాఖల్లో కేంద్రనిధులతో చేపట్టే కార్యక్రమాలన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తిచేసి యుటిలైజేషన్ సర్టిఫికెట్లను సమర్పించే అంశంపై సమీక్షలో చర్చించనున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో వర్క్ టూ సర్వ్ ఆర్డర్ ప్రకారంగా సిబ్బందిని కేటాయించారు. జిల్లాలు ఏర్పడి ఏడాది పూర్తయినప్పటికీ ఉద్యోగులు తాత్కాలిక కేటాయింపులపైనే విధులు నిర్వర్తిస్తున్నారు. శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులను విభజించాల్సి ఉంది. ఎండాకాలం కంటే ముందుగానే ఉద్యోగుల విభజన పూర్తిచేస్తే, ఉద్యోగస్థులు తమ పిల్లల చదువులకు ఏర్పాట్లు చేసుకుంటారని భావిస్తున్నారు. ఉద్యోగుల కేటాయింపులపై కూడా సమీక్షించే అవకాశం ఉన్నది. ఇటీవల జోనల్ వ్యవస్థపై బెంగుళూరులో జరిగిన దక్షిణ జోనల్ కౌన్సిల్ పదో స్టాండింగ్ కమిటీ సమావేశంలో చేసిన తీర్మానాలు, వాటి అమలు తదితర అంశాలపై ఈ సమావేశంలో సీఎస్ అన్నిశాఖల కార్యదర్శులకు వివరిస్తారు.



మేడ్చల్ మండలం పూడూరులో ముదిరాజ్ సంఘం భవన శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి ఈటల రాజేందర్‌కు కేక్ తినిపిస్తున్న ఎంపీ మల్లారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

తెలంగాణలో బతుకులు మారాలి

ముదిరాజ్ సంఘ భవనం శంకుస్థాపనలో మంత్రి ఈటల

మేడ్చల్ రూరల్: 'కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల బతుకులు మారాలి, ఎండిపోయిన బోర్లతో బండమారిన పొలాలకు నీళ్లు రావాలి, చదువుకున్న ప్రతి బిడ్డకు ఉద్యోగం దొరకాలి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలి' అని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. మేడ్చల్ మండలం పూడూరు గ్రామంలో రూ.10 లక్షల ఎంపీ నిధులతో నిర్మిస్తున్న ముదిరాజ్ సంఘ భవనానికి ఎంపీ సీ మల్లారెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి మంత్రి ఈటల భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఈటల మాట్లాడుతూ.. ఈ భవనానికి తాను కూడా రూ.25 లక్షలు ఇవ్వడంతో పాటు అన్ని విధాలుగా సహకరిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన కరెంట్‌ను నూతన సంవత్సర కానుకగా ఆదివారం అర్ధరాత్రి నుంచి అందిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో రెడ్డి సేవా సమితి భవన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి. చిత్రంలో ఎంపీ జితేందర్‌రెడ్డి తదితరులు

40 వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు

- వైద్యారోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి వెల్లడి
- షాద్‌నగర్‌లో రెడ్డి సేవా సమితి భవన్ ప్రారంభం

షాద్‌నగర్, నమస్తే తెలంగాణ: పేదల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.40 వేల కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని వైద్యారోగ్య శాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన రెడ్డి సేవా సమితి భవనాన్ని ఆదివారం ఆయన మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి ఆదివారం అర్ధరాత్రి నుంచి నిరంతర విద్యుత్‌ను అందిస్తున్నామని చెప్పారు. కులాల ప్రాతిపదికన కాకుండా పేదరికం ఆధారంగా రిజర్వేషన్లు ఉంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. రెడ్డి కులస్థుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. షాద్‌నగర్ రెడ్డి సేవా సమితి అభివృద్ధికి రూ.5 లక్షలు విరాళంగా ఇస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. ఎంపీ జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్డి కులస్థులు రాజాబహదూర్ వెంకట్‌రాంరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. రెడ్డి సేవా సమితి అభివృద్ధికి తనవంతుగా రూ.5 లక్షల విరాళం ఇస్తున్నట్టు తెలిపారు. అనంతరం రెడ్డి సేవా సమితి నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే సీ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిండికేట్ బ్యాంక్‌లో 500 పీవోలు

జాతీయ బ్యాంకుల్లో ఒకటైన సిండికేట్ బ్యాంక్ దేశ వ్యాప్తంగా ఆఫీసు/బ్రాంచీల్లో ఖాళీగా ఉన్న ప్రొబేషనరీ ఆఫీసర్ (జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్-1 ఆఫీసర్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- ఆన్‌లైన్ పరీక్ష+ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక
- 9 నెలలు ట్రెయినింగ్+ 3 నెలలు ఇంటర్న్‌షిప్
- ఏడాది పీజీడీబీఎఫ్ కోర్సు తర్వాత పీవో ఉద్యోగం



వివరాలు:

మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్, ఎన్ఐటీటీఈ యూనివర్సిటీతో సంయుక్తంగా ఏడాదిపాటు పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (పీజీడీబీఎఫ్) సర్టిఫికెట్ కోర్సును నిర్వహిస్తున్నది. ఈ కోర్సుకు ఎంపికైన అభ్యర్థులు మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ (బెంగళూరు), ఎన్ఐటీటీఈ యూనివర్సిటీ గ్రేటర్ నోయిడా లేదా మంగళూరులలో ఏదో ఒకచోట రెండు బ్యాచ్‌లుగా ఏడాదిపాటు పీజీడీబీఎఫ్ కోర్సును చదవాల్సి ఉంటుంది. కోర్సును విజయవంతంగా పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రొబేషనరీ ఆఫీసర్ (పీవో) లేదా అసిస్టెంట్ మేనేజర్ స్థాయిలో సిండికేట్ బ్యాంక్‌లో ఉద్యోగావకాశం కల్పిస్తారు.

- పోస్టు పేరు: ప్రొబేషనరీ ఆఫీసర్
- కోర్సు పేరు: పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్
- కాల వ్యవధి: ఏడాది
- మొత్తం ఖాళీలు: 500 (జనరల్-252, ఓబీసీ-135, ఎస్సీ-75, ఎస్టీ-38)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా బ్యాచిలర్ డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత. 2017 అక్టోబర్ 1 నాటికి అభ్యర్థులు ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయస్సు:** 2017 అక్టోబర్ 1 నాటికి కనిష్ఠంగా 20 ఏండ్లు, గరిష్ఠంగా 28 ఏండ్లలోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 600/- ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 100/-
- **కోర్సు ఫీజు:** బోర్డింగ్, లాడ్జింగ్, కోర్సు ఫీజు, ఇతర రుసుములు కలుపుకొని రూ. 3.50 లక్షలు+ సర్వీస్ ట్యాక్స్ చెల్లించాలి. ఈ మొత్తాన్ని కూడా విద్యార్థులకు ఆర్థికంగా తోడ్పాటునందించేదుకుగాను సిండికేట్ బ్యాంక్ 'సిండ్ విద్య ఎడ్యుకేషన్ లోన్' రూపంలో తక్కువ వడ్డీకి ఇస్తారు. దీన్ని ఉద్యోగంలో చేరిన తర్వాత 84 నెలల్లో (7 ఏండ్లు) ఈఎంఐ రూపంలో చెల్లించవచ్చు.
- **కోర్సు వ్యవధి:** 12 నెలలు. ఏడాదిపాటు ఉండే పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (పీజీడీబీఎఫ్) కోర్సును మొదటి 9 నెలలు మణిపాల్ గ్లోబల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్, ఎన్ఐటీటీఈ యూనివర్సిటీల్లో నిర్వహిస్తారు. చివరి మూడు నెలలు ఏదైనా సిండికేట్ బ్యాంక్ శాఖలో ఇంటర్న్‌షిప్ చేయాలి. నెలకు రూ. 3000/- చొప్పున మొదటి 9 నెలలు స్టయిఫండ్‌గా చెల్లిస్తారు. చివరి మూడు నెలలు 15,000/- (నెలకు) స్టయిఫండ్‌గా చెల్లిస్తారు. విజయవంతంగా పూర్తిచేసిన అభ్యర్థులకు పీజీడీబీఎఫ్ డిప్లొమా సర్టిఫికెట్‌తో పాటు ప్రొబేషనరీ ఆఫీసర్‌గా అవకాశం కల్పిస్తారు. ఉద్యోగంలో చేరిన తర్వాత ఐదేండ్లపాటు సర్వీస్ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆరో ఏడాది నుంచి పదో ఏడాది వరకు జీతంతోపాటు అదనంగా ఏడాదికి రూ. 1,00,000 చొప్పున సిండికేట్ బ్యాంక్ చెల్లిస్తుంది

ఆన్‌లైన్ రాతపరీక్ష సిలబస్

సబ్జెక్టు	ప్రశ్నలు	మార్కులు
రీజనింగ్	50	50
క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్	50	50
ఇంగ్లిష్ లాంగ్వేజ్	50	50
జనరల్ అవేర్‌నెస్	50	50
డిస్క్రిప్టివ్ (ఇంగ్లిష్ లాంగ్వేజ్)	2	50

- **ఎంపిక విధానం:** సింగిల్ ఆన్‌లైన్ టెస్ట్+ పర్సనల్ ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్.
- ఆన్‌లైన్ పరీక్షలోప్రతిభచూపిన అభ్యర్థులను ప్రకటించిన ఖాళీల సంఖ్యకు 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్ నిర్వహిస్తారు.
- ఆన్‌లైన్ పరీక్ష మార్కులు, ఇంటర్వ్యూ మార్కుల ద్వారా తుది ఫలితాలను ప్రకటిస్తారు.
- ఆబ్జెక్టివ్ పరీక్షను రెండు గంటలు, డిస్క్రిప్టివ్ పరీక్షను 30 నిమిషాల్లో పూర్తిచేయాల్సి ఉంటుంది.
- కనీసం కటాఫ్ మార్కులను బ్యాంక్ నిర్ణయిస్తుంది.
- రాతపరీక్ష, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కులను కలిపి తుది ఎంపిక చేస్తారు
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, తిరుపతితో సహా దేశ వ్యాప్తంగా 189 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తులు ప్రారంభం:** 2018 జనవరి 2
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** 2018 జనవరి 17
- **డౌన్‌లోడ్ కాల్‌లెటర్స్:** 2018 ఫిబ్రవరి 5 నుంచి
- **ఆన్‌లైన్ పరీక్షతేదీ:** 2018 ఫిబ్రవరి 18
- **వెబ్‌సైట్:** www.syndicatebank.in

'ఆయుర్వేద' పోస్టులు

ఢిల్లీలోని సీహెచ్.బ్రహ్మప్రకాశ్ ఆయుర్వేద చరక్ సంస్థాన్‌లో కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.

వివరాలు:

సీహెచ్.బ్రహ్మప్రకాశ్ ఆయుర్వేద చరక్ సంస్థాన్ ఎన్‌సీటీ ఆఫ్ ఢిల్లీ పరిధిలో పనిచేస్తుంది.

- వైద్య ఐ/సీ ఓపీడీ - 4 ఖాళీలు
- క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ - 6
- రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ - 1
- పంచకర్మ వైద్య - 4
- క్లినికల్ రిజిస్ట్రార్ - 14 ఖాళీలు ఉన్నాయి.
- **దరఖాస్తు:** నిర్ణీత నమూనాలో
- **చివరితేదీ:** 15 రోజుల్లో (ప్రకటన విడుదలైన రోజు నుంచి. ప్రకటన డిసెంబర్ 28న విడుదలైంది)
- **వెబ్‌సైట్:** www.cbpacs.com

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో 38 ఖాళీలు

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్) హెడ్‌క్వార్టర్ సెంట్రల్ ఎయిర్ కమాండ్ యూనిట్లలో ఖాళీగా ఉన్న గ్రూప్ సీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ భారతదేశానికి చెందిన త్రివిధ దళాల్లో అత్యంత ముఖ్యమైన సేనా విభాగం.

- మొత్తం పోస్టుల సంఖ్య: 38 (జనరల్-33, ఓబీసీ-2, ఎస్టీ-2)

పోస్టుల వివరాలు:

- ఎంటీఎస్-14, మెస్ స్టాఫ్-3, కుక్-6, హౌస్ కీపింగ్ స్టాఫ్-10, లేడీ హెల్త్ విజిటర్-1, కార్పెంటర్-1, హిందీ టైపిస్ట్-1
- **అర్హత:** పదోతరగతి /ఐటీఐలో సంబంధిత ట్రేడ్ ఉత్తీర్ణత. హిందీ టైపిస్ట్ పోస్టుకు ఇంటర్‌లో ఉత్తీర్ణత.



- **వయస్సు:** 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష ద్వారా
- రాత పరీక్షలో జనరల్ ఇంటెలిజెన్స్ &రీజనింగ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ ఇంగ్లిష్, జనరల్ అవేర్‌నెస్ అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన విడుదలైన 20 రోజుల్లోగా పంపాలి. ప్రకటన పూర్తి వివరాలకు డిసెంబర్ 23-29 వెలువడిన ఇష్యూలో చూడవచ్చు.

కన్సల్టెంట్లు

చెన్నైలోని కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ ఫుల్‌టైం కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ కేంద్ర వ్యవసాయ, రైతుసంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తుంది.

- కన్సల్టెంట్ - 4 పోస్టులు
- ఈ పోస్టు రిజిస్ట్రేషన్, హేచరీస్ ఇన్‌పుట్స్ తదితరాలకు సంబంధించినది.
- కన్సల్టెంట్ - 1
- ఈ పోస్టు టెక్నికల్ అసిస్టెన్సీకి సంబంధించినది.
- కంప్యూటర్ ప్రోగ్రామర్ - 1
- **ఎంపిక:** ఇంటర్వ్యూ
- **ఇంటర్వ్యూ తేదీ:** 2018, జనవరి 12
- **వెబ్‌సైట్:** www.caa.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

ట్రాన్స్‌కోలో 1604 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (ట్రాన్స్‌కో) సదరన్, నార్తర్న్ పరిధిలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ఇంజినీర్, సబ్ ఇంజినీర్, జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:



- మొత్తం పోస్టుల సంఖ్య: 1604
- **పోస్టుపేరు:** అసిస్టెంట్ ఇంజినీర్-330 (ఎలక్ట్రికల్-250, సివిల్-49, టెలికం-31)
- **అర్హత:** సంబంధిత ఇంజినీరింగ్ బ్రాంచిలో బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత.
- **పోస్టు పేరు:** సబ్ ఇంజినీర్-174
- **అర్హత:** ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా లేదా బ్యాచిలర్ డిగ్రీలో ఉత్తీర్ణత.
- **పోస్టు పేరు:** జూనియర్ లైన్‌మెన్-1100
- **అర్హత:** పదోతరగతితోపాటు ఎలక్ట్రికల్/ వైర్‌మెన్ ట్రేడ్‌లో ఐటీఐ లేదా రెండేండ్ల వ్యవధిగల ఎలక్ట్రికల్ ట్రేడ్‌లో ఇంటర్ వొకేషనల్ కోర్సు ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** జూనియర్ లైన్‌మెన్- రూ. 15,585 –25,200/-, సబ్ ఇంజినీర్ - రూ. 20,535-41,155/ అసిస్టెంట్ ఇంజినీర్- రూ. 41,155-63,600/-
- **వయస్సు:** 2017 జూలై 1 నాటికి జూనియర్ లైన్‌మెన్‌కు- 35 ఏండ్లు, సబ్ ఇంజినీర్/ అసిస్టెంట్ ఇంజినీర్‌కు 44 ఏండ్లకు మించరాదు.
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** సబ్ ఇంజినీర్‌కు -2018 జనవరి 20 , జూనియర్ లైన్‌మెన్ -2018 జనవరి 5 అసిస్టెంట్ ఇంజినీర్-2018 ఫిబ్రవరి 1
- **పరీక్షతేదీ:** సబ్ ఇంజినీర్-2018 ఫిబ్రవరి 25 జూనియర్ లైన్‌మెన్ - 2018 ఫిబ్రవరి 11 అసిస్టెంట్ ఇంజినీర్-2018 మార్చి 11
- **వెబ్‌సైట్:** http://www.tstransco.in

సీడబ్ల్యూసీలో స్కిల్డ్ వర్క్ అసిస్టెంట్లు

జమ్ము పరిధిలోని సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) స్కిల్డ్ వర్క్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 63 (జనరల్ -18, ఓబీసీ-25, ఎస్సీ-12, ఎస్టీ-8)
- **పోస్టు పేరు:** స్కిల్డ్ వర్క్ అసిస్టెంట్
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి మెట్రిక్యులేషన్/పదోతరగతి లేదా ఐటీఐలో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** రూ.18,000/-
- **ఎంపిక:** అకడమిక్ మార్కుల ఆధారంగా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్ ద్వారా.
- **చివరితేదీ:** 2018 జనవరి 22
- **వెబ్‌సైట్:** www.cwc.gov.in

'సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్'లో

కరైకుడిలోని సీఎస్ఐఆర్ - సెంట్రల్ ఎలక్ట్రోకెమికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఈసీఆర్ఐ) ప్రాజెక్ట్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- **పోస్టు:** ప్రాజెక్ట్ అసిస్టెంట్
- ఖాళీల సంఖ్య - 13
- **అర్హతలు:** ఎమ్మెస్సీ కెమిస్ట్రీ లేదా బీఈ/బీటెక్ ఇన్ కెమికల్ ఇంజినీరింగ్
- **వయస్సు:** 30 ఏండ్లు మించరాదు.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూతేదీ:** 2018, జనవరి 5
- **వెబ్‌సైట్:** www.cecri.res.in

S & D

రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- విశ్రాంత వ్యవసాయాధికారులు ఆదర్శనీయం
- వ్యవసాయాధికారుల సంఘం డైరీ ఆవిష్కరణలో మంత్రులు పోచారం, ఈటల, హరీశ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ఉద్యోగ విరమణ పొందిన వివిధశాఖల అధికారులు, ఉద్యోగులు తమ అనుభవాలను రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల అవసరాలకు వినియోగించేందుకు ముందుకురావాలని రాష్ట్ర మంత్రులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, టీ హరీశ్‌రావు, ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఈ విషయంలో విశ్రాంత వ్యవసాయాధికారులను స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. రైతులు, ప్రజలు ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసంతో బతికిన రోజే బంగారు తెలంగాణ సాధ్యమని, ఆ దిశగా ఉద్యమస్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తున్నదని మంత్రులు చెప్పారు. తెలంగాణ విశ్రాంత వ్యవసాయ అధికారుల సంఘం, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఆదివారం ఉత్తమ రైతు పురస్కార ప్రదానం,




ఆదివారం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో తెలంగాణ వ్యవసాయ అధికారుల డైరీ-2018ని ఆవిష్కరిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, ఈటల రాజేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం డైరీ-2018' ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భారీ నీటిపారుదల, మార్కెటింగ్‌శాఖ మంత్రి టీ హరీశ్‌రావు మాట్లాడుతూ రైతుబిడ్డ కేసీఆర్ కొత్త రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం మన అదృష్టమన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చింతమడకలో ట్రాక్టర్‌తో సీఎం కేసీఆర్ వ్యవసాయం చేశారని, సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటికీ వ్యవసాయం చేయడం మరువలేదని అన్నారు. రైతుల కష్టాలు తెలిసిన వ్యక్తి అయినందునే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నారని చెప్పారు. ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ విశ్రాంత వ్యవసాయాధికారులు తమ అనుభవాలను రైతులకు అందించడమే కాకుండా ఉత్తమ రైతులకు అవార్డులు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. రైతులు తమ కాళ్లమీద వాళ్లు నిలబడేలా సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతులను ఓటు బ్యాంకుగా వాడుకున్నాయే తప్ప వారి అభివృద్ధికి ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలే కాకుండా ఎన్నికల మ్యానిఫెస్టోలో లేని అనేక రైతు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని చెప్పారు. ప్రతి రైతుకు ఖర్చులుపోను ఎకరాకు రూ.50 వేలు మిగులు ఉండే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో విశేష ప్రతిభ కనబర్చిన రైతులు వాకిటి రజిత (చౌటుప్పల్), డీఎస్ శివయ్య (బోధన్), గార్ల సత్యనారాయణరెడ్డి (కందుకూరు) లను 'రైతు రత్న అవార్డుల'తో మంత్రులు సన్మానించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే వీ శ్రీనివాస్‌గౌడ్ పీజేటీఎస్ఏయూ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ వీ ప్రవీణ్‌రావు, ఉద్యానశాఖ కమిషనర్ ఎల్ వెంకట్రామిరెడ్డి, తెలంగాణ విశ్రాంత వ్యవసాయాధికారుల సంఘం చైర్మన్ కృపాకర్‌రెడ్డి, అధ్యక్షుడు రంగారెడ్డి, తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షురాలు అనురాధ, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి విజయ్‌కుమార్, వివిధ జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



బాలమ్మ (ఫైల్)



చిన్నారి మృతదేహం



నిందితుడు శ్రీనివాస్ (ఫైల్)

పెనుభూతమైన అనుమానం

- కట్టుకున్న భార్యతోపాటు ఐదునెలల బాలుడి హత్య
- మంచిర్యాల జిల్లాలో ఘటన

సీసీసీ నస్పూర్: అనుమానమే పెనుభూతమైంది. కట్టుకున్న భార్యతోపాటు ఐదునెలల బాలుడిని ఓ భర్త హతమార్చిన ఘటన మంచిర్యాల జిల్లాలో కలకలం రేపింది. సీసీసీ నస్పూర్ మండలంలోని తీగల్‌పహాడ్ రాంనగర్‌లో ఆదివారం ఉదయం 9:30 గంటల సమయంలో ఈ రెండు హత్యలు జరిగాయి. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్‌కు జిల్లా గూడూరు గ్రామానికి చెందిన సంపంగి శ్రీనివాస్ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని రంగాపూర్‌లో నివాసముంటున్నాడు. ఏడాదిన్నర క్రితం సీసీసీ నస్పూర్ మండలం రాంనగర్‌కు చెందిన బాలమ్మ (28)ను వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి బాలమ్మను అనుమానంతో వేధించేవాడు. శ్రీనివాస్‌కు ఇదివరకు మరో పెండ్లి జరిగింది. ఆమెను కూడా అనుమానంతో వేధించడంతో విడాకులు జరిగాయి. శ్రీనివాస్ వేధించడంతో బాలమ్మ రాంనగర్‌లోని ఆమె పుట్టింటికి వచ్చింది. పెద్దల సమక్షంలో రెండుసార్లు పంచాయితీ కూడా జరిగింది. అయినా శ్రీనివాస్ తీరు మారలేదు. మళ్లీ అనుమానంతో వేధించడంతో పుట్టింటికి వచ్చి ఇక్కడే ఉంటుంది. ఆమెకు ఐదు నెలల బాబు ఉన్నాడు. భార్య పుట్టింటి వద్దే ఉండడంతో శ్రీనివాస్ క్రిస్మస్ పండుగకని వారం క్రితం అత్తగారింటికి వచ్చాడు. ఆదివారం ఉదయాన్నే భార్యతో గొడవపడి కోపంలో కత్తితో బాలమ్మ గొంతుకోసి హత్యచేశాడు. ఆమె చనిపోయిన తర్వాత నిద్రిస్తున్న బాబుని గొంతుకోసి అక్కడి నుంచి పరారయ్యాడు. కరీంనగర్, తదితర ప్రాంతాల్లో శ్రీనివాస్‌పై దొంగతనం కేసులు కూడా ఉన్నాయి. ఇటీవల ఓ దొంగతనం కేసులో జైలుకు వెళ్లివచ్చాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత భార్య వద్దకు వచ్చి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. మంచిర్యాల డీసీపీ వేణుగోపాల్‌రావు, ఏసీపీ గౌస్‌బాబా, రూరల్ సీఐ ప్రమోద్‌రావు, సీసీసీ నస్పూర్ ఎస్సై ఉమాసాగర్ ఘట స్థలాన్ని పరిశీలించారు.

మార్చికల్లా తెలంగాణ-2024 డాక్యుమెంట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

వచ్చే ఆరేండ్లలో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఏమి చేయాలో నిర్దేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ 2024 పేరుతో డాక్యుమెంట్ రూపొందిస్తున్నది. 'ప్రజలకు చేసేది మాత్రమే చెప్పాలి. చెప్పింది ఖచ్చితంగా చేయాలి' అనే సూత్రం ఆధారంగా రూపొందిస్తున్న డాక్యుమెంట్ బాధ్యతలను రాష్ట్ర తొలి సీఎస్, ప్రస్తుతం ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా ఉన్న రాజీవ్‌శర్మకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అప్పగించారు. సీఎం కేసీఆర్ మార్గదర్శకత్వంలో దీని రూపకల్పనపై కసరత్తు వేగంగా జరుగుతున్నది. ఇప్పటికే అన్నిశాఖల కార్యదర్శులతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వానికి అన్నిరకాలుగా వచ్చే ఆదాయం, రాష్ట్రంలో సహజ వనరులు, వాటి పూర్తి వినియోగం ఆధారంగా ఈ డాక్యుమెంట్‌ను ఆచరణాత్మకంగా రూపొందిస్తున్నారు. శాఖలవారీగా ఇప్పటివరకు ప్రభుత్వం ఏమిచేసింది? రాబోయే ఆరేండ్లలో ఏమిచేయాలి? ఎలాచేయాలి? అన్నదానిపై సమగ్ర నివేదికలను ఇవ్వాలని ఆయా శాఖలను ఆదేశించారు. ఇప్పటికే కొన్ని శాఖల నుంచి వచ్చిన నివేదికలను విశ్లేషిస్తున్నారు. విశ్లేషణ దశలో ఉన్న ఈ డాక్యుమెంట్‌ను సీఎం కేసీఆర్ పరిశీలించి, ఆమోదించిన తర్వాత బయటకు విడుదలచేస్తారు. దీనిని మార్చినాటికి పూర్తిచేసి విడుదలచేసే అవకాశం ఉన్నది.

ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం

2016-17లో రూ.1.50 లక్షల కోట్లుగా ఉన్న రాష్ట్ర వార్షిక బడ్జెట్.. 2024 నాటికి రూ.5 లక్షల కోట్లకు చేరే అవకాశాలున్నట్టు అంచనాలేస్తున్న నేపథ్యంలో ఈ డాక్యుమెంట్‌ను రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రజల జీవన ప్రమాణాల పెంపే ప్రధాన అంశంగా తీసుకొని రూపొందించనున్నారు. ఎక్కువమందికి జీవనాధారమైన వ్యవసాయాన్ని ఏవిధంగా అభివృద్ధి చేయాలన్న అంశంపై దృష్టి కేంద్రీకరించినట్టు తెలిసింది. రైతులకు ఏడాదికి రూ.8 వేల పెట్టుబడి, భూరికార్డుల ప్రక్షాళన, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్.. ఇలా అనేక కార్యక్రమాలతో అన్నదాతకు దన్నుగా నిలబడిన సీఎం కేసీఆర్ వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేస్తే రాష్ట్రంలో మెజార్టీ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని భావిస్తున్నారు. వ్యవసాయం సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ఇప్పటికే పూర్తిస్థాయి కార్యాచరణను అమలు చేస్తున్నారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో 'మిషన్ భగీరథ' ద్వారా ఇంటింటికి నల్లాల ద్వారా మంచినీరు ఇచ్చే పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది.

వేగంగా సాగుతున్న కసరత్తు

- రాజీవ్‌శర్మకు బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి కేసీఆర్
- ప్రజల జీవన ప్రమాణాలను పెంచడమే లక్ష్యం
- వ్యవసాయరంగంపై ప్రత్యేక దృష్టి
- మానవ వనరుల అభివృద్ధి, విద్య, వైద్యరంగాలకు పెద్దపీట



మానవ వనరుల అభివృద్ధిపై దృష్టి

తెలంగాణ 2024 డాక్యుమెంట్‌లో మానవ వనరుల అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించినట్టు సమాచారం. రాష్ట్రంలో గురుకుల పాఠశాల వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 800 గురుకుల పాఠశాలలు ప్రారంభించి.. కేజీ నుంచి పీజీ ఉచిత విద్యకు నాంది పలికారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలలోని పేద విద్యార్థుల విదేశీ విద్యకు ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున ఓవర్సీస్ పథకం ద్వారా అందజేస్తున్నారు. రాష్ట్రంలో 90 శాతం అక్షరాస్యత సాధించాలనే లక్ష్యంతో 2024 ప్రణాళికను రూపొందిస్తున్నారు.

వైద్యానికి పెద్దపీట

తెలంగాణ 2024 డాక్యుమెంట్‌లో వైద్యరంగానికి పెద్ద పీట వేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ వైద్యశాలలకు శస్త్రచికిత్స ప్రారంభించారు. కార్పొరేట్ వైద్యసంస్థల దోపిడీకి కళ్లెంవేశారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలను ప్రోత్సహించేందుకు కేసీఆర్ కిట్స్ పథకాన్ని అమలుచేస్తున్నారు. భవిష్యత్‌లో సర్కారీ దవాఖానల్లో మరింత మెరుగైన వైద్యం అందించే విధంగా ఈ డాక్యుమెంట్‌ను రూపొందిస్తున్నట్టు తెలిసింది.

అన్నివర్గాలకు అండగా..

ఎస్సీ, ఎస్టీలకు సబ్‌ప్లాన్ అమలుచేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం బీసీల సమగ్రాభివృద్ధికి పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నది. గొర్రెల పంపిణీ, చేనేతకు సబ్సిడీ, చేపపిల్లల ఉచిత పంపిణీ.. ఇలా అనేక కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వం ఎంబీసీల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసింది. సంచార జాతుల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఈ వర్గాలన్నీ 2024 నాటికి సమగ్రంగా అభివృద్ధి చెందేవిధంగా ప్రణాళికను రూపొందిస్తున్నారు. ప్రపంచస్థాయి కార్యక్రమాలకు వేదికగా మారిన హైదరాబాద్ అదే స్థాయిలో అభివృద్ధి చెందేవిధంగా యాక్షన్‌ప్లాన్ రూపొందిస్తున్నారు. వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి, రహదారుల ఆధునీకరణ, స్కైవే, ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం, పట్టణాల్లో పేదరిక నిర్మూలన, మురికివాడల అభివృద్ధి, కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణ, పారిశ్రామిక ప్రగతి, సమగ్ర గ్రామీణాభివృద్ధి తదితర అంశాలతో ఈ డాక్యుమెంట్‌ను రూపొందించనున్నారు.





యువకుని అస్థిపంజరాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, మృతుడు స్వామిదాసు(ఫైల్)

యువకుడి అస్థిపంజరం లభ్యం

గంగాధర రూరల్: కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మాలగుట్ట వద్ద ఓ యువకుడి అస్థిపంజరం శనివారం లభ్యమైంది. ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం మేరకు.. గుట్ట వద్ద గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం ఉన్నదని స్థానిక గొర్రెల కాపరులు ద్వారా గ్రామ సర్పంచ్ గంగాధర పోలీసులకు తెలిపారు. ఘటనాస్థలంలో అస్థిపంజరంతోపాటు పక్కనే ఉన్న బ్యాగును పరిశీలించారు. అందులో లభించిన ఆధారాల ప్రకారం మృతుడు జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన మాలెపు స్వామిదాసు (32)గా గర్తించారు. అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా స్వామిదాసు మానసికస్థితి సరిగా లేక మూడేండ్ల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయాడని తెలిపారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



చోరీ జరిగిన దుకాణం వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్పీ కల్మేశ్వర్‌సింగెనవార్

బంగారం దుకాణంలో భారీ చోరీ

కాగజ్‌నగర్, నమస్తే తెలంగాణ: జువెల్లరీ దుకాణంలో భారీచోరీ జరిగింది. దాదాపు 80 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. కాగజ్‌నగర్ పట్టణం ఎంజీ రోడ్డులో రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలోగల మీనాక్షి జువెల్లరీ దుకాణం యజమాని కొడిప్యాక శేఖర్ శనివారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు టవేరా వాహనంలో వచ్చి దుకాణం ముందు ఆగారు. అదే సమయంలో కాగజ్‌నగర్ టౌన్ కానిస్టేబుల్ మధు తమ బంధువుల కోసమని రైల్వే స్టేషన్‌కు బయలుదేరారు. అనుమానం వచ్చి వారిని మందలించగా, గడ్డపారతో అతడిపై దాడి చేసేందుకు యత్నించారు. తేరుకున్న కానిస్టేబుల్ మధు చాకచక్యంగా తప్పించుకున్నాడు. వెంటనే పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. కాగజ్‌నగర్ ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వర్, కానిస్టేబుల్ మధుతోపాటు పోలీసు సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకోగా, అప్పటికే దుండగులు సిర్పూరు(టి) నుంచి మహారాష్ట్ర అంతర్రాష్ట్ర రహదారి మీదుగా పారిపోయినట్టు పోలీసులకు ప్రాథమిక విచారణలో తేలింది. తెల్లవారుజామున ఎస్పీ కల్మేశ్వర్ సింగెనవార్, కాగజ్‌నగర్ డీఎస్పీ సాంబయ్య అక్కడికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ఎస్పీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. గుర్తుతెలియని వ్యక్తులు మీనాక్షి జువెల్లరీ దుకాణం షెట్టర్లు పగులగొట్టి సుమారు 80 తులాలు బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని, వీటి విలువ సుమారు రూ. 24 లక్షల వరకు ఉంటుందన్నారు. ముగ్గురు లేక నలుగురు వ్యక్తులు ఈ చోరీకి పాల్పడి ఉంటారని తెలిపారు. పక్కనే ఉన్న భవానీ జువెల్లరీ షట్టర్‌ను కూడా పగులగొట్టేందుకు ప్రయత్నించారన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతోపాటు పలువురు నాయకులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

160 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

లారీ, ఆటో సీజ్.. ముగ్గురిపై కేసు

మరిపెడ, నమస్తే తెలంగాణ: అక్రమంగా తరలిస్తున్న 160 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్టు మహబూబాబాద్ ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. లారీ, ఆటోను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదుచేసినట్టు వెల్లడించారు. ఆదివారం మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మరిపెడ మండలం చోక్లాతండాకు చెందిన బానోత్ కిషన్ పత్తి, మిర్చి వ్యాపారం చేసేవాడు. ఇతర రాష్ట్రాలకు చెందిన పలువురు వ్యాపారులు, ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులతో పరిచయాలు పెంచుకున్నాడు. అతడి స్నేహితుడు శివ జిల్లాలోని పలు గ్రామాల్లో రేషన్ లబ్ధిదారుల నుంచి పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి ఆటో ద్వారా చోక్లాతండాలో డంప్ చేసేవాడు. ఆ బియ్యాన్ని అక్కడ నుంచి మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లోని పలు ప్రాంతాలకు తరలించేవారు. చోక్లాతండా వద్ద ఓ లారీలో పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేస్తున్నట్టు సమాచారం అందుకున్న మరిపెడ ఎస్సైలు నల్లగుంట్ల వెంకటేశ్వర్లు, ప్రసాదరావు దాడిచేసి లారీ, ఆటోను సీజ్‌చేశారు. కిషన్, శివతోపాటు లారీ డ్రైవర్ బన్వర్ గోదాడపై కేసు నమోదు చేశారు.

పోలీసులకు పతకాల పంట

- ఉత్తమ సేవలందించిన సిబ్బందికి అవార్డులు ప్రకటించిన ప్రభుత్వం
- నలుగురికి ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీస్ పతకాలు
- ముగ్గురికి మహోన్నత సేవా పతకాలు
- 17 మందికి శౌర్య పతకాలు.. 44 మందికి ఉత్తమ సేవాపతకాలు..
- 21 మందికి కఠినసేవా పతకాలు.. 208 మందికి సేవా పతకాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు పలు అవార్డులు ప్రకటించింది. ఉత్తమ సేవలందించిన పోలీస్ అధికారులు, సిబ్బందికి గుర్తింపుగా పలు అవార్డులను ప్రకటిస్తూ హోంశాఖ కార్యదర్శి రాజీవ్‌త్రివేది ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. అవార్డులు పొందినవారిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ విభాగాలకు చెందిన అధికారులు ఉన్నారు. వీరితోపాటు అత్యుత్తమ సేవలు కనబర్చిన నలుగురికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీస్ పతకం ప్రకటించారు. విజేతలకు పతకంతోపాటు రూ.5లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందజేయనున్నారు. శౌర్య పతకానికి 17మంది, మహోన్నత సేవా పతకానికి ముగ్గురు, ఉత్తమ సేవాపతకానికి 44 మంది, కఠిన సేవా పతకానికి 21 మంది, సేవా పతకానికి 208 మందిని ఎంపికచేశారు. అవార్డుల జాబితాను ఆయా శాఖల అధిపతులకు అందజేశారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే పోలీస్ కేంద్ర కార్యాలయానికి తెలియజేయాలని జీవోలో సూచించారు. ముఖ్యమంత్రి సర్వోన్నత పోలీస్ పతకం పొందినవారిలో యరబతి శ్రీనివాసరావు (కమాండెంట్, మొదటి బెటాలియన్, టీఎస్ఎస్పీ), కిరణ్‌రాయ్ (డీఎస్పీ, ఐఎస్‌డబ్ల్యూ, హైదరాబాద్),మది ప్రవీణ్‌కుమార్ (అడిషనల్ ఇన్‌స్పెక్టర్, అఫ్జల్‌గంజ్ పీఎస్), కొక్కొండ బాలరాజు (ఎస్సై, సీసీఎస్, శంషాబాద్) ఉన్నారు.

శౌర్య పతకం విజేతలు

వివిధ విభాగాలకు చెందిన మొత్తం 17మంది శౌర్య పతకం పొందారు. వీరిలో గ్రేహౌండ్స్ విభాగం నుంచి వై నర్సింహారావు (సీనియర్ కమాండో), డీ జగన్నాథం (జూనియర్ కమాండో), బీ రమేశ్ (జూనియర్ కమాండో), నార్త్ జోన్ నుంచి దురిశెట్టి రఘుచందర్ (సీఐ, ఏటూరునాగారం), రాచకొండ కమిషనరేట్ నుంచి తోకల అవినాశ్‌బాబు (ఎస్సై, ఎల్బీనగర్)

ఇంటిలిజెన్స్ విభాగం నుంచి.. టీ రమేశ్‌కుమార్‌రెడ్డి (ఎస్సై), తుర్రం మోహన్ (హెడ్ కానిస్టేబుల్), ఎస్.రామకృష్ణ (కానిస్టేబుల్), ఎస్ వసంత్‌కుమార్ (కానిస్టేబుల్), ఆర్ శ్రీనివాస్ (ఇన్‌స్పెక్టర్, సీఐ సెల్), కే ప్రసాద్ (పీసీ)

స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫైర్ సర్వీసెస్ నుంచి.. బీరం హరినాథ్‌రెడ్డి (డివిజన్ ఫైర్ ఆఫీసర్, రంగారెడ్డి), కే వెంకటసతీశ్‌కుమార్ (అసిస్టెంట్ డివిజినల్ ఫైర్ ఆఫీసర్, కూకట్‌పల్లి), కే సూర్యప్రకాశ్ (ఫైర్‌మెన్, గౌలిగూడ డీఎఫ్‌వో), జీ భాస్కర్ (ఫైర్‌మెన్, వికారాబాద్), పాలకుర్తి కృష్ణకుమార్ (ఫైర్‌మెన్, హన్మకొండ), ధరమ్‌వీర్‌సింగ్ (సూపరింటెండెంట్, జీఎంఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్) ఉన్నారు.

మహోన్నత సేవాపతకం విజేతలు

అన్నివిభాగాల్లో కలిపి ముగ్గురికి మహోన్నత సేవా పతకం దక్కింది. వీరిలో సీఐడీ నుంచి దుగ్యాల కృష్ణారావు (ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్), ఇంటెలిజెన్స్ విభాగం నుంచి బాతుల నాగేశ్వరరావు (ఎస్సై, ఖమ్మం జోన్), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ నుంచి జీ బిక్షపతి (అసిస్టెంట్ కమాండెంట్) ఉన్నారు.

ఉత్తమ సేవా పతకం విజేతలు

ఉత్తమ సేవా పతకం పొందిన వారిలో పీటీవో నుంచి ఎండీ నజీరుద్దీన్ (ఎస్సై), ట్రైనింగ్ వింగ్ నుంచి ఎం అంజద్‌అలీ, (ఎస్సై, పీటీసీ, కరీంనగర్), టీఎస్ఎస్పీ బీఎన్ఎస్ నుంచి టీఎస్ థామస్ (హెడ్‌కానిస్టేబుల్), ఎం బాలకృష్ణ (ఏఆర్ ఎస్సై), పీవీ నారాయణస్వామి (అసాల్ట్ కమాండెంట్), సీఐడీ నుంచి ఆజాద్‌అలీఖాన్ (హెడ్‌కానిస్టేబుల్), ఎంఏ మజీద్ (హెడ్‌కానిస్టేబుల్), పోలీస్ అకాడమీ నుంచి ఏ సత్యనారాయణ (హెడ్‌కానిస్టేబుల్), వెస్ట్‌జోన్ నుంచి ఆర్ ఉల్లాస్‌గౌడ్(ఏఆర్ఎస్సై), హనుమంత్‌రెడ్డి (ఎస్సై, సైబరాబాద్), జీ శ్యాం (ఏఆర్ఎస్సై, సైబరాబాద్), ఎం బాలసుబ్రమణ్యం (ఏఎస్సై, డీఎస్పీ, మహబూబ్‌నగర్), టెక్నికల్ సర్వీసెస్ నుంచి.. ఎన్ ఎండీ మునీర్‌ఖాన్ (ఏఎస్సై, వికారాబాద్ జిల్లా), ఇంటెలిజెన్స్ వింగ్ నుంచి.. ఆర్ సుదర్శన్ (అడిషనల్ ఎస్పీ, సైబరాబాద్ రీజియన్), భూపతి చంద్రకాంతారావు (ఎస్పీ), ఎం ముత్యం రెడ్డి (ఏఆర్ఎస్సై) ఉన్నారు. ఇంటెలిజెన్స్ పీఎస్ సెల్, ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ నుంచి.. మూల కుమారస్వామి (డీఎస్పీ, హైదరాబాద్), బీ నారాయణరావు (హెడ్ కానిస్టేబుల్) ఉన్నారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ నుంచి..జీ రవీందర్ (హెడ్‌కానిస్టేబుల్), ఐ వీరరామాంజనేయులు, (కానిస్టేబుల్) ఉన్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ నుంచి.. వీ సుధాకర్‌రావు (ఇన్‌స్పెక్టర్), ఎన్ సూర్యారావు (ఎస్సై), బీవీరత్నారావు (ఎస్సై) ఉన్నారు. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫైర్ సర్వీసెస్ నుంచి ఎస్ సందన్న (డివిజనల్‌ఫైర్ ఆఫీసర్, ఆదిలాబాద్), ఏసీబీ నుంచి.. ఎస్వీ రమణమూర్తి (ఇన్‌స్పెక్టర్, ఖమ్మం రేంజ్), ఎం ఆశీర్వాదం (హెడ్‌కానిస్టేబుల్, సిటీ రేంజ్, హైదరాబాద్), షేక్ సుభాన్ భాషా (హెడ్‌కానిస్టేబుల్, హైదరాబాద్) ఉన్నారు.

కఠినసేవా పతకం విజేతలు

మొత్తం 21 మందికి కఠినసేవా పతకాలు పొందారు. వీరిలో గ్రేహౌండ్స్ నుంచి.. ఎన్ భాస్కర్ (అసిస్టెంట్ కమాండెంట్), పీ మహేశ్‌బాబు (జూనియర్ కమాండో), ఎన్ నవీన్ (జూనియర్ కమాండో), అబ్దుల్ అజీం (జూనియర్ కమాండో) ఉన్నారు. నార్త్‌జోన్ నుంచి.. గొల్లపల్లి కోటేశ్వరరావు (కానిస్టేబుల్, గంగాధర పోలీస్‌స్టేషన్), నాంపల్లి శ్రీనివాస్ (కానిస్టేబుల్, గంగాధర పోలీస్‌స్టేషన్), గుడుగుల శ్రీనివాస్ (ఎస్సై, పోలీస్ కంట్రోల్ రూం, రామగుండం కమిషనరేట్), బండ సతీశ్ (ఆర్ఎస్సై, జయశంకర్ భూపాలపల్లి జిల్లా) ఎన్ మధు (ఏఆర్పీసీ), పెద్దిరాజు బాలసుకురి (కానిస్టేబుల్, జయశంకర్‌భూపాలపల్లి జిల్లా) ఉన్నారు. ఇంటెలిజెన్స్‌వింగ్ ఎస్ఐబీ నుంచి.. ఏ సూర్యనారాయణ (ఇన్‌స్పెక్టర్), ఎన్ రాజేంద్రప్రసాద్ (హెడ్‌కానిస్టేబుల్), జీ శ్రీనివాస్‌రెడ్డి (కానిస్టేబుల్), కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ నుంచి.. గొనబ్బ శ్రీఖర్‌గౌడ్ (ఇన్‌స్పెక్టర్), పీ రాజు (హెడ్‌కానిస్టేబుల్), ఎం శ్రీకాంత్‌రెడ్డి (కానిస్టేబుల్), ఎస్ ప్రసాద్ (కానిస్టేబుల్), ఎం ఫ్రాన్సిస్ లాజరస్ (కానిస్టేబుల్), టీ రాజేశ్ (కానిస్టేబుల్) ఉన్నారు.

సేవా పతకం విజేతలు

రాష్ట్రవ్యాప్తంగా పోలీస్‌శాఖలోని వివిధ విభాగాల్లో కలిపి ఉత్తమ సేవలందించిన సిబ్బందిలో 208 మందికి సేవాపతకం ప్రకటించారు. వీరిలో, పీటీవోలో జీ నాగేశ్వర్ (హెచ్‌సీ), ఎండీ మొయిజుద్దీన్ (హెచ్‌సీ), గులాం దస్తగిర్ (హెచ్‌సీ) సీఐడీలో.. గణపతి చంద్రశేఖర్ (ఎస్సై, కరీంనగర్), మరికంట గోవర్దన్‌రావు (ఎస్సైపీ డాగ్ స్క్వాడ్), కొల్లూరు కృష్ణమూర్తి (హెచ్‌సీ), టీఎస్ఎస్పీ బీఎన్ఎస్‌లో.. హరకేసింగ్ (హెచ్‌సీ), టీ మన్‌బహదూర్ (హెచ్‌సీ), ఎండీ ఖలీల్‌అహ్మద్ (హెచ్‌సీ), ఎం వెంకటేశ్వర్‌రావు (హెచ్‌సీ), చెట్ బహదూర్ (ఏఆర్ఎస్), టీ శ్రీనివాసులు (ఏఆర్ఎస్సై), ఎస్కే తఫ్షీపుల్లా (ఆర్ఎస్సై), ఎన్ నర్సయ్య (ఆర్ఎస్సై), కే బాలయ్య (ఆర్సై), వీ ఏడుకొండలు (ఆర్సై), డీవీ నరసింహారాజు (ఏసీ), కే శ్రీనివాస్‌రెడ్డి (ఏసీ), ఎండీ మస్తాన్‌బేగ్ (హెచ్‌సీ), ఎన్ అశోక్ (హెచ్‌సీ), బీ సల్మాన్ (హెచ్‌సీ), సలేంద్ర సుధాకర్ (ఆర్ఎస్సై), జీ లక్ష్మారెడ్డి (హెచ్‌సీ), యాసం వెంకటేశ్వర్లు (హెచ్‌సీ), ఆర్ రామలింగయ్య (హెచ్‌సీ), ఎన్వీ ఆదినారాయణ (ఆర్ఎస్సై), కేవీవీ ప్రసాద్ (ఆర్సై), ఎం శ్రీనివాస్‌రావు (ఆర్సై), బీ శేఖర్‌రెడ్డి (ఏఆర్ఎస్సై), కే సురేందర్ (ఏఆర్ఎస్సై), ఎం మల్లయ్య (ఏఆర్ ఎస్సై), సీహెచ్ పాపారావు (ఆర్ఐ), ఎం శివరావు (ఏఆర్ ఎస్సై), పీ తిరుపతి (ఆర్ఎస్సై), నార్త్ జోన్‌లో.. జీ వీరయ్య (హెచ్‌సీ), కే నర్సయ్య (ఏఎస్సై), సయ్యద్ మాజిద్‌అలీ (ఏఆర్పీసీ), ఠాకూర్ సురేందర్‌పాల్‌సింగ్ (పీసీ), ఎంఏ సలీం (ఏఎస్సై), డీ శంకర్ (ఏఎస్సై), కే రామచంద్రయ్య (ఏఎస్సై), ఏ రఘు (ఇన్‌స్పెక్టర్), ఎస్కే మురద్అలీ (పీసీ), ఆర్ దేవీచంద్ (పీసీ), కే నాగయ్య (ఆర్సై), కర్ణ శివకుమార్ (హెచ్‌సీ), వీ ఆంజనేయులు (అదనపు ఎస్సై), వీ వెంకయ్య (ఏఎస్సై), విల్లా తిరుపతిరెడ్డి (సీఐ), డీ ఆదిశేషుడు (పీసీ), ఎస్కే చాంద్ (ఏఆర్ఎస్సై), ఎన్వీ హరినారాయణ (పీసీ), ఎండీ అయూబ్ ఖాన్ (హెచ్‌సీ), ఎస్కే మస్తాన్ (ఏఎస్సై), కే డేవిడ్ (హెచ్‌సీ), రౌతు శ్రీహరి (ఏఆర్ఎస్సై), వెలుపుల భాస్కర్ (పీసీ)

వెస్ట్ జోన్‌లో.. ఈడీ సంజీవ్ (పీసీ), ఎం రమేశ్ (పీసీ), ఎండీ తాజుద్దీన్ (ఏఆర్ఎస్), శేషుకుమార్ (ఏఆర్ఎస్సై), తాజీద్‌అహ్మద్ (ఏఆర్ఎస్), ఆర్ నర్సింహులు (ఏఆర్‌హెచ్‌సీ), జీ పెంటయ్య (ఎస్సై), ఎన్ కిష్టయ్య (ఏఎస్ఐ), డీ. వెంకట్‌రెడ్డి (ఎస్సై), పీ వెంకటేశం (ఏఎస్సై), కే కృష్ణయ్య (ఏఎస్సై), వీ గణేశ్‌కుమార్ (ఏఆర్ఎస్), ఆవంచ కృష్ణయ్య (హెచ్‌సీ), ఎస్ గట్టయ్య (ఏఆర్ఎస్), జీ గోవర్దన్ (హెచ్‌సీ), ఎస్ రాజేశ్వర్‌రెడ్డి (పీసీ), ఎస్ శంకర్‌రెడ్డి (ఏఆర్), షబ్బీర్‌ఖాన్ (పీసీ), పీ రఘునాథ్‌రెడ్డి (పీసీ), రైల్వేస్ నుంచి.. పీ కృష్ణారావు (ఎస్సై, స్పెషల్ బ్రాంచ్, సికింద్రాబాద్), ట్రైనింగ్ వింగ్ నుంచి.. ముప్పపిచ్చయ, (డీఎస్పీ-సివిల్, పీటీసీ-అంబర్‌పేట్), గొర్రె మధు (సీఎల్ఐ-పీటీసీ, వరంగల్), ఎండీ అబ్దుల్‌అజీజ్ (ఎస్సై, పీటీసీ,కరీంనగర్), నాగుల అశోక్ (ఎస్సై, పీటీసీ, అంబర్‌పేట్), సీహెచ్ హనోక్ (ఎస్సై, పీటీసీ, కరీంనగర్), ఎంవెంకటరమణ (హెడ్‌కానిస్టేబుల్, పీటీసీ, అంబర్‌పేట్), ఎండీ థాహెర్‌అలీ(హెడ్‌కానిస్టేబుల్, పీటీసీ, వరంగల్), హోంగార్డుల నుంచి.. ఎన్‌భాస్కర్ (ఏసీపీ, హెచ్‌జీవో-2, హైదరాబాద్), మహ్మద్ షంషుద్దీన్(ఆర్ఎస్సై,హెచ్‌జీవో), టెక్నికల్ సర్వీసెస్ నుంచి. .కే గురుప్రసాద్(ఎస్సై, కమ్యునికేషన్స్, హైదరాబాద్), బీ రాంమోహన్ (ఎస్సై, ఖమ్మం), డీఏ సత్యానంద్ (ఏఎస్సై, హైదరాబాద్), ఇంటెలిజెన్స్ వింగ్ నుంచి.. డీ రమేశ్(డీఎస్పీ, మెయిన్ ఇంటెలిజెన్స్‌సెల్), బైరి రమేశ్ (ఇన్‌స్పెక్టర్, మెదక్‌జోన్), జీ హనుమంతు (ఇన్‌స్పెక్టర్, హెడ్‌క్వార్టర్స్, హైదరాబాద్), కొప్పోలు నాగేశ్వరరావు (ఇన్‌స్పెక్టర్, ఎస్ఈ సెల్, హైదరాబాద్), బీడీకేరత్నం (ఎస్సై, ఇంటెలిజెన్స్, ఖమ్మం), జీవీఎస్ఎస్‌శాస్త్రి (ఏఎస్సై, హైదరాబాద్), వై సత్యనారాయణ (ఏఎస్సై, హైదరాబాద్), ఎం కృష్ణ(ఏఆర్ఎస్సై, హైదరాబాద్), ఎం తులసీదాస్ (హెడ్‌కానిస్టేబుల్, హైదరాబాద్), ఆర్ రూప్‌సింగ్ (హెడ్‌కానిస్టేబుల్, హైదరాబాద్), కొండబోయిన లక్ష్మయ్య(హెడ్‌కానిస్టేబుల్, హైదరాబాద్), టీ శ్రీరాములు (హెడ్‌కానిస్టేబుల్, హైదరాబాద్), ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ నుంచి.. ఏ సంజీవరెడ్డి(హెడ్‌కానిస్టేబుల్), ఎస్ కృష్ణారెడ్డి(హెడ్‌కానిస్టేబుల్), కొండా శ్రీనాథ్(హెడ్‌కానిస్టేబుల్) ఉన్నారు. కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ నుంచి.. బీ జయచంద్రనాయుడు (ఏఎస్సై, హైదరాబాద్),ఎన్ శంకర్‌నారాయణరెడ్డి(హెడ్‌కానిస్టేబుల్), డీజీపీ ప్రెస్ నుంచి.. ఎస్కేవీ అర్జున (హెడ్‌కానిస్టేబుల్), ఐఎస్‌డబ్ల్యూ నుంచి.. ఎస్ కేవల్ సింగ్ (హెడ్‌కానిస్టేబుల్), టీ మహేందర్‌సింగ్ (హెడ్‌కానిస్టేబుల్), కే వీరభద్రం (కానిస్టేబుల్), ఎన్ రాంమోహన్‌రెడ్డి (కానిస్టేబుల్), పీ హరికృష్ణ (కానిస్టేబుల్), టీ శంకర్(కానిస్టేబుల్), బీ మధుసూదన్‌రెడ్డి (కానిస్టేబుల్), వై నర్సిరెడ్డి(కానిస్టేబుల్), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ నుంచి.. కే రామప్ప (ఇన్‌స్పెక్టర్), పీ మహబూబ్‌సుభాని (హెడ్‌కానిస్టేబుల్), పీ నాగరాజు (హెడ్‌కానిస్టేబుల్), ఏ అచ్యుతరావు (హెడ్‌కానిస్టేబుల్), సిద్ధారెడ్డి (హెడ్‌కానిస్టేబుల్), డీ రాంబాబు(హెడ్‌కానిస్టేబుల్), వీ వల్యానాయక్ (హెడ్‌కానిస్టేబుల్), ఏ సత్యనారాయణ (హెడ్‌కానిస్టేబుల్), జీ భాస్కర్ (సీహెచ్), బీ భీముడు (సీటీ), కే శ్రీనివాస్‌రెడ్డి (సీటీ), సయ్యద్ యూసఫ్ (సీటీ), ఆర్ నవీన్‌కుమార్(సీటీ), ఎస్ జగన్నాథ్ (సీటీ), ఎ నారాయణ(సీటీ) ఉన్నారు. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ డిపార్ట్‌మెంట్ నుంచి.. డీప్రభాకర్ (అసిస్టెంట్ డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్, వరంగల్), గుగ్గిల గంగయ్య (స్టేషన్ ఫైర్‌ఆఫీసర్, బాన్సువాడ), మీర్జా సదాదుల్లా బేగ్ (స్టేషన్‌ఫైర్ ఆఫీసర్, ముషీరాబాద్), ఎంఏ జబ్బార్ (డ్రైవర్ ఆపరేటర్,అచ్చంపేట) జీ మధుసూదన్ (డ్రైవర్ ఆపరేటర్, కామారెడ్డి), అబ్దుల్‌రజాక్ (లీడింగ్‌ఫైర్‌మెన్, కోదాడ), సయ్యద్‌ఆరీఫ్ (లీడింగ్‌ఫైర్‌మెన్, నాగర్‌కర్నూల్), కే విఠల్ (లీడింగ్‌ఫైర్‌మెన్, నిజామాబాద్), రామకృష్ణ(లీడింగ్‌ఫైర్‌మెన్, అచ్చంపేట), భక్తవర్‌సింగ్ (లీడింగ్‌ఫైర్‌మెన్, ఉట్నూర్), బీ ప్రభాకర్ (లీడింగ్‌ఫైర్‌మెన్, ఇచ్చోడ), అల్లుల సత్యనారాయణ (లీడింగ్‌ఫైర్‌మెన్,ఇచ్చోడ), ఏ గంగారాం (ఫైర్‌మెన్, ఆర్మూర్), పీ రాజు (ఫైర్‌మెన్, సనత్‌నగర్) ఉన్నారు. ఏసీబీ నుంచి.. మధు వెంకటేశ్వరరావు (ఇన్‌స్పెక్టర్, సిటీ రేంజ్-1), ఆర్ సతీశ్‌కుమార్(ఇన్‌స్పెక్టర్), బాలాజీ(పీసీ), మహ్మద్ అబ్దుల్ ఖదీరుద్దీన్ (పీసీ), ఎండీ అక్బర్‌అలీఖాన్ (ఏఆర్పీసీ), గౌరం సురేశ్ (పీసీ) పత్తిపాక సురేశ్‌కుమార్(పీసీ), గంజేశ్వర్ పోశెట్టి (హెచ్‌సీ), ఏ నర్సయ్య(పీసీ), వడ్ల రఘుపతి (పీసీ), జీ ఓంప్రకాష్ (పీసీ), అనంతగిరి శ్రీధర్ (పీసీ) ఉన్నారు.



కష్టపడితేనే భవిష్యత్తు

- పని సంస్కృతి ఎంతో ముఖ్యం
- ఉద్యోగులకు ఎయిరిండియా చీఫ్ ఉద్బోధ

ముంబై, డిసెంబర్ 31: నష్టాల్లో నడుస్తున్న ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా లాభాల బాట పట్టాలంటే ఉద్యోగులు నైపుణ్యంతో కూడిన పని సంస్కృతిని అలవర్చుకోవడం ఎంతో ముఖ్యమని, ఎయిరిండియా కనుమరుగు కాకూడదని కోరుకుంటే ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఆ సంస్థ అధినేత ప్రదీప్ సింగ్ ఖరోలా ఉద్బోధించారు. నూతన సంవత్సర సందర్భంగా సంస్థలోని ఉద్యోగులకు ఇచ్చిన సందేశంలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తున్న ఎయిరిండియాకు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఖరోలా గత నెలలో బాధ్యతలు చేపట్టిన విషయం విదితమే. కష్టాల నుంచి ఎయిరిండియాను గట్టెక్కించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, సంస్థ మళ్లీ లాభాల బాటలోకి రావాలంటే ఉద్యోగులంతా నైపుణ్యతతో కూడిన పని సంస్కృతిని అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన అన్నారు. 'ఇటీవలి కాలంలో ఎయిరిండియా పరిస్థితి చాలా మెరుగుపడింది. అయినప్పటికీ మనం ఇంకా ఎంతో దూరం ప్రయాణించాల్సి ఉంది' అని ఖరోలా పేర్కొన్నారు.

ఆస్తుల అమ్మకంపై దృష్టి పెట్టాలి

- ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఆర్థిక శాఖ సూచన



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లు తమ బ్యాలెన్స్ షీట్లను (అప్పుల పట్టికలను) బలోపేతం చేసుకోవాలని, డిఫాల్టర్లు రుణాల కోసం తనఖా పెట్టిన ఆస్తులను అమ్మేందుకు లేదా వాటిని ఇతర బ్యాంకులకు బదిలీ చేసేందుకు గల అవకాశాలను పరిశీలించాలని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఉద్దేశపూర్వక ఎగవేతదారులు, నిరర్థక ఆస్తులు గణనీయంగా పెరిగి ప్రభుత్వ రంగ బ్యాంకులు తీవ్రంగా సతమతమవుతున్న నేపథ్యంలో ఆర్థిక శాఖ ఈ సూచన చేసింది. పటిష్టంగా ఉన్న బ్యాంకులు తమ సామర్థ్యాన్ని బట్టి ఇతర బ్యాంకుల రుణాలను కొనుగోలు చేసేందుకు, లేదా మార్పిడి చేసుకునేందుకు గల అవకాశాలను పరిశీలించాలని ఆర్థిక శాఖ సూచించిందని, గత నెలలో జరిగిన పీఎస్‌బీ మంథన్‌లో దీనిపై కూడా ప్రధానంగా చర్చించడం జరిగిందని అధికార వర్గాలు తెలిపాయి. రుణాల కోసం తనఖా పెట్టిన ఆస్తులను విక్రయించడం లేదా మార్పిడి చేసుకోవడం ద్వారా బ్యాంకులు తమ భారాన్ని తగ్గించుకుని ముఖ్యమైన విధులను నిర్వర్తించడంపై దృష్టి కేంద్రీకరించేందుకు వీలుంటుంది. ఉదాహరణకు ఏదైనా ఒక బ్యాంకు సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమ (ఎంఎస్‌ఎంఈ)కి రుణమిచ్చిందనుకుంటే.. ఆ పోర్ట్‌ఫోలియోను అదే రంగంలో పటిష్టంగా ఉన్న మరో బ్యాంకుకు బదిలీ చేసుకోవడం లేదా అమ్ముకోవాలని, అదేవిధంగా దేశంలో అత్యధికంగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్న చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు అధికంగా రుణాలను ఇచ్చేందుకు ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రత్యేక శాఖలను ఏర్పాటు చేసుకోవాలని ఆర్థిక శాఖ సూచించింది. ప్రస్తుతం దేశీయ తయారీ రంగంలో 40 శాతం ఉద్యోగాలను ఎంఎస్‌ఎంఈలే సృష్టిస్తుండటంతో వాటికి క్లస్టర్ ఆధారంగా రుణాలివ్వాలని పేర్కొన్న ప్రభుత్వం, ఇందుకోసం ఇప్పటికే దాదాపు 50 క్లస్టర్లను గుర్తించింది.

కింగ్‌ఫిషర్‌పై ఎస్‌ఎఫ్‌ఐఓ విస్తృత దర్యాప్తు



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: దేశంలో వైట్ కాలర్ నేరాలపై దర్యాప్తు జరిపే ఎస్‌ఎఫ్‌ఐఓ (తీవ్రమైన మోసాలపై దర్యాప్తు జరిపే సంస్థ) ప్రముఖ మద్యం వ్యాపారి విజయ్ మాల్యాకి చెందిన కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కేసులో మరిన్ని అంశాలపై దర్యాప్తు జరుపుతోంది. మాల్యాతో పాటు కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌తో సంబంధం ఉన్న సంస్థలు, వ్యక్తులు అనేక ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఎస్‌ఎఫ్‌ఐఓ తన నివేదికలో పేర్కొంది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కేసు దర్యాప్తు స్థితిగతుల గురించి కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్‌ను ప్రశ్నించగా, ఇప్పటికే ఒక నివేదిక సమర్పించిన ఎస్‌ఎఫ్‌ఐఓ ఈ కేసులో మరింత విస్తృత దర్యాప్తు జరుపుతోందని చెప్పారు. ఈ వ్యవహారంలో మాల్యాతో పాటు ఇతరులపై ఎస్‌ఎఫ్‌ఐఓ ప్రాసిక్యూషన్ కేసులను దాఖలు చేసేందుకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ అనుమతి ఇచ్చినట్లు ఇటీవల అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే ఇందుకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు.

సంస్కరణల దిశగా వెళ్లాలి

- ప్రపంచ దేశాలకు ఐఎంఎఫ్ పిలుపు

పారిస్, డిసెంబర్ 31: ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై సూర్యోదయ వేళ మరిన్ని సంస్కరణల అవసరం ఉన్నదని అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) చీఫ్ క్రిస్టిన్ లగార్డే అన్నారు. ఫ్రాన్స్‌తోపాటు ఇతర అన్ని దేశాలు సంస్కరణల దిశగా వెళ్లాలని సూచించారు. ఫ్రాన్స్‌లో ఆదివారాల్లో మాత్రమే ప్రచురితమయ్యే లీ జేడీడీ వార్తాపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 2018 ప్రపంచ వృద్ధిరేటు 3.7 శాతంగా ఉండొచ్చని అంచనా వేశారు. 2017లో తొలిసారి ఐఎంఎఫ్ తమ వృద్ధిరేటు అంచనాల్ని సవరించిందన్న ఆమె అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పెరుగుతున్న డిమాండ్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించగలదన్నారు.

ఆధార్ సీడింగ్‌కు కొత్త ఫామ్

- ఏపీవై సర్వీస్ ప్రొవైడర్లకు పీఎఫ్‌ఆర్‌డీఏ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) చందాదారుల ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానించే విషయమై వారి అనుమతి తీసుకునేందుకు సర్వీస్ ప్రొవైడర్లు సోమవారం నుంచి సవరించిన ఫామ్‌లను ఉపయోగించాలని పీఎఫ్‌ఆర్‌డీఏ (పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ) స్పష్టం చేసింది. అటల్ పెన్షన్ యోజన ఖాతాల ధ్రువీకరణ, ఆధార్ అనుసంధానం విషయమై కేంద్ర ఆర్థిక శాఖకు, ఏపీవై సర్వీస్ ప్రొవైడర్లకు మధ్య అనేక సమావేశాలు జరిగాయని, దాదాపు నెల రోజుల క్రితం జరిగిన చివరి సమావేశంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ అధికారులు పాల్గొన్నారని పీఎఫ్‌ఆర్‌డీఏ ఒక సర్క్యులర్‌లో పేర్కొంది. ఆధార్ సీడింగ్ విషయమై చందాదారుల నుంచి అనుమతి పొందేందుకు ఏపీవై రిజిస్ట్రేషన్ ఫామ్‌లో 'తగిన' మార్పులు చేశామని పీఎఫ్‌ఆర్‌డీఏ తెలిపింది.

పరుగెత్తిస్తారో.. పడగొడతారో..

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం స్థూల ఆర్థిక గణాంకాలు, ఆటో అమ్మకాల ఆధారంగా ట్రేడ్ అవుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను ప్రభుత్వ, కార్పొరేట్ సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాల ప్రభావం కూడా ఉండొచ్చని అభిప్రాయపడుతున్నారు. తయారీ, సేవా రంగాలకు సంబంధించి పీఎంఐ గణాంకాలు ఈ వారమే విడుదల కానుండగా, డిసెంబర్ నెల అమ్మకాల వివరాలను సోమవారం ఆటో కంపెనీలు ప్రకటించనున్నాయి. దీంతో వీటి ఆధారంగా మదుపరులు తమ పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకోవచ్చని మెజారిటీ మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఇక ఎప్పట్లాగే అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేస్తాయని అంటున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం కోసం కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కారు ప్రవేశపెట్టే బడ్జెట్, ప్రకటించే సంస్కరణలు కూడా మార్కెట్ తీరుతెన్నులను నిర్దేశించగలవని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రిసెర్చ్ అధిపతి వినోద్ నాయర్ అన్నారు. 'రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత అందరి చూపు 2018 బడ్జెట్‌పైనే ఉన్నది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై ఈసారి బడ్జెట్ దృష్టిపెట్టే వీలున్నది' అని యాక్సిస్ సెక్యూరిటీస్ ఎండీ, సీఈవో అరుణ్ థుక్రాల్ అన్నారు. గత వారం సూచీలు రికార్డు స్థాయిలను తాకగా, సెన్సెక్స్ 116.53 పాయింట్లు పుంజుకుని 34,056.83 వద్ద, నిఫ్టీ 37.70 పాయింట్లు అందుకుని 10,530.70 వద్ద స్థిరపడ్డాయి.

అమ్మకాల ఒత్తిడిలో ఇన్ఫోసిస్

గత వారం ట్రేడింగ్‌లో ఇన్ఫోసిస్ షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి గురయ్యాయి. దీంతో ఈ దేశీయ రెండో అతిపెద్ద ఐటీ రంగ సంస్థ మార్కెట్ విలువ రూ.11,541.88 కోట్లు హరించుకుపోయి రూ.2,26,977.90 కోట్ల వద్దకు చేరింది. ఇన్ఫీతోపాటు ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ మార్కెట్ విలువ కూడా పతనమవగా, ఈ నాలుగు సంస్థల నష్టం రూ.21,319.22 కోట్లుగా నమోదైంది. అయితే రిలయన్స్ ఇండస్ట్రీస్ సహా టీసీఎస్, హెచ్‌యూఎల్, మారుతి, హెచ్‌డీఎఫ్‌సీ, ఓఎన్‌జీసీల విలువ రూ.19,739.62 కోట్లు ఎగబాకింది. టాప్-10 సంస్థల్లో రూ.5,83,347.34 కోట్ల మార్కెట్ విలువతో రిలయన్స్ ముందున్నది.

రూ.6 వేల కోట్ల ఉపసంహరణ

దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) డిసెంబర్‌లో రూ.5,883 కోట్ల పెట్టుబడులను వెనుకకు తీసుకున్నారు. పెరిగిన ద్రవ్యలోటు, అధిక ముడి చమురు ధరలు మదుపరులను ఆందోళనకు గురిచేయడమే కారణం. అయినప్పటికీ రుణ మార్కెట్లలోకి మాత్రం ఎఫ్‌పీఐలు రూ.2,350 కోట్ల పెట్టుబడులను పట్టుకొచ్చారు. కాగా, 2017 మొత్తంగా స్టాక్ మార్కెట్లలోకి రూ.50 వేల కోట్లకుపైగా పెట్టుబడులను తెచ్చిన విదేశీ మదుపరులు.. రుణ మార్కెట్లలో మరో లక్షన్నర కోట్ల పెట్టుబడుల ప్రవాహాన్ని సృష్టించారు.

స్థూల ఆర్థిక గణాంకాలు కీలకం

కొత్త ఏడాది తొలి వారంపై నిపుణుల అంచనా

మదుపరులపై ఆటో అమ్మకాలు, ముడి చమురు ధరల ప్రభావం



స్టాక్ మార్కెట్లకు ఎంఎఫ్‌ల దన్ను

2017లో దేశీయ మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్).. స్టాక్ మార్కెట్లలోకి ఒక లక్షకుపైగా విలువైన పెట్టుబడులను పట్టుకొచ్చాయి. 2016లో కేవలం రూ.48,000 కోట్లకుపైగా పెట్టుబడులు తెచ్చిన ఎంఎఫ్‌లు.. 2017లో రూ.1.2 లక్షల కోట్లకు పెంచాయని మార్కెట్ నియంత్రణ మండలి సెబీ తెలియజేసింది. 2015లో ఇవి రూ.70,000 కోట్లుగా నమోదైనట్లు పేర్కొన్నది. స్టాక్ మార్కెట్లు ఈసారి కూడా విదేశీ మదుపరుల (ఎఫ్‌పీఐ) కంటే దేశీయ మదుపరుల పెట్టుబడులతోనే బలపడ్డాయంటూ ట్రేడింగ్ సరళిని పలువురు నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2017లో ఎఫ్‌పీఐ పెట్టుబడులు రూ.50,000 కోట్లుగా ఉంటే, 2016లో దాదాపు రూ.20,500 కోట్లకే పరిమితమయ్యాయి. 2015లోనైతే రూ.18,000 కోట్లుగానే ఉన్నాయి.

చిన్న షేర్లు.. పెద్ద లాభాలు

2017లో చిన్న షేర్లలో పెట్టిన పెట్టుబడులే మదుపరులకు పెద్ద స్థాయిలో లాభాల్ని అందించాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) స్మాల్‌క్యాప్ సూచీ 7,184.59 పాయింట్లు లేదా 59.64 శాతం ఎగబాకింది. దీంతో తక్కువ పెట్టుబడులు పెట్టిన వివిధ చోటా కంపెనీల్లోనే.. మదుపరులకు ఎక్కువ ప్రతిఫలాలు మిగిలాయి. కాగా, మిడ్‌క్యాప్ సూచీ 5,791.06 పాయింట్లు లేదా 48.13 శాతం ఎగిసింది. ఇదే సమయంలో భారీ సంస్థలతో కూడిన సెన్సెక్స్ 7,430.37 పాయింట్లు లేదా 27.91 శాతం పెరిగింది. ఈ క్రమంలో స్మాల్‌క్యాప్ ఒకానొక దశలో 19,262.44 పాయింట్ల గరిష్ఠాన్ని చేరగా, మిడ్‌క్యాప్ 17,851.03 పాయింట్ల ఆల్‌టైమ్ హైని, సెన్సెక్స్ 34,137.97 పాయింట్ల రికార్డును అందుకున్నాయి.

అవినీతే పెద్ద అవరోధం

- దేశంలో పెట్టుబడుల పట్ల విదేశీ మదుపరుల్లో అనాసక్తి
- మోదీ సర్కారు పాలనపై పెదవి విరిచిన అమెరికా సంస్థ



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: భారత్‌లో పెట్టుబడులకు అవినీతే అతిపెద్ద అవరోధమని, విదేశీ మదుపరులకు ఇప్పటికీ అదే అతిపెద్ద సవాల్ అని అమెరికా రిస్క్ మేనేజ్‌మెంట్ సంస్థ క్రోల్ వ్యాఖ్యానించింది. 2014లో కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పాటైనప్పుడు దేశంలో వ్యాపార నిర్వహణ తీరు చెప్పుకోదగ్గ స్థాయిలో మారుతుందని విదేశీ మదుపరులంతా ఆశించారని, అయితే అంచనాలకు తగ్గట్లుగా ఏమీ జరుగలేదన్నదీ న్యూయార్క్ ఆధారిత రిస్క్ కన్సల్టెన్సీ. బ్యాంకింగ్ రంగాన్ని వేధిస్తున్న నిధుల కొరత, వివాదాస్పద పన్ను నిర్ణయాలు, అధిక నిరుద్యోగం వల్ల తలెత్తుతున్న సామాజిక ఆందోళనలు, రాష్ట్ర స్థాయి రాజకీయాలు తదితర అంశాలన్నీ విదేశీ పెట్టుబడులను ప్రభావితం చేస్తున్నట్లు సదరు సంస్థ పేర్కొన్నది. భారత్‌కు.. ప్రపంచ బ్యాంకు సులభతర వాణిజ్య విధానం రేటింగుల్లో 30 స్థానాలు ఎగబాకి 100వ స్థానం దక్కింది, మూడీస్ సార్వభౌమ రేటింగ్‌లో ఒక మెట్టు పైకెక్కింది మోదీ పాలనలోనేనన్న విషయం తెలిసిందే. అయినప్పటికీ 'వ్యాపారానికి భారత్‌ను అత్యంత అనుకూలంగా మారుస్తామని చెప్పిన ప్రస్తుత నరేంద్ర మోదీ సర్కారు.. ఆ స్థాయిలో పని చేయలేకపోయింది. పలు సంస్కరణలు తెచ్చినప్పటికీ.. వాటి ఫలాలు ఇంకా అందలేదు' అని క్రోల్ మేనేజింగ్ డైరెక్టర్ తరుణ్ భాటియా పీటీఐతో అన్నారు. పెద్ద నోట్ల రద్దు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలుతో కలిగిన ఇబ్బందులను పరిష్కరించడంతోపాటు దేశంలో వ్యాపార నిర్వహణను సులభతరం చేయడంపైనే బీజేపీ ప్రభుత్వ భవితవ్యం ఆధారపడి ఉన్నదని చెప్పారు. అయితే ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చితే భారత్ వృద్ధిరేటు ఆకర్షణీయంగా ఉండటం, దివాలా చట్టం, రెరా, జీఎస్టీ తదితర సంస్కరణలు తీసుకురావడం వల్లే విదేశీ మదుపరుల్లో కొందరైనా భారత్ వైపు చూడగలుగుతున్నారని భాటియా వ్యాఖ్యానించారు. కాగా, 'కొన్ని దేశాల్లో అమలవుతున్న అతిపెద్ద సంక్షేమ పథకాల ప్రయోజనాలు అనర్హులకే అధికంగా అందుతున్నాయి. పేదలకు చేరాల్సిన సొమ్మును అధికారులు మింగేయడమో, ఆలస్యంగా ఇవ్వడమో చేస్తున్నారు' అని అవినీతిపై ప్రపంచ బ్యాంకు విడుదల చేసిన నివేదిక సైతం అభిప్రాయపడటం గమనార్హం. ఇదిలావుంటే 2017 ఆరంభంలో విడుదలైన క్రోల్ ప్రపంచ మోసాల నివేదిక ప్రకారం అవినీతి, దిగజారుతున్న కార్పొరేట్ పరిపాలన, ఆస్తుల భద్రతకు ముప్పు వంటి కారణాలతో దాదాపు 20 శాతం మదుపరులు, సంస్థలు భారతీయ వ్యాపారం నుంచి వైదొలిగినట్లు తేలింది. అలాగే అంతర్జాతీయ పారదర్శక అధ్యయనం ప్రకారం ఆసియా పసిఫిక్ దేశాల్లో భారత్‌లోనే లంచాలు అధికంగా ఉన్నాయని, ఇక్కడున్న ప్రజల్లో మూడొంతులకు రెండొంతుల మంది కనీసం టీ కోసమైనా ముడుపులు చెల్లించుకోవాల్సి వస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంలో 69 శాతంతో భారత్ మొదటి స్థానంలో ఉండగా, 65 శాతంతో వియత్నాం రెండో స్థానంలో ఉంది. పాకిస్తాన్ 40 శాతం, చైనా 26 శాతంతో ఉన్నాయి.

ఐదు టెల్కోలకు త్వరలో నోటీసులు

రూ.2,578 కోట్ల రికవరీకి డాట్ కసరత్తు



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టిన ఐదు టెలికం సంస్థల నుంచి రూ.2,578 కోట్లు వసూలు చేసేందుకు టెలికం విభాగం (డీఓటీ) సిద్ధమవుతున్నది. టాటా టెలీ సర్వీసెస్, టెలినార్, రిలయన్స్ జియో, వీడియోకాన్ టెలికం, క్వాడ్రంట్ సంస్థలు తమ రాబడులను తక్కువగా చూపి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టాయని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కొద్ది రోజుల క్రితం తమ నివేదికలో స్పష్టం చేసిన విషయం విదితమే. దీంతో ఈ ఐదు సంస్థల నుంచి రూ.2,578 కోట్లను రికవరీ చేసేందుకు డీఓటీ త్వరలో డిమాండ్ నోటీసులు జారీచేయనుందని అధికార వర్గాలు వెల్లడించాయి. పైన పేర్కొన్న ఐదు సంస్థలు తమ ఆదాయాన్ని రూ.14,800 కోట్లకు పైగా తక్కువగా చూపి ప్రభుత్వానికి లైసెన్సు ఫీజులో రూ.1,015.17 కోట్లు, స్పెక్ట్రమ్ వినిమయ చార్జీల్లో రూ.511.53 కోట్లు, చెల్లింపులు ఆలస్యమైనందుకు చెల్లించాల్సిన వడ్డీలో రూ.1,052.13 కోట్లు తక్కువగా చెల్లించడంతో ఖజానాకు దాదాపు రూ.2,578 కోట్ల నష్టం వాటిల్లిందని, ఈ విధంగా ప్రభుత్వానికి రావలసిన రాబడిలో టాటా టెలీ సర్వీసెస్ నుంచి రూ.1,893.6 కోట్లు, టెలినార్ నుంచి రూ.603.75 కోట్లు, వీడియోకాన్ నుంచి రూ.48.08 కోట్లు, క్వాడ్రంట్ నుంచి రూ.26.62 కోట్లు, రిలయన్స్ జియో నుంచి రూ.6.78 కోట్లు తగ్గిందని కాగ్ ఈ నెల 19వ తేదీన పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో పేర్కొంది. దీంతో ఈ ఐదు సంస్థల నుంచి రూ.2,578 కోట్లను రికవరీ చేసేందుకు టెలికం విభాగం మరికొద్ది రోజుల్లో డిమాండ్ నోటీసులు జారీచేసే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి.

అంబుడ్స్‌మన్ ఏర్పాటులో జాప్యంపై పార్లమెంటరీ కమిటీ ఆందోళన

ఇదిలావుంటే, టెలికం రంగంలో వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతుండటం పట్ల పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. అంబుడ్స్‌మన్‌ను ఏర్పాటు చేయాలంటూ మార్కెట్ నియంత్రణ సంస్థ ట్రాయ్ (టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) ఇప్పటికే రెండుసార్లు సిఫారసు చేసినప్పటికీ ఈ విషయంలో జాప్యం కొనసాగుతుండటం విచారకరమని ఆ కమిటీ పేర్కొంది. టెలికం రంగంలో ప్రస్తుతమున్న వ్యవస్థ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు ఏమాత్రం సరిపోవడం లేదని, కనుక ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వినియోగదారుల ఫిర్యాదులను, ఆర్థిక క్లెయిములను వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకి తీసుకొచ్చేలా ఆ చట్టాన్ని సవరించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఐటీ రంగానికి చెందిన పార్లమెంటరీ స్థాయీ సంఘం పేర్కొంది.

మరింత 'స్మార్ట్'గా..

- అత్యాధునిక ఫీచర్లతో అలరించనున్న మొబైల్ ఫోన్లు
- ఫేస్ రికగ్నైజేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీలపై తయారీదారుల దృష్టి



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: స్మార్ట్‌ఫోన్లు ఇక మరింత స్మార్ట్‌గా మారబోతున్నాయి. డ్యూయల్ కెమెరాలు, అధిక సామర్థ్యంతో కూడిన బ్యాటరీలతో రూపొందించిన స్మార్ట్‌ఫోన్లు ఈ ఏడాది దేశీయ మార్కెట్లో రాజ్యమేలితే.. 2018లో వీటి స్థానాన్ని ఫేషియల్ రికగ్నైజేషన్, ఆగ్మెంటెడ్/వర్చువల్ రియాల్టీ లాంటి ఫీచర్లతో కూడి పెద్ద స్క్రీన్ ఫోన్లు ఆక్రమించే అవకాశం కనిపిస్తోంది. సూటిగా చెప్పాలంటే వచ్చే ఏడాది మార్కెట్లోకి వచ్చే స్మార్ట్‌ఫోన్లు అత్యాధునిక ఫీచర్లతో మరింత గ్రాండ్‌గా, లైట్‌గా, స్మార్ట్‌గా రాబోతున్నాయి. ఇప్పటికే ఇటువంటి నవతరం ఆవిష్కరణలకు రంగం సిద్ధమైంది. హ్యాండ్‌సెట్ అంటే కేవలం మాట్లాడేందుకు మాత్రమే కాకుండా యజమాని దర్పాన్ని, హోదాను చాటేదిగా ఉండాలన్నది నేటి తరం వినియోగదారుల మాట. అందుకే హైరిజల్యూషన్ కెమెరా, ఆన్-డిమాండ్ మూవీ స్క్రీన్, పోర్టబుల్ మ్యూజిక్ సిస్టమ్, ఎటువంటి పనినైనా సులభంగా చేసుకునేందుకు వీలు కల్పించే ఎన్నో రకాల యాప్‌లు.. ఇటువంటి టెక్ వింతలన్నీ కేవలం ఒకే డివైజ్‌లో చేరి మన అరచేతిలో ఇమిడిపోతున్నాయి. ఇటువంటి హ్యాండ్‌సెట్లతో ఈ ఏడాదంతా హవా కొనసాగించిన తయారీదారులు వేర్వేరు ధరల్లో కొత్త మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చి 2018లో తమ పోర్టుఫోలియోను మరింత విస్తరించేందుకు సిద్ధమవుతున్నారు. సాంసంగ్, మైక్రోమ్యాక్స్, వివో లాంటి సంస్థలు వినియోగదారులకు ఫొటోలు, వీడియోల వీక్షణలో మరింత గొప్ప అనుభూతినిచ్చే 18:9 యాస్పెక్ట్ రేషియో డిస్‌ప్లేతో కూడిన డివైజ్‌లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. మొబైల్ డేటా వినియోగంలో భారతీయులు ప్రపంచంలోనే అగ్రగాములుగా అవతరించడంతో ఇటువంటి స్మార్ట్‌ఫోన్లు మార్కెట్లోకి వచ్చీ రావడంతోనే భారీ విజయాన్ని అందుకున్నాయి. ఇక ఫేషియల్ రికగ్నైజేషన్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి అత్యాధునిక టెక్నాలజీలు మరింత మందికి చేరువకావాల్సి ఉండటంతో చౌకధరకు లభ్యమయ్యే డివైజ్‌లలోనే వీటిని అందించేందుకు చైనా సంస్థలతో పాటు దేశీయంగా హ్యాండ్‌సెట్లను తయారుచేసే సంస్థలు పోటీపడుతున్నాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫీచర్లు కేవలం మొబైల్ హ్యాండ్‌సెట్లలోనే కాకుండా ఫిట్నెస్ ట్రాకర్లు, స్మార్ట్‌వాచ్‌ల లాంటి వియరబుల్స్‌లోకి కూడా ప్రవేశించి ప్రజలు తమ ఆరోగ్యాన్ని, జీవన శైలిని మెరుగుపర్చుకోవడంలో ఇతోధికంగా తోడ్పడుతున్నాయి. ఇటువంటి గాడ్జెట్ల అమ్మకాల్లో చైనా సంస్థలు దూసుకెళ్తున్నాయి. ప్రత్యేకించి దేశీయ స్మార్ట్‌ఫోన్ల మార్కెట్లో అత్యధికంగా అమ్మకాలు సాగిస్తున్న తొలి ఐదు సంస్థల్లో నాలుగు సంస్థలు (షియోమీ, ఒప్పో, వివో, లెనోవో) చైనావే కావడం విశేషం. ఈ ఏడాది ఈ జాబితాలో కొరియా సంస్థ సాంసంగ్ చాలా కాలం పాటు తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నప్పటికీ సెప్టెంబర్ చివరి నాటికి షియోమీ కూడా గట్టి పోటీదారుగా మారి సాంసంగ్ సరసన టాప్ ప్లేస్‌లో నిలిచింది. దీంతో ఇకమీదట ఈ రెండు సంస్థల మధ్య పోటీ ఎలా ఉంటుందన్న విషయం సర్వత్రా అసక్తిని రేకెత్తిస్తున్నది. ఆఫ్‌లైన్ మార్కెట్‌లో గట్టి పట్టు ఉన్న సాంసంగ్ నుంచి షియోమీకి గట్టిపోటీ ఎదురవుతుండగా, ఆన్‌లైన్ మార్కెట్‌లో అగ్రగామిగా ఉన్న షియోమీ నుంచి సాంసంగ్‌కు పెను సవాళ్లు ఎదురవుతుండటమే ఇందుకు కారణం. అయితే డోక్లాంలో భారత్-చైనా సైనిక బలగాల మధ్య తరచుగా ఉద్రిక్తతలు తలెత్తుతున్నందున ఇకమీదట దేశీయ మార్కెట్‌లో చైనా సంస్థలకు పరిస్థితులు అంత సానుకూలంగా ఉండకపోవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఇదిలావుంటే, అమెరికాకు చెందిన అంతర్జాతీయ టెక్ దిగ్గజం యాపిల్ కూడా ఈ ఏడాది విస్ట్రాన్ సంస్థతో కలిసి భారత్‌లో ఐఫోన్-ఎస్‌ఈ మోడల్ స్మార్ట్‌ఫోన్ల తయారీని ప్రారంభించింది. రోజు రోజుకూ శరవేగంగా వృద్ధిచెందుతూ ప్రపంచంలోనే అతిపెద్దదిగా అవతరించిన దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో ప్రవేశించాల్సిన ఆవశ్యకతను యాపిల్ గుర్తించినట్లు ఇది స్పష్టం చేస్తున్నప్పటికీ ఆ సంస్థ మరింత ప్రీమియం డివైజ్‌లను భారత్‌లో తయారు చేస్తుందా? లేదా? అన్నది ఇప్పటికీ ప్రశ్నార్థకంగానే మారింది. ఈ విషయంలో ముందడుగు వేసేందుకు వీలుగా తమకు పన్ను రాయితీలు, ఇతర ప్రోత్సాహకాలను అందజేయాలని కోరుతూ ఆ సంస్థ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్న విషయం తెలిసిందే. ఏది ఏమైనప్పటికీ ఈ ఏడాది దేశంలో 134 మిలియన్లుగా ఉండొచ్చని భావిస్తున్న స్మార్ట్‌ఫోన్ల అమ్మకాలు 2018లో 155 మిలియన్లకు చేరుకోవచ్చని ప్రముఖ అధ్యయన సంస్థ 'కౌంటర్‌పాయింట్' అంచనా వేసింది. వచ్చే ఏడాది దేశంలో మొత్తం 298 మిలియన్ల ఫోన్లు అమ్ముడవుతాయని, వీటిలో ఫీచర్ ఫోన్ల సంఖ్య 143 మిలియన్ల వరకూ ఉండవచ్చని భావిస్తున్నామని ఆ సంస్థ పేర్కొన్నది. 'దేశంలో ఇప్పటికీ ఎంతో మంది స్మార్ట్‌ఫోన్లను ఉపయోగించడం లేదు. వీరిలో చాలా మంది ఫీచర్ ఫోన్లతోనే సంతృప్తి చెందుతున్నారు. దీంతో ఫీచర్ ఫోన్లను వాడే వారు స్మార్ట్‌ఫోన్ల వినియోగంలోకి మారడం ఊహించిన దానికంటే ఆలస్యమవుతోంది' అని 'కౌంటర్‌పాయింట్' రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ తరుణ్ పాథక్ వివరించారు.

కొత్త ప్రాజెక్టుల్లో చౌక గృహాలదే హవా



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: దేశీయ నిర్మాణ రంగం అడుగులు చౌక గృహాల దిశగా పడుతున్నాయి. ఇన్నాళ్లూ సంపన్న వర్గాలే లక్ష్యంగా ముందుకెళ్లిన రియల్ ఎస్టేట్ సంస్థలు.. ఇప్పుడు మధ్యతరగతి వారిపై దృష్టి సారించాయి. 2017లో హైదరాబాద్‌సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో కొత్త గృహాల ప్రారంభోత్సవం 35 శాతం తగ్గినప్పటికీ, అందులో చౌక గృహాల వాటా మాత్రం 6 శాతం పెరిగింది. కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ వివరాల ప్రకారం హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, అహ్మదాబాద్, పుణె నగరాల్లో 2016లో 1,13,044 యూనిట్ల కొత్త గృహాలు ప్రారంభమైతే, 2017లో మాత్రం 73,956 యూనిట్లకు పడిపోయింది. అహ్మదాబాద్‌లో అత్యధికంగా 52 శాతం క్షీణించగా, ఆ తర్వాత హైదరాబాద్ (51 శాతం), బెంగళూరు (47 శాతం), కోల్‌కతా (45 శాతం), చెన్నై (44 శాతం), పుణె (43 శాతం), ఢిల్లీ-ఎన్‌సీఆర్ (14 శాతం), ముంబై (8 శాతం) నగరాలున్నాయి. ఇదే సమయంలో ఈఈ నగరాల్లో చౌక గృహాలు గతేడాదితో పోల్చితే 6 శాతం పెరిగి 31,241 యూనిట్లుగా నమోదయ్యాయి. 11,000 యూనిట్లతో ముంబై మొదటి స్థానంలో ఉండగా, 5,700 యూనిట్లతో పుణె రెండో ప్లేస్‌లో నిలిచింది. ఇదిలావుంటే లగ్జరీ విభాగంలో 70 శాతం పతనం కనిపించింది. 331 యూనిట్లకే వీటిని సరిపెట్టారు. కాగా, రియల్ ఎస్టేట్ నియంత్రణ చట్టం (రెరా) అమలు కారణంగానే బిల్డర్లు ఎక్కువగా కొత్త యూనిట్ల జోలికి వెళ్లలేదని కుష్‌మన్ వెల్లడించింది.


న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌ను కమ్మేసిన పొగమంచు

ఢిల్లీని కమ్మేసిన పొగమంచు

ఈ సీజన్‌లో ఇదే దారుణ వాతావరణం

350కి పైగా విమాన సర్వీసులకు అంతరాయం

పలు రైళ్ల సర్వీసులు రద్దు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: ఏడాది చివరి రోజైన ఆదివారం దేశ రాజధాని ఢిల్లీని దట్టమైన పొగమంచు కమ్మేసింది. 50 మీటర్ల పరిధిలోనే దృశ్య గోచరత లోపించింది. దీంతో రవాణా వ్యవస్థ స్తంభించింది. విమానాలు, రైళ్లు, వాహనాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. 270కి పైగా విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. 50 విమాన సర్వీసులను దారి మళ్లించారు. సుమారు 35 విమాన సర్వీసులను రద్దు చేశారు. ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 11.05 గంటల వరకు ఒక్క విమానం కూడా ఢిల్లీ విమానాశ్రయం నుంచి టేకాఫ్ కాలేదు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ (ఐజీఐ) విమానాశ్రయంలో విమానాల టేకాఫ్‌కు కనీస దృశ్యగోచరత 125 మీటర్లు. పలు రైలు సర్వీసులు రద్దయ్యాయి. మరోవైపు గాలిలో తేమ శాతం అత్యధికంగా ఉండటంతో చలిగాలులు వీస్తున్నాయి. మరోవైపు సగటు వాయు నాణ్యత సూచి 398 పాయింట్లుగా నమోదైంది. ఇది అతి పేలవ పరిస్థితిని తెలియజేస్తుందని ఎమర్జెన్సీ స్థాయిని సూచిస్తుందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) పేర్కొన్నది. ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో పొగ మంచు స్థాయి క్యూబిక్ మీటర్‌కు 297 నుంచి 499.8 (యూజీ/ఎం3)గా పడిపోయింది. ఇదే పరిస్థితులు వచ్చే 48 గంటల పాటు కొనసాగుతాయని చెప్తున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు కేంద్రం రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ప్రకారం నిర్మాణ పనులపై నిషేధం విధించే అవకాశాలు ఉన్నాయి. ఈ సీజన్‌లోనే పొగమంచు పరిస్థితి దారుణంగా మారిందని భారత వాతావరణ విభాగం డైరెక్టర్ ఆర్‌కే జెనామణి తెలిపారు. ఢిల్లీలో జనజీవన వ్యవస్థ ఆరు గంటలపాటు స్తంభించింది. మధ్యాహ్నం వాతావరణ పరిస్థితులు సాధారణస్థితికి చేరుకోవడంతో ప్రజాజీవనం యథాతథంగా కొనసాగింది. ఢిల్లీ ప్రజలు భవనాలపైకి చేరి దట్టమైన పొగమంచు చిత్రాలను తమ సెల్‌ఫోన్లలో బంధించి సోషల్ మీడియాల్లో పోస్టుచేశారు. శనివారం ఢిల్లీ కనిష్ఠ ఉష్ణోగ్రత 7.2 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రత 22.6 డిగ్రీలుగా నమోదైంది.

వ్యక్తి ఛాతీలో 'ఐస్‌పిక్' తొలగింపు

- ఎయిమ్స్ వైద్యుల ఘనత



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: ఒక యువకుడు (27) ఛాతీ పైభాగంలో ఇరుక్కుపోయిన 'ఐస్ పిక్'ను ఢిల్లీలోని ఎయిమ్స్ ట్రామా సెంటర్ వైద్యులు శస్త్రచికిత్స ద్వారా తొలిగించారు. ఐస్ పిక్ అంటే మంచుగడ్డను చిన్న చిన్న ముక్కలుగా చేసే పరికరం. మార్కెట్‌లో ఒక వ్యక్తి అతడ్ని వెనుక నుంచి 'ఐస్ పిక్'తో పొడిచాడు. అది అలాగే ఎడమ ఊపిరితిత్తి వద్ద చిక్కుపడిపోవడంతో పరిస్థితి విషమించింది. ఏ దవాఖానకు వెళ్లినా దాన్ని తొలిగించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. చివరకు ఎయిమ్స్ ట్రామా సెంటర్‌కు రావడంతో వాట్స్ (వీడియో అసిస్టెటెడ్ థొరాసిస్ సర్జరీ) విధానం ద్వారా స్వల్పంగా శస్త్రచికిత్స చేసిన దాన్ని బయటకు తీశారు. శస్త్రచికిత్స జరిగిన వారం రోజులకు అతడ్ని డిశ్చార్జి చేస్తామని వైద్యులు తెలిపారు. ఈ ఐస్ పిక్ అలాగే ఉంటే ఇన్‌ఫెక్షన్‌తో అంతర్గతంగా రక్త స్రావం జరిగి ఆయన మరణానికి దారి తీసేదని ట్రామా సెంటర్ అధిపతి డాక్టర్ రాజేశ్ మల్హోత్రా చెప్పారు.

సీరియల్‌లో అవకాశం కల్పిస్తానని బాలికపై డ్యాన్స్ టీచర్ లైంగికదాడి

- ఢిల్లీలో అరెస్ట్ చేసిన పోలీసులు

సంభాల్, డిసెంబర్ 31: టీవీ సీరియల్‌లో అవకాశం కల్పిస్తానని ఓ డ్యాన్స్ టీచర్ మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ నెల 23 తేదీన ముంబై తీసుకెళ్తున్నానని చెప్పి లైంగికదాడి చేశాడు. ఆ తర్వాత బాలిక తల్లిదండ్రులకు ఫోన్‌లో అందుబాటులో లేకుండాపోయింది. దీంతో వారు ఉత్తర్‌ప్రదేశ్‌లోని తమ స్వస్థలం సంభాల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. వారు ఢిల్లీ, ముంబై పోలీసులతో సంప్రదింపులు జరిపారు. ఆజాద్ అనే డ్యాన్స్ టీచర్‌ను శనివారం ఢిల్లీలో పోలీసులు అరెస్ట్‌చేశారు. అతనితోపాటు ఆ బాలిక కూడా ఉన్నదని ఢిల్లీ పోలీసు అధికారి ఓంకార్ సింగ్ పేర్కొన్నారు. ఆజాద్‌పై పోస్కో, 420, 363 సెక్షన్ల కింద కేసు నమోదుచేసినట్టు సంభాల్ ఏఎస్పీ పంకజ్ పాండే తెలిపారు. అతని ఆధార్ కార్డులో కొన్ని మార్పులు చేసినందుకుగాను 467 కింద కేసు పెట్టినట్టు వివరించారు. ఈ ఘటనను 'లవ్ జిహాదీ'గా హిందూ జగరణ్ మంచ్ అభివర్ణించింది. ఈ కేసులో జిల్లా అధికారులు, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఆ సంస్థ ప్రతినిధి కపిల్ దివానా డిమాండ్ చేశారు.

బ్యాంకాక్‌లో సమావేశమైన భారత్, పాక్ ఎన్ఎస్‌ఏలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 31: భారత్, పాక్ జాతీయ భద్రతా సలహాదారులు అజిత్ దోవల్, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ నజీర్‌ఖాన్ జాంఝువా గత మంగళవారం బ్యాంకాక్‌లో సమావేశమయ్యారు. పాక్ రాజధాని ఇస్లామాబాద్‌లో కుల్‌భూషణ్ జాదవ్‌ను ఆయన తల్లి అవంతి, భార్య చేతన్‌కుల్ కలుసుకున్న మరుసటి రోజే దోవల్, నజీర్‌ఖాన్ సమావేశమయ్యారని ఒక ఆంగ్ల దినపత్రిక ఆదివారం వార్తాకథనం ప్రచురించింది. కుల్‌భూషణ్ జాదవ్‌తో కుటుంబ సభ్యుల భేటీతో సంబంధం లేకుండా ముందస్తుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే వీరి సమావేశం జరిగిందని తెలుస్తున్నది. రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో భారత్ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మాట్లాడుతూ పాక్ సైన్యం మద్దతుతో కశ్మీర్ లోయలో నియంత్రణ రేఖ (ఎల్వోసీ) వెంబడి ఉగ్రవాదుల చొరబాట్ల అంశాన్ని ప్రస్తావించారు. వారిద్దరూ దేశ భద్రత, ఉగ్రవాదం, ద్వైపాక్షిక అంశాలపై చర్చించారని ఈ వార్తాకథనం పేర్కొన్నది.


హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో తొలి సభ్యత్వాన్ని స్వీకరిస్తున్న పవన్‌కల్యాణ్

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

- తొలి సభ్యత్వాన్ని స్వీకరించిన పవన్‌కల్యాణ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జనసేన పార్టీ సభ్యత్వ నమోదును ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రారంభించారు. ఆదివారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో తొలి సభ్యత్వాన్ని పవన్‌కల్యాణ్ స్వీకరించినట్టు జనసేన ఒక ప్రకటనలో తెలిపింది. త్వరలోనే రెండురాష్ట్రాల్లో సభ్యత్వ నమోదును చేపట్టనున్నట్టు పేర్కొన్నది. మూడురోజులుగా పార్టీ కార్యాలయంలో అనుచరులతో సమావేశమైన పవన్.. కొత్త సంవత్సరంలో హైదరాబాద్‌లో వర్క్‌షాప్ నిర్వహించాలని నిర్ణయించారని పార్టీ వివరించింది.

పతంగుల పండుగతో తెలంగాణ రుచులు!

జనవరి 13, 14, 15 తేదీల్లో పరేడ్ గ్రౌండ్స్‌లో

అంతర్జాతీయ కైట్, స్వీట్స్, తెలంగాణ రుచుల పండుగ

వెయ్యి మంది కళాకారులతో సాంస్కృతిక ప్రదర్శనలు • రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ ఏర్పాట్లు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతికశాఖ సరికొత్త పండుగలు నిర్వహించనున్నది. ఏటా నిర్వహించే అంతర్జాతీయ పతంగుల పండుగతోపాటు అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్, తెలంగాణ సాంస్కృతికోత్సవం, తెలంగాణ రుచుల పండుగ వంటి ఉత్సవాలను కూడా కలిపి చేయడానికి కార్యక్రమాల్ని రూపొందించింది. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగంగా ఈ ఉత్సవాలను ఏర్పాటు చేస్తున్నారు. సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులకు, ప్రజలకు విందు, వినోదం కల్పించే ఉద్దేశంతో జనవరి 13,14,15 తేదీలలో పరేడ్‌గ్రౌండ్స్‌లో ఈ ఉత్సవాలన్నింటినీ ఏర్పాటు చేస్తున్నది. ఈ సందర్భంగా వేయి మంది కళాకారులు వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తారు. గత మూడేండ్లుగా రాష్ట్ర పర్యాటకశాఖ పతంగుల పండుగ నిర్వహిస్తున్నది. మన రాష్ట్రం నుంచే గాకుండా దేశవిదేశాలవారు ఇక్కడికి వచ్చి పతంగులు ఎగురేయడం సంప్రదాయంగా మారింది. సింగపూర్, మలేషియా, కెనడా, బ్రిటన్, అమెరికా, దుబాయ్ తదితర దేశాల నుంచి కశ్మీర్, హిమాచలప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కేరళ,కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పతంగులను ఎగురేయటంలో ఆరి తేరినవారు రానున్నారు. ఈ పండుగలో పాల్గొంటామని ఇప్పటికే 20 దేశాలకు చెందినవారు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా వచ్చేవారు హైదరాబాద్‌లో పర్యటించి నగరంలోని చారిత్రక ప్రదేశాలను తిలకించేందుకు పర్యాటకశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. విదేశాల నుంచి వచ్చేవారికి వసతి సదుపాయాలను కూడా కల్పించనున్నది. ఎక్కువ మంది ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు, చాలా మంది వచ్చి చూసేందుకు వీలుగా ఉత్సవాలు నిర్వహించే స్థలాన్ని సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌కు మార్చారు. ప్రతీరోజు రాత్రి 9గంటల వరకు పతంగులను ఎగురవేయనున్నారు. రాత్రివేళ రంగురంగుల బ్యాటరీ దీపాలు అమర్చిన పతంగులను గాలిలో ఎగురేసి వీక్షకులను రంజింప జేస్తారు. ఇక స్వీట్స్ ఫెస్టివల్‌లో భాగంగా వెయ్యి రకాల మిఠాయిలను పరేడ్‌గ్రౌండ్స్‌లో ప్రదర్శిస్తారు. వివిధ రాష్ట్రాలు, వివిధ దేశాల నుంచి హైదరాబాద్‌లో నివసిస్తున్న మిఠాయి తయారీదారుల చేత తయారుచేయిస్తారు. వివిధ వర్గాల కుటుంబాల వారు వారి ఇండ్లలో తయారు చేసుకునే రకరకాల తీపి తినుబండారాలు కూడా ప్రదర్శనలో లభిస్తాయి. స్వీట్స్ ఫెస్టివల్‌లో పాల్గొనడానికి కూడా దేశదేశాలవారు, సంఘాలు ఆసక్తి చూపుతున్నారు. మిఠాయిలతోపాటు ఇతర వంటకాలతో కూడిన తెలంగాణ రుచులను కూడా ఈ సందర్భంగా చవి చూడవచ్చు. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఫతేమైదాన్‌లో నిర్వహించిన తరహాలో తెలంగాణ హోటలియర్స్ అసోసియేషన్ 70 రకాల వంటకాలతో 70 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తుంది. ఈ మేరకు పెద్ద ఎత్తున అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖల కార్యదర్శి బుర్రా వెంకటేశం, డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు.

న్యూ ఇయర్ ఈవెంట్లపై ఎక్సైజ్ నిఘా

- 56 ప్రత్యేక బృందాలతో తనిఖీలు
- 80 మందితో డెకాయ్ టీంల ఏర్పాటు
- 12 డ్రగ్ టెస్టింగ్ బృందాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: న్యూఇయర్ వేడుకల ఈవెంట్లపై ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. 56 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేసి ఈవెంట్లపై డేగకన్నుతో ఎటువంటి అపశ్రుతులు ఏర్పడకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. 80 మందితో కూడిన రహస్య డెకాయ్ బృందాలను సాధారణ జనాలతో కలిసి ఈవెంట్లకు వెళ్లి అక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి న్యూఇయర్ వేడుకలు ప్రశాంతంగా సాగేలా చర్యలు తీసుకున్నారు. 12 డ్రగ్ టెస్టింగ్ బృందాలను ఏర్పాటు చేశారు.

నిరంతర తనిఖీలు

తనిఖీలు చేపట్టేందుకు ఎక్సైజ్‌శాఖ 56 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను నియమించింది. కమిషనర్లు, ఆరుగురు ఎక్సైజ్ సూపరింటెండెంట్లు తొమ్మిది మంది అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, నలభై మంది సీఐలు ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక కూడా తనిఖీలు నిర్వహించారు. ఒక్కో బృందంలో ఒక సీఐ స్థాయి అధికారి, ఒక ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు మరో 200 మంది ఎక్సైజ్ కానిస్టేబుళ్లు విధుల్లో పాలుపంచుకున్నారు. స్పాట్ డ్రగ్ టెస్టింగ్ కిట్లకు సంబంధించి 12 బృందాలు ముమ్మరంగా తనిఖీలు చేశాయి.

ఆడంబర వివాహాలకు చెల్లుచీటీ?

- విపరీతమైన ఖర్చులపై పరిమితి
- లోక్‌సభ ముందుకు ప్రైవేట్ మెంబర్ బిల్లు
- బిల్లు ఆమోదం పొందే అవకాశాలు తక్కువే



ముంబై: రూ.కోట్లకు కోట్లు తగలేసి అత్యంత ఆడంబరంగా జరిపించే వివాహాలకు ఇక నుంచి అవకాశం ఉంటుందా? ఉండదా? అన్నది ప్రస్తుతం చర్చినీయాంశంగా మారింది. వివాహ ఖర్చులపై పరిమితి విధించే అంశంపై ముంబై నార్త్ నియోజకవర్గానికి చెందిన బీజేపీ ఎంపీ గోపాల్ శెట్టి లోక్‌సభలో ప్రైవేటు మెంబర్ బిల్లును ప్రవేశపెట్టారు. భారీఎత్తున ఖర్చుపెట్టి నిర్వహించే వివాహాలపై ఆయన అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. ఒకవేళ బిల్లు ఆమోదం పొందింతే వివాహ ఖర్చు అనే అంశం చట్ట పరిధిలోకి వస్తుంది. వివాహ ఖర్చులపై చట్టం ప్రకారం ప్రభుత్వ నియంత్రణ ఉండాలని ఆయన కోరుతున్నారు. 'వివాహాల్లో పెట్టే అపరిమిత ఖర్చుల నివారణ, నిషేధం' అనే ప్రైవేటు మెంబర్ బిల్లును శుక్రవారం ఆయన లోక్‌సభ ముందుంచారు. 'ఈ అంశంపై విస్తృత చర్చ జరుగాలనే ఉద్దేశంతోనే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం జరిగింది. ఈ బిల్లు చట్టరూపం దాల్చకపోయినా.. లోక్‌సభలో దీనిపై చర్చ జరుగడం వల్ల ప్రజలు కనీసం దీని గురించి ఆలోచిస్తారు. దేశంలో కొంతమంది పెండ్లిండ్ల కోసం భారీగా ఖర్చు చేస్తుండగా.. మరి కొంత మందికి పెండ్లి చేసుకోవడానికి డబ్బులు ఉండటం లేదు. ఈ విషయంలో కొంతైనా సమానత్వం ఉండాలి. నా నియోజకవర్గంలో పెద్దఎత్తున ఖర్చుపెట్టి పెండ్లి చేసేవారిని.. పేద యువతీ, యువకులకు పెండ్లి చేయాలని నేను కోరుతున్నాను. ఇది కొంతమేర సత్ఫలితాలిస్తున్నది. డబ్బున్నవారు ఖర్చుపెట్టొద్దనేది నా ఉద్దేశం కాదు. కానీ పేదలపై కొంత దయ చూపాలి' అని గోపాల్ శెట్టి పేర్కొన్నారు. కాగా పార్లమెంట్‌లో ప్రైవేటు మెంబర్ బిల్లులు ఆమోదం పొందడం అన్నది చాలా అరుదైన విషయం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కేవలం 14 ప్రైవేటు మెంబర్ బిల్లులు మాత్రమే ఆమోదం పొందాయి. 2017 ఫిబ్రవరిలో కూడా కాంగ్రెస్ ఎంపీ రంజీత్ రాజన్ ఇటువంటి బిల్లును ప్రవేశపెట్టారు.

జన్యుపరమైన వ్యాధితో ఆధార్‌కు అనర్హం

వేలిముద్రలు మారిపోతుండటంతో అర్హత కోల్పోయిన బాలిక



న్యూఢిల్లీ, డిసెంబర్ 31: జన్యుపరమైన వ్యాధి ప్రభావంతో వేలి ముద్రలు మారిపోవడం వల్ల ఆధార్ కార్డు పొందేందుకు అనర్హురాలైంది ఓ 14 ఏండ్ల బాలిక. వ్యక్తిగత గోప్యతకు ప్రమాదం వాటిల్లుతున్నదని ఇప్పటికే ఆధార్‌ను వ్యతిరేకిస్తున్న వారిలో ఇప్పుడు తానూ చేరింది. ఆధార్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేపట్టింది. ఢిల్లీకి చెందిన 14 ఏండ్ల ఇదియాపాల్ ఆధార్‌కార్డుకు వ్యతిరేకంగా ఈ ఏడాది ఓ కార్టూన్ వేసింది. ఐదేండ్ల కిందటే ఫేస్‌బుక్‌లో 'ఆధార్ వద్దు' అని రూపొందించి ఉన్న పేజీని రీకాల్‌చేసింది. అందులో ఈ కార్టూన్ పోస్టు చేసింది ఇదియా పాల్. అప్పట్లోనే తండ్రి అదారిశ్ పాల్, కుటుంబసభ్యులకు సన్నిహితుడైన గౌరవ్ సత్యప్రకాశ్‌తో కలిసి ఆధార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలోని బహదూర్ షా జఫర్ మార్గ్‌లో నల్ల బ్యానర్ పట్టుకుని నిరసన తెలిపింది. ఆధార్ ఉద్దేశం గురించి చెప్తూనే, అది వ్యక్తిగత గోప్యతను బయటపెడుతున్నదని ప్రజలకు వివరించింది. ఈ బాలికకు ఇటీవల మార్ఫాన్ లక్షణాలతో జన్యుపరమైన వ్యాధి సోకినట్టు నిర్ధారణ అయింది. వ్యాధి ప్రభావం నెమ్మదిగా శరీరంలోని అన్ని భాగాలకు చేరింది. దీంతో తన చేతి వేలిముద్రలు సైతం మారిపోతున్నాయి. తాను జన్యుపరమైన వ్యాధి బారినపడ్డానని, ఇది ఇతర అవయవాలు, కణాలపై ప్రభావం చూపుతుందని ఇదియా చెప్పారు. వ్యాధి ప్రభావంతో వేలిముద్రలు మారిపోతున్నాయని, దీనివల్ల ఆధార్ పొందేందుకు అర్హతలేకుండాపోయిందని పేర్కొన్నారు. దీంతో ఆధార్ కింద కలిగే ప్రయోజనాలు పొందలేకపోతున్నానని తెలిపారు. 'వ్యక్తుల గుర్తింపు.. ఒక కార్డులో దాచడమేంటి? అవసరమైన వాళ్లు ఆధార్ తీసుకోవచ్చు. అవసరంలేనివారు తీసుకోకపోయినా ఏంకాదు అనేలా ఉండాలి. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు. కేవలం ఆధార్‌కు వ్యతిరేకం' అని ఇదియా వివరించారు.

ముందస్తు ఎన్నికలకు వెళ్లనున్న కేంద్రం?

- రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో ఓటమి భయంతోనే..
- ఛత్తీస్‌గఢ్‌లోనూ ఎదురుగాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్రం ముందస్తు ఎన్నికలకు వెళ్లడానికి సిద్ధమవుతున్నట్టు తెలుస్తున్నది. గుజరాత్ రాష్ట్ర ఎన్నికల ఫలితాలను విశ్లేషించుకున్న తరువాత అధికార బీజేపీ అంతర్మథనంలో పడిందని సమాచారం. ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో బీజేపీ ఒడ్డునపడ్డా అది గెలుపు కాదని, ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలడంతో గెలిచినట్టుగా పార్టీ అంచనా వేస్తున్నది. కేవలం నాలుగుశాతం ఓట్ల తేడాతోనే కాంగ్రెస్ ఓడిపోయింది. గతంలో కంటే 20 సీట్లు అదనంగా కాంగ్రెస్‌కు వచ్చాయి. గుజరాత్ ఫలితాలను విశ్లేషిస్తే కాంగ్రెస్ దేశంలో బాగా పుంజుకుందని బీజేపీ వర్గాలు అంచనా వేస్తున్నట్టు సమాచారం. గుజరాత్ ఫలితాలు బీజేపీని ఆందోళనకు గురి చేస్తున్నాయి. దేశవ్యాప్తంగా బీజేపీ అంతర్గతంగా నిర్వహించిన సర్వేల్లో కూడా పరిస్థితి అంతంతమాత్రంగానే ఉందని తెలిసింది. దీంతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు సిద్ధం కాకముందే ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. ఇదే సమయంలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు 2018 డిసెంబర్‌లో ఎన్నికలు జరుగనున్నాయి. సాధారణ ఎన్నికలకు అతి సమీపంలోనే ఈ ఎన్నికలు జరుగనున్నాయి. సాధారణ ఎన్నికలకు ముందు ఈ రాష్ట్రాల ఎన్నికలు జరిగితే వీటి ఫలితాలు సాధారణ ఎన్నికలపై ప్రభావం చూపుతాయి. ఇప్పటికే రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలో బీజేపీ పరిస్థితి ఏమీ బాగాలేదు. ఈ రెండు రాష్ట్రాలలో ప్రభుత్వ వ్యతిరేకత బాగా ఉంది. రెండు చోట్లా బీజేపీ ఓడిపోయే వాతావరణం కూడా ఉందని సొంత పార్టీనేతలు అంచనా వేస్తున్నట్టు తెలిసింది. ఛత్తీస్‌గఢ్‌లో కూడా ప్రభుత్వ వ్యతిరేకత ఉన్నది కానీ, ఇక్కడ రమణ్‌సింగ్‌ను తట్టుకొని కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చే బలమైన నేతలు లేరని అంచనా వేస్తున్నారు. సొంతపార్టీ పరిపాలన చేస్తున్న రాష్ట్రాలలో ఎదురుగాలి వీస్తుండడంతో ఆ రాష్ట్రాల ఎన్నికల తరువాత సాధారణ ఎన్నికలు నిర్వహిస్తే భారీఎత్తున నష్టపోవాల్సి వస్తుందని బీజేపీ అగ్రనాయకత్వం భావిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల ఎన్నికలను కొద్దికాలం వాయిదా వేయాలి.. లేదా కేంద్రం ముందస్తు ఎన్నికలకన్నా వెళ్లాల్సి ఉంటుంది. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాలలో ఎన్నికలను వాయిదా వేయాలంటే తప్పనిసరిగా పార్లమెంటులో చట్టసవరణ చేయాల్సి ఉంటుంది. ఇది చిక్కులతో కూడుకున్న వ్యవహారం. కానీ ముందస్తు ఎన్నికలకు వెళ్లాలనుకుంటే పాలకపార్టీ ఇష్టాయిష్టాల పైనే ఆధారపడి ఉంటుంది. ప్రభుత్వాన్ని రద్దుచేసుకొని ఎన్నికలకు వెళ్లవచ్చు. ఈ మూడు రాష్ట్రాల ఎన్నికలతో పాటు ముందస్తుగా సాధారణ ఎన్నికలకు వెళితే ఎవరికి వచ్చే ఓట్లు వారికి వస్తాయని, సాధారణ ఎన్నికలపై ఏ ప్రభావమూ పడదని బీజేపీ భావిసున్నట్టు తెలిసింది. ఏదిఏమైనా ముందస్తు ఎన్నికలకు వెళ్లడమే మంచిదని బీజేపీ నాయకత్వం, ప్రధాని మోదీ యోచిస్తున్నట్టు తెలుస్తున్నది.


ఘటనా స్థలిలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

అంతిమయాత్రలో ఆత్మాహుతి దాడి

- ఆఫ్ఘనిస్థాన్‌లో 18 మంది మృతి.. 14 మందికి గాయాలు

జలాలబాద్, డిసెంబర్ 31: ఆఫ్ఘనిస్థాన్‌లోని జలాలబాద్ జిల్లాలో ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. హస్కమీనా జిల్లాకు చెందిన మాజీ గవర్నర్ అంతిమయాత్రలో ఓ ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడగా.. 15 మంది మృతిచెందారని, 14 మంది గాయపడ్డారని నన్‌గ్రహార్ గవర్నర్ అధికార ప్రతినిధి అత్తాఉల్లాహ్ ఖోగ్యానీ ఆదివారం తెలిపారు. మోటార్ సైకిల్‌పై వచ్చిన దుండగుడు దానికి అమర్చిన బాంబులను పేల్చినట్టు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. దాడికి బాధ్యత వహిస్తున్నట్టు ఏ ఉగ్రవాద సంస్థ ప్రకటించలేదు. నన్‌గ్రహార్‌లో ఐఎస్ ఉగ్రవాదులకు పట్టు ఉన్నది. ఇటీవల కాబూల్‌లో షియాలు లక్ష్యంగా పేలుళ్లకు పాల్పడింది తామేనని ఐఎస్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

భవిష్యత్‌లో సొంత ప్రోగ్రామింగ్ చేసుకునే రోబోలు

- ముంబై టెక్‌ఫెస్ట్‌లో రోబో సోఫియా వెల్లడి


మాట్లాడుతున్న రోబో సోఫియా

ముంబై, డిసెంబర్ 31: వేటికవే సొంతంగా ప్రోగ్రామింగ్ చేసుకునే మరమనుషులు భవిష్యత్‌లో రానున్నాయి. సౌదీఅరేబియానుంచి పౌరసత్వం పొందిన తొలి మానవీయ రోబో సోఫియా ఈ విషయాన్ని వెల్లడించింది. ముంబై ఐఐటీ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన సాంకేతిక వేడుకల్లో సోఫియా అందరినీ ఆకర్షించింది. భారత్‌లో సోఫియా పర్యటించడం ఇదే తొలిసారి. తెలుపు-నారింజరంగు చీరలో ఈ కార్యక్రమానికి వచ్చిన సోఫియా సభికులకు 'నమస్తే' అంటూ పలుకరించింది. ఈ సందర్భంగా ఐఐటీ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సోఫియా సమాధానమిచ్చింది. 'ప్రస్తుతం నా ప్రోగ్రామింగ్ చేయడానికి మనిషి అవసరం. కానీ భవిష్యత్‌లో మనుషుల్లాగే రోబోలు సొంతంగా ప్రోగ్రామింగ్ చేసుకుంటాయి. అందుకు ఏడు నుంచి 75ఏండ్లవరకు ఎంతకాలమైనా పట్టొచ్చు' అని సోఫియా తెలిపింది. రోబోలు తమ స్థానాన్ని ఆక్రమిస్తాయని మనుషులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రోబోలు మానవ సంక్షేమానికే ఉపయోగపడుతాయని పేర్కొన్నది. ప్రపంచవ్యాప్తంగా అసహనం పెరుగుతునదని మరో విద్యార్థి ఆందోళన వ్యక్తంచేయగా, మనుషులు తోటివారిపట్ల ప్రేమాభిమానాలతో వ్యవహరిస్తే అసహనానికి తావుండదని సోఫియా సూచించింది. సోషల్‌మీడియా యూజర్ ఒకరు సభావేదికపై పెండ్లి ప్రతిపాదన చేయగా, సోఫియా సున్నితంగా తిరస్కరించింది. ఐదువేల మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

టీఈటీజీవోఏ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నాంపల్లిలోని గెజిటెడ్‌భవన్‌లో తెలంగాణ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎంబీ కృష్ణయాదవ్, టీఈటీజీవోఏ గౌరవ అధ్యక్షుడు ఎం మోహన్‌నారాయణ, ప్రధాన కార్యదర్శి పీ శ్రీనివాస్‌రావు, కోశాధికారి పీ వెంకటేశ్వరరావు, సీతారాములు, అశోక్‌కుమార్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

4న టీఎన్జీవో డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో జనవరి నాలుగున టీఎన్జీవో డైరీ ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు కారం రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాజేందర్ ఆదివారం తెలిపారు. శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, మంత్రి హరీశ్‌రావు, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గుండవరపు దేవీ ప్రసాద్ తదితరులు ఈ సభకు అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

తలాక్‌పై ఒవైసీ వ్యాఖ్యలు సరికాదు

- కేంద్ర మాజీ మంత్రి దత్తాత్రేయ



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ముస్లిం మహిళల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టంగా తీసుకొస్తున్న త్రిపుల్ తలాక్ రద్దుపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలు సరికావని కేంద్ర మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ బండారు దత్తాత్రేయ హితవు చెప్పారు. త్రిపుల్ తలాక్ 1,400 ఏండ్లుగా మైనార్టీ మహిళల జీవితాలను అంధకారం చేస్తుండగా సుప్రీంకోర్టు తీర్పుతో ఆ ఇబ్బందులకు చెక్‌పెట్టేలా ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారని ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో చెప్పారు. ముస్లింల గురించి ఎంఐఎం ఏనాడూ ఆలోచించలేదని, ఆ పార్టీ నాయకుడు అసద్ తమపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తలాక్ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేయడాన్ని హర్షిస్తూ ఏఐసీసీ మహిళా విభాగ కార్యదర్శి నసిమా బీజేపీలో చేరారు. ఆమెకు దత్తాత్రేయ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

తమిళనాడులో రెండు బస్సులు ఢీ

- ముగ్గురు బాలలతోపాటు తొమ్మిది మంది మృతి

దిండిగల్, డిసెంబర్ 31: తమిళనాడులోని దిండిగల్ జిల్లా పరిధిలో ఆదివారం రెండు బస్సులు ఒకదానితో మరొకటి ఢీ కొనడంతో ముగ్గురు బాలలతోపాటు తొమ్మిది మంది మరణించారు. పలువురు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. పలని నుంచి దిండిగల్‌కు వెళుతున్న ప్రైవేట్ బస్సు ప్రయాణికులని పోలీసులు తెలిపారు. దిండిగల్ నుంచి కోయంబత్తూర్ వెళుతున్న తమిళనాడు రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన బస్సును ప్రైవేట్ బస్సు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఉదాంచతిరాం వద్ద ఈ ఘటన జరిగింది. అయితే ఘటనాస్థలిలోనే ఇద్దరు మరణించగా, నలుగురు దిండిగల్ దవాఖానలో, మరో ముగ్గురు ఉదాంచతిరాం దవాఖానలో మరణించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నదని పోలీసులు చెప్పారు.



సిరిసిల్లలో అయుత చండీయాగం నిర్వహిస్తున్న రుత్విక్కులు

యాగం పరిపూర్ణం

సిరిసిల్ల, నమస్తేతెలంగాణ: విశ్వశాంతి, లోక కల్యాణం కోసం శ్రీహరిహరపుత్ర అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల మానేరు నదీ తీరాన చేపట్టిన అయుత చండీ మహాయాగం పరిపూర్ణమైంది. ఐదురోజులపాటు నిర్విఘ్నంగా కొనసాగిన మహాక్రతువు ఆదివారం మహాపూర్ణాహుతితో పరిసమాప్తమైంది. వేద పండితుల పారాయణంతో కార్య క్షేత్రం పునీతమైంది. యాగం ఆఖరి రోజు కావడంతో భక్తులు 50వేలకు పైగా తరలివచ్చారు. చివరిరోజు విశిష్ట అతిథులుగా కరీంనగర్ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి, రాష్ట్ర సహకార బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్‌రావుకు కార్యక్రమ నిర్వాహకుడు రాచ విద్యాసాగర్, కోఆర్డినేటర్ చీటి నర్సింగరావు స్వాగతం పలికారు.



యాదాద్రిలో శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు, (ఇన్‌సెట్)శ్రీరామచంద్రమూర్తిగా స్వామివారు

శ్రీరామచంద్రమూర్తిగా శ్రీలక్ష్మీనరసింహుడు

శ్రీలక్ష్మీనరసింహస్వామివారి అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు శ్రీరామచంద్రమూర్తి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆదివారం ఉదయం స్వామి వారు శ్రీరామునిగా, రాత్రి శ్రీవేంకటేశ్వరునిగా భక్తులు దర్శించుకున్నారు. లోకకల్యాణార్థం నిర్వహించే ఉత్సవాల్లో దుష్టశిక్షణ, శిష్ట రక్షణ కోసం ఆయా కాలాల్లో భక్తులను కాపాడేందుకు ఆవిర్భవించిన అవతార విశేషాలను ప్రధాన అర్చకులు నల్లందీగల్ లక్ష్మీనరసింహాచార్యులు వివరించారు. యాదాద్రి పంచనారసింహ క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆలయంలో శ్రీసత్యనారాయణ స్వామివారి సామూహిక వ్రతాలు భారీగా జరిగాయి. శ్రీవారి ఖజానాకు రూ.13,81,259 ఆదాయం సమకూరింది.

-యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ

S & D



వైరాలో భగీరథ ట్రయల్‌రన్ ప్రారంభించేందుకు బుల్లెట్‌పై వెళ్తున్న మంత్రి తుమ్మల

ఉగాది నుంచి ఇంటింటికీ భగీరథ నీరు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వైరా, నమస్తే తెలంగాణ: ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలోని ప్రతి ఇంటికి మంచి నీటిని అందించేందుకు సీఎం కేసీఆర్ భగీరథ ప్రయత్నం చేసి మిషన్ భగీరథ పథకానికి శ్రీకారం చుట్టారని రోడ్లు భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం జిల్లా వైరా రిజర్వాయర్ వద్ద నిర్మించిన మిషన్ భగీరథ పథకం ట్రయల్ రన్‌ను ఆదివారం ఆయన వైరా ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం తుమ్మల విలేకరులతో మాట్లాడుతూ.. ఉగాది నుంచి రాష్ట్రంలోని ప్రతి ఇంటికి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనున్నదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం కంటే ఏడాది ముందుగానే భగీరథ నీటిని అందించనున్నదని తెలిపారు.



నిర్మల్‌లో మిషన్ భగీరథ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

మిషన్ భగీరథ దేశానికే ఆదర్శం

- నిర్మల్‌లో భగీరథ పనుల ప్రారంభోత్సవంలో మంత్రి అల్లోల

నిర్మల్ టౌన్: మిషన్ భగీరథ పథకం దేశానికి ఆదర్శమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఈ పథకాన్ని ఇతర రాష్ట్రాలు అమలుచేసేందుకు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. నిర్మల్‌లోని గాంధీ పార్కులో రూ.40కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అంతకుముందు పోలీస్ కమాండ్ కంట్రోల్ కార్యాలయాన్ని ఎస్పీ, కలెక్టర్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు.



పెద్దరేవల్లిలో వెంకన్న జాతర బండ్ల ఊరేగింపులో మంత్రి లక్ష్మారెడ్డి

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి

జడ్చర్ల, నమస్తే తెలంగాణ: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం పెద్ద రేవల్లిలోని తిరుమల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలతోపాటు చిన్న రేవల్లిలోని మల్లికార్జునస్వామి ఆలయాల్లో ఆదివారం మంత్రి లక్ష్మారెడ్డి పూజలు చేశారు. టీటీడీ తరహాలో యాదాద్రిని అభివృద్ధి చేయనున్నట్టు చెప్పారు. జడ్చర్లలోని రంగనాయకుల గుట్టను పర్యాటక కేంద్రంగా.. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఆంజనేయస్వామి ఆలయా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు.



అధికారులతో కలిసి ఘణపురం బ్రాంచ్ కాల్వ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ప్రతి ఎకరాకు సాగునీరు

- ఘణపురం బ్రాంచ్ కెనాల్‌ను పరిశీలించిన నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం: ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతుల నిరీక్షణకు విముక్తి కలిగించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం మామిడిమాడలో జరుగుతున్న ఘణపురం బ్రాంచ్ కాల్వ పనులను ఆదివారం పరిశీలించారు. పనులను వేగంగా చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు సూచించారు. పనుల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకుని, తర్వాత మ్యాప్‌ను పరిశీలించారు.



మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం ఎదెళ్ల గుట్ట వద్ద జరుగుతున్న పాలేరు వాటర్‌గ్రిడ్ హెడ్‌వర్క్ పనులను డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆదివారం పరిశీలించారు. ఫిల్టర్‌బెడ్, కెమికల్, సంపుహౌస్, పంప్‌హౌస్, షెడ్ మెయింటనెన్స్, వాటర్ ట్యాంకుల నిర్మాణ పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

- మరిపెడ, నమస్తే తెలంగాణ

కాళేశ్వరం ప్రాజెక్టు మన బతుకుదెరువు

సీఎం కేసీఆర్ ఆదేశంతో నీళ్లు తెచ్చే పనిలో ఉన్నా.. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో రాష్ట్రంలో సిద్దిపేట ఫస్ట్.. భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట ప్రతినిధి, నమస్తే తెలంగాణ: 'తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావడం.. సీఎంగా కేసీఆర్ ఉండటం.. మీ దయతో నేను నీళ్ల మంత్రి కావడం.. ఆ నీళ్లు తెచ్చే పనిలోనే ఉన్నా.. మన బతుకుదెరువు కాళేశ్వరం ప్రాజెక్టు... మూడు ట్రిప్పులుగా రాత్రింబవళ్లు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రైతన్నల బాధలు తీరాలంటే కాళేశ్వరం నీళ్లు రావాల్సిందే.. ఆ రోజులు దగ్గర్లోనే ఉన్నాయి' అని రాష్ట్ర భారీనీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం నారాయణరావుపేటలో రాత్రి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. అంతకుముందు సిద్దిపేటలో క్లాక్ టవర్‌ను, మినీ స్టేడియంలో క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సమావేశాల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో భాగంగా రోజుకు రెండు లక్షల సిమెంట్ బస్తాల పని జరుగుతుందని, 20 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని రాత్రింబవళ్లు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో చురుగ్గా సాగుతున్నదన్నారు. మూడురోజులపాటు కాళేశ్వరం ప్రాజెక్టు పనులు రాత్రీపగలు తేడా లేకుండా పరిశీలించడం జరిగిందన్నారు. ఈ ప్రాంతానికి రంగనాయకసాగర్ రిజర్వాయర్ ద్వారా సాగునీటిని అందిస్తామని చెప్పారు. 3 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న ఈ రిజర్వాయర్‌తో ఈ ప్రాంతం కరువు తీరుతుందన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధరతో ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేసిందని చెప్పారు. సమైక్య పాలనలో మున్సిపాలిటీలకు రూ.10 కోట్ల నిధులు కావాలంటే గగనమయ్యేదని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ఎన్ని నిధులైనా ఇస్తున్నారన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో సిద్దిపేట రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని.. ఇందుకు ప్రజల భాగస్వామ్యం, పురపాలక సంఘం పనితీరే కారణమని మంత్రి అన్నారు. గ్రామీణక్రీడాకారులను జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారు చేసేందుకు హెచ్‌సీఏ ప్రణాళికలు రూపొందించిందన్నారు. సిద్దిపేటలో జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు క్రీడా మైదానాలు సిద్ధం చేశామన్నారు. రూ.5 కోట్లతో ఒలింపిక్‌స్థాయి ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్‌ను నిర్మించామన్నారు. జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు క్రీడాకారులకు 60 గదులతో త్రీస్టార్ హోటల్‌ను నిర్మిస్తున్నామని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.



సిద్దిపేట జిల్లా నారాయణరావుపేటలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు



ఎన్సాన్‌పల్లి బాలికల గురుకుల పాఠశాలలో న్యూఇయర్ కేక్ కట్ చేసి చిన్నారికి తినిపిస్తున్న మంత్రి హరీశ్‌రావు

నూతన సంవత్సర వేడుకల్లో మంత్రి హరీశ్‌రావు

నూతన సంవత్సర వేడుకల్లో మంత్రి హరీశ్‌రావు పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గురుకుల పాఠశాలలో విద్యార్థినులతో కలిసి ఆదివారం అర్ధరాత్రి కేక్ కట్ చేసి వారికి తినిపించారు. 'సిద్దిపేటనే నాకు సింగపూర్.. మీతో నాబంధం 11 ఏండ్లు.. ఒక లక్ష్యంతో తలవంచి చదవండి.. తల ఎత్తుకొని తిరిగే రోజులు ముందే ఉన్నాయి. మీ జీవితాల్లో వెలుగులు రావడమే బంగారు తెలంగాణ' అని మంత్రి అన్నారు. ఏటా హాస్టల్‌కు వచ్చి సంబురాల్లో పాలుపంచుకోవడం తమకెంతో సంతోషంగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. 'సార్.. మీతో ఫొటో దిగాలన్నది నాకోరిక.. ఎప్పుడు నెరవేరలేదు' అని విద్యార్థిని కే దివ్య ఉద్వేగానికి లోనై కంటతడి పెట్టుకుంది. స్పందించిన మంత్రి హరీశ్‌రావు తన స్థానం నుంచి లేచి వచ్చి అక్కున చేర్చుకుని కన్నీళ్లను తుడిచారు. నేను ఉన్నానంటూ చిన్నారికి ధైర్యం చెప్పి ఫొటో దిగారు.

టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు



సిద్దిపేట జిల్లా నారాయణరావుపేటలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న ఎన్‌ఎస్‌యూఐ నాయకులకు కండువా కప్పుతున్న మంత్రి హరీశ్‌రావు



పెద్దపల్లి జిల్లా కొత్తూరులో టీఆర్‌ఎస్‌లో చేరిన మున్నూరు కాపు కుల పెద్దకు కండువా కప్పుతున్న ప్రభుత్వ చీఫ్‌విప్ కొప్పుల



వరంగల్ జిల్లా ముల్కలగూడెంలో కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్



జనగామ జిల్లా రఘునాథపల్లిలో టీఆర్‌ఎస్‌లో చేరుతున్న వారికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే రాజయ్య

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: టీఆర్‌ఎస్‌లోకి వలసలు జోరుగా సాగుతున్నాయి. సీఎం కేసీఆర్ సర్కార్ చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులవుతున్న ప్రధాన పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఇతర సంఘాల వారు పెద్ద ఎత్తున గులాబీ గూటికి చేరుతున్నారు. ఆదివారం కూడా భారీగా చేరారు. సిద్దిపేట జిల్లా నారాయణరావుపేటలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు టీఆర్‌ఎస్‌లో చేరారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి టీ హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కొత్తూరుకు చెందిన మున్నూరుకాపు, పద్మశాలీ కులస్థులు ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ సమక్షంలో గులాబీ గూటికి చేరారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం అనంతసాగర్, తొగర్‌పల్లి గ్రామాల కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలంలో కాంగ్రెస్, న్యూడెమోక్రసీ నుంచి 60 కుటుంబాల వారు ఎమ్మెల్యే కోరం కనకయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు. అశ్వారావుపేట పట్టణంలో 40 మంది యువకులు టీఆర్‌ఎస్‌లో చేరగా ట్రైకార్ చైర్మన్ తాటి వెంకటేశ్వర్లు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే పుట్ట మధు కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. వరంగల్ అర్బన్ జిల్లా ఐనవోలు మండలం ముల్కలగూడెంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ రాఘవులు ఆధ్వర్యంలో 50 మంది టీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే అరూరి రమేశ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జనగామ జిల్లా రఘునాథపల్లిలో కాంగ్రెస్, టీడీపీ పార్టీలకు చెందిన సుమారు 200 మంది కార్యకర్తలు, యువజన సంఘాలకు చెందిన వారు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య సమక్షంలో టీఆర్‌ఎస్‌లో చేరారు.



సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో టీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

పేపర్ మిల్లుపై చిగురిస్తున్న ఆశలు

టేకోవర్ చేసేందుకు తొమ్మిది కంపెనీల ప్రతినిధుల ఆసక్తి.. మంత్రి కేటీఆర్ కృషితో కదలిక

కాగజ్‌నగర్, నమస్తే తెలంగాణ: సిర్పూర్ కాగజ్‌నగర్ పేపర్ మిల్లు పునరుద్ధరణపై కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తెలంగాణలోనే ఏకైక కాగితం మిల్లు.. యాజమాన్యం మొండి వైఖరితో మూడున్నరేండ్ల క్రితం మూతపడటంతో కార్మికులు దుర్భర జీవితాలను గడుపుతున్నారు. ఈ పరిశ్రమను పునరుద్ధరించి కార్మికులకు న్యాయం చేయాలనే పట్టుదలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఈ మిల్లు పునరుద్ధరణకు తొమ్మిది పరిశ్రమల ప్రతినిధులు ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం.

మూత పడిందిలా..

మూడున్నరేండ్ల క్రితం యాజమాన్యం షెట్‌డౌన్ పేరిట మిల్లులో పేపర్ ఉత్పత్తిని నిలిపివేసింది. దీంతో ఈ మిల్లుపై ఆధారపడి జీవిస్తున్న ప్రత్యక్షంగా ఐదువేల మంది, పరోక్షంగా మరో ఐదువేల కుటుంబాలకు ఉపాధి కరువైంది. మిల్లు యాజమాన్యం ఆధునీకరణ పేరిట ఐడీబీఐ, ఇతర బ్యాంకుల నుంచి రూ.350 కోట్ల రుణం తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో అసలు, వడ్డీ కలిపి మొత్తం రూ.420 కోట్లకు చేరుకుంది. రుణాలు తిరిగి చెల్లించనందున 2016 అక్టోబర్ 22న ఐడీబీఐ ఆధ్వర్యంలో బ్యాంకులు మిల్లును స్వాధీన పర్చుకున్నాయి. 2017 ఫిబ్రవరి 16న ఐడీబీఐ ఆధ్వర్యంలో మిల్లును రూ.390 కోట్లకు బహిరంగ వేలం వేయగా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో సిర్పూరు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఈ విషయాన్ని మంత్రులు కేటీఆర్, జోగు రామన్న, ఇంద్రకరణ్‌రెడ్డి తదితరుల దృష్టికి తీసుకెళ్లి మిల్లు పునరుద్ధరణకు చొరువ చూపాలని కోరారు. ఈ నేపథ్యంలో ఎస్పీఎం పునరుద్ధరణకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు నూతన పారిశ్రామిక విధానానికి అనుగుణంగా రాయితీలు కల్పిస్తామని మంత్రి కేటీఆర్ పలు సందర్భాల్లో ప్రకటించారు. అంతేకాకుండా మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కోనప్ప మిల్లు పునరుద్ధరణ కోసం కోల్‌కతాలో ఐడీబీఐ చైర్మన్‌ను కలిసి ఈ ప్రక్రియను సత్వరం పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐడీబీఐ ఆధ్వర్యంలో రెండో విడుత బహిరంగ వేలం వేసేందుకు సిద్ధం కాగా, పాత యాజమాన్యం వ్యూహాత్మకంగా తమకు అనుకూలంగా ఉన్న బ్రోకర్ల సహకారంతో దనేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. మిల్లు ఆస్తులు, అప్పుల అంచనాలతోపాటు మిల్లు పునరుద్ధరణకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించి, నిర్ణయం తీసుకోవాలని ఇంటోరియం రిసోలేషన్ ప్రొఫెషనల్(ఐఆర్‌పీ) ప్రతినిధి రాంరతన్ కానంగోను నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ నియమించింది. ఇందులోభాగంగా ఈనెల 12న పత్రిక ప్రకటన జారీ చేసి ఈనెల 22వ తేదీలోగా బకాయిదారులు, మిల్లు పునరుద్దరణకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో వివిధ రాష్ట్రాల్లోని తొమ్మిదిమంది పారిశ్రామిక వేత్తలు మిల్లు పునరుద్ధరణ కోసం ఆసక్తి చూపుతూ తమ నివేదికలను సీల్డ్ కవరు ద్వారా అందజేశారు. వచ్చే ఫిబ్రవరి మొదటి వారంలో ఈ సీల్డ్ కవర్లను తెరిచి నిబంధనల మేరకు ఆసక్తి ఉన్న పారిశ్రామిక వేత్తలకు మిల్లును అప్పగించనున్నారు. దీంతో గత మూడున్నరేండ్లుగా మిల్లు పునరుద్ధరణ కోసం ఎదురు చూస్తున్న కార్మికుల కల నెరవేరనున్నది.



కాగజ్‌నగర్ పేపర్ మిల్లు

కార్మికులకు మంచి రోజులు

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కృషి ఫలితంగానే సిర్పూరు కాగితం మిల్లు పునరుద్ధరణ వైపు అడుగులు వేస్తున్నది. వచ్చే ఫిబ్రవరిలో మిల్లు పునరుద్ధరణ జరుగుతుందనే నమ్మకం ఉంది. 38 నెలలుగా కార్మికులకు రావాల్సిన బకాయిలు రూ.68 కోట్లు మంజూరు చేయాలని ఐఆర్‌పీ ప్రతినిధులకు వినతిపత్రం అందజేశా. మిల్లు ప్రారంభం తోపాటు కార్మికుల బకాయిలు కూడా ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది.

- కోనేరు కోనప్ప, సిర్పూరు ఎమ్మెల్యే

S & D

పూర్తి ఫిట్‌నెస్‌కు ఇంకా సమయం కావాలి


సైనా

న్యూఢిల్లీ: భారత బ్యాడ్మింటన్ స్టార్ సైనా నెహ్వాల్‌ను గాయాలు బాధిస్తూనే ఉన్నాయి. తీరిక లేని షెడ్యూల్ మధ్య టోర్నీలు ఆడుతున్న సైనా పూర్తి ఫిట్‌నెస్ అందుకోవడానికి మరింత సమయం కావాలని అంటున్నది. ఇండియా ఓపెన్ ముగిసిన తర్వాత దొరికే మూడు వారాల సమయంలో పూర్వపు ఫిట్‌నెస్ దక్కించుకునేందుకు సైనా సిద్ధమవుతున్నది. ప్రస్తుతం పీబీఎల్‌లో లక్నో అవధ్ వారియర్స్ తరపున ఆడుతున్న ఈ హైదరాబాదీ ఆదివారం మీడియాతో మాట్లాడింది. 'ప్రపంచ చాంపియన్‌షిప్ ముగిసిన తర్వాత కావాల్సినంత సమయం దొరుకలేదు. గోపి సర్ అకాడమీలో తిరిగి చేరిన తర్వాత విరామం లేకుండా వరుస టోర్నీల్లో ఆడాల్సి వచ్చింది. దీంతో గాయం తీవ్రమైంది. అత్యుత్తమ ఆటగాళ్లతో ఆడేందుకు ఇంకా వేగంగా ఆడాల్సిన అవసరమున్నది. ఇండియన్ ఓపెన్ ముగిసిన తర్వాత లభించే విరామంలో పూర్తి ఫిట్‌నెస్ దక్కించుకోవాలనుకుంటున్నాను. వచ్చే ఏడాది బీడబ్ల్యూఎఫ్ డబ్ల్యూ బిజీ షెడ్యూల్‌ను ప్రకటించింది. దీంతో ఒక ఆటగాని ఆధిపత్యం కొనసాగే అవకాశం లేకుండా..టోర్నీ టోర్నీకి కొత్త విజేతలు వచ్చే చాన్స్ ఉంటుంది' అని సైనా అంది.

అట్టహాసంగా జాతీయ కబడ్డీ పోటీలు




హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 65వ జాతీయ సీనియర్ కబడ్డీ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మొత్తం 29 రాష్ట్రాల నుంచి దాదాపు 1500 మంది క్రీడాకారులు టోర్నీకి వేదికైన గచ్చిబౌలీ స్టేడియానికి తరలివచ్చారు. టోర్నీ నిర్వాహకులు సంప్రదాయ రీతిలో ఆటగాళ్లకు స్వాగతం పలికారు. డప్పుచప్పులు, సంప్రదాయ నృత్యాలతో స్టేడియం ప్రాంగణాన్ని హోరెత్తించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అంతర్జాతీయ కబడ్డీ సమాఖ్య అధ్యక్షుడు జనార్దన్‌సింగ్ గెహ్లాట్, భారత అమెచ్యూర్ కబడ్డీ చీఫ్ మృదుల్ భదురియా, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు గాంధీ, కిషన్‌రెడ్డి, సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ చీఫ్ కాసాని జ్ఞానేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ జగదీశ్వర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు జరిగిన పోటీల్లో పురుషుల విభాగంలో కర్ణాటక 75-9తో విదర్భపై, కేరళ 49-35తో ఒడిశాపై, గుజరాత్ 48-26తో జమ్ము కశ్మీర్‌పై, ఆంధ్రప్రదేశ్ 50-18తో పశ్చిమబెంగాల్‌పై విజయం సాధించాయి. ఇక మహిళల కేటగిరీలో తమిళనాడు 45-28తో మణిపూర్‌పై, ఛత్తీస్‌గఢ్ 61-12తో పాండీచెరిపై విజయం సాధించాయి.

రెండులోనే కోహ్లీ

దుబాయ్: టెస్ట్‌ల్లో భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ..రెండు ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఆదివారం ఐసీసీ విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో కోహ్లీ(893) రెండు ర్యాంక్‌లో ఉండగా, అద్వితీయ ఫామ్‌తో అదురగొడుతున్న ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్(947) నంబర్‌వన్ ర్యాంక్‌లో దిగ్విజయంగా కొనసాగుతున్నాడు. టాప్-10లో టీమ్‌ఇండియా నుంచి విరాట్‌తో పాటు పుజార(873) మూడో ర్యాంక్‌లో ఉన్నాడు. బాక్సింగ్ డే టెస్ట్‌లో ఆసీస్‌పై అజేయ డబుల్ సెంచరీతో విజృంభించిన అలిస్టర్ కుక్(759) తొమ్మిది ర్యాంక్‌లు మెరుగుపర్చుకుని ఎనిమిదికి చేరుకున్నాడు. రికార్డు డబుల్ సెంచరీతో రాణించడంతో కుక్ ర్యాంకింగ్స్ బాగా మెరుగైంది. బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో అంత భారీ మార్పులేమి లేవు. అండర్సన్(892) టాప్‌లో కొనసాగుతుండగా, జడేజా(870), అశ్విన్(829) వరుసగా మూడు, నాలుగో ర్యాంక్‌ల్లో ఉన్నారు. ఆల్‌రౌండర్ల విభాగంలో షకీబల్‌హసన్(438) నంబర్‌వన్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా, జడేజా(415), అశ్విన్(369) రెండు, మూడు ర్యాంక్‌ల్లో నిలిచారు.

వాడ్కర్ అజేయ శతకం


వాడ్కర్ (133★)

233 పరుగుల భారీ ఆధిక్యం గెలుపు దిశగా విదర్భ

ఇండోర్: చరిత్ర సృష్టించేందుకు విదర్భ మరో అడుగుదూరంలో ఉన్న ది. ఫైనల్‌కు అర్హత సాధించిన తొలిసారే రంజీ టైటిల్‌ను దక్కించుకునేందుకు విదర్భ కసితో పోరాడుతున్నది. ఢిల్లీతో జరుగుతున్న ఫైనల్లో ఆధిపత్యం కొనసాగుతున్నది. 206/4 ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు(ఆదివారం) తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విదర్భ.. అక్షయ్ వాడ్కర్(243 బంతుల్లో 133 బ్యాటింగ్,16 ఫోర్లు, ఒక సిక్స్) అజేయ సెంచరీతో 528/7 భారీ స్కోరు సాధించింది. ఢిల్లీ బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ అక్షయ్.. తన ఫస్ట్‌క్లాస్ క్రికెట్ కెరీర్‌లో తొలి సెంచరీని నమోదు చేసుకున్నాడు. నవ్‌దీప్ సైనీ(3/126).. ఆదిలోనే వాఖరే (17), వసీం జాఫర్(78) ఔట్ చేసి విదర్భను ఇబ్బందుల్లోకి నెట్టాడు. ఈ సమయంలో అక్షయ్ సాధికారిక ఆటతీరుతో ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశాడు. చూడచక్కని షాట్లతో అలరించిన వాడ్కర్ తన ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు, ఓ సిక్స్‌తో అలరించాడు. ఈ క్రమంలో ఏడో వికెట్‌కు సర్వతే(79)తో కలిసి 169 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరు ఢిల్లీ బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ బౌండరీలతో స్కోరుబోర్డుకు విలువైన పరుగులు జతచేశారు. అయితే 79 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద సర్వతే..రానా బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకొచ్చిన సిద్దేశ్ నెరల్(56 బ్యాటింగ్) దూకుడైన ఆటతీరు కనబరిచాడు. నెరల్‌ను అండగా చేసుకున్న అక్షయ్..తన తొలి శతకాన్ని నమోదు చేసుకున్నాడు. ఎనిమిదో వికెట్‌కు వీరిద్దరు కలిసి 113 పరుగుల అజేయ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మరో రెండు రోజులు మిగిలున్న ఆటలో విదర్భ ప్రస్తుతం 233 పరుగుల విలువైన ఆధిక్యంలో కొనసాగుతున్నది. ఇదే జోరు కొనసాగిస్తే..విదర్భకు రంజీ టైటిల్ దక్కడం దాదాపు ఖాయంగా కనిపిస్తున్నది.

ఢిల్లీకి గాయాల బెడద

ఇప్పటికే ప్రత్యర్థికి భారీ ఆధిక్యం సమర్పించుకుని ఢీలా పడిన ఢిల్లీని కీలక ఆటగాళ్ల గాయాలు మరింత బాధిస్తున్నాయి. గౌతమ్ గంభీర్ బొటనవేలి గాయంతో మూడో రోజు లంచ్ విరామం తర్వాత మైదానం వదిలి వెళ్లాడు, పేస్ బౌలర్ నవ్‌దీప్ సైనీ తొడకండరాల గాయంతో బాధపడుతున్నాడు. ఇక లెఫ్టార్మ్ స్పిన్నర్ మనన్ శర్మ మోకాలి గాయంతో మైదానానికి దూరమవగా..మూడో రోజు ఆట ముగిసిన తర్వాత అతను మోకాలికి కట్టుతో కనిపించాడు. దీంతో అతను మ్యాచ్‌కే దూరమవుతాడని కోచ్ భాస్కర్ నుంచి సంకేతాలు అందాయి.

కొకబుర్రాతోనే అసలైన సవాల్


భువనేశ్వర్

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా పిచ్‌లపై అధిక బౌన్స్ ఆహ్వానించదగ్గ పరిణామమని, అయితే కొకబుర్రా బంతులతోనే అసలైన సవాల్ ఎదురుకానున్నదని భారత పేస్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ తెలిపాడు. ఎక్కువ ఓవర్లు బౌలింగ్ వేయడంపైనే దృష్టిపెట్టామని ఈ స్వింగ్ స్పెషలిస్ట్ చెప్పాడు. 'సఫారీ గడ్డపై అడుగుపెట్టగానే అందరికీ బౌన్సీ వికెట్ గుర్తొస్తుంది. కానీ ఆటలో ఎటువంటి పిచ్ ఉంటుందనేది స్పష్టంగా తెలియదు. బ్యాట్స్‌మెన్ విషయంలో బౌన్స్ కీలకపాత్ర పోషిస్తుంది. బౌలర్లకు కూడా అంతే. కానీ కొకబుర్రా బంతులతో బౌలింగ్ చేయడం కష్టమైన పని. 25-30 ఓవర్ల తర్వాత ఈ బంతి పెద్దగా ప్రభావం చూపదు. ఇటువంటి పరిస్థితులను అలవాటు చేసుకునేందుకు సన్నాహకాలు చేస్తున్నాం' అని భువీ మీడియా సమావేశంలో వివరించాడు. భారత జట్టులోని పేస్ బౌలర్లు ఎవరికి వారే సాటి అని, తాను ఉమేశ్, ఇషాంత్, షమీ నుంచి రివర్స్ స్వింగ్ నేర్చుకుంటున్నామని, వారు కూడా నా నుంచి స్వింగ్ నేర్చుకోవచ్చని తెలిపాడు. ఇక శనివారం నాడు రెండు సెషన్లలో ప్రాక్టీస్ చేసిన టీమ్‌ఇండియా.. ఆదివారం నాడు తేలికపాటి వర్షం, తేమ, చలిగాలుల కారణంగా ఇండోర్‌లోనే ప్రాక్టీస్ చేసింది.

ఆఫ్ఘనిస్థాన్ కోచ్‌గా సిమ్మన్స్

కాబుల్: ఆఫ్ఘనిస్థాన్ కొత్త కోచ్‌గా వెస్టిండీస్ మాజీ ఆల్‌రౌండర్ ఫిల్ సిమ్మన్స్ ఎంపికయ్యాడు. లాల్‌చంద్ రాజ్‌పుత్ రాజీనామాతో ఖాళీ అయిన కోచ్ స్థానాన్ని ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు(ఏసీబీ) సిమ్మన్స్‌తో భర్తీ చేసింది. ఈ మేరకు ఏసీబీ ఆదివారం అధికారిక ట్వీట్ చేసింది. ఫిబ్రవరిలో జింబాబ్వేతో జరిగే వన్డే సిరీస్‌తో సిమ్మన్స్ బాధ్యతలు స్వీకరించనున్నాడు. ఇటీవలే ఐర్లాండ్‌తో కలిసి టెస్ట్ హోదా దక్కించుకున్న ఆఫ్ఘనిస్థాన్...భారత్‌తో తొలి టెస్ట్ మ్యాచ్ ఆడనుంది. గతంలో జింబాబ్వే, ఐర్లాండ్‌తో పాటు వెస్టిండీస్ కోచ్‌గా సిమ్మన్స్ వ్యవహరించాడు.

స్పోర్ట్స్ క్యాలెండర్-2018

క్రికెట్


కోహ్లీ

- జనవరి 1 నుంచి 28 వరకు ఆస్ట్రేలియాలో ఇంగ్లండ్ పర్యటన (ఐదో యాషెస్ టెస్ట్, 5 వన్డేలు).
- జనవరి 5 నుంచి ఫిబ్రవరి 24 వరకు దక్షిణాఫ్రికాలో భారత్ పర్యటన (మూడు టెస్టులు, ఆరు వన్డేలు, మూడు టీ20లు)
- జనవరి 6 నుంచి 13 వరకు న్యూజిలాండ్‌లో పాకిస్థాన్ పర్యటన (మూడు టీ20లు, 5 వన్డేలు)
- జనవరి 13 నుంచి ఫిబ్రవరి వరకు ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ న్యూజిలాండ్‌లో
- జనవరి 15 నుంచి 28 వరకు బంగ్లాదేశ్‌లో ముక్కోణపు సిరీస్ (7 వన్డేలు)
- ఫిబ్రవరి 1 నుంచి 18 వరకు బంగ్లాదేశ్‌లో శ్రీలంక పర్యటన (2 టీ20లు, 2 టెస్టులు)
- ఫిబ్రవరి 3 నుంచి 21 వరకు న్యూజిలాండ్‌లో టీ20 ముక్కోణపు సిరీస్ (7 మ్యాచ్‌లు).
- ఫిబ్రవరి 13 నుంచి 25 వరకు భారత్, దక్షిణాఫ్రికా మహిళల మధ్య 5 టీ20లు.
- ఫిబ్రవరి 25 నుంచి ఏప్రిల్ 3 వరకు న్యూజిలాండ్, ఇంగ్లండ్ మధ్య 5 వన్డేలు, 2 టెస్టులు.
- మార్చి 1 నుంచి ఏప్రిల్ 4 వరకు ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు.
- మార్చి 1 నుంచి ఏప్రిల్ 4 వరకు దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య 4 టెస్టులు.
- మార్చి 22 నుంచి ఏప్రిల్ 3 వరకు భారత్‌లో మహిళల ముక్కోణపు సిరీస్ (7 మ్యాచ్‌లు)
- ఏప్రిల్ 4 నుంచి మే 31 వరకు ఐపీఎల్-11
- మే 24 నుంచి జూన్ 6 వరకు ఇంగ్లండ్, పాకిస్థాన్ మధ్య 2 టెస్టులు.
- జూన్ 6 నుంచి 27 వరకు వెస్టిండీస్, శ్రీలంక మధ్య 3 టెస్టులు
- జూన్ 13 నుంచి 27 వరకు ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య ఒక టీ20, 5 వన్డేలు.
- జూన్ 20 నుంచి జూలై 2 వరకు ఇంగ్లండ్‌లో మహిళల ముక్కోణపు సిరీస్
- జూలై 3 నుంచి సెప్టెంబర్ 12 వరకు ఇంగ్లండ్‌లో భారత్ పర్యటన (మూడు టీ20లు, మూడు వన్డేలు, 5 టెస్టులు)

బ్యాడ్మింటన్



- జనవరి 8 నుంచి 14 వరకు థాయ్‌లాండ్ మాస్టర్స్ గ్రాండ్‌ప్రి గోల్డ్
- జనవరి 18 నుంచి 21 వరకు మలేసియా మాస్టర్స్ సూపర్ సిరీస్
- జనవరి 23 నుంచి 28 వరకు ఇండోనేసియా మాస్టర్స్ సూపర్ సిరీస్
- జనవరి 30 నుంచి ఫిబ్రవరి 4 వరకు ఇండియా ఓపెన్ సూపర్ సిరీస్
- ఫిబ్రవరి 20 నుంచి 25 వరకు స్విస్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్
- మార్చి 6 నుంచి 11 వరకు జర్మనీ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్
- మార్చి 14 నుంచి 18 వరకు ఆల్‌ఇంగ్లండ్ ఓపెన్
- ఏప్రిల్ 24 నుంచి 29 వరకు ఆసియా చాంపియన్‌షిప్
- మే 20 నుంచి 27 వరకు థామస్, ఉబెర్ కప్ ఫైనల్స్
- జూన్ 6 నుంచి జూలై 1 వరకు మలేసియా ఓపెన్
- జూలై 3 నుంచి 8 వరకు ఇండోనేసియా ఓపెన్
- జూలై 10 నుంచి 15 వరకు థాయ్‌లాండ్ ఓపెన్
- జూలై 17 నుంచి 22 వరకు సింగపూర్ ఓపెన్
- జూలై 24 నుంచి 29 వరకు జపాన్ మాస్టర్స్
- జూలై 30 నుంచి ఆగస్టు 5 వరకు వరల్డ్ చాంపియన్‌షిప్
- ఆగస్టు 7 నుంచి 12 వరకు వియత్నాం ఓపెన్
- సెప్టెంబర్ 4 నుంచి 9 వరకు హైదరాబాద్ ఓపెన్
- సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు జపాన్ ఓపెన్
- సెప్టెంబర్ 18 నుంచి 23 వరకు చైనా ఓపెన్
- సెప్టెంబర్ 25 నుంచి 30 వరకు కొరియా ఓపెన్
- అక్టోబర్ 16 నుంచి 21 వరకు డెన్మార్క్ ఓపెన్ సూపర్ సిరీస్ ప్రీమియం టోర్నీ
- అక్టోబర్ 23 నుంచి 28 వరకు ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ సిరీస్
- నవంబర్ 6 నుంచి 11 వరకు చైనా సూపర్ సిరీస్ ప్రీమియం టోర్నీ
- నవంబర్ 13 నుంచి 18 వరకు హాంకాంగ్ ఓపెన్ సూపర్ సిరీస్
- నవంబర్ 20 నుంచి 25 వరకు సయ్యద్ మోడీ టోర్నీ
- నవంబర్ 27 నుంచి డిసెంబర్ 2 వరకు కొరియా మాస్టర్స్

చెస్

- మహిళల వరల్డ్ చాంపియన్‌షిప్ (రష్యా)
- మార్చి 10 నుంచి 28 వరకు క్యాండిడేట్స్ టోర్నీ (జర్మనీ)
- మార్చి 16 నుంచి 29 వరకు యూరోపియన్ వ్యక్తిగత చాంపియన్‌షిప్ (జార్జియా)
- ఏప్రిల్ 7 నుంచి 20 వరకు యూరోపియన్ మహిళల చాంపియన్‌షిప్ (స్లోవేనియా)
- ఏప్రిల్ 21 నుంచి 30 వరకు వరల్డ్ అమెచ్యూర్ చాంపియన్‌షిప్ (ఇటలీ)
- జూలై 7 నుంచి 15 వరకు వరల్డ్ టీమ్ చెస్ చాంపియన్‌షిప్ (జర్మనీ)
- సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 6 వరకు చెస్ ఒలింపియాడ్ (జార్జియా)
- నవంబర్ 9 నుంచి 28 వరకు వరల్డ్ చాంపియన్‌షిప్ మ్యాచ్
- నవంబర్ 17 నుంచి 30 వరకు వరల్డ్ సీనియర్ చాంపియన్‌షిప్ (స్లోవేనియా)

మెగా టోర్నీలు



- ఫిబ్రవరి 9 నుంచి 25 వరకు వింటర్ ఒలింపిక్స్ (దక్షిణ కొరియాలో)
- ఫిబ్రవరి 28 నుంచి మార్చి 4 వరకు వరల్డ్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్ (నెదర్లాండ్స్)
- ఏప్రిల్ 4 నుంచి 15 వరకు కామన్వెల్త్ గేమ్స్ (గోల్డ్ కోస్ట్, ఆస్ట్రేలియా)
- జూన్ 14 నుంచి జూలై 15 వరకు ఫిఫా వరల్డ్‌కప్ (రష్యా)
- జూలై 21 నుంచి ఆగస్టు 5 వరకు మహిళల హాకీ వరల్డ్‌కప్ (లండన్)
- 18 నుంచి సెప్టెంబర్ 2 వరకు ఆసియా గేమ్స్ (జకర్తా, ఇండోనేసియా)
- సెప్టెంబర్ 1 నుంచి 9 వరకు వరల్డ్ రోయింగ్ చాంపియన్‌షిప్ (బల్గేరియా)
- సెప్టెంబర్ 11 నుంచి 23 వరకు యూత్ ఒలింపిక్స్ (అర్జెంటీనా)
- అక్టోబర్ 25 నుంచి నవంబర్ 3 వరకు జిమ్నాస్టిక్స్ వరల్డ్ చాంపియన్‌షిప్ (ఆర్టిస్టిక్స్) (ఖతార్)
- నవంబర్ 24 నుంచి డిసెంబర్ 16 వరకు పురుషుల హాకీ వరల్డ్‌కప్ (భారత్, భువనేశ్వర్)

షూటింగ్



- జనవరి 11 నుంచి 21 వరకు సీనియర్, జూనియర్ సెలెక్షన్ ట్రయల్స్
- ఫిబ్రవరి 1 నుంచి 14 వరకు ఇండియన్ గ్రాండ్‌ప్రి రైఫిల్ / పిస్టల్ ఈవెంట్స్
- మార్చి 2 నుంచి 12 వరకు ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్ (రైఫిల్ / పిస్టల్ / షాట్‌గన్).
- మార్చి 20 నుంచి 29 వరకు జూనియర్ వరల్డ్‌కప్ (ఆస్ట్రేలియా)
- ఏప్రిల్ 20 నుంచి 30 వరకు ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ (రైఫిల్ / పిస్టల్ / షాట్‌గన్)
- మే 22 నుంచి 29 వరకు వరల్డ్‌కప్ (రైఫిల్ / పిస్టల్)
- జూన్ 5 నుంచి 15 వరకు వరల్డ్‌కప్ షాట్‌గన్ (మాల్టా)
- జూలై 9 నుంచి 19 వరకు వరల్డ్‌కప్ షాట్ గన్ (యూఎస్ఏ)
- ఆగస్టు 31 నుంచి 15 వరకు ఐఎస్ఎస్ వరల్డ్ చాంపియన్‌షిప్ ఆల్ ఈవెంట్స్

హాకీ



- జనవరి 14 నుంచి 28 వరకు నాలుగు దేశాల టోర్నీ (న్యూజిలాండ్)
- ఏప్రిల్ 25 నుంచి 29 వరకు యూత్ ఒలింపిక్ గేమ్స్ క్వాలిఫయర్స్
- మే 13 నుంచి 30 వరకు మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ
- జూన్ 10 నుంచి 19 వరకు స్పెయిన్ టూర్
- జూన్ 23 నుంచి జూలై 1 వరకు పురుషుల చాంపియన్స్ ట్రోఫీ
- జూలై 14 నుంచి 22 వరకు 6 దేశాల హాకీ టోర్నీ (జూనియర్)
- అక్టోబర్ 1 నుంచి 15 వరకు పురుషుల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

ఆర్చరీ




- జనవరి 19 నుంచి 21 వరకు ఇండోర్ వరల్డ్‌కప్ స్టేజ్-3 (నిమీస్)
- ఫిబ్రవరి 9 నుంచి 11 వరకు ఇండోర్ వరల్డ్‌కప్ స్టేజ్-4
- ఫిబ్రవరి 14 నుంచి 19 వరకు వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్ (ఎంక్టాన్)
- ఏప్రిల్ 23 నుంచి 29 వరకు ఆర్చరీ వరల్డ్‌కప్ (షాంఘై)
- మే 21 నుంచి 26 వరకు ఆర్చరీ వరల్డ్‌కప్ (అంటాల్యా)
- జూన్ 19 నుంచి 24 వరకు ఆర్చరీ వరల్డ్‌కప్ (సాల్ట్ లేక్ సిటీ)
- జూలై 17 నుంచి 22 వరకు ఆర్చరీ వరల్డ్‌కప్ (బెర్లిన్)
- ఆగస్టు 13 నుంచి 19 వరకు వరల్డ్ ఆర్చరీ (లుసానే)

ఫార్ములా వన్



- మార్చి 25 ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి
- ఏప్రిల్ 8 బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి
- ఏప్రిల్ 15 చైనా గ్రాండ్‌ప్రి
- ఏప్రిల్ 29 అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి
- మే 13 స్పెయిన్ గ్రాండ్‌ప్రి
- మే 27 మొనాకో గ్రాండ్‌ప్రి
- జూన్ 10 కెనడా గ్రాండ్‌ప్రి
- జూన్ 24 ఫ్రాన్స్ గ్రాండ్‌ప్రి
- జూలై 1 ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి
- జూలై 8 బ్రిటన్ గ్రాండ్‌ప్రి
- జూలై 22 జర్మనీ గ్రాండ్‌ప్రి
- జూలై 29 హంగేరి గ్రాండ్‌ప్రి
- ఆగస్టు 26 బెల్జియం గ్రాండ్‌ప్రి
- సెప్టెంబర్ 2 ఇటలీ గ్రాండ్‌ప్రి
- సెప్టెంబర్ 16 సింగపూర్ గ్రాండ్‌ప్రి
- సెప్టెంబర్ 30 రష్యా గ్రాండ్‌ప్రి
- అక్టోబర్ 7 జపాన్ గ్రాండ్‌ప్రి
- అక్టోబర్ 21 అమెరికా గ్రాండ్‌ప్రి
- అక్టోబర్ 28 మెక్సికో గ్రాండ్‌ప్రి
- నవంబర్ 11 బ్రెజిల్ గ్రాండ్‌ప్రి
- నవంబర్ 25 అబుదాబి గ్రాండ్‌ప్రి

టెన్నిస్



- జనవరి 15 నుంచి 28 వరకు ఆస్ట్రేలియా ఓపెన్ (మెల్‌బోర్న్)
- మే 27 నుంచి జూన్ 10 వరకు ఫ్రెంచ్ ఓపెన్ (పారిస్)
- జూలై 2 నుంచి 15 వరకు వింబుల్డన్ (లండన్)
- ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 9 వరకు యూఎస్ ఓపెన్ (అమెరికా)
- అక్టోబర్ 29 నుంచి నవంబర్ 12 వరకు ఏటీపీ వరల్డ్ టూర్ ఫైనల్స్
- జనవరి 29 నుంచి డేవిస్ కప్ తొలి రౌండ్ మ్యాచ్‌లు
- ఏప్రిల్ 2 నుంచి డేవిస్ కప్ క్వార్టర్స్ మ్యాచ్‌లు
- సెప్టెంబర్ 10 నుంచి డేవిస్ కప్ సెమీస్ మ్యాచ్‌లు
- నవంబర్ 19 నుంచి డేవిస్ కప్ ఫైనల్

బాక్సింగ్



- జనవరి 9 నుంచి 14 వరకు ఇంటర్నేషనల్ ఇన్విటేషన్ టోర్నీ
- జనవరి 10 నుంచి 16 వరకు మహిళల నేషన్స్ కప్ టోర్నీ (సెర్బియా)
- జనవరి 5 నుంచి 11 వరకు యూత్ మెన్, ఉమెన్ నేషన్స్ కప్ టోర్నీ
- ఏప్రిల్, జూన్‌లో యూత్ ఆసియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ (థాయ్‌లాండ్)
- ఆగస్టులో పురుషుల, మహిళల, యూత్ ఐబా వరల్డ్ చాంపియన్‌షిప్
- నవంబర్‌లో ఐబా మహిళల వరల్డ్ చాంపియన్‌షిప్ (న్యూఢిల్లీ)

అథ్లెటిక్స్



- జనవరి 14 నుంచి నేషనల్ క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ (గోవా)
- ఫిబ్రవరి 1 నుంచి ఆసియన్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (ఇరాన్)
- ఫిబ్రవరి 18 నుంచి ఇంటర్నేషనల్ రేస్ వాకింగ్ (న్యూఢిల్లీ)
- ఫిబ్రవరి 27 నుంచి ఇండియన్ గ్రాండ్‌ప్రి (పంజాబ్)
- మార్చి 5 నుంచి ఫెడరేషన్ కప్ నేషనల్స్ సీనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (పంజాబ్)
- ఏప్రిల్ 5 నుంచి సౌత్‌ఈస్ట్ ఆసియా యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (థాయ్‌లాండ్)
- మే 5 నుంచి నేషనల్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (తమిళనాడు)
- జూన్ 7 నుంచి ఆసియా జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (జపాన్)
- జూన్ 16 నుంచి ఇంటర్నేషనల్ కాంపిటీషన్స్ (కిర్గిస్థాన్)
- జూన్ 28 నుంచి కొసనోవ్ స్మారక టోర్నీ (కజకిస్థాన్)

హైదరాబాద్‌కు రెండో ఓటమి

న్యూఢిల్లీ: కరోలినా మారిన్ గెలిచినప్పటికీ హైదరాబాద్ హంటర్స్ ను ఓటమి నుంచి కాపాడలేకపోయింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ డ్యాషర్స్ 5-0తో హైదరాబాద్‌పై ఘన విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో ఇవనోవ్, సొజొనోవ్ జోడీ (ఢిల్లీ) 15-9, 15-11తో మార్కిస్ కిడో, యూ షియాంగ్ పై గెలువగా, పురుషుల సింగిల్స్‌లో విన్సెంట్ (ఢిల్లీ) 13-15, 15-11, 15-4తో లీ హ్యున్‌పై గెలిచి ఢిల్లీ ఆధిక్యాన్ని కొనసాగించాడు. మహిళల సింగిల్స్‌లో మారిన్ (హైదరాబాద్) 15-10, 15-12తో సంగ్ జి హ్యున్‌పై గెలిచింది. అయితే ఢిల్లీ తమ ట్రంప్ కార్డ్ మ్యాచ్ పురుషుల సింగిల్స్‌లో హువేయ్ 15-14, 14-15, 15-10తో సాయి ప్రణీత్ (హైదరాబాద్)పై గెలవడంతో ఆధిక్యం మరింత పెరిగింది.


నాగల్

కుర్రాళ్లకు అవకాశం

నేటి నుంచి టాటా ఓపెన్

పుణె: భారత యువ టెన్నిస్ ఆటగాళ్లు కొత్త ఏడాదిని విజయాలతో మొదలుపెట్టేందుకు సిద్ధమయ్యారు. సోమవారం నుంచి ఇక్కడ జరుగనున్న టాటా ఓపెన్ మహారాష్ట్ర టోర్నీలో అంతర్జాతీయ ఆటగాళ్లతో తలపడి తమను తాము నిరూపించుకోవాలని తహతహలాడుతున్నారు. భారత స్టార్ టెన్నిస్ ఆటగాడు యుకీ భాంబ్రీ నేతృత్వంలో యువ ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. యుకీతో పాటు రామ్‌కుమార్ రామనాథన్ 2017ను విజయవంతంగా ముగించారు. ఈ ఇద్దరు సీనియర్లతో పాటు సుమిత్ నాగల్, అర్జున్ ఖడే సింగిల్స్‌కు అర్హత సాధించారు. యూకీ తన తొలి రౌండ్ మ్యాచ్‌లో అర్జున్‌తో తలపడనుండగా...రామ్‌కుమార్, కార్‌బల్లెస్ బైనా (స్పెయిన్)తో పోటీకి దిగనున్నాడు. ఇక నాగల్ తన తొలిపోరులో ఇయా ఇవస్కా (బెలారస్)తో తలపడనున్నాడు. క్రొయేషియా ఆటగాడు మారిన్ సిలిచ్ టాప్ సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. డబుల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ రొహన్ బోపన్న, జీవన్ జోడీ...లియాండర్ పేస్, పురవ్ రాజాతో తొలి పోరుకు సిద్ధమయ్యారు. ఇక యుకీ, దివిజ్ శరణ్ ద్వయం..లాస్లో డెరే, బ్లాజ్ కావ్‌సిక్ (సెర్బియా, స్లొవేనియా)తో తలపడనున్నారు. శ్రీరామ్ బాలాజీ, విష్ణువర్ధన్ ద్వయం..ఆదిల్ షమస్దిన్, నీల్ కుప్స్కి (కెనడా, యూకే)తో పోరుకు సిద్ధమైంది. మొత్తం తొమ్మిది మంది భారత డబుల్స్ ఆటగాళ్లు టాటా ఓపెన్‌లో బరిలోకి దిగుతున్నారు. కాగా చెన్నై ఓపెన్‌గా ప్రసిద్ధికెక్కిన ఈ టోర్నీని చెన్నై తమ ఆర్థిక సమస్యల కారణంగా మహారాష్ట్రకు అప్పగించిన సంగతి తెలిసిందే.

శివకపూర్‌కు మూడో టైటిల్



పట్టాయ: భారత గోల్ఫర్ శివకపూర్ 2017కు అద్భుత ముగింపు పలికాడు. ఆదివారం రాయల్ కప్ గెలుచుకోవడం ద్వారా మూడో ఆసియన్ టూర్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. గత 11 ఏండ్లలో కేవలం ఒక టైటిల్‌కు పరిమితమైన 35 ఏండ్ల కపూర్..ఎనిమిది నెలల్లో మూడు టైటిళ్లను సొంతం చేసుకున్నాడు. టోర్నీలో విజేతగా నిలిచిన సందర్భాన్ని తన భార్య మాయతో పాటు కూతురు వేదతో కలిసి శివ సంతోషంగా పంచుకున్నాడు.

రిజ్వి పసిడి షూట్

తిరువనంతపురం: జాతీయ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో షాహజర్ రిజ్వి పసిడి పతకంతో మెరిసాడు. ఆదివారం జరిగిన పురుషుల 10మీటర్ల ఎయిర్‌పిస్టల్ ఈవెంటులో రిజ్వి జాతీయరికార్డు నెలకొల్పాడు. ఎయిర్‌ఫోర్స్ తరపున బరిలోకి దిగిన రిజ్వి 241.7స్కోరుతో స్వర్ణాన్ని కైవసం చేసుకోగా, యశ్వంత్‌సింగ్(237.7), ఓం ప్రకాశ్(218) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. ఫైనల్‌కు చేరుకునే క్రమంలో స్టార్ షూటర్ జీతూరాయ్‌ను కూడా రిజ్వి అలవోకగా అధిగమించాడు.

ఆదిలాబాద్‌లో చలి పంజా

5.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

హైదరాబాద్‌లో స్వల్పంగా తగ్గిన చలి • కనిష్ఠ ఉష్ణోగ్రత 14 డిగ్రీలుగా నమోదు



ఆదిలాబాద్‌లో చలిమంట కాచుకుంటున్న ప్రజలు

హైదరాబాద్ సిటీబ్యూరో/ ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ: ఆదిలాబాద్ జిల్లాలో చలి పంజా విసురుతున్నది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు రోజురోజుకూ తగ్గుతున్నాయి. ఆదివారం రాష్ట్రంలో అత్యల్పంగా ఆదిలాబాద్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 5.7 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రత 29 డిగ్రీలుగా నమోదయింది. శనివారం 5.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత, గరిష్ఠ ఉష్ణోగ్రత 30.4 డిగ్రీలుగా రికార్డయింది. దక్షిణపీఠంపై జిల్లా ఎత్తైన ప్రదేశంలో ఉండటంతో శీతల పవనాలు వీస్తూ జిల్లాను తాకుతున్నాయి. దీంతో జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 గంటల వరకు కూడా చలి తీవ్రత తగ్గడం లేదు. విద్యార్థులు, వృద్ధులు మధ్యాహ్న సమయంలో కూడా స్వెటర్లు, మంకీ క్యాపులనే ధరిస్తున్నారు. సాయంత్రం 4 గంటల నుంచే చలిగాలులు వీ యడంతో చలిమంటలు కాచుకుంటున్నారు. మరోవైపు హైదరాబాద్ లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగడంతో చలితీవ్రత కొద్దిగా తగ్గింది. గడిచిన రెండురోజులు నగరాన్ని వణికించిన చలి శనివారం నుంచి క్రమంగా తగ్గుముఖం పట్టింది. శనివారం ఉదయం 9 గంటల నుంచి ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే 2 డిగ్రీలు తగ్గి 29 డిగ్రీలుగా నమోదయింది. కనిష్ఠ ఉష్ణోగ్రత సాధారణం కంటే 3.3 డిగ్రీలు పెరిగి 14 డిగ్రీలుగా రికార్డయింది.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
మంచిర్యాల	29.0	5.7
ఆదిలాబాద్	29.0	5.7
నిర్మల్	29.0	5.7
కుమ్రంభీం ఆసిఫాబాద్	29.0	5.7
వికారాబాద్	27.8	9.7
భద్రాద్రి కొత్తగూడెం	31.0	16.0
పెద్దపల్లి	31.0	12.0
కరీంనగర్	32.7	11.4
జనగామ	30.0	11.0
ఖమ్మం	31.0	11.0
వరంగల్ రూరల్	31.0	13.0
మెదక్	30.4	12.5
సంగారెడ్డి	30.4	12.5
సిద్దిపేట	30.4	12.5
వరంగల్ అర్బన్	31.0	13.5
నిజామాబాద్	31.5	13.9
కామారెడ్డి	31.5	13.9
జగిత్యాల	29.5	10.0
నాగర్‌కర్నూల్	29.0	17.0
జయశంకర్ భూపాలపల్లి	30.0	16.0
జోగుళాంబ గద్వాల	31.0	16.0
నల్లగొండ	28.6	13.4
హైదరాబాద్	29.0	14.0
రంగారెడ్డి	29.0	14.0
మేడ్చల్	29.0	14.0
మహబూబాబాద్	29.0	15.0
వనపర్తి	28.7	14.2
రాజన్న సిరిసిల్ల	29.0	16.0
మహబూబ్‌నగర్	30.9	15.0
యాదాద్రి భువనగిరి	29.0	16.0
సూర్యాపేట	28.0	16.0